TEXT CROSS WITHIN THE BOOK ONLY

TEXT PROBLEM WITHIN THE BOOK ONLY

UNIVERSAL
LIBRARY

OU_204480

UNIVERSAL
LIBRARY

OUP—901—26-3-70—5,000

OSMANIA UNIVERSITY LIBRARY

Call No. 123/F:76 Accession No 1258

Author

Title

This book should be returned on or before the date last marked below

ఆంధ్రప్రచారిణీగ్రంథమాల. ౨.

వసుమతీవసంతము.

(మౌర్యరాజ్యస్థాపనము.)

ఇది

ఇ [illegible]

వేంకటపార్వతీశ్వరకవులచే

రచియింపఁబడి

[illegible]

అయ్యగారి నారాయణమూర్తి బి. ఎ, బియల్ గారిచే

సంపాదింపఁబడినది.

రెండవమార్పు 2000

కాపీరైటు రిజస్టరు చేయఁబడినది.

ఉదారులకు
ప్లేజితో
1—0—0

1913

ఇతరులకు
పోస్టేజిగాక
రు 1—8—0

PRINTED BY
V. VENKATARAYA SASTRY,
At the Jyotishmathi Press, Madras.
1913

అవతారిక.

దేశచరిత్ర మనుజుని వివేకవంతునిగఁ జేయును. పూర్వ లెట్టికష్ట ముల నెట్టియుపాయాంతరములచేఁ దొలఁగించుకొనఁగలిగిరో తెలుపును. ఎట్టిసాధనాంతరముల నెట్టిమహోన్నతదశల నందఁగలిగిరో విశదీకరించును. ఎట్టిజ్ఞానహీనతచే నెట్టియధోగతుల పాల్పడిరో స్పష్టపఱచును. ఎట్టిసదాచారముల ననలంబించి యెట్టిబలపరాక్రమంబులచే ఖ్యాతిఁ జెందఁగలిగిరో బోధపఱచును. ఎట్టిపురాచారగ్రహణమున నెట్టిదుర్వస్థలకు లోనైరో తెలియఁజెప్పును. ఎట్టిస్వార్థత్యాగమున నెంతొక్కమహాపురుషుఁడు స్వదేశమునకుఁ గలుగనున్న మహోపద్రవమును భేదించి శాశ్వతకీర్తిని జేపట్టఁగలిగెనో ప్రబోధించును. వేయేల! ఏజాతివారుగాని, యేసంఘమువారుగాని, యేదేశమువారుగాని, యేనాగరికులుగాని, యేజానపదులుగాని, తమతమశాశ్వతదేశక్షేమమునకై యెట్టిధర్మాచరణంబున నెన్ని పాటుపడనలయునో తెలుపుచు, వారివారిజీవయాత్రలకు దారిఁ జూపును. చరిత్రజ్ఞానము లేనిదేశప్రజాజీవనము సూదంటురాయి లేనియోడయాత్రవంటిది. చూఁగన్నులును, చేతఁగట్టయు, నైనలేని దీనునిప్రయాణమువంటిది.

సమస్తశాస్త్రజ్ఞానమునందును ప్రఖ్యాతివహించిన మనయార్యులేలొకో యిట్టి మహోపకారకరంబులగుచరిత్రములను వ్రాయమాని రైచిరి? ఈకారణమున మనదేశమువా రంధకారమున మునిఁగియున్నా రనుట నిర్వివాదాంశము. ఈలోపముం దీర్పఁ బూనుపడుట ప్రతి హైందవునకును గర్తవ్యము. కేవలము చరిత్రమును వ్రాసినచో నందలి విషయములు సామాన్యజనరంజకములు గాకుండి, రోగికి పథ్యపువస్తువుల

ం వా వచ్చును. ఈకారణముచేతనే మేధావంతులైనమన పూర్వులు సామాన్యజనులకు వివిధనీతులను ప్రబోధించుటకు పురాణేతి హాసంబులే యుక్తగ్రంథము లని తలంచిరి. భారతము చరిత్రమే యయినను, మనోహరకల్పనలచే నితిహాసరూపంబుగ రచియింపఁ బడుటచే సర్వజనపరిసేయంబై సులభగ్రాహ్యంబై ఆహ్లాదజనకంబై పంచమవేదంబుగఁ బరిగణింపఁబడుచున్నది. కావునఁజరిత్రములన్ని యును నితిహాసరూపములుగ సర్వజనరంజకములుగ వెలయించుట యాధునిక కవివరులకు ప్రస్తుతకర్తవ్యము. ఇట్టియుద్యమము నెఱవేర్చుటకొఱకు మాయాంధ్రప్రచారిణీగ్రంథనిలయము స్థాపింపఁబడినది. ఇట్టియుత్కృష్ట ప్రయత్నమునందు, ప్రథమమున స్వకపోలకల్పిత మగునవలను దెని నైన వెలువరించుట కార్యసాధనము కాదని తలంచి నవలను రచించుట యం దారితేరినబంకించంద్రునియొక్క "దుర్గేశనందని"ని ఆంధ్రంబు నకుం గొనితెచ్చి మాగ్రంథమాలికకుఁ బ్రథమపుష్పముగ నొసంగి తిమి. ద్వితీయపుష్పమైన నాంధ్రకవులచే నూతనకల్పితము గావలయు నని మాచదువరులు వేగిరపడుచుందురు. వారిమనోరథమున కనుకూ లముగ "నసుమతీవసంత" మనునీనవల నర్పించుచున్నారము. ఇందలి కథ యేచరిత్రమును జీవ్రింపఁజేయుచున్నదియో మునుముున్న తెలిసి కొనఁ బాఠకులు తత్పరపడుచుందురు. హైందవులకు హిందూమహా వీరులచారిత్రము చిత్తరంజకముకదా ! అందును హిందూరాజులు మహాన్నత్యముం గాంచినకాలమునుగూర్చి వినుటకుఁ గాతుకము మెండు. చిన్నచిన్న రాజ్యములుగఁ జీలికొనిపోయి యన్యోన్యద్వేషానలం బున బలహీనమై గ్రీకువీరాగ్రేసరులవాతఁబడనున్న హిందూస్థానము నంతను నేకచ్ఛత్రాధిపత్యంబునకుఁ దెఁగల్చి హిందూరాజ్యరమ కత్యం తానందము కల్గించి హిందువులను స్వాతంత్ర్యసౌఖ్యరసాంబుధి నోల

లాడింపఁగలిగిన చంద్రగుప్తసార్వభౌమునిచరిత్రము మనకత్యంతానంద దాయకము కాదా?

వివిధసస్యానుకూలసారభరితంబై, నానాఁగోహపూరిత పర్వత శోభితంబై, బహువిధసౌఖ్యనిదానంబైన హిందూరాజ్యలక్ష్మీలావణ్యం బున కాసించి గ్రీకులచంద్రుఁడగు మహాలగ్జాండరు హిందూదేశముపై దాడివెడలి పాంచాలరాజులలో నొకరివెనుకనొకరి నోడించి క్రమక్రమ ముగ దేశము నాక్రమించుకొనుచువచ్చుచుండ, హిందూస్థానరాజ్యము లలో సత్యధిక్కృత్యమును సహించి అసమానశౌర్యధుర్యులగువీర భటసంతతులచే శోభిల్లుచున్న మగధరాజ్యసింహాసనమునధిష్ఠించియున్న నందుఁడు గ్రీకులవలన స్వదేశమునకుఁ గలుగుచున్న యవమానజనక మగు నోటమి తప్పించి హిందూశౌర్యసంపత్తులు కొఱతవడకుండఁగాపాడుటకు మాయగ, తనపట్టణంబునఁ గలసత్కులప్రసూనవీరులతో ద్వేషము కల్పించుకొని, వారినడఁగింపఁ బ్రయత్నించుచుండెను. గ్రీకులవలనఁ గలుగు చున్న యిట్టిదేశోపద్రవమును, నందునివీరధర్మరాహిత్యమును, స్వ దేశాభిమానశూన్యత్వమును, పాంచాలరాజుల పరాభవంబును గాంచి, వీరప్రతాపోన్నతుండగు చంద్రగుప్తుఁడు, అసమానరాజనీతి నిపుణుం డును, నందకులనాశనదీక్షాపరతంత్రుండు నగు చాణక్యధీమంతుని సాహాయ్యము చేకొని పాటలీపుత్రముపీడి నందశత్రుజనంబుల నొక సేనగాఁగూర్చికొని పాంచాలంబుఁ బ్రవేశించి మునుముున్న హిందూదేశ విద్వేషులగు స్వదేశరాజుల నాశముచేసి పిమ్మట యుద్ధరంగమున బాహు పరాక్రమంబున విజృంభించి గ్రీకులఁ గీటడంచి రణరంగమునయవన పారశీకాదిదేశంబుల జయించిన గ్రీకులపరాక్రమము హిందువులపరాక్రమ మునకుఁ జాలకపోయెనను యశోవిశేషము హిందూరాజ్యరమ కలం కారముగ నెసంగి గ్రీకులెన్నటికి హిందూరాజ్యమును జొరకుండఁ గట్టడి చేసి దేశక్షేమము నరయఁజాలనినందునిశిర ముపాయనముగ నొసంగి

హిందూరాజ్యలక్ష్మిం గయికొనిన చరిత్రాంశ మీ "వసుమతీవసంతము"న హృదయరంజకముగ నుత్పాదింపఁబడినది.

ఈగ్రంథమునురచించినవాఁడు వేంకటపార్వతీశ్వరకవులు. కవులిరువు రైనను నవలయందలియొకొక్కప్రకరణము నొకొక్కరు రచించి నను, శైలియం దిసుమంతయు భేదములేక కవితాధార యొక్కటేప్రవాహముగా నెప్పారుచున్నది. వివిధకవులు రచించినభారతభాగవతగ్రంథములలో నాయాభాగములశైలి తారతమ్యములు విస్పష్టపడుచు వివిధకవివిరచితములని విశదీకరించుచుండును. ఈనవలయం దట్లుగాక వర్ణనాచమత్కృతుల నేమి, ఊహాపోహముల నేమి, ధారాళశైలి నేమి, ఈయుభయకవులలో నిసుమంతయు భేదము గానరాదు. వీరిశైలి శర్కరామిళితగోక్షీరాస్వాదనముం దలపించుచుండును. వీరికవితాగ్గోరశింగూర్చియు, వర్ణనాసామర్థ్యముం గూర్చియు పాత్రౌచిత్యనిర్వాహముం గూర్చియు నవలచదివినచదువరులే గ్రహింపనున్నారు వీరు నియోగివంశీయులనియు,ఇందలివేంకటరాయకవి,ధనాభిరామము, సతీసంయుక్త, యాచఞ్ఞాగేంద్రవిజయము, అనునాటకములను, సురసయనునవలయు, పార్వతీశ్వరకవి, సువర్ణమాల, శ్రీరాశశాంకవిజయము, అనునాటకములను, ఉభయులునుగలిసి చిత్రకథాసుధాలహరియను ప్రబంధమును, రచించి తమకవితాసామర్థ్యమును నాంధ్రదేశమునఁ బ్రకటింపఁజేసిన వాగనియు మాత్రము తెలుపుచున్నాఁడను. ఇక్కవులుభయులాంగ్లేయవిద్యావాసన నిఱుంగనివారయ్యును, ఆంధ్రీకృతచరిత్రగ్రంథసాహాయ్యమాత్రమునఁ యీగ్రంథము రచియించిరి. మఱియు మాగ్రంథమాలకు ద్వితీయపుష్పముగా నెసంగవలసినదను నాప్రార్థనముచే ఏప్రిల్ నెలలో ప్రారంభించి నేచేయువేగిరపాటుచే నెలదినములలో దీనిని ముగించినారు. లోపలేశములెవ్వియయిన పండితోత్తముల క్షీగ్రంథము

నందుఁ గానఁబడినచో వానికీ యవ్యవధయే కారణమని విన్నవించు చున్నాఁడను.

ఈయాంధ్రప్రచారిణీ గ్రంథమాలికాభ్యుదయమునకు సర్వవిధ ములఁదోడ్పడుచున్న మాప్రధానపోషకులకును, అచిరకాలమునసే మా యుద్యమమున కత్యంతపోషకులయి, ఆంధ్రదేశమునం మొదల మాగ్రంథముల నందికొనుచున్న భాషాభిమానులగు మాచందా దారు లకును, మేమెంతయుఁ గృతజ్ఞులమై యున్నారము.

ఆంధ్రభాషాసేవకులగు వారెవ్వరైనఁ జరిత్రవిషయమగు నవల నేదియయిన మనోహరముగ వ్రాసి మాకొసంగినచో వందనపూర్వక ముగ నందికొని యిందుఁ బ్రకటించుచున్నారము.

అయ్యగారినారాయణమూర్తి,
సంపాదకుఁడు.

ఆంధ్రప్రచారిణీగ్రంథనిలయము.

ప్రకటనలకునిబంధనలు.

వార్తాపత్రిక లొకసారిమాచుటకు మాత్రమేయుపయోగించు పవి యగుటచేతను, గ్రంథములు శాశ్వతములు నిరంతరపఠితములు నగుటచేతను, వార్తాపత్రికలయందలి ప్రకటనలకంటె గ్రంథములయందలి ప్రకటనలు శాశ్వతములయియుండునని వేఱుగఁ జెప్పనక్కఱలేదు.

2. మాగ్రంథములు సర్వజనసామాన్యముగనులభశైలినిర్వాయం బడినమనోహరములగు నవలలగుటచే వీనికి విశేషవ్యాప్తియును, బహు జనాదరణమును కలిగియుండును. కావునీగ్రంథములయందుఁ బ్రకటనలు వేయించుకొనువారికి విశేషలాభము కలుగును

3. మాగ్రంథములలో ఒకమారుప్రకటన వేయుటకు పేజీ 1 కి రు8-0-0లు అరపేజికి రు5-0-0లు పాతికపేజికి రు3-0-0లు తీసికొనఁ బడును. విడివిగప్రకటనలు వేయించుకొనువారికి చేటుతగ్గింపఁబడును. ఇంకనువిశేషము తెలియఁగోరువారు మాకు ప్రత్యేకముగ జాబువ్రాయ వలయును.

4. పత్రికాధిపతులెవ్వరైన మాప్రకటనలను తమతమ పత్రికల యందువేయ నంగీకరించెదరేని వారిప్రకటనలను మాగ్రంథములందును ముద్రించెదము.

సెక్రటరీ,

రెండవకూర్పు పీఠిక.



భాషాభిమానుల యాదరముచేతను, భాషాపోషకుల యభిమానముచేతను, ప్రభువుల యనుగ్రహముచేతను, మా గ్రంథమాలికనుండి ప్రథమసంవత్సరమున వెలువడిన నవలలన్నియును పునర్ముద్రణమునకు వచ్చినవని తెలియఁజేయుటకెంతయు సంతసించుచున్నారము.

ఆంధ్రభాషాసేవసేయుచున్న మా యాంధ్రప్రచారిణీగ్రంథనిలయమునకుఁ గంటికిఁ దెప్పలోలె నెల్లవిధముల సహాయులైయుండి మా యుద్యమములకుఁ బ్రోత్సాహముంగూర్చుచున్న మాప్రధానపోషకులును, ఆంధ్రభాషాపోషకులును, నుదార హృదయులును, నగు శ్రీ శ్రీ కొవ్వూరిచంద్రారెడ్డిగారికి మేమెంతయుఁ గృతజ్ఞతాభినందనముల నాచరించుచు సత్కార్యనిర్వహణదీక్షాదక్షులగువారికి సర్వేశ్వరుఁడు దీర్ఘాయురారోగ్యములనిచ్చి రక్షించుగాకయని ప్రార్థించుచున్నారము.

మిక్కిలి శ్రమపడి పదిదినములలోనే ఈగ్రంథ ముద్రణాదికార్యములఁబూర్తిచేయించియిచ్చిన హెచ్. వి. కృష్ణ అండు కంపెనివారి యెడ మేమెంతయుఁగృతజ్ఞులము. ముద్రింపించిన జ్యోతిష్మతీముద్రాక్షరశాలాధికారులును మిక్కిలి ప్రశంసనీయులు.

సంపాదకుఁడు.

శ్రీరామచంద్ర.

అదృష్టము.

అదృష్టమునకు తెక్కలున్నవి. కాలచక్రమువలె నిది యెప్పుడు నాఁగక దొరలిపోవునదికాదు. ఇచ్చనచ్చినప్పు డెగురుటకును, కోరిన చోట వ్రాలుటకును, దానికి స్వాతంత్ర్యమున్నది. ఇష్టము లేనిచోటఁ దనగాలియయినఁ బ్రసరింపకుండఁ జల్లఁగ దాఁటిపోవుచుండును. అదృష్ట వంతునకు దాని తెక్కలచప్పు డొక్కసారియే వినఁబడును. అదృష్ట హీనున కాచప్పుడెప్పుడును వినఁబడదు. అది యెప్పుడును గనఁబడదు. అదృష్టమునకుఁ గనఁబడుస్వభావమే లేదని కొందఱనుకొందురు. అదృష్ట హీనుఁ డదృష్టమే లేదనుకొనును. తెక్కలున్న, యదృష్టమునకు రూప మేలలేదని నీకు సందేహముకలుగుచున్నదా? దానితెక్కలకుమాత్రము రూపమున్నదా? ఆకస్మికముగ నెగిరిపోవుస్వభావముకలదగుటచే దానికి తెక్కలున్నవనుకొనుచున్నాము. కావుననే దానిని పక్షియని భావించు చున్నాము. అది వ్రాలినచోటు కన్నులపండువుగా నుండును. అది ప్రార్థించినరాదు. పిలిచినఁ బలుకదు. అది యెప్పుడు వచ్చునో యెక్కడ వ్రాలునో ఎంతకాలముండునో యెవ్వరు చెప్పఁగలరు? కొందఱు దీనిని వెదకిపట్టుకొనవలయునని ప్రయత్నించుచున్నారు. ఈత్రోవనే వచ్చునని కొందఱెదురు చూచుచున్నారు. కొంద ఱేమియుంజేయక నిస్పృహం జెందుచున్నారు. అదియొకప్పుడు ప్రయత్నించినవారికిఁ జిక్కుటయును గలదు. ఎదురు చూచువారికిఁ గనఁబడుటయును గలదు. నిస్పృహం జెందువారియెదుట వ్రాలుటయును గలదు. ఒకప్పు డీమువ్వురిని దాఁటి పోవుటయును గలదు. మొత్తముమీఁదఁ దఱచుగనూరకచూచుచుండు

వారికంటె బ్రయత్నము చేయుచుండువారే యదృష్టమును బొందగలుగుదురని బుద్ధిమంతుల యభిప్రాయము.

అదృష్టమునకు మంచి చెడుగులు లేవని కొందఱందురు. అది యసత్యము. అదృష్ట మవివేకులకడనైనను నుండఁగలదుగాని యనూయాగ్రస్థుల కడ నుండఁజాలదు. ఎచ్చట మదమాత్సర్యాది దుర్గుణములు వర్ధిల్లుచుండునో యచ్చటినుండి తొలఁగిపోవుట కదృష్టము తనజెక్కల విప్పుకొనుచుండును. కొందఱు దీనిని దైవమందురు. కొందఱు భాగ్యమందురు. ఎవ్వరెట్లన్నను మేము దీని నదృష్టమే యందుము. అదృష్టమువంటిది మఱియొకటి లేదు. సర్వమున కదృష్టమే నిదానమైనది. నేఁడు మాకల మదృష్టప్రభావము నూహించుచున్నది.

శ్రీరామచంద్ర.

వసుమతీవసంతము.

ప్రథమభాగము.

మొదటిప్రకరణము.

నేడు మూడుజాములు తిరిగినవి. సూర్యుఁడాకాశగోళమున మూడుభాగములకుఁ బయినుండి వెలుంగుచుండెను. ఎండయంత తీవ్రముగ లేదు. ఇవి ఫాల్గునమాసపు గడపటిదినములు. ఇప్పుడిప్పుడేకొంచెము కొంచెముగ నెండలు ముదురుచున్నవి. శిశిరవసంతసమాగమ సమయంబులఁ బగటిపూటఁగూడ బ్రొద్దునాలిన పిదపఁ బ్రయాణము సేయుట యాత్రికుల కంతకష్టముగ నుండదు కాన్పున మన మిప్పుడు పాటలీపుత్త్రిమునకుఁ బదిమైళ్లదూరమున నున్న మహావనమునఁ బ్రయాణము చేయవచ్చును. వసంతునిదూత లగుకోకిల లప్పుడే యావనమునఁ బ్రవేశించినవి. కోమలకలస్వనంబుల నెల్లరకును వసంతుని రాకఁ దెలుపుచున్నవి. దక్షిణవాతపోతములు మాఘిడిపూవుల కమ్మనిపరిమళములతోఁ వచ్చి వానికి స్వాగత మొసంగుచున్నవి. వనరమ యాదూతలకుఁ జిగురుతోఁ, రజములతోఁ, నలంకరింపఁబడిన మనోహర శాఖామందిరముల విడుదులు చేసి యుంచినవి. ఒత్తుగఁ బెఱిగియున్న చిట్టేఁత, బలుసు, బొమ్మజెముడు, మొదలగు ముండ్ల పొదలచేతను, దట్టముగ నల్లికొన్న వివిధలతా సంతానములవలనను, విశాలశాఖా ప్రకాండములచే నాకాశము నెరయుచున్న భూమీరుహంబులతోడను, దుర్గమంబయి యున్న యమ్మహావనము క్రూరసత్త్వనివాస యోగ్యమైనదైనను, భవిష్యద్వసంతా

గమసూచకంబు లగుకలకంఠ నిస్వనంబులతోడను, మందమలయా నిలం బులతోడను, పల్లవిత కుసుమిత లతాతరు కాండములతోడను, కన్నుల పండువు సేయుచుండెను.

ఆవనమధ్యమున వాయువ్యమునుండి యాగ్నేయముగా బోవు చున్న యొకదారి యున్నది. అది యంత విశాలమైనదికాదు. ఎరుసగా రెండుమూడుగుఱ్ఱములు పోవ్వటకుమాత్రము సరిపడియున్నది. దాని కిరువంకల నిలివెడెత్తున నెత్తుగా బెరిగియున్న పొదలును, మొక్కలును, తీవలును, దూరముగ నున్న గుట్టలవఱకును వ్యాపించియున్నవి పాటలీ పుత్త్రమునకు వచ్చుచుఁ బోవుచుఁ నుండు ప్రయాణికుల రాకపోకలచే నామార్గము చాలవఱకు నలఁగియే యుండెను. అక్కడక్కడఁ బ్రాక్పశ్చి మంబుల కొకరిద్దఱు మనుష్యులుమాత్రము పోవ్వటకు సరిపడినయిఱుకు త్రోవ లామార్గమునం గలియుచున్నవి. అవి తఱచుగా వేఁటకు వచ్చు చుండు రాజులు తమవేటకాండ్రతో నంతర్వనంబునకుం బోవ్వట కేర్ప డినవై యుండవచ్చును. అపరిచితం బగు నియ్యరణ్యమున నాసందు త్రోవలంబడి మనము పోఁగూడదు. తిన్నఁగా దారినే పోవుదము

అరేబియాదేశపుగుఱ్ఱముపై నెక్కి యొక యాశ్వికుఁ డాదారిని వచ్చుచుండెను. ఆతని వయస్సురువదిరెండు సంవత్సరము లుండును. కన్నులు విశాలము లయినవియే గాని మొగమంతయందమైనది కాదు. గండు మొగము. గళ మొక్కింతపొడవై శిరోవేష్టభారమున వంగి యుండెను. శిరోవేష్టమునందలి రవలతురాయి యాతఁడొక రాజకుటుం బములోనివాఁడనిచెప్పక చెప్పుచుండెను. గుఱ్ఱము మెల్లగ నడచుచుండెను. గమనాయాసముచేతఁ గాను. ఆతఁడు కళ్లెమును వదలి వేగముగఁ బో నిచ్చుటలేదు. పురుషఁడు వెనుకకుఁ దిరిగితిరిగి చూచుచుండెను. ఇంతలో దూరముకుండి యొకయీల వినఁబడెను. ఆతఁడు వనము నలుదెసలను ఒఱకించి చూచెను గాని యేమియును గోచరింప లేదు. నిశ్శబ్దముగ

నుండెను. వెనుకనుండి రెండుగుఱ్ఱములు వేగముగఁ బరుగెత్తుకొని వచ్చుచుండెను. యోధుఁడు తనగుఱ్ఱపుకళ్లెమును సడలించుటచే గుఱ్ఱము పరుగెత్తసాగెను. ఇంతలో దూరమున పొదలనుండి గలగలధ్వని యొకటి వినఁబడెను. మరల నీల వినఁబడెను. ఇప్పుడు గుఱ్ఱపుగతి కొంచెము మందగించినది. కనుచూపుమేరలో భూమివిశేషముగ లేచి యాకసము వఱకును వ్యాపించుచుండెను. అది క్రమక్రమముగ సమీపించెను. ఆవైపున టకటకయనుధ్వనులు వినఁబడుచుండుటచే యోధుఁడు పరికించి చూచెను. పొదలనుండి విడివడినదుప్పలగుంపొకటి యాతని కన్నులఁ బడియెను. కొన్ని ముందునకు నచ్చుచుండెను. కొన్నిదుప్పలు పొదల నుండి విడివడి యిటునటు గంతులు వేయుచుండెను. కొన్ని గుట్టల నుండి గబగబ యాప్రదేశమున కురుకుచుండెను. గుంపులుగుంపులుగను, మందలుమందలుగను వచ్చునాదుప్పలచే మార్గమున కవరోధము కలిగెను. దుప్పికొమ్ములకుఁ జుట్టుకొని తెగిపడిన లతాగుల్మములచేఁ ద్రోవయంతయుఁ జిందరవందర యగుచుండెను. అవి తండోపతండములుగ వచ్చిపడుచుండుటవలన గుఱ్ఱము ముందున కడుగిడలేక పోయినది. యోధుఁడు కళ్లెమును బిగించి యొఱలోనికట్టారిని దూసెను. కాని, యాతనికి ధైర్యము చాలినదికాదు.

అల్లంతదూరమున మనుష్యనియలుకు డయినంతమాత్రమునఁ జేయుచున్న కసవునుగూడ వదలి సహజభీరుత్వమును సూచించు తను చంచలకటాక్షముల నలుదెసలఁ బ్రసరింపఁజేయుచు చంగుచంగున నే పొదలమాటునకో, ఏ లోయలలోనికో, పాఱిపోయి దాఁగికొనుదుప్పలే కావాయివి? పరస్పరసాహాయ్యమున వీని కెంతబలము, ఎంతధైర్యము, ఎంతసాహసము కలిగినది? ఔరా! ఏమి యాసేనావిన్యాసము! ఒక్కదాని వెనుక నొకటి! పలవలకొమ్ములొండొంటినొరసికొనున ట్లొకదాని ప్రక్క—

నొకటి! ఆకొమ్ములను శారుటీఁ బెలవలె ముందునకువంచి తదేకదృష్టితో నాయోధునివంక నెట్లుచూచుచున్నవో?

దుప్పులగుంపు చాల నపాయకరమైనది. పులివేటయయిన నింత భయంకర మయినదికాదు. దానినుండియయినఁ దప్పించుకొనుటకు మార్గము లున్నవి. దుప్పులు గుంపులయి వచ్చిపడునప్పు డెట్టియోధుఁ డయినను తప్పించుకొనఁజాలఁడు. పర్వతమయిన నడ్డుపడలేదు. వీనిమూ లమునఁ జాలమంది వేటకాం డ్రపాయములపాలయిరి. ప్రాణములఁ గోల్పడిరి.

మనయోధునకు సందిగ్ధ సమయము తటస్థమయినది. ముందు నకుఁ బోవలేఁడు. దుప్పు లెదుట కలగఁద్రొక్కుచుండెను. గుఱ్ఱము ముందునకడుగిడుటలేదు. ఆఁగిపోయెను. దుప్పులు మార్గమున గుంపుగట్టి మోరలు పైకెత్తిచూచుచుండెను. వానికొమ్ములకుఁ గల వాఁడి బల్లెముల కైన నుండదు. అవి త్రిశూలములు. ఆప్రళయకాల రుద్రాయుధముల పైఁ బడినవారికి బ్రిదుకెక్కడిది?

యోధుఁడు తనవాఁడికత్తిచే నొకకొమ్మును, రెండుకొమ్ములను, పదికొమ్ములను, ఛేదింపఁగలఁడు కాని, యవి లెక్క లేకుండనున్న వే?ఆతని కేమియును దోఁచుటలేదు హృదయ మావేగపడుచుండుటచే నున్న ధైర్యమును జాఱిపోయినది మరల నొక్కసారి ముందునకు వీక్షిం చెనుగాక్కలు గిఱ్ఱునఁ దిరిగెను. ధైర్యముచెదరియున్న యాతనిహృదయ మున భయమునకుఁ జోటుదొరకెను. అది ప్రవేశించినతోడనే యాతు రత యధిక మగుటచే నాతఁడు సంభ్రమపడఁజొచ్చెను. వెనుకకుఁ దిరిగి తన్ను వెంబడించి గుఱ్ఱములపైవచ్చుచున్న వారినిగూర్చి "రావలదు" అని యొక్కకేకవైచెను. తోడనే వెనుక వచ్చుచున్న గుఱ్ఱములు కొలఁది దూరమునసే యాఁగిపోయినవి. పాప మారెండుగుఱ్ఱములపైనున్న వారు ను స్త్రీలే.

యోధుఁడు కల్లెమును పార్శ్వమునకు బిగలాగి గుఱ్ఱమును వెనుకకు మరలింపఁజూచెను గాని జంతుస్వభావము నెఱింగినయాగుఱ్ఱము స్థాణువువలెనుండి తిరుగదయ్యెను. అతికష్టమున నాతఁడు గుఱ్ఱమును మరలించెను. ఆసమయమునఁ దూర్పుదిక్కున కొండలోయనుండి "తిరుగకుము! వెనుదిరుగకుము! అపాయము రాఁగలదు" అనియొక గంభీరధ్వని వినవచ్చెను. భయభ్రాంతిచేఁ గలఁతనొందినయాతనిమనస్సున కావాక్యములు బోధపడినవికావు. మఱింతభయముతోఁ గల్లెమును వదలి రికాబులనుండి మడిమలు తాటించి గుఱ్ఱమునుడాయించెను. గుఱ్ఱము శరవేగమునఁ బెద్దదాఁటులతో వెనుకకుఁ బరుగెత్త నారంభించెను.

బిలబిలలాడుచు దుప్పలన్నియు నెక్కసారిగా మోరలు వంచికొమ్ముల భాఱుచేసి యతివేగమున నాగుఱ్ఱముపైఁ బడ ముందున కుఱుకుచుఁ దఱుముకొనివచ్చుచుండెను. వానిగమనమున వాయువేగమున్నది. తెప్పపాటుకాలములో ముందున్నదుప్పలన్నియు నాగుఱ్ఱముపైఁ బడి వాఁడికొమ్ములం గ్రుమ్మి చిందఱవందఱఁ జేసినైచెను. పాపము! మన యోధుఁడు క్రిందఁగూలఁబడియెను ఆతనిపైగుఱ్ఱమును బడిపోయెను. ఆభీభత్సముంజూచి ముందుగుఱ్ఱముపై నున్నబాలిక యొక్కకేక వైచి మూర్ఛిల్లెను. అంతకంటెను ముందు రాఁబోవు నాపదనుండి సాధ్యమయినంతవఱకుఁ దప్పింప నెంచి వెనుకగుఱ్ఱముపై నున్నసుందరి యాబాలికగుఱ్ఱమునకు తనగుఱ్ఱము నడ్డముగఁ జేర్చి యొఱనుండి కత్తిని దూసికొని సంసిద్ధముగ నుండెను ఉపమాలంకారప్రియుం డగుకాళిదాస మహాకవి యీసుందరినప్పుడు చూచియుండునేని తప్పక మహిళాసుగమర్దని యగుచండికతోఁ బోల్పకమానఁడు.

ఆసమయమున నిందాఁకటికంటెఁ గొంచెము సమీపమున మరల నొకయీల వినఁబడెను. తోడనే వేటకుక్కలు పొదలనుండి శరవేగమున విడివడివచ్చి యాదుప్పలను దాఁకి చెల్లాచెదరుగఁ జేయుచుండెను.

ఆదిక్కునుండి వేలకొలఁది యలుఁగు లొకదానివెనుక నొకటిగ బారులు గట్టి వచ్చుచుండెను. ఆదారుణశరాఘాతములచే గుట్టమును గ్రుమ్ముచున్న దుప్పులు తుత్తునియలయి పోయెను. ముందు జంతువులు కూలిన కొలఁది వెనుకనున్న దుప్పులు ముందునకుఱికి యాశరానలంబునకు శలభములయి పోవుచుండెను. ఆబాణఘాతములకుఁ దప్పి ముందుగుట్టముల పై కుఱుకఁబోవుచున్న జంతువుల నాసాహసికసుందరి తనకరవాలమున కెరఁ జేయుచుండెను. చెదరి పాఱిపోవుచున్న దుప్పులను వేఁటకుక్కలు తమకరాళదంష్ట్రాంకురంబులఁ జీల్చి చెండాడుచుండెను. నాలుగయిదు నిమిషముల కాప్రదేశమున దుప్పులవికలాంగకములు తప్ప దుప్పులు లేవు. ఇఁక దమకుఁ బని లేదనికాఁబోలు నొక్కవేఁటకుక్క యయిన నక్కడ నిలువలేదు శరవర్షము చల్లారినది.

ఇంతనఱకుఁ గటారిచేఁబూని కాచికొనియున్న యాసుందరి యప్పు డొకసారి వెనుకకుఁ దిరిగి చూచెను. ఇంకను నాబాలక గుట్టముపై మూర్ఛమునింగియే యున్నది. రికాబులలోనున్న యాబాలిక సుకుమార ప్రవాళారుణచరణంబు లల్లలయున్నవి. కోమలమృణాలసమాదృశంబు లగునాబాహువల్లరు లాయశ్వకంఠమున నిరువంకల వ్రేలాడుచున్నవి. సహజరాగరామణీయకంబు లగునాయంగుళు లిప్పుడు రక్తకాంతులం జిలుకుచున్నవి. ఆబాలికా మనోహరచంద్రమండలము గుట్టపుజూలుచేఁ గప్పఁబడి యున్నది. అట్లుపడియున్న బాలికంజూచి యా రెండవ సుందరి, యొక్కనిట్టూర్పు విడిచెను. కన్నులనుండి యశ్రుబిందువుల వెలార్చెను. స్త్రీస్వభావము. సహజముగ సాహసిక లగుకాంత లాపదల యందు ధైర్యమునే వహించుదురు. కాని యనంతరమున దుఃఖ మూఁచి కొనఁజాలరు.

సుందరి గుట్టమునుండి దిగెను. గుట్టముపైఁ బడియున్న యా బాలికనెత్తి తనయొడిలోఁ జేర్చికొని మొగముపైఁ బైటచెఱఁగుతోఁ

గొంచెముగవిసరెను. ''అమ్మా! భయములేదు'' అని పిలిచెను. ఇంకను నాబాలికకుఁ దెలివిరాలేదు. సుందరి, బాలిక, యనువిశేషణములు మీకు వినుఁగుఁ బుట్టించుచున్నవా? అపరిచితవనీతలంబున నాకస్మిక ముగఁ బరిచితలైనవారి నామములు మనకెట్లు తెలియఁగలవు? తెలియునంతవఱకు మనమావిశేషణములనే విశేష్యములుగా వాడు కొందము. ధర్మధర్మవాచకవిషయంబున మహాకవులమనుకొనువారే పొరఁబడిపోవుచున్నారు. ఈగందరగోళమునఁ బడియున్న మన మెంతటి వారము? అయినను సుందరీపదము మనోహరమైనదియే. బాలిక ముద్దు పేరు. ఉచ్చరించినకొలఁది మనోహరంబులగుచుండు నీముద్దుమాటల వినుట కెవ్వరు ముచ్చటపడకుందురు?

సుందరి యట్లే విసరుచుండెను. ఆచల్లనిగాలి కాబాలిక ముగంబున ముసరికొనుచున్న వినిలకుటిలకుంతలంబులు వీచోపులిచ్చుచుండెను. సుందరి మాటిమాటికి నామెకన్నులు విచ్చునేమో యనునాశతోఁ జూచుచుండెను. కొంతసేపటి కాబాలిక మొకనిట్టూర్పు విడిచెను. కనుదమ్ము లించుక చలించెను. ఆబాలికామణి మొకసారి కన్నులు విచ్చి చూచెను. ఎనుట నొకపురుషుని దివ్యసుందరవిగ్రహముండెను. మరలఁ గన్నులు మూతవడియెను.

రెండవ ప్రకరణము.

ధనుర్బాణములను ధరించియున్న యాపురుషుని చూచినతోడనే సుందరి సంభ్రమము నొందెను. ఏమియును మాటలాడక యాపు రూపచకమగుదృష్టితోఁ బడియున్న గుఱ్ఱమువంకఁ జూచుచుండెను. పురుషుఁడతివేగముగ నాగుఱ్ఱమును దొలఁగించి క్రిందఁబడియున్న

యోధునిశరీరమును దడవిచూచెను. గాయములు విశేషముగఁ దగిలి యున్నవి. నెత్తురువెల్లువలచే దుస్తు లన్నియును దడిసిపోయెను. ప్రక్క లెగురుటలేదు. చేయిపట్టిచూచెను. నాడి కనఁబడలేదు. గుండెలపైఁ జెవినెగ్గి వినెను. ఏమియును వినఁబడుచున్నట్టులేదు. శరీరమువాత్రము వెచ్చగనే యున్నది. నాసారంధ్రములనుండి కొంచెము శ్వాసము వచ్చుచున్న ట్లనుమానించెను. మరల గుండెలపైఁ జేయినై చెను. ఱగియాఁగి కొట్టుకొనుచున్నట్టు కనిపట్టెను. ఆతనియాతురమును జూచి, సుందరి "అయ్యా! ఆతఁడెట్లున్నాఁడు?" అని తొందరతోఁ బ్రశ్నించెను.

"భయములేదు. ఆబాలికకు స్మృతివచ్చునఱకు నీవేమియును గదలవద్దు. ఈతనిరక్షణమునకుఁ దగిన ప్రయత్నములఁ జేసెదను." అని పురుషుఁ డామెను హెచ్చరించెను. ఇంతలోఁ గొంతమంది సేవకు లచటికి వచ్చిరి. పురుషుఁడు వారితో నేమియో మెల్లఁగఁ జెప్పెను. సేవకు లాయోధుని పదిలముగ నెత్తి తీసికొనిపోయిరి పురుషుఁడు సమీపించి "ఇంకను స్మృతికలుగలేదా?" యని సుందరినడిగెను.

"అయ్యా! ఈసుకుమారి భయభ్రాంతయై మూర్ఛిల్లినది. హృదయము చెదరిపోయినది. ఎంతకునుస్మృతికలుగుటలేదు. కొంచెము జలముండిన——"

పురుషుఁ డటునిటుచూచి "భద్రముగ నుండుము" అనిచెప్పి వెడలెను

"ఈయాపద్బాంధవుఁ డెవ్వఁడై యుండును?" అనిసుందరి తలపోయసాగెను. ఏమియును గోచరముకాలేదు. పురుషుఁడు వారినెఱిం గియే యుండునా?

పురుషుఁడు జలమునుగొని తెచ్చి యా సుందరి కొసంగెను. ఆ జలము సుందరి యాబాలిక ముఖమునఁజిలికి చీరచెఱఁగున నలిమృదుల

ముగ నొత్తెను ఆచీరచెఱంగుచే మరల విసరుచుండెను. కొంతసేపటి కాబాలిక యొకనిట్టూర్పు విడిచి కన్నులు తెఱచెను. ఆసుందరపురుష మూర్తి కన్నులయెదుటనే యుండెను. బాలికకు స్మృతి వచ్చినది. ఆమె యట్టె తనదృష్టి సుందరిమోమునఁ బ్రసరింపఁజేసెను. సుందరి హృదయము సంతోషనిమగ్నమయ్యెను బాలికచూపుల యర్థమును గ్రహింపలేకపోయెను. సుందరియొడినుండి యాలేమ తటాలునలేచి మేలిముసుఁగు సవరించుకొని యామెవెనుక కరిగెను సుందరియును లేచి నిలువఁబడియెను.

పురుషుఁడు "మీరెక్కడికేగెదరు?" అని యడిగెను.

సుందరి "పాటలీపుత్త్రమునకు"

"ఎచ్చటినుండి వచ్చుచుంటిరి?"

"రత్నగిరినుండి, మాపరివార మంతయు ముందేగినది. సమీపమునకు నచ్చితిమిగదాయని మేమాయనతో గుఱ్ఱముల నెక్కినచ్చుచు నీవిపత్తునంబడి పరోపకార పారీణులగు మీయవ్యాజవాత్సల్యమున రక్షింపఁబడితిమి,'

"ఆయోధుఁడు నారభమ్మపై సురక్షితముగఁ బాటలీపుత్త్రము చేరఁగలఁడు. గాయములమాన్పుప్రయత్నములును జరుగును."

ఈసంభాషణమునలన బాలిక కెల్లవృత్తాంతమునుదెలిసెను. తమ్ముఁ గాపాడినయాపుణ్యపురుషుని సుందరి వెనుకనుండి మరల నొకసారి చూచెను. ఆచూపును మరలించుకొనలేక పోయెను. ఆలోకమోహనం బగు సుందరాకారసందర్శనంబునఁ దనివి తీరకుండెను అతనియెడమ భుజంబున నెక్కుడించియున్న విల్లు పాదములవఱకు వ్రేలాడుచుండెను. మెడలోజందెపుఁబెట్టుగ ధరింపఁబడినయమ్ములపొది కుడివైపున నెప్పులు గులుకుచుండెను. కుడిచేతిలో నొకయలుఁగుండెను. జఘనోపరిభాగమున బిగించి కట్టినకాసెకోక యాతనిసింహమధ్యమును విస్పష్టముగఁ దెలుపు

చుండెను ఒడలంతయుఁ గంచుకాద్యలంకరణములచేఁ గప్పఁబడియుండెను. విశాలవక్షస్థలంబును, నాజానులంబితంబు లగుబాహువులును, నాతఁడు బలపరాక్రమసంపన్నుఁడని చెప్పుచుండెను. పూర్ణిమాచంద్రమండలమును నిరసించునాతనిమోమున నొకవింతకాంతి కన్నుల మిఱుమిట్లుగొలుపుచుండెను. పుండరీకంబులఁబోని యాపాలుగన్నులు సోగలై, యాకర్ణాంతములై, చూపులుగభీరములై, సుందరములై, యుండెను. ఫాలభాగము విశాలమైయుండెను. విండ్లనలె వంగియున్నకనుబొమలు దీర్ఘములై, దట్టములై, యున్నవి. ఇంద్రనీలకాంతులఁ జిమ్ముచుఁ, బట్టుకుచ్చులవలె మెత్తనై యొత్తుకొనుచున్న మీసములు ముఖమండలమునకు సంపూర్ణశోభావంతములై యుండెను. అట్లాబాలిక యింకను జూచుచునే యుండెను. అసుందరాంగునికడ క్షణక్షణమున కాకవింత యందము తోఁచుచునేయుండెను.

పురుషుఁ డాబాలికచూపులయర్థమును గ్రహించెనో లేదో కాని యాతనిచూపులుమాత్ర మాసమీపమునకుఁ బోయి కుశలప్రశ్నమును జేయుచుండెను. చూపులకుఁ గుశలప్రశ్నమనఁగానేమందురా? అవి యొండొంటితోఁ మైత్రిఁగల్పించుకొనఁగలవు. అగాధములగు హృదయములను గూడఁ దెలిసికొనుశక్తి వానియందున్నది. ఆరహస్యము మనకెట్లు తెలియును? సుందరి యీపరమార్థమును గ్రహించెనో లేదో గాని వెనుకకుఁ దిరిగి బాలికవంకఁ జూచెను.

" ఈసాధుశీలుఁ డెవ్వరై యుండును ? " అనువాక్యము లా బాలిక కెంబెదవులనుండి యప్రయత్నముగ నవ్యక్త మధురధ్వనితో మెల్లఁగ వినవచ్చెను.

సుందరి పురుషునివంకఁ జూచి"అయ్యా! నేఁడు మాప్రాణములను గాపాడి మాకు మహోపకారముఁ గూర్చిన మీపావననామాక్షర

ములం దెల్పి మమ్ము ధన్యాత్మలఁగాఁ జేయఁ బ్రార్థించెదను" అని యెను.

"ఎల్లవిపత్తులనైనను దప్పించి సజ్జనుల సర్వదా కాపాడుటకు జీవదయాపరుం డగు భగవంతుఁడే తోడుపడుచుండును. మానుష్యమాత్రుఁడ నగు నేనెంత? నాపేరుతోఁ బ్రయోజన మేమి?"

"ఇప్పట్టున మమ్ము రక్షించుటకై యవతరించిన భగవంతుఁడు మీకంటె మఱి మాకెవ్వఁడు?"

"అదృష్టవశమున నీశ్వరప్రేరణచే నిమిత్తమాత్రముగ వచ్చిన నాసంగతిఁ దెలిసికొనుటవలన మీకుఁ బ్రయోజన మేమున్నది?"

"ఉత్తములు తమనామమును దాముగఁ దెలియుఁ జేయునాచారము లేదని నేనెఱుంగుదును—అయినను కృతజ్ఞతాపూరిత మగునాహృదయము నన్నిట్లు ప్రేరేచుటచే నడుగ సాహసించితిని. నన్ను క్షమించెదరుగాక!"

"ఇంకు క్షమింపవలసిన దేమున్నది? సురక్షితముగ మీగమ్యస్థానమును జేర్చుటయే నాకోరిక యైయున్నది"

"మీకు సర్వదా భగవంతుఁడు తోడగునుగాక!" ఇట్లు వారు ముచ్చటించుకొనుచుండఁగాఁ గొందఱుబోయలొకపల్లకిం గొనితెచ్చిరి. పురుషుఁడు "మీరీపల్లకినెక్కి- పాటలీపుత్త్రమున కరుగవచ్చును. ఈ బోయలు మిమ్ము సురక్షితముగ గమ్యస్థానమునకుఁ గొనిపోవఁగలరు" అనియెను.

బాలిక మేలిముసుఁగును సవరించుకొనియెను. సుందరి యామె హృదయమును గ్రహించి ముందునకు దారితీసెను. బాలిక మందమంద గమనముతో నామెవెన్నంటి పల్లకియొద్దకుం జని యచ్చట నిలువఁబడియెను. సుందరి యాపురుషునకు నమస్కరించి "మాకు సెలవొసఁగెదరా" యని విన్నవించెను—

"శుభమగుంగాక" యని పురుషుఁ డాశీర్వదించెను. తోడనే యాబాలిక పల్లకిలోఁ బ్రవేశించుచు మేలిముసుఁగుచాటునుండి యొక సారి పురుషునిపైఁ దనకటాక్షమును బఱపించెను

కొందఱుముద్దరాఁడచూపు లతినిశితములైనవి. ఆచూపు లా పురుషుని హృదయమున నాఁటుకొనియెను. ఆతనిహృదయ మొక్క సారి కలఁగెను. ఇంతలో సుందరియుబల్లకి నెక్కెను. బోయ లా పల్లకినెత్తి యోంకారధ్వనులు దెసలఁ బ్రతిధ్వనులీనఁ బాటలీపుత్రము దిక్కుగా నడచుచుండిరి. పల్లకి దృష్టిపథంబునుండి దాఁటిపోవుటచేఁ బురుషుఁడు తనచూపులను వెనుకకు మరల్చెను. ఇరుపురుసేవకు లాయశ్వములను వారివెంటఁ గొనిపోయిరి. మనపురుషుఁడు తాను వచ్చిన త్రోవనే వనమధ్యమునకుఁ బోయెను.

మూఁడవ ప్రకరణము.

పాటలీపురదుర్గమునందలి రాజభవనమున వసారాలో నొకపురుషుఁడు ప్రచారము చేయుచుండెను. అతఁడు విలువగలసన్ననితెల్లదుస్తులను ధరించియుండెను. అతఁడు ధరించినయంగీ మోకాలివఱకు దిగఁబడి వాయుప్రసారమునఁ గొట్టుకొనుచుండెను. సగముసగము నరసినబుగ్గమీసములును, దట్టమై పొడుగుగనున్న బవిరిగడ్డమును ఆతనిగంభీరవదన మండలమునకు మఱింతగాంభీర్యమును గలిగించుచుండెను. అమూల్యరత్నఖచిత మగుముద్రయుంగర మాతనికుడిచేతి చిటికెనవ్రేలిపైఁ బ్రకాశించుచుండెను. సింగపుతలలపోలిక చెక్కడపుఁబనిగలమెఱుఁగుబంగరు కడియము లాతనిముంజేతుల వ్రేలాడుచుండెను. ఆతనిపదంబుల బంగారు సరిగపనిచేసినముచ్చలజోడు ధరింపఁబడి యుండెను. ఆచంద్రకాంత

శిలాతలంబున నటునిటు నడచుచున్న డాక్టరు మడిమలతాఁకునఁ జిటుకు చిటుకునుని ధ్వనిచేయుచుండెను. ఆతనివలెఁ స్వఱువదియేండ్లు గడచి నను శరీరిపాటవముంబట్టి నలువదియేండ్లకు మించియుండదని తోఁచును. రాత్రినిద్దుర చాలకయో, మతియేకారణముననో గాని యాతనినేత్రము లెఱ్ఱవడి నెత్తురుముద్దలవలె నుండెను.

ఆతఁడి ట్లాలోచించుకొనుచుండెను. "వైద్యులు బాగుగనే పని చేసిరి. ప్రాణభయము లేదనుమాట నేటికి వినఁబడినది. ఈగుణము నిలువఁబడవలయును చాలవఱకు రక్తము క్షీణించినది. నేఁడు వైద్యులు కట్లు విప్పి కడిగించి మరల కట్లు కట్టినారు. నాతము చేయకుండ నేదో మందిచ్చి యుందురు. ఆమందువలన నాతనికి బాగుగ నిద్రపట్టి నది. నిద్రపట్టుటవలనఁగూడ నారోగ్యము కలుగును బాధయును చాల వఱకు తగ్గినది. ఈశ్వరానుగ్రహమునఁ గ్రమక్రమముగ నారోగ్యము కలుగవచ్చును" అని యాలోచించుకొనుచుండఁగా నుత్తరపువైపున నున్నగదితలుపు తెఱచికొని యొకదాసి ప్రవేశించి "మహాప్రభూ! మెల కువ వచ్చినది. దయచేయుఁడు" అని చెప్పెను. తోడనే యతఁడు లోని కరిగి తలుపు జేరగిలవైచికొనియెను.

ఆగది చాల విశాలమైనది. తూర్పువైపుగవాఁకిలికాక తక్కిన వన్నియును మూసివేయఁబడి యుండెను. విశేషముగ నితరవస్తువు లం దేమియును లేవు. ఒకబల్లపై మణిమయపాత్రములందుఁ గొన్నిద్రావ కములును, లేపనములును, జేర్పఁబడి యుండెను. దానికెదురుగ నొక పవడపుఁగోళ్లమంచముపై హంసతూలికాతల్పమున నొకపురుషుఁడు శయ నించి యుండెను. ఆతనియొడలినిండఁ దెల్లనివస్త్రము కప్పఁబడియున్నది. ముఖముమాత్ర మగపడుచుండెను. ఆమంచమునకు సమీపమున సువర్ణ మణిఖచిత మగుపీఠముపై నాపురుషుఁడు కూర్చుండి, పరుండియున్న

పురుషుని చెక్కులపైఁ జేయివేసి చూచి "కుమారా! సుఖముగా నున్నదా" అని ప్రశ్నించెను.

హీనస్వరముతో "కొంచెము నెమ్మదిగ నున్నది" అని యాతఁడు బదులు చెప్పెను. ఆతనిముఖము రక్తక్షయమునలనఁ గొంచెము తెల్లవడి యుండెను ఆతఁ డెదో జబ్బుపడి యుండవచ్చును.

పీఠముపైఁ గూర్చుండియున్న మొదటిపురుషుఁడు "బాధయెట్లున్నది?" అని ప్రశ్నించెను.

"చాలవఱకు తగ్గుచున్నట్లున్నది. ఆయాస మింకను తగ్గలేదు. లేచిన కన్నులు తిరుగుచున్నట్లుండును" అని రోగిచెప్పెను.

"బాగుగ నిద్రపట్టినదా?"

"ఒడలుమఱచిననిద్దుర యింకను పట్టుటలేదు. కొంచెముగ నిద్ర పట్టుచున్నది. హృదయమున నేదో గందరగోళముగా నుండును. నేనిచ్చటి కెట్లువచ్చితిని?"

"మనభటులు సురక్షితముగ రథముపైనుంచి తీసికొని వచ్చినారు"

రోగి కన్నులు మూసికొనియెను. కొంతసే పాలోచించి "పాపము వారేమైపోయిరో గదా!" అని ప్రశ్నించెను.

"వారును మనకోటలోననే యున్నారు. వారి కేమియు నాపదకలుగ లేదు"

"ఎచ్చటనున్నారు?"

"శచీభవనమున నుంచితిని. వారిసంరక్షణమునకు వసంతుని నియోగించితిని"

అనునప్పటికి రోగి యులికిపడి లేవఁబోయెను.

"కుమారా! లేవకుము! గాయపుఁగట్లు చెదరి రేఁగఁగలవు" అని పురుషుఁడు వారించెను.

"వసంతుఁడు వారికిఁ దగినఁ దిచర్యలు చేయుచున్నాఁడా?"

"ఆ. వారి కేమియును కొదవ లేదు. వారియుపచారముల కనేక పరిచారికలు నియమింపఁబడిరి."

"వసంతుఁడా? పరిచారికలా? సుందరులా? సంరక్షణమా? నే నా? జీవించుటయా?" అని యొక్కపెద్దనిట్టూర్పు విడిచి రోగి కన్నులు మూసికొనియెను.

పురుషునిగుండెలు బ్రద్దలై పోయెను. ఆతని కదియంతయును సన్నిపాతగుణముగఁ దోఁచెను. తత్తరముతో "వైద్యులు! వైద్యులు!!" అని కేక వేయుచు గదినుండి యవ్వలకుఁ బరువెత్తెను.

అట్లు సంభ్రమముతోఁ బోయినపురుషుఁడు పద్మనందుఁడు. ఆతఁడే మగధరాజ్యచక్రవర్తి. ఆపడియున్నరోగి యాతనిజ్యేష్ఠపుత్రుఁడు, విష్ణుగుప్తుఁడు. ఆతనికిప్పుడు సన్నిపాతదోషము కలుగలేదు. గాయముల బాధకుఁదోడు హృదయమున నేదోవేదనముకలిగినది. దానిపై నాతనికిఁ గోపముకూడ వచ్చియుండును. తండ్రియెదుట నావిషయమునుగూర్చి నోక్కి చెప్పుటకు ధైర్యముచాలనియశక్తిచే నేమేమో ప్రలాపించెను. పద్మనందుఁడితని కొకరాజపుత్రికను బెండ్లిచేయుటకును, ఆకారణమున నొకరాజ్యమును సంపాదించుటకును, పెద్దప్రయత్నమును చేసియుండెను. ఆతఁడిట్టికార్యములయందు చాలనేర్పరి. కుమారునకు నెమ్మదిగా నున్నదనునాశతో నాతనిఁ జూడవచ్చెను. ఇప్పటియాతనియున్మత్తప్రలాపములు పద్మనందునకు దోషగుణజన్యములుగాఁ దోఁచెను. ఆతనిగుండె నీరైపోయినది. హృదయము చెదరిపోయి యేమిచేయుటకును దోఁచకయున్నత్తునివలె నైద్యులనిమిత్తము కేకలువేయుచుఁ బోయెను. పుత్రప్రేమ యెంత ఘనమైనది?

సాల్గన ప్రకరణము.

మగధమాళవదేశములకు నడుమ నొకపర్వతపంక్తియున్నది. ఆపర్వతములయందలిచిన్నిచిన్ని రాళ్లు మిక్కిలి తేజోవంతములై రత్నకాంతుల నీనుచుండును. అదికారణముగ నాపర్వతపంక్తిని "రత్నగిరి" యని ప్రజలు పిలుచుచుందురు. పూర్వము, మాళవరాజసంతతిలోనివాఁడగు చండపాలుఁ డనునాతఁ డేకారణముననో యప్పటిమాళవపతి యాగ్రహమునకుఁ బాత్రుఁడై అవంతిని వీడి కుటుంబసహితముగ నీపర్వత ప్రాంతములకు వచ్చి చేరెను. ఆతఁడు చాలధనముకలవాఁడగుటచే నాపర్వతపంక్తినడుమంగల యొకవిశాలప్రదేశమున నొకపట్టణము నిర్మించెను. దానికాతఁడు రత్నగిరి యనియే పేరు పెట్టెను. క్రమక్రమముగ నారాజు సౌశీల్యముచే నితరదేశములనుండి చాలమంది యుచ్చోటికిఁ గుటుంబసహితముగఁ గాపురమునకు వచ్చిరి. కొంతకాలమున కాపర్వతపార్శ్వప్రదేశమంతయు జనాకీర్ణమై యచ్చటచ్చటఁ బల్లెలును, పట్టణములును, బయలువెడల నదియొకచిన్న రాజ్యమయ్యెను. ఆప్రజలంద ఱాచండపాలునియధికారమునకు లోఁబడి నడచుకొనుచుండిరి. చండపాలుఁడు రత్నగిరిదేశమునకు రాజై సుఖముగఁ జాలకాలము ప్రజాపాలనముఁ గావించెను.

ఆరత్నగిరి క్రమముగా నాతనివంశములోనివాఁడైన మానపాలుఁడనురాజుచేఁ బాలింపఁబడుచుండెను. మానపాలుఁడు చాలధార్మికుఁడు. ప్రజ లాతని దేవునిగ భావించుచుండిరి. ఆతనికిఁ బుత్రసంతానము లేదు. చిరకాలమున నొకపుత్రికమాత్రము కలిగెను. ఆమెపేరు వసుమతి. ఆశిశువు జనించినకొలఁదికాలములోనే విధివశమున మానపాలుని

భార్య చనిపోయెను. ఆ దుఃఖవశమున నాతఁడు చాల కృశించి పోయెను. అదిగాక యేండ్లుగడచినవాఁడు. ఈసమయమున నాతని కెల్లవిధములఁ గుడిబుజమై సేనాధిపతియున్న యాప్తబంధుఁ డొకఁ డాతని విడిచి విదేశములఁబట్టి పోయెను. ఈమనస్తాపములచే వ్యాధి గ్రస్తుఁడై యాతఁ డిలోకమును విడిచి పోయెను

తండ్రి గతించినతోడనే వసుమతి రత్నగిరికి రాణియని మంత్రులు ప్రకటించిరి. ఆమె కప్పటికి వ్యవహారోచితజ్ఞానము లేకయుండుటచే మంత్రులే యారాజ్యము నాభాలికపక్షమునఁ బాలించుచుండిరి. దురాశాపరుఁడగుపద్మనందుఁ డీసమయమును గనిపట్టి యాకోట నాక్రమించుకొనవలయు ననితలంచెను. యుద్ధము లొనరించి ద్రవ్యమును వెచ్చపెట్టి కీర్తిని సంపాదించుట యాతని కిష్టములేదు. భేదోపాయమునఁ దనకార్యము సాధించుకొనుట లెస్సయని యాతఁ డాలోచించెను.ఇట్లు తలంచి కార్యతంత్రజ్ఞులగునాప్తుల నచటికిఁ బంపి మంత్రులలో నంతఃకలహములు పుట్టించెను. ఆకలహకారణములచే రత్నగిరి కల్లోలములలో మునిఁగిపోయెను. సందడి నడంచువాఁడునుబోలె పద్మనందుఁడు కొలఁదిపరివారముతో, యువరాజగు విష్ణుగుప్తునితో, రత్నగిరి ప్రవేశించి చల్లగ నాకోటనాక్రమించుకొనియెను. ఆరాజ్యమీ ఏటికు నందరాజ్యమునకు జోడబడినదే యగుటను, ప్రజలను బాలించు దక్షు లెవ్వరును లేకపోవుటచేతను, మంత్రులలో నంతఃకలహములు బలమగుటచేతను, కోటలోనియితరోద్యోగు లందఱు నేమియుఁ గలుగఁ జేసికొనక యూరకుండుటచేతను, నందున కారాజ్య మశ్రమముగఁ జేజిక్కెను. రాజనీతినిపుణుఁ డగునందుఁడు ననాయాసముగ నొకదేశమును తనసామ్రాజ్యమునఁ గలుపుకొనఁగలిగినందుల కెంతయు సంతసించెను. అందు రాజప్రతినిధిగఁ, గోట స్వాధీనపఱుటలోఁ దనపక్షమునఁ బనిచేసిన

''శకటాలుఁ'' డనుమంత్రిశిఖామణి నేర్పఱచి కొన్నిదినములు తన కుమారు నందుండనియోగించి యాతఁడుపాటలీపుత్రమునకు మరలెను.

విష్ణుగుప్తుఁడు కొన్నాళ్లు రత్నగిరిలోనుండి వసుమతితోఁ బరిచయముచేసికొనియెను. ఆతఁడుజ్ఞానహీనుఁడునుమోటుదనముగలవాఁడు నగుటచే నాతనిచేష్ట లామెకు సహ్యములుగ లేకపోయెను వసుమతి చాల విద్యావతి. ఆమెను జిన్ననాఁటనుండియును బెంచి పెద్దదానిని జేసిననుండియే యామెకువిద్యనేర్పెను. పరిపూర్ణముగ సంగీత విద్య నభ్యసింప జేసెను. క్రమముగా వసుమతి సంగీతసాహిత్యములయం దద్వితీయ ప్రజ్ఞావతి యయ్యెను.

విష్ణుగుప్తుఁ డామె నెటులైన లోఁబఱచుకొని పరిణయము చేసి కొనవలయుననుగట్టియాశతో నుండెను. ఇంక నచ్చటనుండినఁ దనకామె వివాహమాడునాశ యుండదనియుఁ, బాటలీపుత్రమునకుఁ బోయినచోఁ దగినవారిచే నామెకుఁ జెప్పించి యామె మనసు తనవంకకుఁ ద్రిప్పికొని పరిణయమాడవచ్చుననియు నాతఁడు తలంచుకొనియెను.

ఇట్లు కృతనిశ్చయుండై వసుమతిని బాటలీపుత్రమునకుఁ బ్రయాణముచేసెను. వసుమతి బాలిక.ఏమిచేయఁగలదు? రాష్ట్రమునందలి యుద్యోగస్థు లందఱును సందునియాజ్ఞకు లోఁబడిపోయిరి. ఇప్పు డామెను రక్షించువా రెవ్వరు? ఇట్టివిషమస్థితిలో వసుమతి మఱియొక మాట చెప్పకతనసంరక్షకురాలగు సుందరితో విష్ణుగుప్తునివెంబడి పాట లికిఁ బ్రయాణముచేయుట కిష్టపడియెను.

పాప మామెకుఁ దల్లి చిన్ననాఁడే గతించినది. తండ్రియును దివి కేగెను. శైశవమునుండియుఁ దన్ను కన్నబిడ్డకంటె నెక్కువ ప్రేమతోఁ బెంచుచున్నసుందరి యామెతోనేవచ్చుట కాయత్తపడి యున్నది. ఇక నామెకు రత్నగిరిలో నేమున్నది? ఎవ్వరున్నారు? రత్నగిరి

యామెకు దుఃఖముల కాలవాల్తమైనట్లు కనఁబడియెను. ఆవలి కేగిన నావిచారములనెల్ల మఱచిపోవచ్చునని యామె తలంచెను. ముందేమి కానున్నదో యామె యాలోచించుకొనలేదు. పాప మామె వయస్సెంత? విష్ణుగుప్తునిమాయోపాయము లామె యెట్లుగ్రహింపఁగలదు? సుందరియే తన కన్నిట దిక్కని యామె నిశ్చయించుకొనియెను. సుందరితో నామె పరివారసహితముగఁ బాటలీపుత్త్రమునకుఁ బ్రయాణమయ్యెను.

నాఁడు పరివారమును వీడివచ్చుచు మహావనమున మనకుఁ బరిచితలైన బాలికాసుందరులలో, బాలికయే వసుమతి. సుందరి సుందరియే. దుష్పులగుంపుచే నపాయమునుగాంచినయాతఁడు విష్ణుగుప్తుఁడు. దుశ్చింతలగలవారి కెప్పుడును శుభములు చేకూఱవు.

ఐదవప్రకరణము.

క్రమముగా విష్ణుగుప్తున కారోగ్యము కల్గెను. మరల నాతఁ డెప్పటిగొడవలోఁ బ్రవేశించెను. ఆతఁడు మిగుల మూఢుఁడగుటయేకాక నవనవయౌవనమదంబునఁ గేవల విషయాసక్తుండై యుండెను. తండ్రి ఎలె నాతనికి రాజ్యకాంక్ష లేదు ధనాశ లేదు. ఆతని కేమికొదవ? చక్రవర్తికి పెద్దబిడ్డ; యువరాజు; జనకునియనంతరమునఁ గోరకయే రాజ్యలక్ష్మి యాతని వరింపనున్నది; కుందేటికొమ్ములనైన సాధించి తెచ్చి యిచ్చుటకు వేనవేలు సేవకులున్నారు; అనుభవించుట కనేక భోగము లున్నవి; ఐశ్వర్య మున్నది. సార్వభౌముఁడగుతండ్రి యాతనిని ప్రాణముకంటె నెక్కుడుగఁ జూచుకొనుచున్నాఁడు. కోరికలకు

బుట్టినిల్లైనజవ్వన మాతనికడ సార్థకతఁ గాంచుచున్నది. భావిమగధ చక్రవర్తిగాఁ బరిగణింపఁబడుచున్న యాతనికిఁ దీరనికోరికలే లేవు.

కాని, యాతఁ డొక్క విషయముంగూర్చి నిరంతరమును బరితపించుచుండెను. ఆపరితాపమున కెన్నటికైన నుపశాంతి కలుగునా? వసుమతీకరగ్రహణమునఁగాని యాతనితాపము చల్లారదు. అప్పుడు గాని యాతనిజీవితమునకు సుఖము కలుగదు. అతఁడు తనవైభవమును గూర్చియు, గుణములను గూర్చియు, నతిశయముగా నెందఱవలననో "వసుమతికడఁ బాగడించుకొనుచుండెను" ఆమెహృదయమింక నాతనికిఁ బూర్ణముగఁ దెలియలేదు. కాని యామెకుఁ దనపై ననురాగము కలుగ లేదని మాత్రము గ్రహించెను.

వసంతునిపై నాతనికనుమానము తగిలెను. వసంతుఁడు వసుమతీ సుందరుల సంరక్షణమునకై రాజుచే నియమింపఁబడుట విష్ణుగుప్తునకుఁ బ్రాణసంకటముగ నుండెను. విష్ణుగుప్తునకుఁ దండ్రికడ నెంత యోచనయున్నది. తండ్రికాతనియెడ నెంత యోప్రేమయున్నది. అయినను విష్ణుగుప్తుఁడు చండశాసనుఁడగుతండ్రికడ వాయెత్తి మాట్లాడ ధైర్యము లేనివాఁడై యుండెను. ఎట్లైన వసంతుని నాయుద్యోగమునుండి తప్పింప వలయు నని యాలోచించుచుండెను. రాజ్యతంత్రజ్ఞుఁడగుపద్మనందుఁడు ప్రజారంజకుఁడగువసంతునకు మంత్రిపదవి నొసంగ నిష్టము లేని వాఁడైనను, నాతనియందు గౌరవమునే చూపుచుండును. అందులకుఁ గారణ మాతనిసుగుణములే కావచ్చును. గోముఖవ్యాఘ్రమగు పద్మనందుని గంభీరహృదయమును గ్రహియించుట చాలఁ గష్టము.

విష్ణుగుప్తుఁడు రాచనగరునం దొకరహస్యాగారమునఁ హంస తూలికాతల్పమున నీయాలోచనాసముద్రమునంబడికొట్టుకొనుచుండెను. ఇంతలోవెలుపలఁ జిటుకుచిటుకుమనుగిలుకుమట్లలచప్పుడు వినవచ్చెను.

ఆతఁడు తలయెత్తి చూచుసరి కెదుట నొకతరుణీమణి సాక్షాత్కరించి యుండెను.

ఆమె యందకత్తెయే యని చెప్పినంతమాత్రమునఁ దృప్తి లేదు. అవయవవర్ణనమున యథారూపమునుఁ బోధించుటదుస్సాధ్యమే. కామినులకుఁ బ్రాయమే సుందరమైనది. విలాసములకు జవ్వనమ్ము మెఱుఁగులకు దొలుకాఱువన్నెది. నెఱజవ్వనమున విలసిల్లు నాయువతీమణి నెమ్మేనినిగ్గులు పవనచంచలితంబు లగుజలతరంగములం దొలుకాడు చంద్రకిరణములవలె మిలమిల మెఱయుచుండెను. ఆమెవిలాసచేష్టితముల కవధిలేదు. ఒక్కక్షణమైన నామె యూరకుండదు. పయ్యెద సవరించు కొనుచుండును. కిరకంకణములనుగదలించుచుండును. అటునిటుసవిలాస ముగఁ జూచుచుండును ఆమెముఖచంద్రమండలము చిఱునవ్వువెన్నెలల నొకప్పుడును విడిచి యుండుట లేదు. ఆమెనవ్వుచుండునప్పుడు, నును జెక్కులఁ జిన్నిగుంట లెంతోరమణీయముగ నుండును. సాముద్రిక శాస్త్రమున నట్టిచిహ్నములు జారిణీలక్షణములుగఁ బరిగణింపఁబడినవి. ఆమె జారిణియో, భోగినియో!

విష్ణుగుప్తుఁడు గాయములబాధలోఁ బడియున్నప్పు డీమె యాతని కుపచారములఁ జేసినది. విష్ణుగుప్తున కామెయన్నఁ జాలదయ. ఆతని కడ నామెకుఁ జాలఁజనవున్నది. వారి కన్యోన్యసంబంధ మీవిధముగాఁ గుదిరినది ఆమెనుచూచినతోడనే విష్ణుగుప్తునకు ముఖము వికసించినది.

"చతురికా! ఏమైనది?" అనియెను.

"మొగ మింతయైనది"

"ఆమె యంతయు నాలకించినదా?"

"ఆలకించినది"

"ఏమన్నది"

"ఏమనుట కేమున్నది. ఊరకున్నది"

"సిగ్గుపడినదికాఁబోలును!"

"సిగ్గుపడినదో, భయపడినదో"

"ఎట్లైన నేమి? కోపపడకుండుటయేచాలును"

"నీ కేమైనను జాలును"

"ఈమాటల కేమిగాని, కార్య మేమయినది?"

"భంగ మయినది"

"పరిహాసములు మాని నిజము చెప్పుము"

"నిజము నిడివిమీఁదగాని తేలదు"

"వసుమతీహృదయము నీకింకను తెలియలేదా?"

"తెలిసిపోయినది"

"ఏమని తెలిసిపోయినది?"

"నీమీఁద లేదని—"

విష్ణుగుప్తుఁడదరిపడియెను. "నీమాటల కేమియును బ్రత్యుత్తరము రాలేదా?" అనియెను.

"వచ్చినది ఆమెకుఁ బెండ్లియాడవలెనని లేదు"

"ఏమి? మగధరాజ్యచక్రవర్తిని యగుటకైనను నామె కిష్టముండదా?"

"పాపగ్రహములు చూచుచున్నవి ఆమె కంతయదృష్ట మెట్లుపట్టును? నిన్నుఁ బెండ్లియాడవలె నని లేదు"

"మఱి యెవ్వరిని బెండ్లియాడును?"

"వసంతుని—"

ఈమాటకు విష్ణుగుప్తునకుఁ గోపమువచ్చెను. మఱి నీవేమి బోధించితివి?" అనియెను.

"మాటలలోఁ బడిపోవుట కందఱును వెఱ్ఱిచతురికలే యనుకొంటివా?"

''నిర్భాగ్యురా లగువసుమతి నీమాటలు వినలేదా?"

"వసంతునిబోధనము లామెతల కెక్కినవి. మనమేమిచెప్పినను లాభములేదు"

విష్ణుగుప్తుఁడు మండిపడియెను. "ఏమి! ఆమురాత్మ్యుఁ డొంతదుర్జ యుఁడై చరించుచున్నాఁడు! ఆతనిపొగ రడంచువఱకు మనకార్యము సిద్ధింపదు. ఇందులకుఁ దగినప్రయత్నము చేయవలయును"

"మాటలనలన లాభములేదు. చేసి చూపవలయును"

"అది మనచేతిలో నున్నది"

"యువరాజునకుఁ జేయరానిపని యేమున్నది?"

"కొలఁదిదినములలో నాతనిగతి చూచెదవుగాక! ఇటకు నీవు రహస్యముగనే వచ్చితివా?"

''నీకన్నులకంటె నెవ్వరును నన్ను చూడలేదు. నీగుండెలు కొట్ట్లు కొనుచున్నవా యేమి?"

''మఱేమియును భయములేదు. నాయనగారియాజ్ఞ యట్లున్నది. దానిని మనము వ్యతిరేకించుచున్న ట్లగపడరాదు"

"నాయనగారియాజ్ఞకాదు. వసంతునియాజ్ఞ యనుము"

"చీ! ఆనీచుఁ డేమిచేయఁగలఁడు"

"ఇంకేమి చేయవలయును! మొదటికే మోసము చేయుచున్నాఁడు"

"ఇంకెన్ని నాళ్లు! అయినదా యయ్యపని"

"కానలయును. ఆవెనుకఁజూడవలయును."

"రమ్ము! మనయుద్యానమునకుఁ బోదము. నీతోనింకను మాట లాడ వలసియున్నది."

ఇట్లుసంభాషించుకొని వారిరువురును వెడలిపోయిరి.

చతురికపణ్యాంగన. వారిరువురకును జనవధికమగుటచే రాజుగారు

చతురికను యువరాజమందిరమునకు రాఁగూడదని యాజ్ఞచేయించిరి. అది వసంతునిమూలమున జరగియుండునని చతురికకుఁ గోపముకలిగెను. అందుమూలమున నీకుఁబ్రవన్నినది. అంతేకాని వసుమతీవసంతులకింత వఱకేమియును సంభాషణము జరగియుండలేదు. వసంతుఁడెవ్వరో వసుమతి యెఱుఁగనేయెఱుఁగదు. వేశ్యాంగనలమాయాపాగురలలో ననేకులు బంధింపఁబడిరి. వారివిషవాక్యములు చాలమందిప్రాణముల హరించినవి. విష్ణుగుప్తునకుఁ జతురికవాక్యము లమృతప్రాయములు. చతురికవలనఁ దనకార్యములు చక్కఁబడునని యాతఁడు నమ్మి చున్నాఁడు జత్తులమారిచతురిక యాతని లోఁబఱుచుకొని యేమేమో చేయఁజూచుచున్నది. ఎట్టివింతలు పుట్టనున్నవో?

ఆఱవప్రకరణము.

పాటలీపుత్రమునందలిరాజభవనమునకు దక్షిణముఁ దూర్పు పడమరలకు వ్యాపించు నొకసౌధపంక్తి యున్నది. అందు శచీసౌధము మనోహరమైనది. దానికిఁ బ్రాక్పార్శ్వమున చైత్రభవనమును, ఎట్టయెదుటనే విష్ణుగుప్తుని కేళీసౌధమగునింద్రమందిరమును గలవు. శచీసౌధము చంద్రకాంతశిలలచే నిర్మింపఁబడినది అడుగునను పైభాగమునను తాపటముచేయఁబడినయాసున్నిగ్ధశిలాప్రదేశముల మనోహరలతలును, పుష్పములును, ఫలములును, చిత్రింపఁబడియుండెను. అందొక విశాలభవనమున కుడ్యములయందు చిత్రవిచిత్రములగు చిత్రపటములమర్పఁబడి యున్నవి. అందు వరుసగా శ్రీమహావిష్ణునిదశావతార

ములు, నందనోద్యానమునందలి మందారతరుషండమునఁ గందుకక్రీడ సలుపు జగన్మోహిని, తుమ్మెదగాఢ నఘనయించునెపంబునఁ జనుదెంచిన దుష్యంతుని మనోహరరూప సుందర్శనంబున వెఱఁగుపడి నిలిచియున్న శకుంతల, లజ్జామూర్ధ్యమున నగ్నిమిత్రునికొఁగిట బెదరిబెదరి చూచుచున్న మాళవిక, హంససందేశము నత్యాదరమున నాలకించుచున్న దమయంతి, రాణులచేఁ బూజింపఁబడుచున్న వత్సరాజును, కుసుమశరభ్రాంతిచేఁ దదేకధ్యానమునఁ జూచుచు నిలువఁబడియున్న రత్నావళి, ఆకాశయానమునఁ బోవుచు నేకాంతనిశెపంబున వెనుదిరిగి సానురాగముగఁ బురూరవుం జూచుచు నాఁగినయూర్వశి, మొదలగుచిత్రరూపములు యథాపూర్వముగ లిఖింపఁబడియుండెను.

ఆగదియందు రత్నకంబళముపై పఱపఁబడినమెత్తనిపట్టుపఱపుపై గోడకువేయఁబడిన మొకమల్దిండు నానుకొని వసుమతి కూర్చుండియుండెను. పార్శ్వముననున్న పట్టుదిండుపై నెడమమోచేతి నాని హస్తపద్మమునఁ జెక్కిలిఁ జేర్చికొనియెను. ఆమెదక్షిణబాహువల్లిక పార్శ్వముననున్న సుందరిమెడకుఁ జుట్టుకొని యామెదక్షిణభుజంబునుండి కింత పార్శ్వమున ప్రవేలాడుచుండెను. ఆహస్తపల్లవము సుందరిసమున్న తివక్షస్థలంబున ప్రవేలాడుచున్న మణిహారముల నల్లనఁగదలించునప్పుడు కోమలాంగుళంబుల మెఱయుచున్న యుంగరములమణిద్యుతులు సుందరి కన్నుల మిఱుమిట్లుగొలుపుచుండెను. సుందరి యెడమచేయి వసుమతి గంటలయొడ్డాణముప్రక్కనుండి యామెసన్ననినడుమును జుట్టుకొని యుండెను. ఆమె వసుమతినంకఁ దదేకదృష్టితోఁ జూచుచుండెను. ఇరువురును మాటలాడుటలేదు వారిహృదయముల నేదో విచారముకలిగియున్నట్లు వారిముఖలక్షణములవలనఁ దెలియవచ్చుచుండెను. ఒక్కింతనేపు వారటేయుండిరి. వసుమతి యొకనిట్టూర్పు విడిచి సుందరితోఁ నిట్లనియెను.

"ఈతనియుద్దేశ మేమైయుండును?"

"ఎట్లు తెలియఁగలదు? పాముకాళ్లు పామునకే యెఱుక. ఇతఁ డెంతకఠినహృదయుఁడో, అంతదుర్మార్గుఁడు. ఎంతదురాశాపరుడో, అంతలోభి"

"పాపాత్ముఁడగు నీతనిపాలఁబడి మనము మానప్రాణములఁ గోలు పడనలసినదేనా?" అని వసుమతి కన్నుల నీరు పెట్టుకొనియెను.

"అమ్మా! విచారింపకుము. మెఱుఁగులేఁజెక్కుల వేఁడికన్నీటిచే గందింపకుము. నిట్టూర్పులవలన నధరపల్లవము వాఁడిపోవ్రచుండ నా హృదయము దహించుకొనిపోవ్రచున్నది ఊఱడిల్లుము"

"ఏమని యూఱిల్లి యుండఁగలము? ఆతనిదుర్వ్యాపారము లతిభీషణములుగ నున్నవి."

"ఆతని కున్నదంతయును రాజ్యకాంక్షయే"

"రాజ్య మాతనిస్వాధీనమునఁనే యున్నదే. సంక్షుణ మనుఁజెప మునఁ దెచ్చి మనకేల యిట్టినిర్బంధము గూర్పనలయు?"

"పద్మనందునకు రాజ్యకాంక్షకంటెను ప్రుత్త్వ్రేమ ఘనమైనది. మననిగ్బంధమునకు విష్ణుగుప్తుఁడు కారణమై యుండనొచ్చును"

ఇట్లనినంతోడనే వసుమతిమొడలు కంపించెను. అధరపల్లవము చలించెను. కన్ను లెఱ్ఱనడియెను. మొగము చేవుర్రించెను. గద్గదస్వర ముతో నిట్లనియెను.

"దేవ్రుఁడు నిర్దయుఁడు. ఆమూఢునిగాయములనుమాన్పి యగతిక నగు నాహృదయమును గాయపఱచినాఁడు. దినదినమునావిష్ణు—ఆ నిర్భాగ్యుఁడు తనయున్మత్త్రలాపములచే నాగాయముపై గరళముం జిలుకుచున్నాఁడు"

సుందరి తరళనయనము లశ్రుపూరితము లయ్యెను. ఆడ్రువారి హృదయము లతికరుణములు. వారిసుకుమారహృదయములు కష్టముల

పోరైన వివేకోపవు. "అమ్మా! నేను దురదృష్టవంతురాలను. తల్లి దండ్రులు లేనిబిడ్డ వగుచున్ను నాప్రాణముగఁ బెంచితివి. నీవు రత్నగిరి రాణివై యున్నప్పుడు కన్నులుచల్లగాఁ జూడనలయునని గఁ పెడానతో నుంటిని. నాకష్టము లన్నియు మఱచిపోయితిని. నాజీవితము నిరర్థక మైనదే యైనను నితోడిదేహోకముగ జీవించి యుంటిని. తల్లీ! చిన్న బోయిననీమొగము చూడఁజాలను. నీహృదయమును పరితపింపఁ జేసి కొనకుము. ఇంతవఱకు మనకుఁగలిగినయుపద్రవ మేమియును లేదు. ధైర్యమును వహించి యుందము" అనియెను.

"ఉత్తరక్షణమున నెట్టియాపద రానున్నదో తెలియుట లేదు. పాముకాటునవిషమునలెనాదురాత్మునియెడ లంతటనుమోహవికారము విరియఁ బారినది. యుక్తాయుక్తపరిజ్ఞానము లేక లజ్జావిహీనుఁడై చరి యించుచున్నాఁడు. దుర్మదాంధుఁడై నిరంకుశముగ నాతఁడేమిచేసిననను చేయఁగలఁడు. మనకు దిక్కెవ్వరు?" అనునప్పుడు వసుమతియెడ లంతయును గడగడ వడంకెను.

"దిక్కులేనివారికి దేవుఁడే దిక్కు. నాటికెవ్వరినో యాతఁడే పంపుసేయుచుండును. అట్లు కానియెడల మొన్న నామహావనమునందు దుష్టుల యుపద్రవమునుండి యామహాత్మునిచే మనమెట్లు రక్షింపఁబడు దుము?"

అతితరమగువిచారమున కంతరాయమే కలుగనియెడల నది హృదయగోళమునుబగల్చివైచును. సుందరిపై వాక్యములవలన వసుమతి హృదయము మఱియొకచోటికిఁ బోయెను. అటఁ గష్టములేవియు నగపడుటలేదు. కాన, హృదయమున నేదో యాశ కలిగెను. ఏమేమో యాలోచించుకొనియెను. ఆయాలోచనల కంతము లేకపోయి నది. సుందరితో మఱి యెట్లు మాటలాడివలయునో యామెకుఁ దెలిసినదికాదు. నాలుకతుదివఱకు వచ్చినమాట యాగిపోవుచుండెను.

అతికష్టముపై మనసు కుదురుపఱచుకొని "ఆయుదారశీలుఁ డెవ్వఁడో? ఎచ్చటివాఁడో? ఏమైనఁ దెలిసినదా?" అనియెను.

సుందరికి నూపిరి తిరిగినది ఆమెకు వసుమతివిచారమునపనయించు మార్గము దొరకినది "బిడ్డా! ఆతఁడు రాజకుటుంబములోనివాఁడనియే నానమ్మకము. విశేషించి యీనగరవాస్తవ్యుఁడే కావచ్చును" అనియెను

"నీవెట్లు చెప్పఁగలవు?"

"రాజపుత్త్రులకుఁగాని వేఁటగొడవ యుండదు. ఆతనిరూపగుణ విశేషములుకూడ నావిషయమును స్థిరపఱచుచున్నవి. ఈనగరము పోఁడే కానియెడల సర్వము నాటంగినవానివలె నింతలో మనకు మంచి సదుపాయములను గల్పించి మనల సిపురింబునకుఁ జేర్పలేఁడు"

"ఆనుగుణరాశికటాక్షమున మన మింకను రక్షింపఁబడఁగలమా?"

"ఆ! నిశ్చయముగ రక్షింపఁబడఁగలము. బాల్యచాపలమునం గలిగినసిగ్గుచే నివాతని నప్పుడు తిన్నఁగఁ జూడలేకపోయితివి"

వసుమతియొడలు జల్లుమనియెను "చూచినంతమాత్రమున నాతని స్వభావము మన కెట్లు తెలియఁగలదు?"

"చూపులవలన హృదయము వ్యక్తమగుచుండును. అప్పుడాతఁడునావెనుక మేలిముసుఁగునైచికొనినిలిచియున్ననీపైఁ బఱగించిన సమాదరశీతలంబులగు కటాక్షములలో నెంతయో యర్థమున్నది.ఆతఁడు మనల నెన్నటికిని మఱవఁజాలఁడు"

వసుమతికి సిగ్గు పుక్కిలింత లయ్యెను. మఱియేమియును మాటలాడలేదు. సుందరి కారణమును గ్రహించినది. ఆమెయు నాప్రశంసయంతటితో నాపివేసెను.

వీడవ ప్రకరణము.

సౌందర్యవర్ణనము కొందఱు కింపుగా నుండును. గుణకీర్తనము మఱికొందఱకు రుచించును వర్తనాదులనగుతించి తెలిసికొనుటకై వేఱొకకొంద అభిలాషపడుచుందురు. అందఱ నన్నివిధముల సంతసింపఁ జేయుట యొకరితరము గాదు. కాని, కథానుకూలముగుపాత్రౌచిత్యమును యథారీతిగఁ బోషించుటకై ప్రయత్నించుటయే కవులధర్మము. ఈసందర్భమున మనకథానాయిక యగువసుమతిసౌందర్యముగూర్చి వ్యాయవలయు నని మాకెంతయో కోరికయున్నది. ఆమెమోహన రూపమును వ్యాయుటకు మేము చిత్రకారులమయ్యెదము. పాఠకుఁడా! నీహృదయఫలకమును పరిశుభ్రపఱచి యుంచెదవేని మాలేఖనిచేఁ జేత నైనంతవఱ కామెమనోహరాకృతిని లిఖియించుటకై ప్రయత్నించి చూచెదము. మేమెంతనఱకుఁ గృతార్థుల మయ్యెదమో చెప్పుభారము నీయందున్నది. మేమీవసుమతి నడుగఁబోము. నీవు సరిచూచి కొనఁ గోరెదవేని మహావనమునం దామెను దర్శించినరసికపురుషుని హృదయమున దృఢముగఁ బ్రకృతిచే లిఖింపఁ బడినయీవసుమతీ మోహనవిగ్రహముతోఁ బోల్చిచూచుకొనుము. దానికిని దీనికిని భేద ముండదనియే మాయభిప్రాయము. మేమిప్పు డాపురుషునితో నైక్య మొందితిమి.

వసుమతి యిప్పు డేకాంతస్థానమునం దున్నది. తనసౌధమున నొకమృదుశయ్యపైఁ బరుండి యున్నది. నిద్రించుట లేదు. ఏమియో యాలోచించుదానివలెఁ బరధ్యానముగఁ జూచుచున్నది. మేమీ మోహనాకృతి నిప్పుడు ప్రదర్శింపఁబోవుచున్నాము. పునరుక్తియని కోపిం పక నీహృదయమును నిర్మలముగ నుంచుకొనుము. వసుమతివలెనే

నీవుగూడఁ బరధ్యానముగ నుండకుము. మాకిస్ప ఉపనాద్యలంకార ములతోఁ బనిలేదు. స్వభావమునే కైకొని సత్యను నింకఁ బ్రదర్శించె దము. కాని, మబ్బుచాటునుండి వెలువడుసంపూర్ణచంద్రబింబము నొక్క-సారి స్మరించుకొందుము. ఆ వెన్నెల కాంతిని విలోకింతుము. ఆచల్ల దనమునకై సంతసింతుము. అప్పుడె వికసించినపద్మముల గ్రహిం తుము వానిపత్రములయొప్పిదమునకై యానందింతుము. వానిపై నాడుచున్నభ్రమరముల నాలోకింతుము. చంపకముల సన్నిధి చేసి కొందుము. మృణాళములఁ దలంతుము. పల్లవములఁ బ్రశంసింతుము. తారల లెక్కింతుము.ఆకాశమునకై చూతును. మెట్టదామరల నవలో కింతుము. పదియాఱువన్నె బంగారముఁ గోరుదుము. కలకంఠముల స్మరింతుము.అయ్యో! మేము పూర్వపరిచయముగల వీనినన్నిటిని మఱువ లేకుండఁ బోయితిమే? అయినను వసుమతినిఁ జిత్రింపనలయునను సంక ల్పము మాహృదయమున దృఢముగ నాఁటికొనియే యున్నది. ఈ మనోహరవస్తుసంస్మరణచే మామన మవశమైనది. అశీకసాన్నిధ్యమున లీనమైనది. ఇట్టిసమయమున వసుమతి సత్యమైనమోహనాకృతి మా హృదయమునఁజిత్రముగ నెట్లో నెలకొన్నది.నీవుమావలె మనసును బరు గెత్తనీయకుము. మాహృదయమునందు నాఁటికొనియున్నయీవసుమతీ మోహనవిగ్రహమును నీహృదయముఁగో నద్దికొనుము. ఇప్పుడు చూచి కొనుము!

ఆలావణ్యరాశితేజోవరణమున నిగనిగమెఱయుచు నీలకాంతులచే సొగలై దట్టముగనున్న యాకుంతలములను జూచుచున్నావా? ప్రకాశ మానమై, సున్నిగ్ధమై, వర్తులమైనయాముద్దుమొగ మగపడుచున్నదా? ఆసుందరీమణిమనోహరతనులతయందలి లావణ్యతేజము నీకన్నుల మిఱు మిట్లుగొల్పుచున్నదా? ఆసాత్వికాకారము నీకు గోచరించుచున్నదా? ఆకర్ణాంతములై, విశాలములై, వాలికలైయున్న యామెనేత్రము లెట్లు

వికసించి యున్నవో చూచుచు! మృగుపక్ష్మములు కదలుట లేదేమి? కనీనికలు సునీలములై యెంతమనోహరముగనున్నవి? సుదీర్ఘమై, సుందరమై, యమూల్యముక్తామణిప్రభాచుంబితాగ్రమై, తిన్నని, యొప్పులకుప్పలకు నాసికఁజూచితివా? సమదీర్ఘములయి, కోమలములయి, గుండ్రములయి యున్న బాహువులు కంచుకాద్యలంకరణములచేఁ బ్రకాశించుచున్నవి. చూచితివా? సమ్రక్తకోమలారుణాంగుళీవిభాసితంబులగుమనోహరహస్తములం బరికించుచున్నావా? నఖంబులు కాంతిమతంబులయి యున్నవి. సన్నమై, చిఱుగంటలమొలనూలిచే నలంకరింపఁబడిన నెన్నడుము నీకగపడుట లేదా? స్వభావారుణంబులయి సమంబులైయున్న యామె మృదుపదంబుల వీలోకించితివా? సన్ననిమున్వలువమాటునుండి వెలువడు నెమ్మేని మెఱుపులయందలియందమును నిర్ప్రగ్రహియించితివా! ఆమె మనతోఁ మాట్లాడదేమి?

ఆమెహృదయమున నేదో వింతవికార ముదయించినది. స్త్రీల హృదయములు నిగూఢములైనవి. పరేంగితజ్ఞానధురీణులగుమహాపురుషులకుఁ గూడ దురవగాహమైనవి. ఇప్పు డామెమన స్సామెలో లేదు. ఆమెనిద్రించుటకై పరుండియుండలేదు. ఏదియో యాలోచించుకొనుచుండెను. ఏమియునుఁ దోఁచుటలేదు. మహావనమునఁ దన్నురక్షించినపురుషుని మోహనాకార మామెమనస్సును హరించి యుండునా? యువతులు కేవలపురుషసౌందర్యమునకే వలచుట స్వాభావికము. గుణవిశేషములు కూడ విదితమైనప్పుడిఁకఁ జెప్పవలసినదే మున్నది? ఆమె పది యాప్రేండ్లకన్య. ఆతఁడు జగన్మోహనాకారుఁడగు యౌవనపురుషుఁడు. ప్రాణదాన మొనరించినసుందరుని ప్రాణేశ్వరునిగాఁ దలంచుటలో వింత యేమున్నది? పొరలిపొరలివచ్చుచుండు భావముల వలన నెంతనిగూఢచిత్తములనైనఁ గనిపట్టవచ్చును. నిజముగా నామె హృదయమును నాపురుషుఁ డాకర్షించినాఁడు. ఆమెకు నిసురపట్టుట లేదు. ఇట్లు యోచించుకొనుచుండెను.

"ఆదయార్ద్రహృదయుఁ డకారణవాత్సల్యమున నాపత్సముద్ర మునుండి నన్నుద్ధరించుటకుఁ గారణమేదైన నుండునా? స్వర్గమునుండి దిగివచ్చినభాగ్యదేవతవలె ముమ్మొద్ధరించి తా నుంటరిగఁ బోయెనేమో? అతనికిఁగాఁకములందు దయకుసించినసుస్వభావ మేదైన నుండియుండునా? లేకున్న నాతనిక్రీగంటిచూపులుతటి మనోహరములయియుండునేల? అయ్యో! అభిమాత్రము చాలసేపు నిలిచిననా? నాచూపులలో నైక్యమైనట్లుండి యంతలో మఱలిపోవుచుండెనివే? ఆఁడువారిచుఱుకు చూపులయం దట్టిగుణము కలదేమో? అంతమాత్రమున నాతనిచనువు నకుఁ గష్టము కలుగదుగద? ఆకారణమున నాపై నసూయ కలుగునే మో?—ఎంతమాట! అట్లయిన నాయం దెంతో ప్రేమగలవానివలె మాచెలియో నావిషయమున నేల ముచ్చటించును? కృతజ్ఞతాపూర్వక ముగ నేనేమిచేసితిని? ఆతనిముద్దుమొగమునఁ జిఱునవ్వదయించినదే? అదియాతనిస్వభావమా? ముఖలక్షణమా? లేఁ దీనికేమైననర్థమున్నదా? నన్నాతఁడు పరిణయము కాఁ దలఁచియుండునా?— అటులయిన నాతనియన్వయనామగోత్రము లేల దాఁచికొనవలయును? సుప్రసిద్ధుఁ డగుటచేఁ దన్నుఁదాఁదెలిపికొనకున్నను దనయూరిపేరైన నేల తెలుప లేదు? ఆతఁ డీపాటలీపుత్త్రమునకే యుండియుండునా? అదియుగాక యాతఁడు రాజపుత్త్రుఁడనుగూడ నైయుండునని హృదయమునం దేదియో చెప్పుచున్నది. ఆశ యిట్టితలంపులనే కలిగించును. రాజపుత్త్రుఁడే కానియెడల నాతని కావనసమీపమున, పల్లకీయు భోయలు నెట్లు వత్తురు? అంతపరివార మెట్లుండును? ఇదియంతయు నిజమేయైనచో మఱల మాకేల దర్శనమీయఁడు. నాహృదయ మాతనికి స్పష్టముగఁ దెలియ లేదేమో? మహాత్ములు పరహృదయము నెఱుఁగువఱకుఁ దమ హృదయములను వెల్లడింపరుగదా! ఇప్పట్టున నాగతి యేమి కావలయును?"

అని యాలోచించుకొనుసరి కామెకనుగొలుకులనుండి బాష్ప బిందువులు చెక్కులవెంట దిగజారుచుండెను. నిట్టూర్పులు వచ్చెను. ఒడలూరక వడంకుచుండెను. పరవశతదోచెను. ఒక్కింతసేపు కన్నులు మూతవడియెను. ఇంతలో నాపురుషుని దివ్యమంగళవిగ్రహమెదుట సాక్షాత్కరించిన ట్లయ్యెను. దిగ్గున లేచి నిలువబడి నలువలంకులకుం దనచూపులు నాటించెను. ఎవ్వరు నగపడలేదు. శయ్యపైజేరి కన్నులుమూసికొనియెను. మరల నాసుందరాకారము గోచరమయ్యెను. మరలం గన్నులు విచ్చి చూచెను. సుందరి యెదుట నిలువబడి యుండెను. సుందరి నామె చూడలేదు. "ఏమియోమాయావిలాసము" అనియెను.

"ఆపురుషోత్తమునిదా?" అని సుందరిప్రశ్నించెను.

వసుమతి యించుక యప్రగల్భయై యామెనుజూచెను. ఆచూపులట నిలిచినవికావు ఇటునటు పరుగెత్తినవి. ఎటుటకుడ్యముపై నొక మోహినీపట ముండెను. దానిని నిరూపించుచు, "అన్యను మోహినీరూపమును దాల్చి యాతఁడెట్టిమాయావిలాసముఁ జూపినాఁడు" అనియెను.

"మోహనరూపమనుము" అని సుందరి మారుపలికెను.

వసుమతి దానికిఁ బ్రత్యుత్తర మీయవలయు ననియాలోచింపుకొనుచుండెను ఇంతలోఁ బరిచారిక వచ్చి "అమ్మా! అధికారి తమకొఱకు వేచియున్నాఁడు" అని వచించెను. వారాతని సందర్శింపఁబోయిరి.

ఎనిమిదవ ప్రకరణము.

వసుమతీసుందరులు సౌధమును దిగివచ్చుసరి కధికారపురుషుఁడు లోపలిభవనమున నిలువఁబడియుండెను. ఆతని జూచినతోడనే యాసతీమణులిరువురును మిగుల నాశ్చర్యమును జెందిరి. ఒక్కింతసేపాయద్భుతరసంబున మునింగి నిశ్చేష్టలై నిలువఁబడిరి ఆతఁడు రాజపుత్రోచితంబు లగుదుస్తులనుధరించి యుండెను ఏమి యాలోచించుకొనుచుండెనో గాని కుశల మరయవచ్చినయాతఁడును మాటలాడలేదు. వసుమతి యింకను జిత్రప్రతిమవలెనే యున్నది. ఆయిరుపురిలోఁ బెద్దదియును గృహకృత్యములయందలిభారమును వహించినదియు నగుసుందరికిఁక నివ్వెఱపడి చూచుచుండుట కవకాశము లేఁగు. గృహమున కతిథియైవచ్చినపురుషుని సన్మానింపనియవమాన మామెకుఁ గలుగవలసినదే గాని వసుమతి కెంతమాత్రమును గలుగదు. సుందరి వినయపూర్వకముగ "అయ్యా! స్వాగతము. ఈపీఠమునపై దయసేయుఁడు" అనియెను. పురుషుఁడట్లు కూర్చుండెను.

"దయాళురగు మీహృదయమునకు మేమింకను జ్ఞాపకముగనున్నామా?" అని సుందరి ప్రశ్నించెను.

"లేకేమి? ఎప్పటికప్పుడు మీశ్లేమసమాచారములఁ దెలిసికొనుచునే యున్నాను. ఇప్పుడు మీ కుశలమును ప్రత్యక్షముగఁ జూచిపోవలయు ననివచ్చితిని"

"ఎంతకాలమునకు మరల దర్శనము దొరకినది? ఇంతవఱకు మీరెచ్చట నున్నారయ?"

"ఇచ్చటనే చక్రవర్తిచే మీసంరక్షణమునఁ జేనియోగింపఁబడియున్నాఁడను"

"ఇంతకుముం దెచ్చట నుండెడివారు?"

"ఎప్పుడు నిచ్చటనే యున్నాఁడను. నేనీచక్రవర్తికి జ్ఞాతివర్గము లోనివాఁడ నగుటచే నినగరునందే వసించి యుందును"

వసుమతి కీమాటలు వినఁబడినవా? ఈతఁ డలనాటి ప్రాణదాత యని యామె గ్రహించినదా? ఏమో? ఆమె యేమియును మాటలాడ లేదు. మహానందమున నెడలు మఱచిపోయినదికాఁబోలు!"

"మహాత్మా! ఇప్పుడుగదా మావసుమతి దిక్కుగల దైనది" అని సుందరి దీనముగఁ బలికెను.

"చక్రవర్తి రక్షణమిననున్న మీకేమిభయము?"

"మమ్మీచక్రవర్తి యెందులకు రక్షించునో తెలియకుండుట కంటె మఱే భయమేమున్నది?

"మిమ్మెల్ల విధములఁ గాపాడవలయు ననియే మహారాజు నుద్దేశము."

"మా జీవితములఁ గాపాడ నక్కఱలేదు. మరియాదఁ గాపాడినఁ జాలును."

"అదేమి యట్లనుచున్నారు?"

"రాజోద్యోగులకడ నంతకన్న మనవిసేయవలసినదేమున్నది?"

"నావిషయమున మీరేమియును శంకింపవలదు. అబలలగుమీ మానరక్షణము సేయుటకంటె నాకు రాజసేన యధికముగాదు. నన్ను మీప్రాణబంధునిఁగఁ దలంచి మీకుఁ గష్టముగఁ దోఁచుచున్న మీ హృదయరహస్యముల వెల్లడింపవచ్చును. నేను జీవించియున్నంతవఱకు మీకేమియును భయములేదు."

"అల్లనాఁడు క్రూరజంతుబాధనుండి మాజీవితములఁ గాపాడితిరి. సతీమణులకు జీవిత మంతప్రియమైనది కాదు. శీలమును గాపాడు

కొనుటకు వారు ప్రాణములనైన విడువఁగలరు. ఇప్పుడు మాకు మాన రక్షణమున సంశయము కలుగుచున్నది."

పురుషుఁడు బాగుగ నాలోచించుకొనియెను. ఆతని కాలోచన యేమియునుదోఁచుట లేదు. ఒక్కింత వదనబింబమును బైకెత్తిచూచి సరికి వసుమతీ మోహనవిగ్రహ మాతని యెట్టయెదుట సాక్షాత్కరించి యుండెను. ఆమెతరళనయనంబులనుండివెడలుకటాక్షములాతనిహృదయ మును గలఁచివేయుచుండెను. వసంతుఁడామెవంకఁ జూచువఱకును, వసుమతి యాతనిమనోహరలావణ్యామృతమునుదనివాఱఁ గనుదమ్ములఁ గ్రోలుచునే యుండెను. ఆతనిచూపు లెదుర్కొనినతోడనే వసుమతి తనకటాక్షముల గిరుక్కున మరల్చివైచెను

ఓపికికినసునుతీ! నీకింత భయమేల? ఆతఁడు శాంతచూర్ణి దయామయుఁడు. ఆతనిమనోహరకటాక్షమాలికలకు నీనలపు చూపు లుపాయన మొసంగఁదలంచియు నేల శంకించెదవు? ఓముద్దరాలా! నీకు సిగ్గు లేదని యెవ్వ రాక్షేపింతురు? సుందరి నీప్రాణమే గదా! నీముద్దు చెల్లించుటకంటె నామె కిక నేమి కావలయును? పాప మాతని హృదయ మెట్లున్నదోమాత్రము నీకుఁ దెలియనిమాట నిశ్చయము. అందుచేతనే నీవాతనిచూపుల నెదిరింపలేకున్నావు. తెలిసినను నీసిగ్గు నీకు స్వతంత్రత నీయదే. ఇరువురను జూచుచున్నమాకు మీరిద్దఱు నొక్క మెట్టుపై నున్నారనియే తోఁచుచున్నది. నీవుఁగూడఁ దెలియఁదలంతువేని యొక్కింతసేపు నీలజ్జాసఖిని దూరమునకుఁ బంపి యాతనిచూపుల యర్థమును గ్రహింపుము.

పురుషుఁ డింకను నాలావణ్యరాశిం జూచుచునే యుండెను. ఆతని కాలోచన యేమియును దోఁచనే లేదు. మరల నడిగినదే యడుగుచుండెను.

"మీకేమియును భయము లేదు. సంశయమువలదు" అని యెను.

"కామకులచిత్తవృత్తములు యుక్తాయుక్తవివేకశూన్యమ్ములై యుండును. మానవతులసౌశీల్యములు పరమపవిత్రము లయినవి. అపరిచితంబగు నీస్థలంబున, దుష్టాముకజనమధ్యంబున, నున్నమాకు శాంతి యెట్లుండును? ఈపురంబున ననాథజనరక్షకుం డగువసంతుఁ డొక్కఁడున్నాఁడనివినుచున్నాము. ఆతనియనుగ్రహము మాకెట్లు లభించును? ఎన్ని విధములఁ జూచినను మీకంటె మాకెవ్వరును రక్షకులులేరు"

"మత్తేమియు నుపద్రవము లేదు. పాటలీపుత్రీమంతయుఁ బాపాకరంబనియేతలంపకుండుఁ. దీనదయాపరుండును, మహాతేజస్సంపన్నుఁడు నగు చంద్రగుప్తుఁ డీయూర నున్నంతవఱకును దారుణకర్మముల నాచరించుటకుఁ జక్రవర్తియైన సాహసింపఁజాలఁడు. ఆతఁడు పరదైవము వలె నెల్లవిషయములఁ గనిపెట్టుచునే యుండును. ఆతఁడు నాకుఁ బ్రాణమిత్రుఁడు. నేనును నిరంతరమును మీక్షేమమునుగూర్చి ప్రార్థించుచుండెదను."

"అంతర్భవనముల నున్నయబలల నిరంతరముఁ గను గలిగి చూచు చుండుటకు మీకుమాత్రము తీరిక యెట్లుండును?"

"అట్లు శంకింప నక్కఱలేదు. మీ కెప్పుడైననాపద రానున్న యప్పుడీయుంగరమును నాకడ కంపుఁడు. నాప్రాణములఁ గోల్పడియైన మిమ్ముఁ గాపాడుటకుఁ బ్రయత్నించెదను."

అని యొకముద్రిక నెసంగెను

ఆనంద మనిర్వాచ్య మైనది. రూపరహితమగు నాపవిత్ర శక్తి యిట్టిదని ప్రాయటకుఁగాని వర్ణించి చెప్పటకుఁగాని వలనుపడునది కాదు. అది యనుభవైకవేద్యము ఆముద్రిక వసంతనామాంకితమై యుండెను. అప్పుడు సుందరికిఁ గలిగినయానందమునకు మేరలేదు. ఏమహా

పురుషునియు త్తమగుణములు లోకాతీతము లని యెల్లప్పుడును వినుచుం డెనో, ఎవ్వనియనుగ్రహము తమకు లభించుట దుస్సాధ్య మని తలంచు చుండెనో, ఆమహాపురుషుఁడు నేఁడు తమజీవనదాతయై, ప్రాణబంధుఁడై, తమమానప్రాణరక్షణములకుఁ బూటకాపై, యెట్టయెదుట సాక్షాత్కరించి యున్నయీతేజోమూర్తి యని తెలిసికొనఁగలిగినప్పు డామె హృదయమున నెట్టియానందము పూర్ణీభవించియుండునో యెవ్వరు చెప్పఁ గలరు? అప్పు డచ్చట వసుమతీసుందరు లిరువురుమాత్రమే యుండుట తటస్థించెనేని స్త్రీ ప్రకృతికి సహజములగు విలాసచేష్టలచే వారిహృదయ భావము లుప్పొంగి పొరలిపోవ్రచుండుగని చెప్పుటకాశ్చర్య మెమున్నది? వసుమతి లజ్జావాధ్యమున మాటలాడక చిత్రమువలె నున్నదియేగాని యామెవిమోహ హృదయమున నెన్ని యో భావములు పుట్టుచునే యున్నవి. నలపుచూపు లన్నిటిని గనిపట్టుచునేయున్నవి. ఇప్పు డామె మనంబున, నానందము, మోహము, లజ్జానిర్బంధము, సంభ్రమము, ఇంక నేమేమియో యండి నిబిడీకృతంబులయి యుండెను పాపము! వసుమతి యెంతగూఢముగ నున్నను నవి యన్నియును మొగమునఁ గనఁబడుచునే యున్నవి. సుందరి కొక్కటేయానందము వసుమతిహృదయభావముల నామె కనిపట్టి యుండునా? ఏమో? ఆమె తనవలపుచేష్టల నన్నిటిని జాలకాలముక్రిందటనే మఱచిపోయినది. ఇప్పుడు వసుమతివికారముల నామె గ్రహింపలేదనుకొందుము. వసంతునకు నమస్కరించి.

"అయ్యా! మీమహానుభావత్వమును దెలిసికొనఁజాలనిమా యవివేకమును మన్నింపఁ గోరెదము. ఇప్పుడు మాకు సంపూర్ణముగ ధైర్యము కలిగినది." అనియెను.

"ఇందు మన్నింపవలసిన దేమున్నది? నన్ను ను, నాపేరునుగూడ మీరు మవఃపూర్వకముగ గౌరవించుచున్నందులకు సంతోషించితిని. నేఁబోయివచ్చెదను. మీకింకను గోరఁదగిన దేమైనఁ గలదా?"

"అయ్యా! తఱుచు మీదర్శనముకంటె మాకింకఁ గోరఁదగిన దేమున్నది?"

"అవశ్య మట్లే."

అని వసంతుఁడు వెడలిపోవుచు నొకపారి వసుమతివంకఁజూచెను. ఎట్లు సాహసించినదో గాని వసుమతియును జూచెను. ఆయన్యోన్య వీక్షణము లొక్కక్షణకాలముమాత్రము నిశ్చలములయి యున్నవి. ఆమోహవీక్షణములే యొండొరులమనోహరాకారములను హృదయ ఫలకముల లిఖియించు తేజోలేఖనయంత్రము లయినవి.

వసంతుఁడు తనయుంగరమును సుందరికిని, హృదయము వసుమతికిని సంపూర్ణస్వాతంత్ర్యములతో నొసంగి యెట్లో వెడలిపోయెను.

తరువాత వసుమతీసుందరుల కేమోమో చాలవఱకు సంభాషణము జరిగినదఁట! సుందరి నెఱజాణ! ఆమె యెప్పుడును వసుమతిని బరిహసించుటకేకుచ్చుట పడుచుండును. ఆమె సోత్ప్రాసవచనములచే వసుమతి మనసు చిక్కుకొన్నదేమో?

తొమ్మిదవ ప్రకరణము.

మోహము చాలఁజెడ్డది. లోకమంతయు మోహములోనే మునిఁగియున్నది. ఏకపక్షమోహము మిగుల నపాయకరమైనది. పాము కాటునకును దీనికిని భేదము లేదు. ఈవిషము తల కెక్కినేని యది దిగుటకుఁ దగినమం దీలోకమున లేదు. ప్రాణములు పోయిన పెనుక

నది యేమగునో మనము చెప్పలేము. అప్పటికిని నివృత్తికానియావిష జ్వాల లాప్రాణములను భయపెట్టుచు వెనుదవులుననియే చెప్ప నచ్చును.

విష్ణుగుప్తుడు వసుమతిని బరిణయమగుటకై యనేక ప్రయత్న ములు చేయుచుండెను. అవి యన్నియును నిష్ప్రయోజనములయి పోవు చుండెను. ప్రతిప్రయత్నావసానమందును నాతని కాశాభంగమే ఫలిత మగుచుండుటచే నారాటము హెచ్చయ్యెను. మోహము ముంచుకొను చుండెను ఒడలు తెలియుట లేదు. తానేమిచేయుచుండెనో, ఏమి మాటలాడుచుండెనో ఆతడెఱుగడు. సర్వదా వసుమతీవిగ్రహ మాతని కన్నులయెదుటఁ బ్రచలిత మగుచుండెను. ఆతనికి వసుమతి తక్కినీకఁ బ్రపంచమేమియు గోచరించుట లేదు.

నిద్రాహారము లాతఁ డెఱుఁగఁడు. ఒకనాటిరాత్రి రెండుయామ ములు దాటినవి. ఆతఁ డింద్రమందిరమున శయ్యపైఁ గూరుచుండి యుండెను. ఒకరత్నజ్యోతిచే నామహాలంతయు దేదీప్యమాన మగు చుండెను. దక్షిణగవాక్షము తెఱచియున్నది. మలయానిలకుమారుఁ డప్పు డాదిక్కునుండి మెల్లమెల్లఁగ మహాలులో నాడుకొనుటకై దిగు చుండెను. కిటికీకిక్కన్వల సర్వము నంధకారమే. విష్ణుగుప్తుని హృదయమో మోహాంధకారపూరితమై యున్నది. ఆతఁడు తల రెండుచేతులలోనుంచు కొని యొకవిధముగఁ జింతించుచుండెను. ఆతఁ డేమియాలోచించుకొను చుండెనో గాని యొకసారి గుభాలున లేచును. మరలఁ గూర్చుండును. ఒకమారు తనకత్తిని సవరించుకొనును. ఇంచుక తలయూఁచి దానిని మెల్లఁగఁ జారవిడుచును. నిస్పృహాఁ జెందుచున్న యాతని హృదయ మునఁ గోప ముద్రేకముతోఁ బ్రవేశించి వికారహేతువులగువస్తువుల నాశనము చేయవలయు ననుసంకల్పముఁ బుట్టించుచుండెఁ గానేమో మన మెఱుఁగము. ఆశకు వీని నన్నిటిని భ్రాలించుశక్తియున్నది. దానిచే

మహాసముద్రమునైనను ఛుదిమిట్ట నీదవచ్చును. ఆశయే, మోహ ముచే నిస్పృహాఁ జెందియున్న వారిప్రాణములు లేచిపోకుండఁ జిక్కించు కొను వలయయియున్నది. ఈయాశాజాలము లీతనియుద్రేకప్రయత్న ముల కంతరాయములుగ నుండి చాలఁ బనిచేసియుండును. లేనియెడల నాతఁ డట్లుద్రేకించుచుండియు విరితి నొందుచుండుటకుఁ దగిన కారణ మగపడదు.

మూఁడుజాములు దాఁటినవి. ఆతఁడు శయ్యాపైనుండి కదలలేదు. చాచియున్న యొకపాద మప్పుడప్పుడు పాముపడగనలె నాఁచుచుండెను. కన్నులు మూతవడి యుండెను. తల కదలుటలేదు. ఒక్కశిరోజమైనఁ జలించుటలేదు క్రమక్రమముగఁ జేతుల పట్టుసడలెను. మేను మెల్లఁగ శయ్యాపై కొఱఁగెను. మనఃపరిశ్రమచేతను, శరీరాయాసము వలనను, నొక్కనిమిషములో నిద్రాదేవత యనురాగముతో వచ్చి యాతనిఁగాఁగి లించుకొనియెను. గాఢముగఁ గౌఁగిలించుకొనలేదు. కలతనిద్దురలు తఱుచుఁ గలలచే నిండియుండును. జాగ్రదవస్థయందు మనస్సున నాఁటిన విషయములే స్వప్నమునఁ దోఁచుచుండుట స్వాభావికము. ఆతఁడొక స్వప్నమును గనియెను.

ఆకలలో నాతఁడు వసుమతికై వెదకికొనుచు శచీసౌధమున కరి గెను. ఆమె యగపడలేదు. అంతటను వెదకెను. నిలువుటద్దమునఁ దన యందమును జూచికొనియెను. తనహృదయమున వసుమతియాకార మును స్మరించుకొనియెను. పారవశ్యమునఁ గన్నులు మూతవడియెను. మరల నొకసారి నిలువుటద్దమునఁ దన్ను చూచుకొనఁగోరెను. ఇప్పు డచ్చట నద్దములేదు. శచీభవన ముద్యానవనముగా మాఱెను. ఒక పొదరింటిలో నేలకి లతలమాటునుండి యొక మనోహారాకార మోహ ద్వ్యక్త మగుచుండెను. అటనున్న వా రెవ్వరైయుందురు? ఆతనికి స్వప్నమునైన వసుమతి సుందరాకారముకంటె వేఱేమియు గోచరిం

చుట లేదు. కాని, తనయాశాలతకు నిరంతరమారకుఁ డయియున్న వసంతుఁడకూడ నాతనిస్మృతికి వచ్చుచుండుట కలదు. మఱపురాని వారిలోఁ బ్రాణప్రియులతోఁగూడ గర్భశత్రువులును గలిసియుందురు. ఆతఁడించుక సమీపించి చూచెను. ఆపొదరింటిలో వసుమతీ వసంతులిరువురును గూర్చుండి యుండిరి.

వికచారవిందముపై ముసరికొనుచున్న సమదచంచరీకములవలె వసుమతివదనబింబమునఁ జలించుచున్న చికురజాలంబులఁ జక్కఁజేయు వసంతునిఁ జూచునప్పటి కాతనిహృదయము కిళుక్కుమనియెను. శరీరమునఁ గంపము తోఁచెను. అప్పు డాతనిక భయముకలుగుటకుఁ గారణము లేదు. క్రోధమతిశయించినప్పుఁడుగూడ నెడలువడఁకుట సామాన్యధర్మము. ఎది యెట్లున్నను రాజపుత్త్రుఁడు భయభ్రాంతుఁ డయ్యెనని చెప్పుటకుమాత్రము మాకిష్టము లేదు. వసుమతి వసంతుని ప్రక్కనే కూర్చుండియుండెను. వసంతుఁడు తనయెడమచేతి నామె కంఠమునకుం జుట్టి కోమలకరాంగుళులతోఁ జుబుకమును బుడుకుచుండెను. ఆతని కంఠపార్శ్వంబున వామభుజంబుపైఁ దనచెక్కిలి నానుకొనియున్న వసుమతి ప్రకేగంటిచూపు లూర్ధ్వముఖంబులయి ప్రియైకస్థానము లగు వసంతుని వాలికచూపులతో నైక్య మొందుచుండెను. వారేమిమాటలాడుకొనుచుండిరో యాతనికిఁ దెలియ లేదు నిజముగ వారేమియును మాటాడుటయును లేదు. తన్మయత్వమున మైమఱచి యుండిరి. విష్ణుగుప్తునియాశాలత తెగిపోయినట్లయ్యెను. హృదయావేగము నాపలేక పోయెను. ఇరువురుకామునకు లేకాంతస్థలంబున వినోదించుచున్నప్పుడు రసభంగముసేయఁగూడదనుసంశయమైన నాతనికిఁ గలుగ లేదు. కాని, వసంతునియాత్మగౌరవమును, పరాక్రమమును, తలంపునకు వచ్చుటచే భయము కలిగెను. అనూయయును, రాజపుత్రత్వమువలనఁ గలిగిన

దురభిమానమును నాతనిఁ బ్రేరేపించుటచే వెనుకముం దరయక వారిని సమీపించెను. వసుమతీవసంతు లీతని జూచిగో లేదో కాని యానంద పారవశ్యమున యథాపూర్వముగనే యుండిరి. వారినిఁ జూచుకొలఁది విష్ణుగుప్తుని హృదయమునఁ గ్రోధానలము ప్రజ్వలించుచుండెను. అట్టి సమయమున వసంతుని దననిశితఖడ్గమునకు బలిసేయఁ దలఁచెను. కత్తి వెత్తి పొదరింటిపై నొక్కవిసరు విసరెను. తోడనే వసంతుఁడు దిగ్గునలేచి కన్ను లెఱ్ఱఁజేసి చూచెను కాలానలకీలాసన్నిభంబులగు నాతని కోపవీక్షణంబులు మహాయోధులకుఁగూడ భయంకరము లయినవి. విష్ణుగుప్తుఁడు భయభ్రాంతుఁడయి యొక్కపరుగునం భాటిపోవుచు నూధవీలతాపాశములు కాళ్లకుఁ దగులుకొనుటచే ముందునకుఁ బడి యెను.

ఆపాటున మెలఁకువ కలిగినది. కన్నులు విచ్చి చూచుసరి కేమియును లేదు. మనస్సునేకవిధములఁ దొట్రుపడుచుండెను. ఆయుద్యానమును, నా పొదరిల్లును, నా వసుమతీవసంతులును, వారిపారవశ్యాకారములును, నాతనిమనస్సునకుఁ బొడకట్టెను. మనశ్చాంచల్యము కలిగినది. అందువలన సత్యాసత్యము లాతనికిఁ దెలియలేదు. హృదయదౌర్బల్యమున యాథార్థ్యము నాతఁడు గ్రహింపలేకపోయెను. కొంతసేపటివఱకు దీ స్వప్నమే యని యతనికి గోచరించినదికాదు. వసంతుని క్రోధాకారము మరల హృదయమునఁ దట్టినతోడనే యాతఁడు శయ్యనుండి లేచెను. ఎందులకు? ఉద్యానమునుండివలెనే పరుగెత్తుటకు. అది సౌధ మని యాతఁడు గ్రహించెను. తానిదివఱకు ననుభవించినది స్వప్నవృత్తాంత మని యాతఁడు కనుఁగొనియెను. నిజముగ వసుమతి యింకను వసంతునిసొమ్ము కాలే దని సరిపుచ్చుకొనియెను. ధైర్యమును వహించెను. ఎల్లవిధములఁ దనప్రయత్నముల కభ్యంతరము కలుగఁ జేయుచున్న వసంతునిరూపగుణవిశేషంబులఁ బలుతెఱంగుల నిందించెను.

తసమనోరథఫలంబులకు, మూగుతుండయి యున్న యాతనినిర్జించు కెట్లని యాలోచించుకొనుచుండఁగా వేకువసమయమున నాతనికన్నులుమూఁత పడియెను. ఆతఁడు మరల నేమిస్వప్నము గాంచెనో మనకుఁ దెలిసినదికాదు.

పదియవప్రకరణము.

రాజనగరిలోని యొకభవనమునఁ జక్రవర్తియగు పద్మనందుఁడును, విష్ణుగుప్తుఁడును, సముచితాసనములఁ గూర్చుండి యుండిరి. యువరాజు వినమితవదనుఁడయి యుండెను రాజు చాల మూలనేర్పరి. ఆతఁ డెప్పుడును పుత్త్రునిమనసు నొవ్వకుండఁగనే బుద్ధులఁ గఱపుచుండును. ఎటులయినఁ గుమారునిఁ దనయంతవానిగాఁ జేసిపోవలయు ననియాతని కోరిక. తండ్రిబిడ్డల కీక్రిందివిధముగ సంభాషణము జరగెను.

"కుమారా! నీవు భావిచక్రవర్తివి. మరియాద విడిచి చరియింపఁగూడదు".

"నేనేమి చేసితిని?"

"ఎప్పుడును నాటగాండ్రతోడను, పాటగాండ్రతోడనే చరియించుచుందువు."

"ఏమియును దోఁచదు. వినోదముగఁ గాలక్షేపము సేయుటకు నాకిం కెవ్వరున్నారు?"

"నీకుఁ గాలక్షేపమే కాదా? ప్రతిదినమును కొలువునకు రాఁగూడదా?

"ఏమో? నాకుఁ బాలఁ జిరాకుగ నుండును."

"చతురిక యింకను నీయింటికి వచ్చుచున్నదా?"

విష్ణుగుప్తునిమొగము వెలవెలపోయెను. "లేదు పాప మొక్కసారి—"

"నీకుఁ జూడవలయునని యున్నదా?"

"ధానికిఁ జూడవలయునని కోరిక యున్నదట!"

"వలదు. ఇట్టివాఁడవనియే నిన్ను వసుమతి నిరాకరించుచున్నది."

"అందువలనఁ గాదు. వసంతునిబోధనమువలన"

"నీవెప్పుడును వసంతునిపై నేరములనే చెప్పుచుందువు. ఒక్కటియును సత్యమైనదికాదు. ఆతఁడు బుద్ధిమంతుఁడు. ఇంతవఱకు మనయెడ ద్రోహచింత యాతనికిఁ గలుగలేదు."

"బ్రాహ్మణప్రముకమువలన నేమఱి యుండరాదు. ఆతఁడు చేయికుట్ర లిన్నియు నన్నియుఁ గావ్రి. ఆతని కిప్పుడు రత్నగిరిరాజ్యమును, వసుమతిని, గూడ నపహరింపవలయు ననియున్నది"

"ఆతఁ డన్యాయముగ నేపనియంచును బ్రవేశింపఁడు."

"వసుమతి నంగీకరింపఁ జేయుటకే యాతఁడు ప్రయత్నించుచున్నాఁడు."

"నీకు బుద్ధియే యున్నయెడలఁ జక్రవర్తిపుత్త్రుఁడ వగునీకంటె వసంతుఁ డామె కెక్కువవాఁడా?"

"ఆతఁ డట నధికారిగానున్నంతవఱకు నాబుద్ధి యేమియు నుపయోగింపదు. ఆతనిఁ దప్పింపవలయు. తప్పించుటయే కాదు. అవమానింపవలయును. శిక్షింపవలయును. ఆతఁ డట్టిహీనస్థితికి వచ్చినప్పుడు గాని నాపై వసుమతికి మోహము కలుగదు."

ఇట్లు మాట్లాడు కొనుచుండఁగా నాగదివెలుపల నుద్యానవనముననుండి "ఓసి దుర్మార్గురాలా! ఎంతస్వామిద్రోహమున కొడిగట్టుకొనుచున్నావే" అని యొకయువతీమణిపరుషవాక్యములు వినవచ్చెను.

ద్మనందునకు స్వాచ్ఛిద్రోహ మనినఁ జాల భయము. తత్క్షణమే కిటికీలోనుండి యుద్యానమువంకఁ జూచెను. దూరమున నొకతరుణీ పాటిపోవుచుండెను. వగర్చుచున్న యొకయువతిభవనముదిక్కుగా వచ్చుచుండెను. తత్తఱముతో రాజును, విష్ణుగుప్తుడును, తలుపులు దెఱచికొని, యుద్యానమునఁ బ్రవేశించిరి.

విష్ణుగుప్తున కది యేమియు నాశ్చర్యముగఁ దోఁచుట లేదు. ఆవచ్చుచున్న చెలువ చతురిక యని రాజు తలంచికొనియెను. ఆమె వారి సమీపమునకు వచ్చి నమస్కరించి రాజున కొకయుత్తరము నెసఁగెను. ఆమె నిజముగా చతురిక గాదు. చతురికనుబోలి యుండుటచే దూరమునుండి చూచినరాజుగారి కనుమానము కలిగెను అది యామె కక్కయో చెల్లెలో యయియుండును.

"ఈయుత్తర మెక్కడిది" అని రాజుగా రడిగిరి.

"ఇది యొకదాసియొద్దనుండి గ్రహించితిని"

"ఆదాసి యెవ్వరు?"

"రత్నగిరినుండి వచ్చినవసుమతిపరిచారిక"

"సుందరియా? ఆమెపరిచారికకాదే"

"సుందరి కాదు. కనకలత"

"ఆమె యేమైనది?"

"పాటిపోయినది"

"అంతభయమునకుఁ గారణమేమి?"

"దేవర యీయుత్తరమును చిత్తగింపవలయును. ఇది యొక రాజద్రోహిచే వ్రాయఁబడినది"

పద్మనందుఁడు తత్తఱపడియెను. ఉత్తరమును విచ్చి యిట్లు చదివెను.

'ప్రియా! కష్టములు వచ్చె నని విచారింపనలదు. నేటిరాత్రితో నీనిర్బంధము వదలిపోగలదు మూడుగుఱ్ఱములతో రాత్రిరెండు యామములకు నచ్చి పిలిచెదను. అప్పటికి మీరిరువురును సిద్ధముగ నుండవలయును. వలయుసాధనము లన్నియును సిద్ధపఱచితిని. ఏమియును సంశయముపఱలదు.

నసంతుఁడు"

ఈయుత్తరము చదువుచున్నప్పుడు రాజు మొగము క్రోధావేశ మున జేవుర్పుచుచుండెను. దీర్ఘక్రోధమున రాజుదాసితో"నీయుత్తరము నీకెట్లు వచ్చినది? ఇది యాదాసియొద్ద నుండునని నీవెట్లు కనిపట్టితివి? నిన్ను విడిపించుకొని పాఱిపోగలిగినంతటి బలముగలదానియొద్ద నీయుత్తరము నెట్లు పెట్టికొనగలిగితివి?" అను ప్రశ్నలేవియును వేయ లేదు. అంతయవసరమును లేదు. అందు వసంతునియుంగరపుముద్ర యున్నది. అదివసంతుఁడే ప్రవాసియుండు ననుటకిక సంశయ మేమి యుండును? ఎట్లువచ్చినదేమి? నేరము బయటఁబడినది.

విష్ణుగుప్తుఁడు తండ్రిముఖచిహ్నములఁ గనిపట్టెను "నాయన గారు! చూచితిరా వసంతునిదుర్బుద్ధి! ఇప్పుడయిన నామాటలు తారాక్ష మగుచున్నవా? ఇంకను నన్నే నిందించుచుందురా? ఇక వసుమతి దక్కదు." అని దీనముగఁ బలికెను

"ఇప్పుడేమియు నుపద్రవము కలుగలేదు. మఱేమియు తొందర పడనక్కఱలేదు. దీనికిఁ దగినప్రతీకారము త్వరలోనే చేయవచ్చును" అని చెప్పి పద్మనందుఁడు రహస్యాలోచనామందిరమునకుఁ బోయెను.

పదునెనిండవ ప్రకరణము.

ఆదేశమున నాబాలగోపాలము వసంతోత్సవముచేయు నాచారము కలదు. కావునఁ బాటలీపుర మిప్పుడు నిత్యకల్యాణమును బచ్చతోరణము నైయుండెను. ఆవసంతమున నందఱహృదయములును ఫుల్లవించినవి. వననులును బల్లవించినవి. వనములఁ గోయిలలు కఁరమెత్తి పంచమస్వరమున రాగ మాలాపన సేయుచుండెను. పురమునందలి ప్రతిసౌధమునందును యువతిజనము కలస్వనమున మోహనరాగ మాలాపించుచుండెను. వసంతమున రాగ మెల్లెడ మూర్తీభవించి యున్నది. రాగము మూర్తీభవించుట యెట్లని సందేహ మక్కఱలేదు. లేఁదీఁగలయందలి నవపల్లవములు రాగయుక్తములు. పల్లవసదృశము లగు యువతీమణుల మృదులాధరములును రాగయుక్తములే. యీవనదంపతుల హృదయములుకూడ రాగయుక్తములయి యున్నవి. సమదకోకిలముల తొగరుగన్నులయందును, చిలుకబోదల ముకుపుటములయందును, రాగము మూర్తీభవించియున్నది. ఈయద్భుతమహిమ లావసంతసమాగమమున్నచో కలిగియుండును. వసంతోదయము యీవనోదయమే. వానికిని దీనికిని భేదములేదు.

శచీభవనమునకు దక్షిణభాగమున విశాల మగు కుసుమాకరోద్యాన మున్నది. ఆవనలక్ష్మికిని వసంతసమాగమ మైనది. వసంతుఁడావసరమను ప్రకృతిచే గూర్పఁబడినయమూల్యాలంకారములచే నలరించుచుండెను.

ఆవనమునకుఁ జుట్టును చంద్రకాంతమణినిర్మిత మగు ప్రాకార మున్నది. ఆయోరనే దట్టముగ నైన్తెన తాళవృక్షము లుండెను. వాని

మొదళ్ళునిడలా ప్రాకారమునసిలమశిశలాకలవలె బ్రతిఫలించుచుండెను. వానియాకులపచ్చనికాంతు లాప్రాకారోపరిభాగమునకు గారుత్తమశి ప్రభలఁ గూర్చుచు, ఖేచరులకు హృదయాహ్లాదమునుఁ గూర్చుచుండెను. తరువాతి నొకదానివెనుక నొకవరుసగా చుట్టును తీయనూమిడిగున్నలు, సురపొన్నలు, పొగడలు, మందారములు, నిమ్మలు, నారింజలు, నందలగుఫలవృక్షములు రమణీయముగ నాటఁబడియుండెను. నడుమ నడుమ లతామందిరములును, మణిమయవేదికలును; విలసిల్లు చుండెను క్రిందఁ బచ్చపట్టుకంబళిము పఱచిన ట్లొత్తుగఁ బెఱిగియున్న లేఁబచ్చిక యాలోకనసుందరముగ నుండెను.

ఆవనమధ్యమునఁ బద్మరాగమణిమయంబులగు సోపానములచే నొప్పుళుగులుకుచు, నిర్మలవారిపూరముల నిండి తొలఁకుచున్న సరోవర మొకటియుండెను. అదిచతురమై చిత్రలిఖితమగు మణిమయదర్పణముం బోలి ప్రకాశించుచుండెను. అందుఁ బద్మలతలును, కైరవతీగలు నలమికొనియుండెను. చిఱుగాలితాఁకునఁ గొంచెమెత్తుకొనియున్న తామ రాకులచొరనున్న కొదమరాయంచలు తెరచాపయెత్తబడి నిమచుటకు సిద్ధముగనున్న రమణీయవిహారనౌకలఁ దలపించుండెను. అందలి జలవిహంగమముల కలకలారావములును, జలతరంగముల గలగలధ్వనులును, సమదబంభరములఝంకారస్వనంబులును, శ్రవణపర్వముగా వినవచ్చుచుండెను.

ఆసరోవరమునకునడుమ మణివినిర్మితమగు మండపమొకటి విరాజిల్లుచుండెను. అందు నీలమణిస్తంభములకు నిజమెత్తువఱకు నెప్పుడు జలము నిండియేయుండును. అందు వల్లవకామినులతో వివిధాకృతుల విహరించుచున్నట్లు జలకేళీలోలుఁడగు గోపాలబాలునిమనోహరవిగ్రహ ములు యథాపూర్వకముగఁ జిత్రింపఁబడియుండెను.

ఆకొలనిచుట్టును తీవపందిళ్లు, పూలమొక్కలును, దర్శనీయ ములై యుండెను. అందందు వివిధాకారములగు జలయంత్రములు గలవు. ఒకచో పద్మాలయయుఁ బద్మహస్తయు నగునట్లు మణులచేఁ జిత్రింపఁబడిన లక్ష్మీవిగ్రహమును తొండములచే నాకర్షింపఁబడిన సలిలధారలచే నభిషేకించుచున్నట్లు చంద్రశిలానిర్మితములగు వెల్ల యేనుఁగులు రెండుచిత్రింపఁబడియుండెను. ఇంకొకచోఁ దనకోమలకరకమల ములనున్నకలశమును నంచి మాధవీలతను దడుపుచున్నశకుంతల, మఱి యొకచో వదనాసనసేచనమున దోహదముసేయునదియుఁబోలె పుక్కిటి జలంబుల వకుళభూరుహస్కంధముం దడుపుచున్న సుందరీరూపము, వేఱొకయెడ జటాజూటమునుండి పొంగిపొరలివచ్చుచున్న గంగాప్రవా హముగలచంద్రశేఖరవిగ్రహము, ఇట్లే చిత్రవిచిత్రము లగుజల యంత్రము లమర్పఁబడియుండెను. ఆజలధారలన్నియును వేఱువేఱుగా స్ఫటికశిలానిర్మితములగు కాలువలనుండి యయ్యుపవనాలంకారములగు లతాతిరులబోదులలోనికిఁ బ్రవహించుచుండెను. ఒక్కచో నీలమణినిర్మిత మగు నేనుఁగుతొండమునుండి చిమ్మనగ్రోవినుండివలెఁ బైకెగయుచున్న జలశీకరము లాకొలనియొడ్డుననున్న మాధవీలతామందిరమును దడుపు చుండెను.

ఆలతా గృహమునందలి చలువరాతిన్నెపై వసుమతికూర్చుండి యుండెను. ఆమె వసంతపూజ చేయుచుండలేదు. ఆమెచేతిలో నొకతామర పూవున్నది. అది సహస్రపత్రికమలము. మనోహరముగ వికసించి యున్నది. దానిపరిమళ మామెకు వెగటుగఁ దోఁచుచున్న దేమోకాని యామె మొగమున నట్టివికారము కన్పట్టుచుండెను. ఆమె తలవంచికొని యాపుష్పమువంకనే చూచుచుండెను. ఒక్కొక్కటిగ రేకుల నూడఁ దీయుచుండెను. అవి యెంతకును దఱుగుటలేదు. ఇంక నట్లేచేయు చుండెను. అందేమికనఁబడియెనోకాని యొక్కనారిచిఱునవ్వునవ్వెను. పొద

రింటినలువంకలకును దృష్టి సారించెను. అప్పు డాసెచెక్కలు పులకించి
యున్నవి. ముందున్న కొలనివంక జూచెను అందొయ్యారముగ
జోడుభాయక యీఁదులాడుచున్న రాయంచమిథున మామెకన్నులఁ
బడియెను. తామరాకులపై ముక్తామణులపోలిక నిలిచియున్న జల
బిందువులలోఁ బ్రతిఫలించుసాయంతనసూర్యకిరణప్రసారమున నామె
కన్నులు నిఱుమిట్లు గొనియెను. ఆకారణమున నామూపులు చెదరిపోయి
నవి. రవికిరణప్రతాపమున ముకుళించియున్న కలువపూపైపై నాదృష్టి
ప్రసరించెను. తోడనే నసుమతికన్నుల నశ్రుబిందువు లుదయించెను.
పద్మోదరెఱఁగునఁగన్నులు తుడిచికొని మరలఁ దానున్న పొదరింటివంకఁ
జూచికొనియెను. ఆమెకు శరీరమునఁ గంపము గోఁచెను. అటనుండలేక
లేచి యుద్యానమునఁ బ్రవేశించెను.

వసుమతి వనరమణొక్క యనంతసౌభాగ్యమును దిలకించెను.
అంతటను వసంతునినుగోహారాకారము విస్పష్టమగుచుండెను. అప్పుడే
యుదయించుచున్న లేఁజిగురులయందు గాఢరక్తిమయు, వికసించినవాని
యందించుక యెఱుపును, విరిసి ప్రాలినపల్లవములఁ గపిలవర్ణమును
నిశ్లే వివిధభేదములచే వివిధవర్ణములగు చిగురుటాకుల నెన్నింటినో
చూచెను. అన్నిటియందును వసంతాకృతి యొక్కమాదిరిగనే పూర్ణ
భవించియుండెను. మలయానిలస్పర్శంబుననల్లనఁ గదలియాసు లేఁజిగురు
గొమ్మలతాఁకున నించించుక విరియుచున్నలతాసుమమంజరులువసంత
కుమారునిసుకుమారచేష్టితములఁ బ్రకటించుచుండెను. కోమలరసాల
పల్లవంబులఁ గసివాటుగ భుజించి పంచమస్వరంబున నెలుగెత్తి గానము
సేయుకోకిల కలకంఠనాదములయం దెల్లెడ వసంతుని గుణకీర్తనము
లే వినవచ్చుచుండెను. తీయమామిడిగున్నలయందలి యొగరుపూఁప
పిందెలమెక్కియావందించుచిలుకఖోదల యస్పష్టములగు ముద్దుపలుకుల

యందును, అరవిరిమొగ్గలచుట్టును జుంజుమ్మని రొదసేయుచుఁ బరిభ్రమించునెలదేటిగముల మనోహరాకృతులయందును, వికసితకుసుమ మంజరులయందుఁ బరిమళములు సేకరించుకొని తీయ మామిడుల కాయఁగొమ్మలపై నుయ్యెలలూఁగుచు, లతాతనుసంతతులు నానంద పారవశ్యమునఁ దలలూప నిడుదపయనంబుల నల్లనల్లన నేఁగించుమంద మలయానిలకుమారునిశైత్యసౌరభ్యమృదు స్పర్శనంబులందును, రామణీయకనిధి యగువసంతునిసుకుమారాకారము పరిపూర్ణముగ వ్యక్తమగు చుండెను. వేయేల? వసుమతి మనోహరపీఠణంబు లేనంకఁ బఱపిన నావంకనే వసంతుఁడు ప్రత్యక్షమగుచుండెను. అది వసంతకాలము. విశ్వమంతయును వసంతవిలసితమై యుండుననుటలో వింత యేమున్నది? వసంతునిమోహనాకార మెవ్వరైనఁ గన్నారఁ గాంచినవా రున్నారా? నిజముగఁ జూచినవా రెవ్వరైన నుందురేని వారాతని వర్ణింపఁ జాలరు. చూడకయే చూచినట్లు వర్ణించి శ్లోకమును నమ్మించినవా రనేకు లున్నారు. ఆకాశమునకు నిచ్చెనలు వేయునట్టివారివాక్యములను మేమంతగా విశ్వసింపము. వసుమతియొక్కతెయే విశ్వమంతటను వసం తుని యాకారమును విస్పష్టముగఁ జూచుచున్నది.

ఆతఁడు కాలక్రమమున మార్పునొందునవసంతుఁడుకాఁడు. మోసు ప్రాకులఁ జిగురునెట్టింపఁ బాటుపడువసంతుఁడు కాఁడు. ఆతఁ డెన్నఁడును కోకిలలకుఁ బాటలు నేర్పలేదు. యువయువతీజనంబున కంతకు నతఁడు సామాన్యుఁడు కాఁడు. పైపైమెఱుంగుల నలరించుచు నున్నచ్చెలి యుండి తుదకు ప్రాణేశ్వరియగువనలక్ష్మిని గ్రీష్మాతపత్రం జేసి కృతఘ్నుఁడై యగపడకుండఁ బోవువాఁడు కాఁడు. చిరకాలమునుండి సమయముదొరకినపుడెల్ల కవులచే వేనోళ్ల వర్ణింపఁబడుచుండు వసంతుఁడు గాఁడు.

ఏపురుషోత్తమునిమనోహరాకార మేతరుణీమణిచంచలకటాక్ష ములకు నిశ్చలత్వమును గటాక్షించునో, యెవ్వనిసంస్మరణ మేసుందరి యధరపల్లవమును నిట్టూర్పుబొగలచేఁ గమలించునో, యెవ్వనియలీక సాన్నిధ్య మేకన్నియ సుకుమారావయవములఁ గంపింపఁజేయునో, యాసతీమణి కాతఁడొక్కఁడే వసంతుఁడు. భావనాబలంబున సతీమణు లెల్లరును దమతమ ప్రాణేశ్వరులను వసంతమూర్తులుగఁ జూచికొన్న వారే. కాని, వసుమతిమాత్రము విశ్వసుంతటను వసంతుని జూచుచున్నది. ఆమె నిజముగ వసంతునిపై వలపుఁ గలిగియున్నది. మహావన మునఁ దనజీవితమును గాపాడినవసంతుని, ఆత్మరక్షణకై నిజముద్రిక నానవాలుగ నిచ్చినవసంతుని, తనజీవితేశ్వరునిగ నమ్మియున్నది.

సమీపించియున్నప్పుడుగూడ వ్రీడాభరంబునను, నానందపారవశ్యంబునను, నెవ్వరిమనోహరాకారమును గన్నార వీక్షింపలేకపోయినదో, యెవ్వనిమృదుమధురసంభాషణంబుల వీనులవిందుగ వినలేకపోయినదో, యెవ్వనిగుణగణంబులు తలంపునకుఁ జాటినప్పు డొక్కఁడేనిట్టూర్పు విడువకయుండలేకపోయినదో, యాతనిమోహనాకారమును, నవపల్లవములందును, నూత్న కళికాసంచయమునందును, నరవిరిమొగ్గలందును, వికసితలతాంతమంజరులయందును, పూఁపపిందెలయందును, కాయగొమ్మలయందును, లోఁపలను, వెలుపలను, ప్రతివస్తువునందును, గన్నాఱఁ గాంచుచున్నది. మనసాఱఁ బ్రేమించుచున్నది.

మోహమున కద్భుతశక్తియున్నది.ఒంటిపాటుగ నున్నవారిపైఁ బడినప్పుఁ దానితెగువ చూచి తీరవలయును. వసుమతిహృదయము నిప్పుడది సంపూర్ణముగఁ గలఁచి వైచినది. ఉన్మాదముంగూడఁ గలిగించినది. పాపము! పదియాఱేండ్లకుసుకోమలి యగువసుమతి యిప్పుడేమిచేయఁ గలదు?

ప్రతివృక్షమునకు నమస్కరించును. ప్రతిశాఖను గౌగిలించుకొనును. వసంతునకుఁ బుష్పాంజలి నొసంగ లతలకైపరువెత్తును పొగడ కొమ్మపైఁ జక్కఁగ నల్లికొనిన పుష్పవతియగు మాధవీలతంగాంచి సిగ్గున వెనుదిరుగును. కోకిలాలాపములనాకర్ణించి నిలిచి వినును. అంతలో నేమిఁజోఁచునో? ఊరక నిట్టూర్పులు విసుచుచుండును. ఒక్కచో నిలుచుట లేదు. ఒడలంతయుఁ జెమ్మటచే నార్ద్రీకృతమయ్యెను. సాత్వికోదయమునఁ బొరలిపొరలి వచ్చుచున్న యీమెస్వేదోద్గమము నపనయించుటకు మలయానిలునిశక్తి చాలలేదు. తిన్నఁగా నొకమల్లెపందిరికడకేఁగెను అటఁగూడ వసంతుఁడు పాత్రొత్కరించియే యుండెను. ఆతని మల్లెపూవ్వులతోఁ బూజింపఁ దలంచి, కోమలకరపల్లవమును జాఁకిఁ జాచి యొకకుసుమమును గోసెను. అందును వసంతుఁడు మూర్తీభవించి యుండెను. పూజించుటకు మతి తావ్రలేదు. ఆకుసుమమును గన్నులకద్దికొని తనశిరంబున నుంచుకొనియెను. మరల నింకొక పూవును గోసి, మునుపటినలెనే యొనరించెను. తనివి తీరలేదు. ఇంకను నట్లే చేయుచుండెను.

ఆసమయమున సుందరి యచ్చటికి నచ్చి యంతయును జూచెను. వసుమతి యేమియు నెఱుఁగదు. సుందరి నెఱజాణ ఆమెజాణతనముప్రతి వాక్యమునందును వ్యక్తమగుచుండును.

"వసుమతీ! వలపు తలకెక్కుచున్నదా?" అని పలుకరించెను.

పండ్రెండవ ప్రకరణము.

వసుమతి నిశ్చేష్ట యయ్యెను. వదనచంద్రమండలమునఁ బొరలి పొరలివచ్చు స్వేదబిందుప్రులఁ బయ్యెదచెఱఁగున నొత్తికొనుట లేదు. గుట్టుబట్టబయలయ్యెననునారాటమునఁ గొట్టుకొనుచున్న గుండెలమడుకు నడఁగింపఁ బ్రయత్నించుట లేదు. హృదయావేగముచే నెడనెడ వచ్చుచున్న నిట్టూర్పులనాఁచికొనవలయు ననుతలంపైనఁ గలుగుట లేదు. నీలచికురజాలంబులం దగిలికొని వ్రేలాడుచున్న మల్లికాకుసుమముల సుగంధములకై పరిభ్రమించుసమదభృంగముల షడ్జస్వరమాధుర్యమునైన నాలకించుట లేదు. ఎదుట నిలుచుండిన సుందరిని బలుకరించుటకునోట మాట రాకుండెను. మలయవాయుస్పర్శనంబునం గదలు కోమలారుణ ప్రవాళమువలె మృగులాధరము కంపించుచుండెను. సుందరి చాఁదెలివిగలది. వసుమతిగంభీరహృదయభావముల నన్నిటిని సంపూర్ణముగ గ్రహించెను.

"వసుమతీ! ఏమి సేయుచుంటివి?" అని పలుకరించెను.

వసుమతికింకను మాటలాడుటకు ధైర్యము కలుగలేదు. ఉత్తర మీయకుండినచో సుందరి యనుమానించుకొనునేమోయని సందేహించి "ఋతురాజు నారాధించుచుంటిని." అనియెను.

"వసంతునిఁ బూజించుచుంటివా?" అని సుందరి ప్రశ్నించెను. వసుమతిగుండె ఝల్లుమనియెను. గద్గదస్వరముతో

"ఔను" అని ప్రత్యుత్తర మిచ్చెను.

"నిన్నే నీవు పూజించుకొనుచుంటివే! తన్మయత్వముచే నీవు వసంతాకృతినిఁ దాల్చితివా యేమి?"

"లేదు. ఆతని నాహృదయాంతరాళమునఁ బూజించి నిర్మాల్య మును నాశిరస్సున ధరించుకొంటిని."

"సుందరీశిరోమణి వగునీకుఁగూడ వసంతుఁడు నెత్తిమోఁదిదేవత యేనా?"

"ఆతఁడు లోకమునకంతకును బ్రేవాఁడేకదా?"

"నీహృదయము!—ఆతనిపైనున్నది కాఁబోలును!"

"అది యెచ్చట నున్నదో నేనెట్లు చెప్పఁగలను?నీకెట్లు తెలియం గలదు?"

"అటులైన నీలో లేదా?"

"లేదని నీవెట్లు నిర్ధారణ చేయఁగలవు?"

"వసంతుఁ డాకర్షించికొని పోమె నని తలంచితిని."

వసుమతిమొగము వెలవెలఁబోయెను "ఏమి! ఈయసందర్భ ప్రలాపములు" అని గద్దించెను.

వయసుచే సుందరి వసుమతికంటెఁబెద్దది. చాలవఱకుఁ బ్రపం చానుభవముగల ప్రౌఢ. అసందర్భముగ మాటలాడునది కాదు. వసు మతిపలుకులకు భయపడలేదు.

"నీమనసు నిలో లేనట్లు నీమొగమే చెప్పుచున్నది," అనియెను.

వసుమతి లేనిధైర్యమును దెచ్చుకొని "మొగముచూచి హృద యమును దెలిసికొను నదృష్టశక్తినీకెట్లు కలిగినది?"అని యుగ్గడించెను.

"అట్టిశక్తి వసంతుఁడు సాక్షాత్కరించి దయతో నాకొసంగి నాఁడు."

"ఆతఁ డిదివఱ కెవ్వరికిని ప్రత్యక్షమైనట్లు వినియుండలేదే?"

"లేకేమి? ఈకన్నులతో మనమే చూచియుంటిమి"

వసుమతిహృదయమున సంతోషమో, మోహమో, ఆనందమో, మఱియేమోకాని యుప్పొంగి పోవుచుండెను. తడఁబాటుతో "నీమాటలయర్థమేమో నాకుఁ దెలియుటలేదు." అనియెను.

"తెలియకున్న నీశుభలేఖఁ జూచికొనుము. తెలిసినదానికిఁ దెలియనిదియుఁ జూచినదానికిఁ జూడనిదియుఁ దెలుపుట నావశ్యము కాదు"

"అయ్యో! తల్లిదండ్రులను బోఁగొట్టుకొని, రాజ్యమును బరుల పాలుగావించి, కఠినహృదయుఁడును, నురాశాపరుఁడును, క్రూరకర్ముఁడును నగుదురాత్మునికృత్రిమాదరణమున నీచెఱసాలలోఁ బడియున్న మనకు శుభలేఖ లెవ్వరియొద్దనుండి వచ్చును?"

"గతము నేలత్రవ్వెదవు? శుభమున కేలశంకించెదవు? ప్రాణబాంధవుఁడు దయతో స్వహస్తమున లిఖియించియొసంగినకమ్మ శుభలేఖగాక మఱేమగును?"

"దిక్కుమాలి పరులపంచలపాలయియున్న మనకుఁ బ్రాణబంధువు లెవ్వరు?"

"విచారముల నన్నిటినిమఱపించి తన్మయత్వమున మహానందముం గూర్చు నివసంతుని నీవేమందువు?"

"అనుట కేమున్నది? అది యాతనిస్వభావము."

"ప్రాణరక్షణ మొనరించి బలవంతముగ హృదయమును హరించినవసంతున కదియును స్వభావగుణమేనా?"

"వసంతుఁ డెవ్వరు?"

"నీప్రాణేశ్వరుఁడే?"

వసుమతికిఁ గోపమువచ్చినది. కన్ను లెఱ్ఱపడలేదు. కనుబొమలు మాత్రము ముడివడినవి. కాని, మొగమునసంతోషచిహ్నములే తోఁచుచున్నవి. విశాలనయనములు బాష్పపూరితములయియున్నవి. కోపము

స్వచ్ఛందమయినది. ధానికి మాయ, ఋర్మ్ము లేదు. సిగ్గుచేఁగలిగిన కోపముమాత్రము కృత్రిమమయినది. కోపమునకును ద్వేషమునకును జాతి వైర మున్నది. లజ్జాకోపముమాత్ర మట్టిదికాదు. అది కేవల మను రాగముయొక్కమాయావేషము. కాని, తఱుచుగా నిరెండుకోపములకును బర్యవసాన మొక్కటియే యగుచుండును. ఇప్పుడు వసుమతికిఁ గలిగినది లజ్జాకోపము. హృదయమును దాఁచికొనుటకై తెచ్చికొనిన దొంగ కోపము. ఇట్టికోపముతోనే వసుమతి,

"ఏమీ! సుకృత్రియకులాలంకారుఁడగు మానపాలునితనయ నెఱుంగక మాటలాడుచున్నావు?" అనియెను.

"వసంతునకుఁగూడ నిట్టియాభిజాత్య ముండుటచేతనే నీకీ లేఖ వ్రాయవలసివచ్చినది."

"ఆతఁడు నాకేల వ్రాయవలయును?"

"నీవాతని ప్రేమించుటచేత—నిన్నాతఁడు ప్రేమించుటచేత"—

"ఓధూర్తురాలా! ఏమి యీ యసత్యాలాపములు! సిగ్గుసిగ్గు!"

"ఇట్టిసిగ్గుచే నెంతకాల మీహృదయమును బరితపింపఁజేసికొందువు?"

"చిరపరిచితిగలనీవు నాహృదయము నిట్లుగాఁ దెలిసికొంటివా? చాలుఁజాలు! ఇంక నిట్టిప్రసంగములఁ గట్టిపెట్టుము. నాకుఁ గోపమువచ్చుచున్నది. నీగౌరవమునకు భంగకరముగ నెట్లు వర్తింపవలసివచ్చునో? నాయెదుట నిలువకుము. అవ్వలికిఁబొమ్ము"

"అట్లేపోయెదను. నీహృదయేశ్వరునిచే లిఖియింపఁబడిన యీ యుత్తరమును నీవొక్కతెవే చదివికొనుము. నీహృదయోత్కర్షమునకు భంగకరముగ నిందుండి నేనేల యడ్డు రావలయును! ఈ లేఖ మూలమున మోహానలపరితప్తము లగుమీయిరుపురిహృదయములును నను

రాగరసాంబుధి నోలలాడి సుఖింపవలయునని యేమో నాకోరిక. అదియే పది వేలు. నీలేఖ నీవే తీసికొనుము. నాకెందులకు?"

వసుమతికి హృదయమును దాఁపఁ దలంపు గలుగుచున్నకొలఁది కోప మధిక మగుచుండెను. ఇప్పుడు పట్టరానికోపము వచ్చెను. పాపము! వసుమతి ముద్దరాలు వెనుకముంగా లాలోచించుకొనలేదు. సుందరి చేతినుండి యుత్తరమును తటాలున లాగికొని చించి పాఱవై చెను.

పదుమూఁడవ ప్రకరణము.

వసుమతి యేమిపని చేసినది? ఎవనికొఱకు తానింతవఱకును దదేకధ్యానముతో నున్నదో, ఎవ్వని మోహనాకారమును తనలోప లను, వెలుపలను, నంతటనుజూచి యానందించుచున్నదో, ఎవ్వని యుదారగుణమునఁ జెలితోఁదాను మహావనమున రక్షింపఁబడినదో, అట్టి ప్రియుని, నట్టిసుందరవిగ్రహుని, నట్టి సుగుణాలంకారుని, సందేశపత్రి కను తునికములోఁ జించి పాఱవైచినదిగదా! ఇది యామె చేయఁదగి నపనియా? వసుమతి మంచిపని చేసినదికాదు. చాలఁ దొందరపడినది. తనగుట్టు బట్టబయలయ్యె ననుమిథ్యాకోపము కల్పించుకొని తానిట్టి కార్యమున కొడిగట్టవచ్చునా? ఇది ముగ్ధాలక్షణము కాఁబోలును! కొందఱు ముద్దగొండ్రు తమహృదయమునఁదున్న మోహావ్యాపార మును ప్రాణసఖులకైనఁ దెలుప సంకోచించుచుందురు. అది తెలియ కుండ నుండుటకై యెన్ని యెత్తులు వేసి పెట్టుకొనుచుందురు. వసుమతియునట్లే ప్రవర్తించినది. వసుమతి యొనరించినయీకార్యమునకయి కోపించి సుందరి యవ్వలికేగెను.

వసుమతి తానిప్పు డేమిచేసినదో తెలిసికొనియెను. మిక్కిలి చిన్న బుచ్చుకొనియె. ఆవేగపడఁజొచ్చెను. శరీర మాపాదమస్తకమును గడగడవడఁకుచున్నది. తనపురోభివృద్ధికి, తనయాశాలతికు, తనమనుగడకు, తనయిహసౌఖ్యమునకు, నిది భంగకరమైననూచన యని డిల్లపోయెను. గుండెలు తటతటఁ గొట్టుకొన నారంభించినవి. హస్తములు తానొనరించిన యకృత్యమును దెలిసికొని కాఁబోలు పల్లవములవలెఁ జలింప నాగెను. ముత్యములవలె శాష్పబిందువులా మెకన్నులనుండి జారి జోట జోట పయ్యెదపైఁ బడుచుండెను. ఈవేగములన్నియు నొక్కమారుగఁ బనిచేయుటచే నామె హృదయమునఁ జాలఁదల్లడిల్లినది. క్రమక్రమముగ నవి యన్నియును సద్దణఁగినవి. కొంతసేపు హృదయమేమియుఁ బనిచేయక స్థాణువువలె నుండెను. ఇట్లు తీశిక మైనపిదప గుండెలతి తీవ్రముగ మరలఁ గొట్టుకొనసాగెను. యోచన లన్నియు నొకదాని వెంట నొకటిగ మరలవచ్చి ప్రవేశించినవి. అవి యన్నియు మరల నామె హృదయమునఁ జాలఁ గ్రుమ్ములాడినవి. వానికిఁబ్రయోజన మేమియుఁ గాన్పింపలేదు. ఈగాలివాన కొంత యడఁగినపిదపఁ బళ్ళాత్తాప మామె లోపలఁ బ్రవేశించెను. ఆమె తనయకృత్యమునకయి పలుమాఱుఁ దన్ను దూషించుకొనియెను. ఈభయవికారములలో మునిఁగిపోయి ముందేమి చేయవలయునో యామెయూహింపఁజాల దయ్యెను. ఒకసారి యాకసము వంకఁ జూచెను. నలుదెసలు పరికించెను. ఆమెదృష్టులు క్రమక్రమముగఁ గ్రిందికి పఱుగెత్తినవి. అందేమున్నది? తాను చించి పాఱవైచిన యుత్తరపుముక్కలున్నవి. అవి కనఁబడినతోడనే యామెకన్నులవెంట మరల శాష్పబిందువులు రాలజొచ్చెను. ఆముక్కలొక్కొక్కటిగ నేరి కనుఁగొనవలయు ననుసంకల్ప మామెకుఁ గలిగెను. ముందునకు వంగెను. కాని, కన్నీళ్లు కార్యమున కవరోధము లయినవి. ఆమె కన్నీళ్లను దుడిచికొని యాలేఖాఖండము లొక్కొక్కటిగఁ దీసి కన్నుల నద్దుకొన

సాగెను. 'ఈముక్కలయందలి లేఖనాంశమును కన్నులు గ్రహింపఁగలుగు ననునాశచేతనో, ప్రియునిహస్తములచే లిఖింపఁబడిన శుభాక్షరములు సీక్షింపఁగలిగితి ననుభక్తిభావముచేతనో, యామె యట్లొనరించి యుండును. దానివాస్తవమును వసుమతి నడిగియే తెలిసికొనవలసి యున్నది.

ఆ లేఖాఖండములు మూఁడునాలుగు క్రిందనుండి తీసి యెడమ చేత నుంచికొనియెను కుడిచేతితో మఱల నొకటిరెండుముక్కల నేరెను. ఇంతలో మలయానిలకుమారుఁడు చెట్లపైనుండి యామె యెడమచేతిపై నిక్షిప్తమాలి యుండున్నఖండముల నెగురఁగొట్టెను. వసుమతి మిగులఁ జీకాకును బొందెను. ఆమెకుఁ జాలఁగోపము వచ్చినది. ఈసమయమున గుడిచేతిపట్టు సడలి యందున్న ముక్కలుగూడ జాఱిపోయినవి. ఆమె కేకువువచ్చెను. ఏమిచేయుటకును దోఁచలేదు. వికలచిత్తులకు చేత నా చేతనజ్ఞానముండనేరదు. పాప మీమె ముగ్ధ. భావసంకల్పము లన్నియుఁ జెదరియున్నవి. మన స్సిమితత కుమరుటలేదు. మలయవాయువుల వంక దలయెత్తి దీనముగఁజూడసాగెను. ఇట్లని ప్రార్థింపఁజొచ్చెను.

''ఓమలయానిలకుమారా! నే నబలను. నానాథునకు మహోపరాధము చేసి వికలచిత్తనై యున్నదానను. నన్ను క్షమింపుము. తాపశాంతిఁ జేసి నన్నూరడించుటకు మారుగ, నాహృదయానలమును మఱింత రవుల్కొల్పుచున్నాఁడ వేమి! నీవు నాజోలికి రాకుము. నీకిదే ప్రొక్కుచున్నదానను''

ఈసందర్భమున నామెకు నిర్మలాకాశము కన్నులఁ బడియెను. హృదయమించుక వికసించెను. అప్పటితనకృత్యమును దలంచికొనియెను. ఆమెకు నవ్వువచ్చెను. ఆమె మోకరించి సద్భావముతో మరల నా లేఖాఖండములఁ దీయ నుద్యమించెను. ఒకటిరెండుముక్కలను దీసెను.

అందేమున్నదో చదువవలయునని యామె కాతురతజనించెను. మడఁగి యున్న యొకతునుకను విచ్చి చూచెను. అందు ''అగ్రహ'' అను నక్షరములుండెను. సంభ్రమవశమున వానిని ''అన్యగ్రహ'' అని యామె చదువుకొనినది. మరలఁ గొన్నిఖండముల విప్పిచూచెను. ఒకదాని యందు ''కిం'' ఉండెను. వేఱొకదానిలో ''ము'' అనునక్షరమున్నది. ఇంకొకటిఁజూచెను. అందు''...వసంత'' అనునక్షరము లున్నవి. ఆమె సంభ్రమానందములతో నాపవిత్రాక్షరము లున్నతునుకను దనకన్నుల కద్దుకొని హృదయముపైఁ జేర్చికొనియెను. మరల మరల ''వసంత వసంత'' యని యనేక పర్యాయములు చదువుకొనియెను. హృదయ మునం దదేరీతిని స్మరించుకొనియెను. అప్పటి యామె హృదయో త్సుక్యమునకు మేరలేదు మరల భూమినుండి మఱిరెండుతునుకలను దీసెను. వానియందు వరుసగ, ''డును'' ''దుడు'' అనునక్షరములు గోచరించుచుండెను. వానియర్థ మామెకుఁ దెలియలేదు. ఇఁకఁ గొన్ని తునుకల నేరెను. వానియందక్షరముల పోలికలుగూడ లేకుండఁబోయినవి. మఱియొకముక్కను దీసి చూచెను. దానిలో ''విష్ణుగుప్త'' యను నక్షరములున్నవి. చూచినతోడనే యామెకు శరీరము వడక నారంభించెను. కన్నులు మిఱుమిట్లు గొనియెను. హస్తపల్లవములు దడదడ కంపించుచుండెను. గుండెలుద్వేగముతోఁ గొట్టుకొనసాగెను. ఆమె కొంచెముమనసును గుదుటఁబెట్టుకొని యింకొకముక్కను విప్పెను. అందు ''ఆపద'' అను భయంకరాక్షరములు కనఁబడినవి. అది చదివి వసుమతి మిక్కిలి భయపడసాగెను. ఆమెకు శరీరమంతయు ముచ్చెమటలతోడను దడిసిపోయినది. మొగము వెలవెల పోయెను. గుండెలలో నేమియో యలజడిపుట్టెను. ఆమె యేమి చేయఁగలదుఁ? ఒకమాట కొకమాట సమన్వయించుట లేదు. ఎట్లో ధైర్యమును

చెచ్చుకొని యింకొకముక్క-ను విప్పి చూచెను. దానిలో "చూడను," అని యుండెను. ఆమె నిశ్చేష్ట యయ్యెను. ఒక్కింతసేపటిలో మరలఁ దెలివితెచ్చికొని మొదటితునుకను విప్పి చూచెను. అందలియక్షరము లను "ఆగ్రహ" అని స్పష్టముగఁ జదువుకొనియెను. "ఏమి! అనుగ్రహము కదా ? ఆగ్రహమా ?" అని యులికిపడియెను. మిక్కిలి తత్తఱపాటును బొందెను. అప్పుడొక లేఖాఖండము గాలితాఁకున నెగిరి యామెపయ్యెద పైఁ బడియెను. దానిందీసి చూచెను. అందు "ప్రియా" లను సంబోధనవాక్య ముండెను. ఆమెహృదయము భగ్గున మండిపోయెను. "హా! జీవితేశ్వరా ! మహాపరాధిని యగునిమంద భాగ్యురాలు నీకు ప్రియురాలె ట్లగును ? ఇంతటిప్రేమాస్పదం బగుసంబోధనమున కిది తగదు, తగదు—ఓయవివేకిని! వసుమతీ! ఆయుదారశీలునకు, నాదయాళునకు, నాపరోపకారపారీణునకు, నివెట్లుప్రియురాల వగుదువు ?" ప్రియా" యని యనిపించుకొనుటకు సిగ్గు తగవు—తగవు—"అని తనయందలి నిరసన భావమునం గలిగినకోపముతో నాముక్క-ను నలిపి పాఱవైచెను. ఇంక మిగిలినవానిని జదువఁగూడదని యామె నిశ్చయించుకొనియెను. తన చేతిలోనున్న యాముక్కలన్నింటినిఁ గ్రమముగఁ బెట్టి చూచెను. వానియందు వరుసగ—

"ఆగ్రహ"
"క్షిం"
"ము"
"వసంత"
"డును"
"దుఁడు"
"విష్ణుగు ప్త"
"ఆపద"
"చూడను"

అసి చదువుకొనియెను వానినలన నేమిబోధపడినది? ఏమియును బోధపడలేదు.హృదయాందోళనము మఱింత హెచ్చయ్యెను, "అయ్యో! ఈయుత్తరమును వివేకహీనవై నేనేల చించిపాఱవైచితి" నని యామె మరలఁ దన్ను మిక్కిలి నిందించుకొన నారంభించెను. ఇంక నేమేమియో యాలోచన లామెమనసునఁ బుట్టినవి. ఏమైన నేమి? చేయి దాటిపోయినది ఇఁక నాయుత్తరముయొక్క సంపూర్ణార్థము నామె గ్రహింపఁజాలదు. "ఆగ్రహము" "ఆపద" విష్ణుగుప్త, ఈ మూఁడును మరలఁ జదివి చూచికొనియెను. ఒక్కనిమిషము తదేక దృష్టితోఁ దలవంచుకొనియెను. ఆమె మొగముపైకెత్తుసరికి కన్ను లెఱ్ఱబడిపోయి యుండెను బాష్పబిందువులు వచ్చుటలేదు. మొగము జేవుర్పించెను. అధరమును గఱచికొనుచు "నాప్రియుని కాపదసేయువా రెవ్వరు? ఆతనియాగ్రహమునకు నాప్రియుఁడు లోఁబడఁజాఁడేనా?" అనుకొనుచుఁ దల పంకింప నారంభించెను మరల నుత్తరక్షణమునకే యీకోపవికారము లన్నియు నామెమొగమునుండి వెడలిపోయినవి. దీనభావమంకురించెను. ఏమిచేయుటకును దోఁచక తలవంచుకొనియెను. క్రింగ మఱి రెండులేఖాఖండములు గాన్పించెను. అందొకదానియందు "చంద్రగుప్త" అనునక్షరము లగపడుచుండెను. దానిని కంపితహస్తముతోఁ నెత్తికొనుచుండఁగా రెండవతునుకగాలితాఁకున నెగిరి సమీపమునఁనే తిరుగఁబడియెను. అందున్న "రక్షణ" యనునక్షరంబులు చదివెను. త్వొందరతో దానినిగూడఁ దీసికొనెను. ఈరెండును జేర్చి చూచుకొనియెను. అందేదియో యర్థము స్ఫురించుచుండెను. ఈయభిప్రాయమువలనఁ బ్రుతునుకలలోనిసారాంశ మామెకు గోచరించినట్లుగనుండెను. ఉత్తర మాపత్సూచకమయిన దని యామె యనుకొనెను. కళవళము మఱింత హెచ్చయ్యెను. ప్రాణేశ్వరునిప్రియలేఖను జూచి

పాఅవయిచిన పాపఫలముసంపూర్ణముగ ననుభవించుచున్నానని యామె యనేకవిధములఁ బశ్చాత్తాపపడఁజొచ్చెను. ఆమెయిట్లు వితర్కించెను.

"అయ్యో! ప్రాణేశ్వరున కేమియాపద రానున్నదో? దిక్కుమాలినజ్ఞాకోపములు నన్ను ప్రేరేచుటచే మూర్ఖచిత్తనై యీయుత్తరము నేనేలచించితి? ఇందలివిషయము లెంతయసరమైనవో గదా! తేళ్ళమిజరుగనున్నదో? ఎట్టియాపదలలో మునిగిపోవ నుంటిమో? ఇందలి యాధార్థ్యము నాకెట్లుతెలియును? ఊరక కీడుశంకించుచున్నానేమో? ఈయాపద విష్ణుగుప్తనకుఁగాఁగూడదా? అట్లేల యనుకొనవలయును? అదియునుసరికాదు. హృగయేశ్వరుఁడు "చూడను" అని స్పష్టముగ వ్రాసియున్నాఁడే. దానికింకొకయర్థమేమియున్నది? ఏవిధముచేతఁ జూచినను మాయాపదనే శంకింపవలసివచ్చుచున్నది కడపటి "చంద్రగుప్త" "రక్షణ" అనుపదములయర్థమే పయిమాపదను ద్యోతపఱచుచున్నది కానియెడలఁ జంద్రగుప్తపరిరక్షణ మేల కావలసియున్నది?" అని వితర్కించుకొనియెను.

మోహ మనేకవికారముల నుదయింపఁ జేయును. ఎట్టిభయకారణమునయినఁ గనఁబడకుండఁ గప్పివేయుచుండును. "ప్రియా" యను వాక్యమామెతలఁపునఁ బొడతెను. "హాప్రియా! వసంతా!" అని పెద్దపెట్టున నెలుఁగెత్తియేడ్చుచు నిలుప్రనఁ గూలఁబడియెను. కలఁతవారియున్న హృదయమున శోకానలము ప్రజ్వలించుటచే నామె శోషిల్లి మూర్ఛ మునింగెను.

పదునాల్గవ ప్రకరణము.

వసుమతి కన్నులు తెఱచుసరి కొకపురుషుఁ డామెకుఁ గనఁబడి యెను. అతనితలపై విచిత్రాలంకారవిలసితం బగుశిరోవేష్టము మెఱయు చుండెను. దానిపై రసాలఫలసదృశాకారము గలపచ్చనితురాయి శోభిల్లుచుండెను. అతనియధరము తాంబూలరాగముచేఁ గెంపువలెఁ బ్రకాశించుచున్నది. అతనిచూపులు సౌమ్యములుగ లేవు కన్ను లెఱ్ఱనై విరోగతాపవ్యధనో, మధుపానమత్తతచేఁ గలిగినఁమూత్తుక్య మునో, వెల్లడిచేయుచుండెను. మొగము సంపూర్ణచంద్రమండలము వలె శీతలప్రకాశితము గాక, నల్లమబ్బుచాయల లోఁగొనుచు నప్పుడె యస్తమింపనైయున్న సూర్యబింబమువలె దుమదుమలాడుచుండెను. కోపవేగమునఁనో, యెడతెగని నిట్టూర్పులసందడినో, ముకుపుటములు తెఱచుగఁ బైకెగురుచుండెను. మణులచేఁ జెక్కఁబడిననల్లని (మొకమల్) యంగరకాయాతనిమోకాళ్లవఱకు వ్రేలాడుచుండెను. దక్షిణకరమున బంగారుతీఁగలచే మనోహరమై సింగపుతలగలదంతపు బెత్త మొప్పులు గులుకుచుండెను అది యాతనిచేతిలోఁ దిన్నఁగ నుండుటలేదు. ఇటు నటు జరగుచుఁ దలక్రిందు లగుచు వాహ్యాళి సేయుచుండెను. దక్షిణకరముయొక్క యనామికయందు, నమూల్యపద్మరాగాలంకృతం బగు సువర్ణాంగుళీయకము తనయుజ్వలకాంతుల నిటునటు ప్రసరింపఁ జేయు చుండెను. అతనిదొడమచేయి మాటిమాటికిని, నూనూఁగుమీసముల పైకిఁ బోవుచు వాని నొకవింతసొగయిలున సవరించుచుండెను.

ఆపురుషుఁడు మెల్లఁగ, నొయ్యారముగ, సగర్వముగ వసు మతిని సమీపించెను. వెనుదిరిగిపోవుట కామెకుఁ బాదము లాడలేదు

ఆమె యేమియును జేయలేక స్థాణువువలె నిలువఁబడిపోయెను. అది యును పురుషునకు విలాసముగనే తోఁచినది. ఆమెముఖమండలమును గాంచినతోడనే పురుషునిత్రిష్ణాకార మంతయు మారిపోయినది. బెబ్బులి గొఱ్ఱెపిల్ల యైనది. సుందరాంగులమనోహర కటాక్షములయం దీమహిమ యున్నదికాఁబోలును! అతఁడు మందహాసముఁ జేసెను. అది యాతని హృదయగాంభీర్యమును వెల్లడిచేయుచుండెను. దీనభావమునుగూడ సూచించుచున్నది ఆంగోకమోహనమూర్తిని సమీపించి యాతఁ డిట్లు చెప్పఁదొడఁగెను.

"మనోహారిణీ! నన్నుఁ జూచి యిట్లేల జంచ్చవడియెదవు? నేను నీకు దాసుఁడను. నీవొక్కసారి నీకోమలశీతలకటాక్షమును బఱగించెద వేని నేనుధన్యుఁడ నగుదును ధన్యతముఁడ నగుదును. నాహృదయ ములో నీవు నాకుఁదెలియకుండ నొకవింతయగ్నిని ప్రవేశపెట్టితివి. అది నన్ను దహించివేయుచున్నది. ఇట్లెన్నాళ్లు భరించి యోర్చుకొని యుండఁగలను? అది ప్రతిరక్తనాళమునందును ప్రవేశించి నాశరీరము నందలిరక్తము నంతను మహాజ్వాలగా మార్చివేసినది. రోమరోమకూప ములనుండి వెలువడునిజ్వాలలు, ఈభూమరహితకీలలు, నాకుభరింపశక్యము గాకుండనున్నవి. ఒకొక్కక్షప్పు డీమంటల యుద్రేకముచే మండిపోవుదు నన్నభయమున నాశరీరమునందలిమస్తుల నన్నిటిని దీసి పాఱవైచు చున్నాఁడను. వీవన లీయగ్నిని మఱింతయభివృద్ధిపఱచునేగాని యెట్లుప శాంతి చేయఁగలవు? ఎట్టియుపచారములచేతను నిది శాంతిఁజెందునది కాదు. నిశీతలాంగపరిరంభణంబునంగాని యిది యుపశమిల్లదు. నీవ్రేమను పటివలెనే యుపేక్ష వహింతువేని ఈయగ్నికీశరీరము సంపూర్ణముగ నాహుతియైపోవును. ఒక్కమారుగ నట్లైపోయిననుబాగుగనేయుండును. నిలువునను నిలువఁబెట్టి తీవ్రాగ్నిశిఖల దరికొల్పి కొంచెముకొంచెముగ మంటఁజేసియుఁ జచ్చిపోకుండ నాశాపాశములను బంధించి యీయయ

బాధలో నిలిపివేసితివే? నీపై నున్న యాశ, నీయందున్న మోహము, నీమీఁదనున్న యనురాగము, నీతోనున్న హృదయసంబంధము, నాప్రాణములకు సంకెలలై బంధించివేయుటచే వానికి గాఢముగఁ జిక్కుఁబడిపోయి నేనీలోకమును విసువఁజాలకున్నాఁడను. అట్లు విడిచిపోవుటయు నాశక్యము కాదు. అదియును నీకటాక్షములోనే యిమిడియున్నది. అదియునుగాక నీరూపగుణములచేఁ గట్టువడిపోయియున్న నాకీక స్వాతంత్ర్య మెక్కడిది? ఈకారణముచేత రత్నగిరిలో నిన్ను వీక్షించి నది మొదలు నేను పొందుచున్న బాధ, నేననుభవించుచున్న నిర్బంధము, లిట్టిదని యిప్పు డెట్లు వాక్కులచేఁ జెప్పఁగలను? ఓమోహనమూర్తీ! ఈ బాధ, యీనిర్బంధము, నీయగ్నిజ్వాలాసంచయము, నీహలాహలము, నీవి యన్నియు నేనెన్నాళ్లుభరించి యుందును? నన్ను గృఁడుము. నీదానుఁడనై పోయితిని. నన్ను వీక్షించుటచే నీకు మహాపాతకము రాఁగలదు. తప్పక రాఁగలదు. ఏమందువు? కోమలపల్లవసదృశమయి, సుధారసపరిపూర్ణమగు నీయధరమును విప్పి, యొక్కవాక్యము.— అమృతతుల్యమగునొక్కపలుకు, వీనులవిందుగ వినిపించి నాయీ మహాగ్నిజ్వాలలఁ జల్లార్పుము.

వసుమతి యీదీనాలాపములను వినియెనో లేదో కాని యామె పెడమొగముఁ బెట్టుకొనియుండెను. పురుషునకుఁ బ్రత్యుత్తర మేమియు నీయలేదు.

ఈపురుషుఁడు విష్ణుభక్తుఁడే యని వానివాక్యములను బట్టి చదువరులు గ్రహించియే యుందురు.

వసుమతి మాట్లాడలేదు. ఆమెకుఁ బదచలనము లేదు. ఆమె హృదయమునకును జలనము లేదు. స్త్రీలహృదయములు చంచలములని స్వభావ మెఱుంగనివారందఱు వాదించుచుందురు. అట్టివార లీసమయమున వసుమతిని జూచియుందురేని, నామెహృదయస్థైర్యమును

గనిపట్టఁగలుగుఁగాని, తప్పకతమవాదమును విడిచి పెట్టఁగలరు. విష్ణు గుప్తుఁ డామెలక్షణములను బరికింపలేదు. ఆమె సిగ్గుచే మాటాడకుండె నని యాతఁడు యోచించుకొని యిట్లనియెను.

"వసుమతీ! ప్రత్యుత్తర మిచ్చుట కింతసిగ్గేల? నీవాక్యామృత మును జిలికి నాహృదయతాపమును జల్లార్పుము"

"నావాక్యము నీకమృతము గాదు" అని పెడ మొగముగనే వసుమతి ప్రత్యుత్తరమిచ్చెను.

విష్ణుగుప్తుఁ డీమాటలకు వెలవెలఁబోయి "కాకేమగును?" అనియెను.

"విషమగును"

"హృదయతాపభరంబునఁ బ్రాణములపైనాశవదలుకొనియున్న నాకిట్టిసమయమున దానివలనఁగూడఁ బ్రయోజనమున్నది"

"పరితాపోపశమనమున నీకు మరణమే శరణ్యమై యున్న యెడల మటియేయుపాయమునకైనఁ గడంగుము. ఊరక నన్నేల నిర్బంధించెదవు?"

"ఇది నిర్బంధమా? నీభార మంతయు నేనే వహించితినే? వివాహ మిషమున నిచే నరికట్టఁబడి నీదాసుఁడనై మెలంగెదనే. రత్నగిరిరాజ పుత్రికను మగధదేశరాజ్ఞిమణిని జేయఁదలంచుట నిర్బంధముగఁ దోఁచు చున్నదా?"

"అట్లైనట్టికైన జరగునని స్వప్నమునఁ గూడఁ దలంపకుము. చంద్రుఁ డెంతరాజై యున్నను, నానిశాచరునిమొగము పద్మినీకాంత యెన్నఁడును జూడఁబోదు"

"అట్లే నీవును నామొగమును జూడఁబోవా?"

"చూడను మున్మాటికినిఁజూడను."

విష్ణుగుప్తునిహృదయము రగులుకొనిపోవుచుండెను ఆతనికి సహింపశక్యముకానికోపము వచ్చెను.

"దుర్గాగ్గురాలా! యువరాజును నివెట్లు తప్పించుకొని పోఁగలవు? నిన్ను నివెట్లుకాపాడుకొనగలవో చూచెదఁగాక!" అనియెను.

"చూచుట కేమున్నది? మనుష్యమాత్రు లొకరినొక రేమియో సాధింతుమనుకొనుట వట్టిభ్రమ. ఈదినమున నున్నవాఁ డేపగపడుట లేదు. దీనికంతకును భగవంతుఁడే కర్త. నీవును నేనును గాము"

"ఏమీ యీప్రగల్భవాక్యములు! ఎట్టిదైవ మడ్డుపడునో నివే చూచెదవు. కన్నులున్న వికదా!"

"నాఁడు నుహూనసమున నిన్నును మమ్మున్నుబాణాపాయమునుండి కాపాడినదైవమే నేఁడును గాపాడును. అప్పుడున్న దైవ మిప్పుడు లేకపోలేదు. వృథాప్రగల్భములతోఁ బ్రయోజన మేమి? అప్పు డెమి చేయఁగలిగితిరో చూచికొనుము"

"నిహృదయము నాకుఁ దెలిసినది. ఎవ్వఁడు నాయాశాకుసుమ మునకు ఝంఝామారుత మగుచున్నాఁడో, ఎవ్వనిమూలమున నా మనోరథసిద్ధుల కంతరాయము లగుచున్నవో, ఎవ్వని నిహృదయమున నిరంతరమును ధ్యాసించుచు ననున్నఁ దృణీకరించుచున్నావో యాతని నీ వింకఁ జూడఁజాలవు. ఆతనినామమునైన వినఁబోవు. సుఖత్రియకుమా రుఁడ నైతినేని నావాక్యము లర్థవంతము లగునుగాక ? దానిఫలము శీఘ్రముగ ననుభవములోనికి వచ్చునుగాక! ఓసిదురాత్మురాలా? నీవేమి చేయఁ గలవు? నీరాజ్యము నారాజ్యమునఁ గలిసినది. నివు నావశమై యుంటివి. నీప్రాణములును నాచేతిలో నున్నవి భాగుగ నాలోచించు కొనుము. అమృతమును బరిత్యజించి హాలాహలమును గ్రోలకుము. కల్పవృక్షమునువీడి కాలినమోఁడు నాశ్రయింపకుము. చింతామణిని బోఁగొట్టుకొని చింతగింజ నేరికొనకుము."

ఇట్లింక నేమియో యుపన్యసింపసాగెను. బెబ్బులిచెంతనున్న హరిణివలె వసుమతి గడగడవడఁకిపోవుచుండెను. ఈవ్యాఘ్రముఖము నుండి యీవలఁబడుట యెట్లని యీమె యాలోచించుకొనసాగెను. ఇంత లో నచటి కెవ్వరో వచ్చుచున్న యలుకుడు వినవచ్చెను. విష్ణుగుప్తుఁడా యలుకుడు నిని కోపఘూర్ణితచిత్తముతో నావలికి దాఁటిపోయెను.

పదునేనవప్రకరణము.

వసుమతిదుఃఖకుఁదనమునకుఁ గోఁగించుకొని వెడలిపోయిన సుందరి యేమైనది? ఆమెకు నిజముగా వసుమత్సైఁ గోపము వచ్చినదా? సుందరికి వసుమతి ప్రాణముకంటెను ప్రియమైనదిగదా! పాపము! వసుమతి కామెకంటె దిక్కెవ్వరున్నారు? అట్టిదో నామెపై సుందరి యెట్లు కోపింపఁగలదు? ముగ్ధలగుయువతీమణులు సిగ్గుచే నేమిచేయ సాహసింపరు? అవి యన్నియును ప్రౌఢప్రియులకుఁ గోపకారణములగునా? వసుమతి తప్పపనియే చేసినది. కటకటా! తరువాత నెంతగాఁ బరితపించినది? ఆపరితాపముం జూచిన మనకే జాలి కలుగుచున్నదే? సుందరి కది యెంతవిచారకరముగ నుండును? సుందరి యిది యంతయును జూడఁబోవునా యని సందేహింతురా? ప్రాణప్రియ యగు నామెను విడిచి సుందరి యొకనిమిషమైన నిలువఁ జాలదని మీరెఱుఁగరు.

సుందరి నేఁడు శచీభవనమున నంతర్భాగమునన్నున్న తనపడక గదిలో నలంకరించుకొనుచున్నది. ఆమెతనశిరముదఁపె న్నెరులముడిసడలించి

సంపెగనూనెచే మెఱుఁగు పెట్టుచున్నది. కురుల నిరుపాయలుగ వక్షఃపార్శ్వంబులకు మలపి మృదులారుణాంగుళులచేఁ జిక్కఁడలించుకొనుచున్నది. నీలమై దట్టముగనున్న కచకలాపమునుండి వెలువడుకోమల నఖంబులు నల్లమబ్బుపైఁ బ్రసరించుమెఱుపుతీఁగలవలెమెఱయుచుండెను. ఆమెబాహువల్లరులు సుదీర్ఘములైనను శిరోజములు చాలఁ బొడవైన వగుటచేఁ జిక్కఁడలించినంతవఱ కెడమచెతితోఁ జేర్చిపట్టుకొని మరలఁదుదవఱకుఁజిక్కఁదీసికొనవలసివచ్చెను. తరువాత దంతపుదువ్వెనతో నదేరీతిగ దువ్వుకొనియెను. నిలువుటద్దమునఁ జూచికొని సమానముగఁ దిన్ననిపాపట దిద్దుకొనియెను. నీలమై,నున్నై, యున్న చికుర మండలమునఘమనిగనిగలాడుచున్న పాపట గీటురాతిపైమెఱయుచున్న సువర్ణరేఖనలె నెప్పు లొలుకుచుండెను. రెండుపాయలుగ నున్నకుంతలములు వెనుక వైచికొని దువ్వెనతో నున్నగ దువ్వికొనియెను. కొంత వఱకు జడనల్లి చుట్టగాఁ జుట్టెను తరువాతఁ దుదవఱకు నల్లి చుట్టగాఁ జుట్టుకొనియెను. తుదిచుట్టుమాత్రము వెన్నున వ్రేలాడ విడిచెను. ఆమె తనశిరంబున సువర్ణాలంకారము లేవియు ధరింపలేదు. జడచుట్టుపై నొకపుష్పమాలిక నలంకరించెను. కస్తూరిచే వదనమండలమును దుడిచి భూమధ్యనుండి పాపటవఱకు సిందూరరేఖ సవరించికొనియెను. విశాలతరళనయనంబులఁ బచ్చకప్పురపుఁగాటుకరేఖఁ దీర్చికొనియెను. కరకమలముల బరిశుభ్రముగఁ గడిగికొని వేఱొకగదిలోనికిఁబోయొక్కింత సేపటిలోఁ దిరిగి యచ్చటికి వచ్చెను. ఆమె యిప్పుడు మునుపటివలె లేదు సాహిత్యరించిన మోహినివలె నున్నది. ఆమె ధరించుకొన్న సరిగ పనిచేసినపచ్చపట్టు చీరకుచ్చెలుమొత్తపూవులవలెఁ బాదములవఱకు వ్రేలాడుచుండెను. అమూల్యరత్నఖచిత మగుగంటలమొలనూలి కాంతులు కన్నుల మిఱుమిట్లు గొలుపుచుండెను. శ్రవణయుగ్మమునం దలంకరించికొన్ననునుగెంపుదమ్మంటుల యరుణకాంతి లేఁజెక్కులకో,

కపోలములందలి కెంజాయలుకర్ణాభరణములకో, మెఱుఁగు వెట్టుచుండెను. ఆమె తనయందమును నిలువుటద్దములోఁ జూచికొనియెను తల యూఁచెను. అప్పు డచ్చట నద్దములోనిప్రతిబింబమును నామెయును దక్క మఱియెవ్వరును లేరు. ఉన్నచో వారును దలనూఁపవలసినదే. విస్మృతి వహింపనలసినదే. ఆమెసౌందర్యము స్త్రీలకుఁగూడ మోహమును గలిగించును. ఆచెలువమునం దొకవిధమైనయాకర్షణశక్తి మిశ్రితమై యున్నది. ఆచూపులలో మత్తుమం దున్నది. ఆమె తనసౌందర్యమునకుఁ ధానే జిచ్చువడియెను. తలవంచుకొని యొక్కనిట్టూర్పు విడిచెను. తన్నుఁ జూచి తానేమోహించుకొన్న దేమో? కాదు. కాదు. ఆమెకుఁ బూర్వవృత్తాంత మేదియో స్ఫురణకు వచ్చియుండును. ఒకటిరెండశ్రుబిందువులు కాటుకకనుఁగొలుకులనుండి జారి పైటపైఁ బడి యంతలో మాయమయ్యెను. ఆమెకు జ్ఞప్తికివచ్చిన విచారసూచకమగు విషయమును దెలిపికొనుటకట నెవ్వరును లేరు. ఆకారణముచే మన కందలియుధార్థము బోధపడినది కాదు. ఆవిలాసవతి కాసమయమున నేదో ప్రియతమమైన నస్తువు తలఁపునఁ బాతియుండును. పాప మిరువదియైదేండ్లపడుచు. ముగ్ధబాలికయగు నిసుమతికొఱకుఁ దనజీవితమును ధారపోయుచున్నది. ఆమెసత్యచరిత్ర మేమో మనకింకను దెలియలేదు.

సుందరి బ్రహ్మచారిణి కాదు. సంపూర్ణయౌవనావస్థలో నభిమానధనమును గాపాడుకొనుచున్న ధైర్యవతి. ఆమెధైర్యమున కెట్టి శూరపురుషులును జాలరు. ఆమె యిప్పు డిట్లేలయలంకరించు కొనుచున్నది చెపుమా! ఆమె యేదో ఘనకార్యమును దలపెట్టినది. సుందరి తలంచినకార్యముల కెన్నఁడును విఘ్నములు కలుగలేదు. ఆమె సౌందర్యవిలాసములే యామెకు విజయమును జేకూర్చుచుండును.

అప్రగల్భ లగు సతీమణులసౌందర్యము దుష్టశ్లోకములవలన వారికిఁ గీడు దెచ్చుచుండును. కాని, ప్రగల్భరాం ద్రగుసుందరులమనోహర

విలాసములు దుష్టలోకమునే మోసము చేయఁగలవు. వారి సౌందర్యమున కెట్టినిశాచరులైనను నిష్టాగరిష్ఠులగుమానులు కావలసినదే వారి కాసౌందర్యము రాజ్యముచంటిది. దానికి లోఁబడి లోక మంతయును చెప్పినట్లు చరియింపఁగలదు పూర్వమాదినారాయణుఁడు జగన్మోహినీ స్వరూపమును దాల్చినప్పు డిట్టిసౌందర్యమే మూఢులగు రాక్షసుల యూద్ధత్యమును జల్లార్చినది.

సుందరిసౌందర్య మట్టిది. ఆమెకు నేఁడు చీకటివేళ నెంటిపాటున నొకయపరిచితస్థలంబునకుఁ బోవలసివచ్చినది. చాలనావశ్యకం బగునొక సందేశమును నడపవలసి వచ్చినది. ప్రాణమానరక్షణసమయంబున నామెకు సౌందర్యమే కవచమువంటిది. ఆమె తనవిలాసములవలన లోకమును వశపఱచుకొనఁగలదు. కేవలసౌందర్యము లోకమోహనకరమైన దగుటచే పాపమబలలు దురాత్ములమూలమునఁ జిక్కులలోఁ బడిపోవు చుందురు. చతురమతి యగుసుందరి కట్టిభయములేదు. ఆమె యొక్కసారి తేరిచూచినా యెట్టిపుష్కలుకుఁడైన నామెకు దాసానుదాసుఁడై పోవలసినదే. సుందరి యిదియంతయు బాగుగ నాలోచించుకొనియే యిప్పు డీజగన్మోహనవ్యవతారమును దాల్చి యుండును.

ఆమె మరల నొకసారి యద్దమువంకఁ జూచెను. విశాలోన్నతవక్షస్థలంబునఁ గంచెలసైఁ బయ్యెద నందముగ సవరించుకొనియెను. తాంబూలరాగాధరమును విరియించి యొక్కచిఱునవ్వు నవ్వెను. ఇవి యన్నియును మోహనమాత్రమున కంగన్యాసములు కాఁబోలును. అనిర్జనస్థలంబున నప్పటివిలాసములను దేవతలైనఁ జూచియుండరు. చూచి నఁబోఁబుప్పువర్షమును గురియించియే యుందురు.

అప్పుడు సూర్యాస్తమయ మైనది. కనుచీఁకటి పడుచుండెను. సుందరి గదితలుపులుమూసి యుద్యానవనమార్గము పట్టెను. ఆమె యెటకుఁబోవఁదలఁచినదో మనకుఁ దెలియదు. ఆవిషయము వసుమతికిఁ

దెలిసియేయుంగున. ఆమె యిప్పుడు విచారసముద్రమున మునిగి యున్నది. మఁతో మాటాడలేదు. సుందరివలననే నిజముఁ దెలిసికొన వలయును. మనమామెవెంటనే పోవుదము.

పదునాఅవప్రకరణము.

ఆకసమునందలిసంజకెంజాయ లుద్యానమునఁ జిగురుగొమ్మలకు వింతకాంతి నెసంగుచుండెను. పక్షులు కివకినగూయుచుఁ జీకటులతోఁ గూడ గుబురుగొమ్మలమాటున నున్నతమగూండ్లలోనికిఁ జేరుకొను చుండెను. అప్పు డొంటిగి నడచుచున్న సుందరి నడుగడుగునకును వసంత కోకిల 'కో' యని పలుకరించుచుండెను. సుందరివెనుదిరిగి చూచుటలేదు. చీఁకటి బాగుగఁ బడకుండఁగనే తిరిగి రావలయునని యామె తలంచెను. ఎట్లు పోవలయునో యామెకుఁ దోఁచుట లేదు. ఉద్యానవనదక్షిణ ద్వారముఁ దెఱచికొని యావీధివెంటనే పోనలయునని యూహించెను. పాప మామెకు గమ్యస్థానమునకుఁ ద్రోవ తెలియదు. ఊరక ముందు నకు నడచుచుండెను.

ఇంతలో నుద్యానమున దక్షిణమువై పునుండి యెవరో వచ్చు చున్నట్లు కనిపెట్టెను. వాఁడెవ్వఁడైయుందు రని యామె వితర్కించు కొనియెను. అప్పుడు పొదలమాటుననుండి వెలువడినవిష్ణుగుప్తుఁ డామె కన్నులఁ బడియెను. సుందరి యేమియును చలింపలేదు. తనమేలి ముసుఁగుసవరించుకొనఁబోయెను కాని, యదిగాలివిసరునఁ జెదరిపోయెను.

ఆసమయమున విష్ణుగుప్తుఁ డామె సుందరవదనారవిందమును సందర్శించెను. ఆతఁడప్పుడు పుష్పాసవపానమత్తతచేఁ దూలుచుండె

వసంతకాలము-ఉద్యానము-చల్లనిసాయంసమయము - నవ యూవనము - సురాపానమత్తత-ఎట్టయెదుట దివ్యసుందరీరూపసందర్శనము-ఇంటిపాటు. ఇవియన్నియును విష్ణుగుప్తునకు మోహోద్రేకమును గలిగించెను.

ఆతఁడు సంభ్రమముతో నామెను సమీపించి "సుందరీ! దివ్య సుందరీ! ఏకాంతముగ నెక్కడకుఁ బోర్చుచున్నావు?" అని తడఁబాటు మాటలతోఁ బలుకరించెను

సుందరి మోహనిహృదయస్థితి నింతలో గ్రహించినది. ఆతనికిఁ బ్రత్యుత్తర మీయకుండ వెడలిపోవులు కనకాశము లేదని తలంచుకొని యెను. ఎటులైనఁదప్పించుకొని పోవలయునని నిశ్చయించుకొనియెను.

"యువరాజా! ఈచీఁకటిలో నీయుద్యానమున కెవ్వరికొఱకు వచ్చితిరి?" అనియెను.

"ఎవ్వరికొఱకా? సుందరికొఱకు దివ్యసుందరికొఱకు"

"అంతటిభాగ్యవతి యగుసుందరి యెవ్వరు?" అని సుందరి తన తరళనయనములనుండి కటాక్షమాలికల నాతనిపైఁ బఱగించెను.

ఆచూపులు విష్ణుగుప్తుని చంచలహృదయమును మఱింత కలఁగించెను. మదవిస్మృతి దానికిఁ దోడుపడియెను.

"సుందరి యెవ్వరా? అది యువరాజు కన్నులలో మెఱయుచున్నది, చూడు! చూడు!" అని కన్ను లరమోడ్చి ముందునకుఁ బడఁబోయెను.

సుందరి కొంచెము తొలఁగి నిలువఁబడియెను. సురాపానమత్తుఁడగునాతనిచేష్ట లన్నియును బాగుగ గ్రహించెను. తనమోహన మంత్రముచే నాతఁడాకర్షింపఁబడినట్లు నిశ్చయించెను. ఒకసారి చిఱునవ్వు నవ్వెను.

విష్ణుగుప్తునకు ద్రేకము కలిగెను. "ఓ! ఓ! వెన్నెలమల్లె పువ్వుల మధుకలశమునందలితళుకు! నవ్వు! ఇంకొకసారినవ్వు! నీవే

సుందరివి. యువరాజునకుఁ దగినసుందరివి. చతురిక మంచిదికాదు. వసుమతి నామాట వినదు. నీవే సుందరివి యువరాజునకుఁ దగిన సుందరివి" అని యామెను సమీపింపఁబోయెను.

సుందరి కొంచెము వెనుకకు జరిగి పయ్యెద సవరించుకొనుచు "ఏమి నాభాగ్యము! యువరాజునకు నాపై నింతదయ వచ్చినది? ఇన్నాళ్లకు నేను మీకన్నులఁ బడితినా?" అనియెను.

విష్ణుగుప్తుఁడు వికటహాసము చేయుచు, "ఇది యెత్తిపొడుపు! సుందరీ! క్షమింపుము." అనియెను.

"ఎట్లు క్షమింపఁగలను? ప్రతిదినమును వచ్చుచు బోవుచుండు మిమ్ములను నేను సాభిప్రాయముగ, సానురాగముగ, నెన్ని సారులు చూచి నను నిప్పటికిఁగాని నాపై దయగలిగినదికాను"

"ఆ! ఆ! దయ నీకా? నాకా?"

"యువరాజునకే దయ యుండవలయును"

"ఔను నేను యువరాజునే. ఇప్పుడు నీకట్టాక్షమునకు లోఁబడి పోయితిని" అని యుద్వేగముతో నామెను బట్టుకొనఁబోయెను.

సుందరి యేమియును భయపడలేదు. ఆమె సౌందర్యవిలాసము లామెను గాపాడఁగల ననునమ్మిక మాత్రమెకుఁ గలదు విష్ణుగుప్తునిమధుపానమత్తతకూడ నామెకు శ్రీరామరక్ష యైనది. ఆమె యాతని దప్పించుకొని,

"రాజకుమారా! సిరిరా మోకాలొడ్డువా రెవ్వరుందురు? అనృష్టవశమున నీయనుగ్రహము లభించినది. కాని, సమయమువాత్రము మంచి దైనదికాదు" అనియెను.

విష్ణుగుప్తుఁడదరిపడి "ఏమి? ఏమి? చెప్పు! భయము లేదు" అనియెను.

"మీరు పుష్పాసవము గ్రోలియున్నారుగదా"

"అయిన నేమి? అది మహారాజలక్షణముకాదా?"

"ఔను. కాని, నాకాపరిమళముగిట్టదు."

"ఓసీ! దీనియం దెంతమహిమ యున్నదో నీకుఁదెలియదు. సురల కమృత మెట్టిదో సుర మనకట్టిది"

"కావచ్చును. మారాజకుటుంబమున కట్టిభాగ్యము కలుగ లేదు"

"కలుగ కేమి? క్రమముగా సభ్యసింపవచ్చును?"

"ఇప్పు డేమైనది? మీస్నేహమువలన నన్ని భాగ్యములును కలుగ వచ్చును"

"అట్లే రమ్ము! ఇంద్రమందిరమునకుఁ బోవుదము రమ్ము"

సుందరి కరకంకణములు సవరించుకొనుచు నిలువఁబడియెను.

"ఏమి? నీకింకను సందేహ మేమి?" అని విష్ణుగుప్తుఁడు హెచ్చరించెను.

"ఏమియును లేదు. ఈసంధ్యాసమయమున మనమిరువురమును బోవుట యెవరైనను చూచినయెడల బాగుగ నుండదు. మీరు మాత్రము మరియాద లెఱుఁగరా"

"అట్లైన నీయభిప్రాయ మేమి?"

"అందఱును నిద్రించినవెనుక—"

"అంతవఱకు నేనిచ్చట నుండినచ్చునా?"

"వలదు, వలదు. ఎవ్వరికి ననుమానము కలుగకూడదు. మీరేగ వచ్చును. నేనొక్క తెనే బయలుదేరి మీకేళిమందిరమునకు—"

"వచ్చెదవా? తప్పక వచ్చెదవా? ఎంతసేపునకు వచ్చెదవు?"

"రెండుజాములకు—"

"అంతవఱకు నీవెర్చి యుండగలవా?"

సుందరికి నవ్వు వచ్చెను. అది లోలోననె యడంచుకొని యొక్క-

నిట్టూర్పు విడిచెను. "ఏమి చేయఁగలము? లోకమునకు వెఱవవలయును" అనియెను.

"సరే! రెండుయామములా! అంతకు దాఁటకుండరావలయును."

"మహాభాగ్యము"

"తప్పక వచ్చెదవా?"

"ఆ. నాయదృష్టదేవతసహాయముగ నొక్కతెను బయలుదేరి వచ్చెదను"

"ఏదీ! ఒట్టుపెట్టికొనుము!"

సుందరి యెడమచేతినడిమివ్రేలు చిటుక్కునవిఱిచి?ఇంతయొట్టు" అనియెను.

ఆయొట్టునందలియర్థమాతనికి బోధపడినంతబోధపడినది అప్పటి యామె విలాసమున కాతఁడు విభ్రాంతుఁ డయ్యెను. ఆతని కామెను విడిచిపోవలయు ననిలేదు. ఆమె మనసునకు భారముగ పరివర్తింప వలయు ననియులేదు. ఆమోహనవిగ్రహము నెదుట నెవ్వఁడు మఱు మాట చెప్పఁగలఁడు?

"సుందరీ! రమ్ము. వేగముగ రమ్ము. ఒట్టు మఱవకుము', అని విష్ణుగుప్తుఁడు వెడలిపోవుచుండెను.

సుందరియేమి యాలోచించుకొన్నదో గాని యాతనిని వెనుకకుఁ బిలిచెను.

"ఆపిలుపుతోడనే యాతఁడు గిరుక్కున మరలి యామెను సమీపించి ''ఏమి?'' అనియెను.

సుందరి ఏమియును మాట్లాడక తల వంచుకొనియెను.

''సందేహ మక్కఱలేదు. నీయుద్దేశ మేమియో చెప్పుము."

"మఱేమియును లేదు. అర్ధరాత్రివేళ ద్వారరక్షకులను దాఁటి-"

"ఇదియా సందేహము! బాగుగనే తోఁచినది" అని యాతఁడించుక యోచించి "ఈముద్రిక నానవాలుగఁజూపుము. నిన్నెవ్వరునభ్యంతరపెట్టరు." అనియుంగరమునెసంగెను.

సుందరి చిఱునవ్వు నవ్వుచు "ఇఁక నిరాతంకముగ రాఁగలను. యువరాజే నాచేతిలోఁ జిక్కిపోయినాఁడు" అనియెను

"అట్లే" అని నవ్వుచు నాతఁడు వెడలెను.

సుందరి యాతని వెంబడించి యుద్యానవనదక్షిణద్వారము వఱకును బోయెను. ఆతఁడాద్వారమును దాఁటిపోయెను. సుందరికి నిర్బంధమును దాఁటిపోయెను. కొంతసేపటి కామెయు నాద్వారమును దాఁటిపోయెను.

పదునేడవ ప్రకరణము.

పాటలీపుత్రము నాగరికతనందినపట్టణములలోనికెల్లఁ బ్రసిద్ధికెక్కినది. ఆనిశాసమయమున వీధిదీపములచే రాజమార్గమంతయును బట్టపగలుగ నుండెను. సుందరి మేనిమునుఁగు సవరించుకొని యారాజమార్గమునుండి పశ్చిమాభిముఖయయి పోవుచుండెను. కాంతిమంతములగుకాచదీపములవెలుతురున నాసుందరితరళనయనంబులు మెఱపుల మెఱయించుచుండెను. జనులనేకులాత్రోవను బోవుచుండిరి. ఆయుధపాణులగురక్షకభటులు నందందుఁ జరియించుచుండిరి. వారిచేతులలోఁ దళతళ మెఱయుచున్న చంద్రహాసములు మిగులఁ బదనైనవి. సుందరి బెళుకుచూపు లంతకంటెను బదనైనవి. ఆమె వారిని జూచి భయపడలేదు. జగజ్జేత యగుమదనునికుసుమాయుధముకడ మఱి యే యిత

రాయుధములు పనిచేయఁగలవు? ఎవ్వరును నామెను బలుకరించుట లేదు ఆజగన్మోహనాకారమును ఱిచ్చవడి చూచుచుండిరి. సుందరి వారిని దప్పించుకొని పోవ్రచుండెను. కొంతదూరము నడచెను.

అటనుండి యుత్తరముగ నొకసందుత్రోవకు మఱలెను. ఆమెకు జంద్రగుప్తుని భవనమున్నదిశమాత్రమే తెలియును గాని త్రోవతెలియదు. తనకుఁ దోఁచినత్రోవను బోవ్రచుండెను. అతివేగముగఁ బోవుచున్న యొకపురుషుఁ డామె కెదురయ్యెను. ఆతఁడామెను చూడలేదు. అట నింకెవ్వరును లేరు సుందరి యాతనిం జూచి "అయ్యా! చంద్రగుప్తభవనమునకు నాకు దారితెలిపెదరా?" అని మెల్లఁగ నడిగెను.

ఆపురుషుఁ డామెమాటలు వినలేదు. తప్పించుకొని పోవుచుండెను. సుందరి గ్రీవాభంగయయియాతనివంకఁ బార్శ్వమునకుజూచెను. ఆతనిపాదముల కాచూపులు సంకెలలయ్యెను. ఆతఁడు మఱిముందడుగు వేయలేదు. ఆతనిహృదయమున నామెయందు గౌరవమో, దయయో, మఱియేమో, యుదయించెను.

"నీవెవ్వరు?" అని యాతఁడు ప్రశ్నించెను.

"నేనెవ్వతెనైననేమి? ఈయాపదకిఁ గ్రొత్తదానను. నాకిప్పుడు చంద్రగుప్తునిదర్శన మవసరముగఁ గావలసియున్నది. ఈయబల కింత మాత్రము సాహాయ్యము చేయలేరా?"

"నాకుఁ జాలఁ దొందరపని యున్నది. నీతో మాటలాడుటకు నాకు సావకాశములేదు."

"తొందరపను లుండవచ్చును. సజ్జనులకుఁ బరోపకారమునకు మించినస్వకార్యము లుండవు. అమను ఆఁడువారిప్రార్థనము నెవ్వరు త్రోసివేయఁజాలుదురు?"

సుందరి పలుకులలో నమృత మున్నది. ఆపురుషుని హృదయ మావాక్యములకుఁ గఱఁగిపోయెను.

"నేనిప్పుడు పోవుచున్న కార్యముకూడ నట్టిదే. ఆపదలలోఁ బడి పోవనున్న యబలల సంరక్షణమునకు నేను త్వరపడవలసి యున్నది"

సుందరి దూరాలోచన కలది. ఆవాక్యములవలన నాతఁడు చంద్రగుప్తునకో, వసంతునకో, సేవకుఁడయియుండునని యామె గ్రహించెను. "అయ్యా! ఆయబల లెవ్వరో తెలిపెదరా?" అని యాతని నడిగెను.

"అదిచాలరహస్యము, చెప్పఁగూడదు."

"విదేశస్థురా లగుసుందరికిఁ దెలిసినంతమాత్రమున మీ రహస్యమునకు భంగము కలుగదు. ఈపట్టణమున నేనెవ్వరి నెఱిఁగి మాటాడఁగలను?"

పురుషునిహృదయము పనిచేయుట లేదు. కలఁగిపోయినది. ఆ పురుషుఁడు సంభ్రమముతో "నీవు సుందరివా?" అని ప్రశ్నించెను.

ఆవాక్యమువలన సుందరి కంతయును దెలిసిపోయినది. పరహృద యములను నశపఱచుకొని రహస్యములను దెలిసికొనుశక్తి యామెకుఁ జాల నున్నది. "అయ్యా! మీరు వసంతునికడ నుద్యోగులా?" అని యాతనిఁగూర్చి ప్రశ్నించెను.

"కాదు చంద్రగుప్తునియొద్ద" అని చెప్పి యాపురుషుఁడు పోఁ బోవుచుండెను.

"అయ్యా! కొంచెముసేపు నిలువుఁడు. మీరాజమానుని భవన మునకు దారి చూపి మఱి పోవచ్చును"

"నేను నిలుచుట కవకాశము లేదు. సుందరి నిటకుఁ దక్షణమ తీసికొనిరావలయు నని మాస్వామి పూజ్ఞ యయినది"

ఆతఁడు తనకొఱకే పోవుచున్నాఁడని సుందరి గ్రహించెను. ఈసంగతియంతయును చంద్రగుప్తున కీవలకే తెలిసియుండునని యనుకొనియెను. పురుషునితో నిట్లనియెను.

"అట్లే చేయవచ్చును. ఈయబలయొకమహాపదనుమునింగి చంద్రగుప్తరక్షణమునకై యూహించుచున్నది. ఈమె ప్రార్థనమునంగీకరించి దయయుంచి యీమెకు మీ ప్రభునిశరణముం గూర్చి పుణ్యము గట్టుకొనుము."

"సరే నేను తిరిగి వచ్చి నిన్నుఁ గొనిపోయెదను. అంతవఱకు నిటనే యుండుము"

"ఈచీఁకటిరేయి నియపరిచితస్థలంబున దీనురాలగు నబల నొంటి విడిచి చనుట నివంటివానికిఁ దగదు. నన్ను నిరపాయస్థలంబునకుఁ జేర్చి మఱిపొమ్ము"

పురుషున కేమియును దోఁచుటలేదు. స్వామికార్య మాతనిఁ ద్వరపెట్టుచుండెను. ఆసుందరి ప్రార్థనమును త్రోసివేసిపోవుటకు మన నుంగీకరించుటలేదు ఆతఁడు సంభ్రమముతో "చంద్రగుప్తుని యానతికి వ్యతిరేకముగ నెవ్వరును జరియింపఁజాలరు. దయయుంచి నన్ను పోనిమ్ము" అనియెను.

"నీకేమియును భయములేదు. నాతో మాటలాడుటకూడ మీ ప్రభున కావశ్యకమే యని యెఱుంగుము. నన్ను మీప్రభునికడకుఁ జేర్చి యింకను నీకు పోవలసియున్న యెడల నప్పుడు పోవచ్చును. మనము మాటలాడినంతసేపైన నాలస్యముకాదు. నన్ను వేగముగఁ గొనిపొమ్ము" అని దీనముగఁ బ్రార్థించెను.

పురుషుఁడు మఱి మాట్లాడలేకపోయెను. "అట్లైన వేగముగ రమ్ము" అని వెనుకకు దారితీసెను.

సుందరి యాతని వెన్నాడి పోవుచుండెను. అవివేకుఁ డగువిష్ణు గుప్తుఁడు తనకు నమ్మినబంటైపోవుటయు, అపరిచితుఁ డగునొకపురు షుఁడు తనకు మార్గదర్శియగుటయు, శుభసూచనములే యని యామె తలంచుకొనియెను. క్రమముగా వారిరువురును జంద్రగుప్తమందిరము కడ కరిగిరి.

అప్పుడు పురుషుఁ డామెను చూచి "ఇదియే మాప్రభునిమంది రము. నీవు లోనికిఁ బొమ్ము" అని చెప్పి తాను ముందునకుఁ బోవు చుండెను.

"అయ్యా! కొంచెమాఁగి మీప్రభునితో నాయాగమనముం గూర్చి తెలిపెదరా?" అని సుందరి ప్రశ్నించెను.

"నేను లోనికిఁ బోఁజాలను అనవసరకార్యములకుం బూనుకొనిన నాకుఁ జిక్కురాఁగలదు"

"మాపైనీపకారముం జేసిననీప్రాణములమీఁదికి వచ్చునట్లు చేయుటకు నెనంగీకరింపఁగలనా? నీకేమియును భయము లేదు. పోయి మీప్రభునితో మనవిచేయుము"

ఆమోహాననుంత్రములనడుమఁ బురుషునిహృదయవిశ్వాస మెట్లు నిలువఁగలుగును? "సరే! ఏమని చెప్పవలయును?" అనియడిగెను.

"సుందరి వచ్చినదని మనవిచేయుము"

"నీవుసుందరివా!" అనిపురుషుఁ డొక్కపరుగున లోనికిఁబోయెను. క్షణములో మరలివచ్చెను. అతనికేమియును చిక్కుకలుగలేదు. "అమ్మా! లోనికి దయచేయుము" అని యామెను దీసికొనిపోయెను.

వారిరువురు నొకభవనమునఁ బ్రవేశించిరి. పురుషుఁడుమాత్ర మట నాఁగక మఱియొకపనిమీఁదఁ బోయెను. అందుఁ బరిమళతైల దీపములు ప్రకాశించుచుండెను.ఒకచోఁ జంద్రగుప్తుఁ డుచితాసనముపైఁ

గూరుచుండి "చాణక్యనీతి"ని బఠియించుచుండెను. నడుమనడుమఁ దలయెత్తి యేమేమో యాలోచించుచుండెను. ఆతని మొగమెట్టివడి పోయెను. నడుమనడుమ నిట్టూర్పులు విడుచుచుండెను. అప్పుడుగూడ నాతనిసౌమ్యవదనము దర్శనీయముయి యుండెను.

సుందరి యాతని సమీపించి చేతులు జోడించి "మహాత్మా! భద్రి మగుఁగాక!" అనిపలికెను.

చంద్రగుప్తుఁడు మొగమెత్తి సుందరివంకఁ జూచి "అమ్మా! రమ్ము! ఇటఁ గూర్చుండుము" అని యొకపీఠమును జూపెను.

సుందరి కూరుచుండలేదు. దీనాననమును వంచి నిలువఁబడి పోయెను.

"మీరు సేనముగ నున్నారా?" అని చంద్రగుప్తుఁడు ప్రశ్నించెను.

"అనాథలమయి యాపత్సముద్రమున మునిఁగిపోవుటకు సంసిద్ధముగ నున్నారము" అని సుందరి కన్నీటితోఁ బ్రత్యుత్తరమిచ్చెను.

"మీరతఱుణవిషయమున వసంతుఁడు నాకు జాబ్రవాసినాఁడు" అని చంద్రగుప్తుఁడు చెప్పెను.

వసంతుఁడు, తనకాపదరానై యున్నదని తెలిసినతోడనే వసుమతి కొకలేఖయుఁ, జంద్రగుప్తున కొకజాబును, వ్రాసిపంపెను. ఆయుత్తరములఁగొనితెచ్చిన పరిచారిక శచీభవనమునకుఁబోయి యటనున్నపరిచారికకు వసుమతియుత్తరము నిసంగి, యతివేగముగ రెండవయుత్తరమును గొనిపోయి చంద్రగుప్తున కొసంగెను సుందరి వసుమతియుత్తరమును తనపరిచారికవలన నంపుకొని మోహలేఖ యని భ్రమించినది. పాపము! వసుమతి సిగ్గుచే నాలేఖను చించినైచినదిగదా!

సుందరి యీవృత్తాంతమంతయును చంద్రగుప్తునకు నివేదించెను విష్ణుగుప్తునిదుష్పరివర్తనమును, వసుమతిదుస్థితియును, గూడ నాతనికి విన్నవించెను.

చంద్రగుప్తుడు చాల జాలిపడియెను. "మీకేమియును భయము లేదు. ముందు వసంతరక్షణమునకై ప్రయత్నింపవలసి యున్నది" అనియెను.

"అయ్యా! ఇప్పుడు వసంతునకుఁ గలిగిన ఆపద యేమో తెలిసినదా?"

"రాజభటులాతని నాకస్మికముగఁ బట్టుకొన్న ట్లాతనియు త్వరమువలనఁ దెలియవచ్చినది. ఆతని కారాబద్ధునిఁ జేసియుందురు"

సుందరి యదరిపడియెను. అంతలో నించుక యాలోచించుకొని యెను. తనయొద్దనున్న యుంగరమును చంద్రగుప్తున కిచ్చెను.

చంద్రగుప్తుడు దాని నందుకొని యాశ్చర్యముతో "ఇదియెట్లు లభించెను?" అని యడిగెను.

సుందరి యావద్వృత్తాంతమునుపూసగ్రుచ్చినట్లుగ వాక్రుచ్చెను.

చంద్రగుప్తుడు సుందరిమనోదార్ఢ్యమునకును, దూరదృష్టికిని సాహసవర్తనమునకును, తనలో మిగుల మెచ్చుకొనియెను.

ఆతని కీసమయమునఁ దానిదివఱకుఁ జదువుచున్న "చాణక్య నీతి" యందలికొన్ని భాగములు జ్ఞప్తికి వచ్చినవి. ఆతఁ డెమియు నధైర్యమును వహింపలేదు. సుందరితో నింకేమియును ముచ్చటింపనులేదు. దిగ్గునఁ దనపీఠమునుండి లేచి తలపై నెకకుల్లాయి నిడుకొని చేత నొఱతోనున్న చంద్రహాసమును ధరించి యెక్కడకో బయలువెడలెను. సుందరిని దనతో రమ్మని సంజ్ఞచేసెను. సుందరి యాసంజ్ఞ నింతలో గ్రహించినది. ఆమహావీరుని జూచినతోడనే యానారీమణికి మరింత ధైర్యము హెచ్చయ్యెను. చంద్రగుప్తుడు ముందును, సుందరి వెనుక

నుగా, బయలువెడలి పోవుచుండిరి. ఆతఁడు క్రోధ మెవ్వరితోడను మాటాడలేదు. ఆతనినిఁ బలుకరింప సాహసించినవా రెవ్వరును లేరు. చంద్రగుప్తుఁ డనిన సేవకులకును, ప్రజలకును గూడ నధికగౌరవము, భక్తియును, గలదు. ఆతనియందలిసుగుణములచేతను, సౌమ్యవర్తనములచేతను, ప్రజ లాతని దేవునిగ భావించుచుందురు. విశేషించి పద్మనందునిక్రూరస్వభావాదులుగూడఁ బ్రజల కీతనియందుఁ దృఢ భక్తివిశ్వాసములను సమకూర్చినవి. చంద్రగుప్తుఁడు కక్ష్యాంతరములు గడచిపోవుచుండెను. సుందరి వానివెనువెంటనే యరుగుచున్నది.

వారిరువురును పట్టణములోఁ బ్రవేశించి, రాజమార్గమునఁ గొంతదూరము నడచిరి. పురమంతయు నింకను జనసంకులముగనే యున్నది. చంద్రగుప్తుఁడు రాజమార్గమును విడిచి పురమునందుఁ బుష్ప మటిదిక్కుగ నున్నయొకనీధివెంట నడవనారంభించెను. ఆవీధిని దాఁటి మఱియొకసందుమార్గమునఁ బడి నడచుచుండెను. ఆతఁడతివేగముగఁ బోవుచుండెను. సుందరియును శ్రమయనక యాతనితోడనే నడచు చున్నది. ఆతఁ డెక్కడికిఁ బోవుచుంనెనో, యెందుల కేగుచుండెనో, సుందరికి గోచరించినదికాదు. ఆమెమనసునం దనేకవిధములైన యోచ నలు పుట్టినవి. ఒకదానికి నామెమనసున స్థిరవసతి దొరకినదికాదు. ఆమె యాలోచించుకొనుచునే యుండెను. నడచుచునే యుండెను. చంద్రగుప్తునిహృదయమునఁగూడ ననేకసంకల్పములు బయలుదేరినవి. వెంటనే వికల్పములై పోవుచున్నవి.

క్రమముగ వారిరువురును పట్టణపుఁజివరకుఁ బోయిరి. అందొక మామిడితోఁట యున్నది. దానిచుట్టును బలమైనప్రాకారము కలదు. అందొకచో ద్వారము కాన్పించుచుండెను. ఆమార్గమున వారిరువురు నందుఁ బ్రవేశించి కొంతదూరము నడచిరి. వారి కొకకుటీరము దృగ్గోచర మైనది. సుందరి యేమి యాలోచించుకొనుటకును, నవ

కాశములేదు. ఆమె హృదయము సంభ్రమించుచుండెను. చంద్ర గుప్తుఁడు కుటీరమున కేవల సుందరిని నిలిపి తాను లోపలికిఁ బోయెను. గడియసేపటివఱకును కుటీరద్వారము మ్రాకున్న సుందరి యట్లే నిలిచి యుండెను. లోపలఁ జంద్రగుప్తుఁ డెవ్వరితోడనో మాట్లాడుచున్నట్లు లామె గ్రహించినది. అవె దృష్టులును, మనసును, నా కుటీరమువైపునకుఁ బరుగులిడుచుండినను, నామె యచటనుండి కదలలేదు. బయలంతయు సంధకారముగానుండెను. దట్టముగ నున్న చెట్లచేత నావనమున నంధ కారము మఱింతదళితమై కన్నును గన్నును గానరాకుండెను. కుటీరము లోనిదీపపుగాంతులుమాత్రము తలుపుసందులోనుండి చిన్నిచిన్ని మెఱపు తీవలవలె నపరిభాగమునం దంతటను ప్రసరించుచున్నవి. అల్లనల్లన బయలువెడలుచున్న పిల్లవాయువ్రలతాకునఁ జెట్లక్రింది యెండుటాకుల మర్మరధ్వనులు వినవచ్చు చుండెను. వనమంతయు జీబురుమనుచు భయంకరముగఁదోఁచుచుండుటచేసుందరిపలుమాఱుసద్దయినదిక్కులకు దృష్టి సారించుచుండెను. ఏమియును గానవచ్చుటలేదు.

"ఈతఁ డీకుటీరమున కేల వచ్చెను? ఇందెవ్వ రున్నారు? ఎవ్వ నితో నీతఁ డింతసేపు మంతనము సేయుచున్నాఁడు? మాకష్ట ముల నీయుదారపురుషుఁడు నిర్వ ర్తించునా? నందునివలన నేమియుప ద్రవము రానున్నదో" ఈమొదలయిన యాలోచనలామెహృదయమున నెక్కసారిగఁ బ్రవేశించి సంకులసన్నాహము సేయుచుండుటచే నామె భాహ్యమును మఱచిపోయెను తానెచ్చట నిలిచియుండెనో యామె యెఱుంగదు.

ఇంతలోఁ గుటీరద్వారము తెఱవఁ బడియెను. ఆకుటీరమందలి దీపపుఁగాంతు లగ్రభాగమునఁ గొంతదూరము వఱకుఁ బ్రసరించు చుండెను. సుందరియొక్కనిమిష మాపెలుతురువంక వీక్షించెను. కుటీర మును వెలువడిపోవుచున్న యొకపురుషాకార మామెకుఁ గనఁబడెను.

ఆతఁడు దారిప్రక్కనే నిలువఁబడియున్న సుందరి నీక్షించి "లోపలి కేగుము" అని చెప్పి వడివడిగ నావనమును దాఁటి పోయెను.

పదునెనిమిదవ ప్రకరణము.

సుందరి కుటీరమునఁ బ్రవేశించెను. అందొకమహాపురుషుఁడు వ్యాఘ్రాసనముపైఁ గూర్చుండి యుండెను. ఆతఁడు సాక్షాత్కరించిన సదాశివునివలెఁ దేజోమూర్తియై యుండెను. మాంసలమై, గుండ్రనగు నాతనికంఠమున రుద్రాక్షనక్షత్రమాలిక మొలచినట్లుండి నిగనిగమెఱయు చుండెను. ఎడమభుజముపై నుండి నక్షత్రములక్రిందుగ దక్షిణపార్శ్వ మునఁ గటిప్రదేశమునఁబడును వ్రేలాడుచున్న మూఁడుపోచలుగల బ్రహ్మ సూత్రమాతనిసన్ననికావియంగరకాలోనుండివెండితీఁగవలెఁ బ్రకాశించు చుండెను. ఆతనిముఖమున బ్రహ్మతేజస్సు మూర్తీభవించి యున్నది.

చంద్రగుప్తుఁ డాతనియెదుటభయభక్తి వినయవినమితుఁడై యొక దర్భాసనమునఁ గూర్చుండియుండెను. క్రమక్రమముగ నాతనిముఖమండ లముక్రోధఘూర్ణితమగుచుండెను. భ్రూములుముడివడియెను. కోపతీవ్రము చేఁగలిగినహృదయతాపమువలనమాటిమాటికిఁ గాలసర్పమువలెఁగోఁచు నేమేమో యాలోచించుచుండెను. బ్రహ్మతేజోనిధి యగునామహా పురుషునిముఖమండలమునఁగూడ నరుణకాంతులున్నవి. అవి స్వాభావిక ములో, కోపతీవ్రముచేఁ గలిగినవ్రో, గ్రహించుటకు సుందరి కవకాశము

లేదు. స్వాభావికముగ సుందరీమణులమెఱుఁగుజెక్కులఁ గెంపుజాయలుండుట కలదు. ఆపురుషునిముఖకాంతు లట్టివికావు. అవి యాతని గంభీరహృదయమునఁగూడి నిముడక పైకిఁ బ్రజ్వలించుచున్న క్రోధానల కీలాజన్యములే కావచ్చును.

సుందరినిఁ గొనికిఁ బిలువనాజ్ఞాపించినది మొద లాపురుషుఁ డెమో యాలోచించుచునే యుండెను. ఇప్పుడు నాతఁ డాధ్యానమునసే యుండెను. సుందరి లోనికిఁ బోయి యూరక నిలువఁబడలేదు. "ఈమహాపురుషుఁ డెవ్వఁడై యుండును?" అని తలంచెను. ఎగుట భయభక్తులతోఁ గూర్చుండియున్న చంద్రగుప్తుని చూచెను. చంద్రగుప్తునంతటివాఁ డీతని దర్శనముం గోరి వచ్చుటనుగూర్చి యాలోచించెను. ఈమహామహుఁ డసాధారణప్రజ్ఞాధురీణుఁడై యుండు నని భావించుకొనియెను. మిగుల భక్తిభావముతో నామహాత్మునకునమస్కరించినిలువఁబడియెను. పురుషుఁ డామెను గూర్చుండు మని సంజ్ఞ చేసెను. కాని, సుందరి యట్లేనిలువఁబడి యుండెను.

పురుషుఁడు తనమొగంబును భార్శ్వమునకు మలపి గంభీరస్వరంబున "నృపతులా! విష్ణుగుప్తుఁ డెంతకృతఘ్నుఁడు! ప్రాణదానమొసఁగిన భక్తునిప్రాణములనే తీయఁజూచుచున్నాఁడు" అనియెను.

సుందరికి గుండె జల్లుమనియెను. ఇంతనఱ కామె వసంతుని ప్రాణాపాయమునుగూర్చి శంకించుకొనియైన నుండలేదు. ఆపురుషుని వాక్యము లామెకు భయంకరములుగఁ దోఁచెను.

అప్పుడు చంద్రగుప్తుఁడు "గురువర్యా! పామునకుఁ బాలుపోసి పెంచుటవలనఁ గలుగులాభము మరణముకంటె వేఱేమున్నది! విష్ణుగుప్తుఁడు యువరాజు; కామాంధుఁడు; ఏమిచేయఁజాలఁడు?" అనియెను.

పురుషుఁడు నిట్టూర్పు విడిచెను. సుందరివంకఁ జూచి "వసుమతీ నీకేమగును!" అనియెను.

ఆగంభీరాకారునియెదుట మాటలాడుటకు సుందరికి జంకుగలి గెను. "ఆమె నాప్రాణమునకుఁ బ్రాణము" అని నెమ్మదిగా బదులు చెప్పెను.

"నీవామెను ప్రాణపదముగఁ బెంచుకొనుచున్నావా?"

"ఔను."

"మీరాజ్యమును, మిమ్మును సంరక్షించుచున్నట్టియు, భావి మగధరాజ్యచక్రవర్తి యగునట్టియు విష్ణుగుప్తున కావసుమతి నిచ్చి యేల పెండ్లిచేయఁగూడదు?"

సుందరికి భయము తోఁచెను. ఆపురుషునియుద్దేశ మామె కనుమానము గలిగించెను. "అయ్యా! మోహమునకు స్వాతంత్ర్యము లేదు. అది సమయానుకూలముగ మార్పు నొందఁజాలదు." అనియెను.

"వసుమతికి, మగధదేశరాజ్ఞీమణి యగుట కిష్టముండదా?"

"లేదు. ఆమెకు వసంతుఁడే రాజ్యము. వసంతుఁడె యామె ప్రాణము. ఆమెకు వసంతునికంటె మఱి ప్రపంచమే లేదు."

"ఆమె కేమి తెలియును? ఆమెకష్టసుఖముల నెఱింగిన వారు బోధించి యామె యభిప్రాయమును మార్చి విష్ణుగుప్తునిపై మఱలింప వచ్చును."

సుందరి వాక్యము లతికష్టముగఁ దోఁచుచుండెను. అయ్యా! ఆమెజీవితము వసంతునిజీవితమం దున్నది. ఆమెహృదయము వసంతుని హృదయమం దున్నది. భగవానుఁ డగుకుసుమాయుధునిచే గూర్చఁ బడిన దంపతుల నెవ్వ రెడఁబాపఁగలరు? నిరంకుశాధికారమును వహించిన విష్ణుగుప్తునికూరభావము వారిప్రాణములహరించిన హరింపఁగలదుగాని వారిహృదయాంతరాళముల నిండి నిబిడీకృతం బగు ననురాగ తేజో లేశము నైన హరింపఁజాలదు" అనియెను.

అనునప్పటికిఁ జంద్రగుప్తుఁడు లయకాలానలునివలె మండిపడుచు "ఏమీ! నాప్రాణమిత్రుఁ డగువసంతున కకారణముగ నపకృతిసేయ సాహసించినదురాత్ముఁడు—— వివేకహీనుఁడు—— మూఢుఁడు—— మరల నాయెదుట నిలువఁబడఁగలఁడా? జీవింపఁగలఁడా? నాభారిం బడిన యాతని నొరుఁ డెవ్వఁడైన రక్షింపఁగలఁడా?" అని కోపాతిరేకమున నూడ లెఱుంగక యొఱనుండి చంద్రహాసమును బెఱికికొని లేవఁబోయెను.

పురుషుఁ డాతని వారించి శాంతవచనములతో "వత్సా! కేవల క్రోధమాత్రమున లాభము లేదు కార్యాలోచనంబునకు శాంతమును, నిదానమును, గావలయును. మనకిప్పుడు బలవద్విరోధము కలిగియున్నది. ఇప్పట్టునమనమూరక విజృంభించుటతగదు. అతిగూఢముగ మెలఁకువతో ధైర్యమును వహించి కఠినప్రయత్నమునఁ గార్యము సాధించుకొన వలయును. మనవిశాఖలునివలన వసంతునిదుస్థితియును, చక్రవర్తిదుర్జయమును వింటిమిగదా! స్వతంత్రస్వతంత్రుఁడగు చక్రవర్తికూడ నీయకార్యము నింతరహస్యముగ నెందులకుఁ జేయుచున్నాఁడో యెఱుఁగవా? రాజకార్యము లెల్లప్పుడు నొక్కరీతిగా సాగిరావు. రాజనీతులు బహువిధము లైనవి. అవి సమయానుకూలముగ మారుచుండును. అసురాత్ములచేతులలోఁ జక్రవర్తిమ్రుదిక యున్నంతవఱకు మనకును, లోకమునకును, నెమ్మది యుండదు. చక్రవర్తి యగుపద్మనందుఁడు పరమ లుబ్ధుఁడు. ఆతనినందనుఁడు పరమమూర్ఖుఁడు. ఇట్టి వారిపరిపాలనమున నెన్ని యకార్యములు పుట్టవు! ఎందఱుసత్పురుషులహృదయములు పరితపింపవు? ఎందఱుమానవతులజీవితములు చలింపవు?" అనియెను.

"మహాత్మా! ఇట్టిదారుణకర్మముల మన మూరక చూచుచుండవలసినదేనా?"

"కాదు. ప్రతీకారము చేయవలసినదే. కోపతీవ్రముచేఁ దొందరపడక నిదానించి శాంతముతోఁ బనిచేయవలయును."

"ప్రాణములమీఁదికి వచ్చుచున్నప్పు డింకను, నుపాధ్యాయ చాణక్యునిహృదయము శాంతిమునే గోరుచున్నదా?"

"తత్తఱపడకుము. మఱేమియును భయములేదు"

సుందరివీనుల కీవాక్యములు సుధాసేచనము లయ్యెను. ఆమె చాణక్యునిలోఁ కాతీతప్రభావమును వినియున్నది. వసుమతితండ్రియగు మానపాలుని కామహాత్ముఁడు ప్రాణమిత్రుఁ డనికూడ నెఱుంగును. ఆ పురుషుఁడే చాణక్యుఁడని తెలిసినవెనుక నామెహృదయమున ధైర్యము నెలకొనియెను.

చంద్రగుప్తుఁ డాతురతతో "ఆర్యా! వసంతరక్షణమున కిప్పు డేమైన నుపాయ మున్నదా?" అనియెను.

"ఉన్నది" అని చాణక్యుఁడు సుందరివంకఁ జూచెను

సుందరి చాణక్యునిపాదములపైఁ దనచూపులు పఱగించుచు నిలువఁబడియెను.

అప్పుడు చాణక్యుఁడు "బిడ్డా! రత్నగిరిరాజ్యమునకును మీకును గలిగినదుస్థితినిగూర్చిచాలవిచారించుచుంటిని. వసుమతికి నీసాహాయ్య మంగరక్షయై యున్నందుల కెంతయు సంతసించితిని" అనియెను.

"మహాత్ము లగుమీహృదయము నాయెడ దయార్ద్రమై యున్నది. మాకష్టము లన్నియును దీరిపోఁగలవని ధైర్యము కలుఁగు చున్నది." అని సుందరి వినయముతోఁ బలికెను.

"యోధాగ్రేసరుఁ డగురాధాకృష్ణవర్మయే యున్నయెడల మాన పాలునితనయ యిట్లు దిక్కుమాలి యుండదు. రత్నగిరిరాజ్యమున కిట్టి గతి కలుగదు. ఆరాధాకృష్ణవర్మ యేమయ్యెనో నీకేమైనఁ దెలిసినదా?" అని చాణక్యుఁడు ప్రశ్నించెను.

సుందరి యప్రగల్భయై యేమియు మాటాడ కూరకుండెను. ఆమె కాతనివృత్తాంత మేమియును తెలియదేమో?

చాణక్యుఁ డిఁక నావిషయమునుగూర్చి ప్రశంసింప లేదు. "పాపము! వసుమతి కెల్లవిధముల నీవే దిక్కుగాఁ గనఁబడుచున్నావు. అబలవగు నీవేమిచేయఁగలవు?" అనియెను.

"మహానుభావా! నేనబల నని సందేహింపకుఁడు. నాప్రాణపదమైనవసుమతికిని, నామెప్రాణ మగునవసంతునకును, మేలుగూర్చుపట్టున నాప్రాణములనైన విడుచుటకు సంసిద్ధముగ నున్నదాననను. ఇప్పట్టున నన్నిట్టికార్యమున నియోగించినను నెఱవేర్చుటకు నాజీవితమును ధార వ్రోసెదను"

"చంఁదలంచుకొన్నశత్రువు నెదిరింపవలసినప్పుడు ప్రాణములపై నాసవదలుకొని పనిచేయవలయునుగాని తప్పించుకొనఁజూచునప్పుడంతటి సాహస మక్కఱలేదు. ఇప్పట్టున ధైర్యమును లాఘనమును జూపి కార్యమును సాధించుకొనవలసియున్నది."

"ఆర్యు లాజ్ఞాపించినట్లే చేయుటకు సంసిద్ధముగ నున్నదాననను.

"ఇది చాల రహస్యముగ జరగవలయును. పూర్వునంఁ బరిమళమువలె నాఁడువారిహృదయమున రహస్యము దాఁగ దని సందేహము కలుగుచున్నది.

"ఆవిషయమున సంశయింపకుఁడు. వసుమతీసంరక్షణమునకై చిరకాలముక్రిందటనే నేను నాయబలాత్వమును వదలుకొంటిని. ఇప్పుడామెప్రాణమును గాపాడుటకయి పౌరుషమునుగూడ వహించెదను."

"భద్రా! నీవట్టిదానవే యగుదువు. ఒకవేళ మనరహస్యము బయలువడుట తటస్థించెనేని అప్పుడుమాత్రము చంపుటకును, బ్రుచ్చుటకును, తెగించి యుండవలయును."

"నే నందులకు ముందే సిద్ధపడి యున్నదాననను"

"అట్లయిన నీకుఁ గొన్నిసంగతు లుపదేశింపవలసి యున్నది. రమ్ము" అని చాణక్యుఁడు వ్యాఘ్రాసనమునుండి లేచెను.

ఆకుటీరమునఁ దుత్తరభాగమునం దొకయఱ యున్నది. అందుఁ జాణక్యునిదేవతార్చనపీఠమున్నది. చాణక్యుఁడును సుందరియు నా యఱలోఁ బ్రవేశించిరి.

ఆపీఠమున కిరువంకలను జాణక్యునిచే ప్రాయఁబడినతాళపత్ర గ్రంథములు లెక్కలేకుండ నున్నవి. అందాతఁడు కొన్ని స్వయముగా రచించినవి. పూర్వపు గ్రంథములు కొన్ని. రాజనీతిని బోధించు గ్రంథములే విస్తారముగా నున్నవి. ఆగ్రంథములయందలి సారాంశములను దనయనుభవముచే గ్రహించి "చాణక్యనీతి" యను నొక గ్రంథము నాతఁడు రచించెను. అది యాదేవతార్చన పీఠమునై నున్నది. ఆగ్రంథ మంతయును జంద్రగుప్తుఁడు కంఠపాఠము చేసినదే. ఆతఁ డెప్పుడు నదే చూచుచుండును. వసంతుఁడు చనువు మానునప్పటి కది సగముమాత్రమే క్షయించియింపఁబడినది. ఆతఁ డంతవఱకే చదివియున్నాఁడు. ఆపీఠమున కెదురుగ సమీపమున రెండుగజములచతురము గల రాతి కట్టడమునైఁ గృష్ణాజినములు పఱుపఁబడి యుండెను ఎంతప్రేమాస్పదులైన నాతనియానతిలేనిదే యాయఱలోనికిఁ బోఁ గూడదు. ఆకారణమునఁ జంద్రగుప్తుఁడిప్పు డచ్చటికిఁ బోలేదు.చాణక్యుఁ డన్ని విద్యలయందుఁ బరిపూర్ణుఁడే. అం దభిమానవిద్య నీతిశాస్త్రము. ఆతనికి మంత్ర శాస్త్రమునందుఁ గూడ నిట్టియభిమానమే కలదని కొంద ఱందురు. ఆతనికి నిలువెల్లమాయయే యనువారుఁగూడఁ గొలఁదిమంది యున్నారు. కావచ్చును. ఆతఁ డెప్పుడు నొక్కరీతిగా నుండఁడు. ఒక్కచోట నివసింపఁడు. కొందఱకుఁ గేవలము క్రూరస్వభావుఁడుగను, మఱికొందఱకుఁ

గేవలదయాస్వరూపుడుగను, దోచుచుండును. ఎల్లపుడును నాతడు సర్వ సముడు కాడు. ఆతనికిగూడ గర్భశత్రువులు కొందఱున్నారు. ఆతని శిష్యులకు లెక్కయే లేదు. వారు సామాన్యులు కారు అయినను వారందఱు నిప్పు డాతనికి శత్రుపూ చేయుచుండుట లేదు. వారివారి పనులలో వారున్నారు శత్రుపక్షమునఁబని సేయుచున్నను, చాణక్యునిశిష్యు లెప్పుడు నాతనికి విధేయులే. ఇది యాతని దయాప్రభావమో, మంత్ర ప్రభావమో, మూఁఢప్రభావమో, మనకుఁ దెలియదు.

సుందరి నిప్పు డాయఱలోని కేలతీసికొనిపోయెనో, యేమిబోధం చెనో, యెవ్వరికిని దెలియ లేదు. చాణక్యునిరహస్యము సముద్రము లోని బడబానలమువంటిది. అది యెన్నఁడును బయలఁబడినట్లు వినియుండ లేదు. అట్లగుటయే తటస్థించెనేని జగత్ప్రళయము కావలసినదే.

కొంతసేపటిలోఁ జాణక్యుఁ డొక్కఁడు నాయఱనుండి యీ వలకు వచ్చెను. సుందరి యేమైనది? ఆతనితో నీవిషయమునుగూర్చి ప్రశ్నించువారెవ్వరు? ఆతఁడు ప్రస్తావింపనివిషయమునుగూర్చి యడుగు టకుఁ జంద్రగుప్తునంతటివాఁడుగూడ సాహసింపలేకపోయెను. ఆతని మొగంబున దృష్టినిల్పి చూచుచు నిలువంబడియెను.

"కుమారా ! నృపలా ! ఇఁక మనపని మిగిలియున్నది." అని చాణక్యుఁడు హెచ్చరించెను

"ఇప్పు డేమిచేయవలయును? చంద్రగుప్తద్వితీయుఁడనై సిద్ధముగా నున్నాఁడను."

కుమారా! సయుక్తికముగఁ దీర్పవలసినకార్యములకు శస్త్రము లక్కఱలేదు"

"ఆర్య్య లాజ్ఞాపించినట్లే"

"రమ్మ్మ. ఇంకను మనకుఁ జాలపను లున్నవి".

అప్పుడాయిరువ్వురును గుటీరములుపులు మూసికొని యానిశా సమయమునఁ బురాభిముఖులై యెటకేనిం బోయిరి.

తలుపులుతీసినప్పుడు, గూలిచే లోపలనున్న దీప మాఱిపోయెను. పాపము! సుందరి వసుమతికాఁ కాఁబోలును! అర్ధరాత్రమునఁ జాణక్కుని యానతి శిరసావహించి అంధకారబంధుర మగు నాకుటీరమున నొంటిగ నిలచి యుండుటకు సహించి యున్నదికాఁబోలును!

పందొమ్మిదవ ప్రకరణము.

ఆకృష్ణపక్షమునందలియర్ధరాత్రమున శ్వేతారుణవర్ణమిశ్రితంబు లగు నస్పష్టచంద్రికలు పాటలీపురభవనంబులకు విశ్రమోద్యానముల నిం చుండెను. చంద్రకాంతమణిసౌధములపై బట్టబైటఁ గుసుమశయ నంబుల మయినుఱుచి నిద్రింపుచున్నవతీమణులమోముఁగు లేఁజెక్కి ళ్లగ్గులకును, నాయరచందమామమొడలినిగ్గులకును, దారతమ్యముఁ గనుంగొన వలసినదే. అయినను మన కిప్పుడు చందమామయందమును, కౌముదీ విలాసమును, వర్ణించుచుండుటకుఁ దీఱిక లేదు. రాత్రి ద్వితీయ యామాంతమునఁ దోఁచుక్షీణచంద్రునివిలాసములఁ జూచుట కెవ్వరు కని పట్టుకొని యుండఁగలరు? విచారమున మునింగియున్న వారును, శోకన బద్ధులయినరకొక్కభటులును, విరహులును, మొదలగు నస్వతంత్రులుదక్క మఱి యెవ్వరానిశీథసమయమున [illegible] నిద్రింప కుందురు? కాదా

గృహారక్షకుల కప్పుడే రెండువంతులు గడచినవి. ఇప్పుడు మూడవవంతు జరగుచున్నది. పాప మాకారాగారమున నొకపురుషుఁడు తలవంచుకొని విచారించుచుండెను. ఆద్వారమునందలి యినుపయూచలనడుమనుండి చంద్రకిరణము లాతనిపైఁ బడుచుండెను. ఆవెన్నెలవెలుతురున నాతఁడెవ్వఁడో మీరానవాలుపట్టి చెప్పలేరు. ఆతని నిదివఱకు మీ రొకటి రెండుసారులు చూచియున్నారు. కాని, యిప్పు డతఁడు మీరు చూచినప్పటియాకారముతో లేఁడు. ఆవిశాలవక్షస్థలంబును, నాకోమలదీర్ఘ బాహుదండంబులును, కంచుకాలంకృతంబులై యుండలేదు. ఆనగు మొగంబున గభీరమందహసకాంతులు స్ఫురించుటలేదు.ఆయుత్తమాంగమున నుష్ణీష మలంకరింపఁబడియుండలేదు. అసంస్కృతంబులగు విశాలకుంతలములు ముడిసడలి చెవరి యొడలిపైఁ గప్పుకొని యున్నవి. కోపతీవ్రతవలనను, హృదయావేగమువలనను, నాతనిముఖమండల ముదయకాలారుణమండలమువలె నెఱ్ఱనై యుండెను. ఆతనికి నిద్రాదేవత యొడమై పోయినది. అదృష్టదేవత యేమైపోయినదో యాతఁ డెఱుఁగఁడు.

ఆతఁడు నిన్నటియుదయమువఱకును నున్నతోద్యోగి యగు రాజబంధుఁడు. ఇప్పుడో కారాబద్ధుఁడగురాజద్రోహి. పాపమాతఁడు వసంతుఁడె.

"ఔరా; ధననందునిపరిపాలన మెంతనిరంకుశముగ నున్నది? అకారణముగ సాధువుల బాధించునాతనిప్రభుత్వ మెంతకాలము నిలువఁగలదు? ఆతని కెన్నఁడు నేను కలనైన నపకారము చేసి యెఱుఁగనే. కూరులకోపమునకుఁ గారణ మెందులకు? ఆతనికి నేను జ్ఞాతినర్గసుతోని వాఁడనుగదా! అదియే కారణ మైయుండవచ్చును. ప్రాణాధికప్రియుండగునందనునిప్రాణములం గాపాడినమహోపకారి కిదియా ప్రత్యుపకారము? ఛీ!కృతఘ్నులకు ధర్మము లతోఁ బనియేమి? పాపము!పులియింటఁ

బడినకురంగాంగనవలె నావసుమతి యూరాక్షసహతకులచేతులఁ బడి యేమి కానున్నచోగదా! ఆలావణ్యరాశి నన్ను మనసారఁ బ్రేమించి యున్నట్లు నాహృదయమే చెప్పుచున్నది. నాఁడామహావనంబున సుందరి వెనుకనుండి నాపైఁ బ్రసరించినదయారస శీతలంబులును, వివేకనిశితంబులును, నపాంగప్రదర్శితంబులును, నగువలపుచూపు లిప్పటికిని నాహృదయమున నాటుకొనియే యున్నవి. కుశలప్రశ్నావసరంబున మోహసూచకంబు లగునామె విలాసచేష్ట లిప్పుడును నాకన్నులయెదుటనే కనఁబడుచున్నవి. శచీభక్షణమున నేను దర్శింపఁబోయిననాఁడు నా ముద్రికామూలమున నానామమును గ్రహించి వెఱగుపడినదియుఁబోలె, చూచుచుఁ దనప్రేమైక కటాక్షంబుల నాపైఁ బఱపించి నన్నాదరించుట నేనెఱుంగనాఁ? అది మఱవఁగలనా? ఆకుసుమకోమలి జగన్మోహనాకారము నాహృదయఫలకమున లిఖింపఁబడియే యున్నది. సెలవుఁ దీసికొనుపట్టున "అయ్యా! తఱచు మీదర్శనముకంటె మాకిఁకఁగోరఁదగినదేమున్నది? అని వచించిన సుందరి పలుకులలో నెంతయర్థమున్నది? ఇఁక మరల నాకాసుందరీమణుల దర్శించుభాగ్యము లభించునా? ఓమోహనాంగీ! ప్రాణప్రియా! వసుమతీ! సుకుమారహృదయ వగునీవీ దురదృష్టవంతు నేల కామించితివి? ధనలుబ్ధుఁడును, దురాశాపీడితుఁడును, నసూయాపరుండు నగుధననందుని కీతఁడు జ్ఞాతివర్గములోనివాఁ డని యెఱుంగవా? ఆతని కుద్యోగినై యున్న వాఁడ నని యైన నెఱుంగవా? పుట్టలోఁ గాపురము సేయువానికి నెమ్మది యెక్కడిది? అయ్యో! ప్రాణేశ్వరీ! ఈయల్పాయుష్మంతునికొఱకు నీచిరజీవితము నేల ధారపోయఁదలంచితివి? నేను మిమ్ముసందర్శించి వెడలిపోవుచుండఁగా నగపడు నంతవఱకు జాలక మార్గములనుండి తొంగితొంగిచూచుచుండుదానవు. అట్టినీవు మరల నాదర్శనమును స్వప్నమునం జేయుచుందువా? ఇనీ!

నేనెంతటి కృతఘ్నుఁడను. అమూల్యధనంబగు హృదయమును నా కొఱకు సంపూర్ణముగ నొసంగిన నిన్నెంతనిర్దయురాలినిగాఁ జూచుచున్నాఁడను? నావియోగము సహింపనినీకు నిద్ర యెట్లువచ్చును?—హా! జీవితేశ్వరీ! విషన్నుఁడ నగునాచే నిదివఱకుఁ బంపఁబడిన లేఖయే నీకు యమలేఖ కాలేదుగద! సుందరి యెమట నుండగాఁ బ్రేగఁ జూచూపైన నాపైఁ బ్రసరించుటకు సిగ్గుపడుచుండునీవు దాసిచేఁ బంపబడినలేఖ నెట్లు చదువఁగలవు? అయ్యో! చదువకున్న నత్యావశ్యకంబు లగునందలివిషయము లెట్లు తెలియును? నీకొఱకు వ్రాయఁబడినలేఖను సుందరి చదువుట కంగీకరింపదే! సుకుమారహృదయ వగు నీ వాలేఖను జదివి ప్రాణములు విడిచినను, సిగ్గుచే జదువఁ లేఖను విడిచినను; నాప్రాణములు విడువవలసియేయున్నది. ప్రియా! నాకొఱకు విచారింపకు మని నీకెవ్వరిచే వార్త నంపను? హృదయేశ్వరీ! ఏమియు నక్కఱలేదు. మనయిరువురిహృదయములు నేకీభవించియున్నవి. ఇరువురి జీవితములు నేకీభవించియున్నవి. ఇరువురికష్టములు నేకీభవించియున్నవి. ప్రాణప్రియుల మగు మన మిరుప్రరము నెక్కరికష్టముల నొకరుచూడకుండ వియోగముచే నిలోకమును విడిచినను, ఒకరిసుఖమొకరిని విడువకుండ సంయోగముచే నీలోకమును మఱచినను, సమానమేయని నిశ్చయించుకొని భవిష్యన్మరణమునకు సంసిద్ధుఁడనైయున్నాఁడను—ప్రాణేశ్వరీ! ఇది యెట్లు? నాకష్టములు మరణముతోఁదీరిగలవు. దురాత్ములచేతిలోఁ బడినయబలవగు నీకు మరణమునకైనను స్వాతంత్ర్యము లేదే ఈరహస్యములు జోపటివఱకు దాఁగిన దాఁగవచ్చునుగాని యింక నెంతకాలము దాఁగును? పాపము బ్రద్దలుకాక మానదు. ప్రాణమిత్రుం డగు చంద్రగుప్తుఁడసాధారణుఁడు. ఆతఁడు శోకాకులుఁడై పోయిననను, నాతనిపలుకు లీరాజ్యమున వేదవాక్యములుగాఁ బరిగణింపఁబడు

బడుచున్నవి. అతఁడు డీరాజ్యమునకుఁ గిరీటములేని సార్వభౌముఁడు. ముద్రికలేని శాసకుఁడు. అఘటనఘటనాసమర్థుఁడగు చాణక్యగురుని ప్రజ్ఞ యద్వితీయము. అట్టిమహాత్ముని శిష్యుఁడనై, యట్టిచంద్రగుప్తుని మిత్రుఁడనై, యుత్తమక్షత్రియవంశజుఁడనై, పౌరుషనంతుఁడనైయున్న నేనుకాలవశంబునఁ గొయ్యబొమ్మవలె నీకారాగృహంబున దొరలాడుచున్నాఁడఁ గదా! హా! కాలమా! నీవెంతకుఁజాలవు" అని, యీరీతిగ నాతఁడు పరితపించుచుండెను.

పాప మాయర్ధరాత్రమునఁ గష్టములలోఁ నున్నయాతని నెవ్వరు పలుకరింతురు? ఎవ్వ రాతని కాలోచనములఁజెప్పుదురు? కాలము గడచిపోవుచున్నది అదియెప్పుడు మొక్కరీతిగనే నడచుచుండును కాని, కష్టములలోఁ నది కదలుచున్నట్లే యుండదు. సుఖానుభవసమయమునఁ గాలము పరుగెత్తుచున్నట్లుండును. వసంతున కిప్పుడు నిమిషములు యుగములుగఁ గడచుచున్నవి చంద్రుఁడప్పు డాకాశగోళమున నాలవ భాగమునందుండి వెలుంగుచుండెను. ముదుకవెన్నెలలు నిరాఘాటముగఁ గారాగారమునఁ బ్రవేశించుచుండెను. ఆవెన్నెల వెలుతురునవాఁడియున్న వసంతునిముఖకమలము విస్పష్టముగ నగపడుచుండెను. రక్షకభటుని చేతిచంద్రహాసమునఁ జంద్రకిరణములు తప్తరజతప్రభల నీనుచుండెను.

వసంతునికన్నులు మూతపడలేదు. కాని, బాహ్యప్రపంచమును మాత్రము చూచుటలేదు ఆతనిదృష్టులు భావనాప్రపంచమునఁ బ్రసరించుచున్నవి. అందుఁ శాటలీపురము లేదు. కారాగృహమునులేదు. అది యుద్ధరంగము. వసంతుఁడు రథమునపైఁ గూర్చుండియుండెను. నెగపై వసుమతి కూర్చుండి గుఱ్ఱముల నడపుచుండెను. ఆతని రథపార్శ్వమునఁ జంద్రగుప్తునిరథమున్నది. వసంతుఁడు విష్ణుగుప్తునితోఁ బాటారాజ్యాదిగఁ బోరాడుచుండెను. ఇంతలో నాతనికి పద్మనందుఁడు

డడ్డము వచ్చెను.వసంతుఁ డాతనితలఁ దెగనఱకుటకుసిద్ధముగ నుండెను. "ఎవరువారు" అను నొకధ్వని యాతనిబాహ్యశ్రవణములఁ బ్రవేశించెను. ఆతనిభావన లన్నియును జెదరిపోయినవి. అప్పుడువసంతుఁడు కారాగార మునను న్న తన్నుఁదాను చూచుకొనియెను. అదరిపడియెను.

ఆతనిహృదయభావములకంతరాయమునుఁ గలిగించినవాఁడు కారా గారరక్షకభటుఁడే. ఎవ్వరో యటకు వచ్చుచున్నట్లువాఁడు కనిపెట్టి యట్లు ప్రశ్నించెను.ఆతని కేమియును బ్రత్యుత్తరము రాలేదు. ఒక్కింత సేపున కచ్చటికి మేలిముసుఁగునైచుకొన్న యొకయువతీమణి వచ్చి నిలిచెను.

"నీవెవ్వతెవు? ఇచ్చటి కీరాత్రిసమయమున నేలవచ్చితివి?" అని రక్షకభటుఁడు ప్రశ్నించెను.

"నేను వసంతునిబందుగురాలను, ఈతనితో నొక్కమాటాడి పోవలయు ననివచ్చితిని" అని యాతరుణి బదులుచెప్పెను.

వసంతుఁ డాకంఠధ్వని నాలకించెను. ఆతని కది చాతకమునకు జలదగర్జనమువలెనే యుండెను.

"నలనుపడదు. రాజాజ్ఞ లేనిదే కారాబద్ధునితో మాటాడఁ గూడదు. పొమ్మ్ము. పాపము, నీవాఁడుదానవ్రగాన నూరకుంటిని. ఇటకుఁ బరు లెవ్వరు వచ్చినను, తల నఱకినైచుటకు మాకు రాజాజ్ఞయైనది" అని భటుఁడు కఠినముగఁ జెప్పెను

"మరణదండమునకు సిద్ధముగనున్న మావసంతునితోఁ గడసారి యొక్కమాటాడి పోవుటకు నాకు రాజాజ్ఞయైనది."

"ఆయుత్తరవు నీయొద్ద నున్నదా" ఏదీ?"

అయబల యొకయుంగరము నాతనికిఁ జూపించెను. భటుఁడు దాని నందికొని వెన్నెలవెలుతురునఁ జూచి కన్నుల కద్దుకొనియెను.

భటుఁడాయుంగరము మరల నామె కిచ్చివైచి "అమ్మా! మాది సేనక జీవనము. రాజాజ్ఞ ననుసరించి యెంతకాఠిన్యమునైన వహింపవలసి యుండును. ఇదియును రాజాజ్ఞయే కదా! నీవు పోయి మాటాడ వచ్చును" అనియెను.

"నాయనా! నీవు చాల మంచివాఁడవు. న్యాయమార్గము నవ లంబించి నాకు మావసంతుని కడసారిసందర్శనమును లభింపఁజేసితివి. సంతోషపూర్వకముగ నేనొసంగుచున్న యీతృణమునుగ్రహింపుము" అనికొన్ని సువర్ణనిష్కముల నాతని కొసంగెను. ఆతఁడానందముతో వాని నందుకొని కొంచెము తొలఁగియుండెను.

ఆస్త్రీ కారాగారద్వారమునొద్దకుఁ జనియెను. ఇనుపయూఁచల నడుమనుండి వెన్నెలవెలుఁగున వసంతునిఁ జూచెను. ఆతఁడప్పుడునిలువఁ బడి యుండెను. ఆస్త్రీ నాతఁడానవాలుపఱ్చెను. ఆమె సుందరియే.

దీనాననుఁడైయున్న వసంతునిఁ జూచి సుందరి నిర్విణ్ణయైయేమియు మాటాడలేకపోయెను. వసంతుఁడేమో మాటాడఁ దలఁచెను గాని దుఃఖవేగమున నాతఁడు నోరెత్తలేకపోయెను. ఒక్కింతసే పిరువురును స్థాణువులవలె నుండిరి.

వసంతుఁడు గద్గదస్వరముతో "వసుమతి సేమముగ నున్నదా?" అనిప్రశ్నించెను.

"ఇంతవఱకు జీవములతో నున్నది?"

"కడసారి నేనంపినయుత్తరమును జదువుకొన్నదా?"

వసంతుఁడు రత్నిణవిషయమే కాకుండ వసుమతికిఁ దనహృదయ మును వెల్లడించుటకుఁగూడనామె కా యుత్తరమువ్రాసియుండును. పాప మామె చదువుకొనలేదని యాతని కెట్లు తెలియును? సుందరి యాయుత్తరమును గూర్చి యేమియును చెప్పఁ దలఁచుకొనలేదు.

"అంతయును దెలిసినది జరిగినదానికయి విచారించుటవలన లాభము లేదు. రాఁబోవుదానినిగూర్చి యాలోచించుకొనవలయును." అనియెను.

"నాకేమియును విచారము లేదు. నాప్రాణప్రియ యగు వసుమతికిఁ జంద్రగుప్తరక్షణము దొరకిన దనుసంగతి వినువఱకును నా హృదయము తహతహ నెందుచున్నది."

"వసుమతి నెవ్వరు రక్షింపఁగలరు? వసంతుఁడె రక్షింపనలయును"

వసంతునినేత్రములు బాష్పపూరితము లయ్యెను. ఒక్కనిట్టూర్పు విడిచి "సుందరీ! అది యెట్లు పొసంగును?" అనియెను.

"అధైర్యము వలదు. ఎప్పుడును చీఁకటిరాత్రులే యుండునా?"

"వసంతునకు వెన్నెలయైనను చీఁకటియైనను నీయొక్కరాత్రియే కదా."

"అమంగళముశాంతించుఁగాక"

"అయ్యో! ఇంకను శుభోదయమునకే యాసించుచున్నావా?"

"ఆశయే కాదు త్రోవటయిదయమె శుభోదయము కాఁగలదు" అని మెల్లఁగఁ బలికెను.

"అది యెట్లు?"

సుందరి యాతనిచెవిలో నేమేమియో చాలసేపు ముచ్చటించెను. క్రమక్రమముగ నాపలుకులు వినుచున్నకొలఁది వసంతునిముఖము వికసించుచుండెను. సుందరి యెల్లనిషయములు నాతనికి నివేదించి యాతనియొద్ద సెలవు గైకొని వచ్చినదారినే వెడలిపోయెను.

ఇరువదియవ ప్రకరణము.

ప్రభాత మగుచున్నది. ప్రభాతవృత్తాంతమును వ్రాయ మాచేయి యాడుట లేదు. ఆప్రభాత మెవ్వరి కుత్సాహజనకముగ నుండును? ఆ మందమలయానిలము లెవ్వరియొడలికి హాయిగ సోకుచుండును? ఆపక్షుల కలకలారావము లెవ్వరిచెవులకు విందుగ వినబడుచుండును? ఆతేజో మూర్తియరుణకాంతులు తమకనుదమ్ముల విప్పి యెవరానందముతో నాలోకింపగలుగుదురు? అయినునియభ్యుదయమున కెవ్వరు ప్రమోద వాహికలో నోలలాడగలుగుదురు? ఎవ్వ రాశయనాగారములనుండి లేచి లోకయాత్రసేయం బ్రయాణోన్ముఖు లగుచుందురు? ఆమ్లానహారో ద్యానకుసుమామోదము లెవ్వరుఘ్రాణేంద్రియములు తనివిదీరగ్రహింప గలుగుదురు? ఆపద్మసరస్సుల నెవ్వరు తిలకింతురు? ఆవికచారవింద సంచారసమ్మదములగు షట్పదములసంగీతము లెవ్వరు విందురు? ఆపల్లవరాగమునకును ప్రభాతకాంతులకును భేద మెవ్వరు కనిపెట్టు దురు? ఆద్వైక్యభావము నెవ్వరు గ్రహింతురు? వసంతునివృత్తాంత మెఱుంగనివారి కివి యన్నియు గోచరించును. వారాలోకింతురు. వారా మోదింతురు. అలజడినొందుచున్న మనముల కివియెవ్వియుఁ గనఁబడవు. మనకు నీనిశోఁ బనియును లేదు. పాప మావసంతుఁడు వధ్యస్థానమునకుఁ దీసికొని పోఁబడుచున్నాఁడు. అక్కడికిఁ బోవుదము రండు.

నాఁడు మహోదయమున ప్రాలికాముఖపద్మ వీక్షణమున వ్యాకోచ భావము నొందియున్న వసంతునివ్వు మొగమెనా యిది? సరోవరమును బాసి వాఁడియున్న పద్మమువలెఁ గళావిహీనమై యిట్లున్న దేమిఁ? నాఁడు పుంభాన్ముఖపుంఖములుగ యోధరక్షణమునకై యలుగులను విడిచిన

వసంతుని దీక్షా బాహుశాఖలేనా యివి? శృంఖలాబద్ధములై యిట్లున్న వేమి? నాఁడు శచీసౌధమున ముద్రిక నిచ్చు నెపమునఁ దనపేరు ప్రకాశము చేసినవసంతుఁడేనాయితఁడు? అప్రగల్భుఁడై యిట్లునడచుచున్నాఁడేమి? ఆహేతువులు మనకుఁ దెలియవు. ఆతఁడు వధ్యస్థానమునకుఁ గొనిపోఁబడుచున్నాఁడు. ఆతనిచేతుల కీనుపసంకెలలు తగుల్పఁబడి యున్నవి. ఇరుపార్శ్వములను వెనుకను ముందును విచ్చుకత్తులతో నున్న తలవరులు నడచుచుండిరి.

వారు నలువురుమాత్రమే యుండిరి. ముందొకయుత్తమాశ్వముపై నొకపురుషుఁడు ఖడ్గహస్తుఁడై యతి భయంకరాకారముతోఁ బోవుచుండెను. ఆతఁడెన్నఁడై యుండునని చదువరులు శంకింపనక్కఱలేదు. ఆతఁడు యువరాజగు విష్ణుగుప్తుఁడు. మహారాజాజ్ఞ సంపూర్ణముగ నెఱవేర్చుటకయి యాతఁడు సంసిద్ధుఁడై వచ్చెను వారందఱును వధ్యస్థానమును బ్రవేశించిరి. ఆస్థానమునకు నలుతట్టుల నాకసముతోఁ నెఱయుచున్న మహానృక్షములు విస్తారముగా నుండెను. ఆచెట్లతోఁపు నడుమ నధ్యశిలయున్నది. విష్ణుగుప్తుఁడు గుఱ్ఱమును దిగెను. రాజాజ్ఞను వసంతునకుఁ జదివి వినిపించెను. ఆతఁడశిరఃఖండనము చేయుటకయి తలవరుల నాజ్ఞ నిచ్చెను నియుక్తదేవతాప్రార్థనముఁ గావించుకొమ్మని వసంతుని హెచ్చరించెను. వసంతుఁడిప్పుడేమని యుత్తర మిచ్చెను? ఆతఁడుభగవద్ధ్యానములోఁ మగ్నుఁడయ్యెనో, యాలోచనాధీనుఁడయ్యెనో, మనము చెప్పలేము. ఒక్కనిమిషము కన్నులు మూసికొనియెను "ధ్యాన మైనదా?" యని విష్ణుగుప్తుఁడు తొందరపెట్టుచుండెను. ఏ కారణముననో సంకెలలు విప్పుటకుమాత్ర మాజ్ఞ నిడలేదు. తలవరులు తమతమకత్తులపదనును సరిచూచుకొనుచు సవరించుకొనుచుండిరి. ఆకత్తులమెఱపులు మృత్యుదేవతాకటాక్షములని కన్నులు తెఱచిన వసంతుఁడు గ్రహించెను. మృత్యుదేవతకు నేఁడు తనపై సంపూర్ణాధికార

వచ్చిన దని యాతఁడు తెలిసికొనియెను. ఈయపమృత్యు దోషము తాననుభవింపవలసినదేనా యని యాతఁడు తలపోసి చూచెను. ఇంతలో మృత్యుంజయుఁ డాతనితలపులో నిల్చెను. ఆర్యచాణక్యుఁడు నడేవిధముగఁగనఁబడియెను.ఆశిప్రనిజటాజూటమునఁ జంద్రుఁ డున్నాఁడు. ఆతఁడు శాలచంద్రుఁడు. చాణక్యునిజటాజూటమునఁ జంద్రుఁడు కాన వచ్చుచుండెను. కాని, యీతఁడు సంపూర్ణకళలచే విరాజిల్లుచుండెను. వానినాతఁడు స్మరింపసాగెను. ఆస్మరణచేనాతని కెక్కడలేనిధైర్యమును వచ్చెను. మృత్యువును దిరస్కరించు గంభీరవాక్యములతో నాతఁడు విష్ణుగుప్తుని జూచి.

"మహారాజు నానేరమును బ్రకటించెనా?" అని యడిగెను.

"అది మేము వినలేదు."

"ఆజ్ఞాపత్రిమునఁ దపరాధము నిర్దేశింపఁబడినదా?"

"లేదు"

"నేరమును బ్రకటింపకుండ దండనమును విధించుట రాజధర్మమగునా?"

"నినేరమును గూర్చి మహారా జెఱుంగును. ఆయన యెఱిగియుండి విధించినయీదండనము ధర్మానుమత మనియే నాయభిప్రాయము."

"నానేరమును విచారణసేయలేదు. దానిని నిర్ధారణ మెట్లు చేసెను?"

"దానినిగూర్చి నీతోముచ్చటింపవలసినపని లేదు.నిన్నద్రోహివి. అందులకుఁ దగినశిక్ష ననుభవించుటకై సిద్ధముగ నుండుము."

ఈముష్కరప్రలాపములు వసంతునకుఁ గోపోద్రేకమును గలిగించినవి. ఆతని మొగ మెఱ్ఱవడియెను. కన్నుల నగ్నికణములు రాలుచుండెను. చేతులు పనిసేయఁబోయినవిగాని శృంఖలాబద్ధములై యుండు

టచే వానికి స్వేచ్ఛ కలిగినదికాదు. ఆతఁడు గంభీరస్వరముతో నిట్లని చెప్పఁదొడంగెను—

"మీ రిచ్చట కాకపోయినను యమునియొద్దనైన దీనికిఁ దగిన సమాధానము చెప్పి తీరనలయును. ఎవ్వరిద్రోహకృత్యములును నచ్చట బట్టబయలు కాకమానవు. జీవులకుఁ దగిన శిక్ష విధించున్యాయాన్యాయదక్షుఁడాతఁడుగాని నివును, నితండ్రియును గారు మనమందఱమాతనియొద్దకుఁ బోవలసినవారమే. నివిప్పుడు నన్నేమో చేయుదువనుభయమునాకావంతయిను లేదు. నేనను విఁపవలసినదానికెప్పుడును సిద్ధముగనే యున్నాఁడను. కాని, తోపు, నీవును నితండ్రియునుగూడ నావలెనే మృత్యుదేవతకు సన్నిహితబాంధవు లైనప్పుడు, నావలెనే వధ్యశిలను గనులఁ జూచునపుడు, నావలెనే మీమీ నేరములను గూర్చి మీకు వినఁబడకుండ నున్నపుడు, మీరెట్టివిచారమునకు లోనగుదురో యోచించుకొనుము. అప్పుడు నివుసమాధానమే చెప్పించుకొనఁ దలఁచెదవేని నాకీసమాధానమును జెప్పి నన్ను వధింపుము. బోనులోనున్న సింగమును వధింపనేవచ్చును. దానివలనఁ గీర్తి రానేరదు. అంతమాత్రమున క్షాత్రమునిలువఁబోదు. పురుషత్వము రాదు. ఐశ్వర్య మనంతమైనదికాదు. సామ్రాజ్యము నిత్యముకాఁబోదు. లోకమున నిట్టివేవియును నిలిచిపోవు ధర్మాధర్మములు రెండే నిలిచిపోవుచున్నవి. దుర్మార్గచింతనము గలవారలకు ధర్మమునందు రుచియుండునని యెవ్వరు చెప్ప సాహసింతురు? వారుసుకృతములకై చూతురని యెవ్వరు నిర్ధారణము చేయఁజూతురు? మన మొక్కఁర ముప్పొంగిన ప్రయోజనము లేదు. మన మహారాజపదవి శాశ్వతమైనదికాదు. తాడిచెట్టు తాను భూలోకకల్పవృక్షము నని మిన్నందుచున్నది. దాని నాశ్రయించినవారిలు బ్రహ్మానందమునే పొందుచున్నా మనుకొనుచున్నారు. కాని, వానియందలి మంచిచెడ్డలు చెప్పుటకు వానికధికారము లేదు. లోక మున్నది.

సజ్జనలోకముచేఁ గొనియాడఁబడినవారిజన్మ మె యుత్తమ మైనది. అది చూచుకొనవలయును. ఈమిన్నంది మిడిసిపడుటలో లాభము లేదుఁ లాభము లేదు. న్యాయమును జూడవలయును. సత్యమును గ్రహింప వలయును. ధర్మమును విడిచి నడవరాదు. ఈనడతలు, నీముష్కర వాక్యములు, నీశాసనములు, నీయధికారములు, నిదఁడనములు, నీముష్కార్యవిజయములు, నిపాపచింతనములుఁ బ్రయోజనకారులు కానేరవు. శస్త్రజీవి శస్త్రముచేతనే మృతిఁ జెఁగును. మోసకృత్యములఁ జేయువాఁడు వానిమూలమునఁనే మృత్యువువాతఁ బడిపోవును. కపట వృత్తి యెప్పుడును శాశ్వతసుఖమును సంపాదింపఁజాలదు. ఇది నిశ్చయము. నిశ్చయము.—"

వసంతుఁ డిదేవిధముగ నుపన్యసించుచుండెను. విష్ణుగుప్తుఁడు దురాగ్రహావేశుఁడై "చూచెదరేల? శిరముత్తరింపుఁడు. తలనఁగుఁడు. రాజాజ్ఞనెఱవేర్పుఁడు." అని తలవరులఁ దొందరపెట్టసాగెను. ఈవాక్యములు వసంతునకు వినఁబడలేదు. వసంతునిధర్మోపన్యాసమును వినుచు నావేశులైయున్నతలవరులకును నీయాజ్ఞ చెవినిబడినదికాదు. వారిహృదయములు కఱఁగి నీరైపోయినవి. ఇఁక వారిచేతులలోనికత్తి లెంతపదనుగా నున్నదేమి? వారిమూఁడ్కులయందు దయాభావ ముదయించినది. వారికత్తులతళతళత్కాంతులలో నిస్సీము క్రూరస్వభావము గోచరించుట లేదు. అవి వారిబుజముల పైఁ గట్ట బ్రావీనవి. విష్ణుగుప్తుఁడిస్సడేమిచేయఁగలఁడు? చాల నలజడినిబొందెను. తానే యాపని నిర్వర్తింపనలయు ననియాతని కొకసంకల్పము కలిగినది. వెంటనే దానికి వికల్పమును గలిగినది. గౌరవలోపమని కాఁబోలును! ఏమియును దోఁచకపిచ్చివానివలెనటునిటు ప్రచారము చేయసాగెను. వసంతుఁ డింకనదేరీతిగ నుపన్యాసము నిచ్చుచుండెను.

ఇంతలో నాప్రదేశమునకుఁ గొందఱుజనులు వచ్చిరి. వారివెనుక మఱికొందఱు వచ్చిరి. ఇంకను గొందఱు వచ్చిరి. వేఱొకకొందఱు గుంపులుగుంపులుగ రాఁజొచ్చిరి. ఎచ్చటఁ జూచిన జనులే. ఏమూలఁ జూచినను జనులగుంపులే. ఇట్లు కొలఁదికాలములోనే యాప్రదేశమంతయును బహుజనాకీర్ణమై పోయినది. వారి కోలాహలము హెచ్చయ్యెను. వీరంద ఱెవ్వరై యుందురు? వసంతుని జూచుటకైవచ్చిన పట్టణవాసు లని తోఁచుచున్నది. అయినచోఁ బట్టణమునం దెచ్చటను నేఁడు వసంతుఁడు శిక్షింపఁ బడు నని ప్రకటించి యుండలేదే. వీరెట్లువచ్చిరి? వసంతుని మరణదండన వృత్తాంతమును గడచినరాత్రి చోణక్యునివలన విని వసంతునియం దభినూనముగలప్రజ లందఱు నిట్లు వచ్చుచుండిరి. విష్ణుగుప్తుఁ డీప్రజాసమూహమును జూచి నివ్వెఱపడ సాగెను. అతఁడు రహస్యముగ వసంతుని జంపింపలయు నని తలంచి యుండును. అట్లుకానియెడల నాతఁ డీప్రజలను జూచి తిచ్చనాటును బొందనేల?.

ప్రజలిసుకవేసిన రాలకుండునట్లుగ నానన మంతయు నాక్రమించిరి. వధ్యస్థానముచుట్టును జుట్టివేసిరి. స్థలము చాలకయో, వసంతుని జూడవలయు ననియో, కొందఱు చెట్లపై కెక్కసాగిరి. కొందఱు ప్రొసికొని ముందునకు వచ్చుచుండిరి. కొంద ఱీదుమ్మృత్యమును జూడలేమని దూరముగనే నిలువఁబడి పోవ్రుచుండిరి. అందఱు నన్నివిధముల మాట్లాడుకొనుచుండుటచే నానన మంతయు గగ్గోలుగ నుండెను. ఒకరిమాట యొకరికిఁ దెలియుట లేదు. చెట్లపై నున్న వా రందఱును గ్రిందనున్న ప్రజల నుద్బోధించుచుండిరి. ప్రజలందఱును గుంపులుగుంపులుగఁ గేకలువేసికొనుచు నావధ్యస్థానమును జుట్టివేయసాగిరి. చేయి మెదపుటకు సందులేదు. కత్తి నెత్తుట యెట్లు? ఊపిరి యాడుటకైన నవకాశము లేదు. ఆజ్ఞ యేమి వినఁబడును? విష్ణుగుప్తుఁ డీప్రజా

సందోహమును జూచి మిక్కిలి భయపడసాగెను. ఆతఁడొకతలవరిని సమీపమునకుఁ బిలిచి యాతనిచెవిలో నేమియో చెప్పెను. వెంటనే యాతఁడు తనచేతనున్నఖడ్గము నక్కె క్రిందఁ బడవైచి యాప్రజలసందు నుండి మెల్లఁగ దారిఁబట్టెను. ఆవేగములోఁ నున్నప్రజ లీతని వీక్షింప లేదు. వీక్షించినను సరకుచేయ లేదు. వానినిగూర్చి యాలోచించుట కాప్రజల కనకాశ మెక్కడిది?

తలవరియేగినకొన్ని నిమిషముల కొకయూనపురుషుఁడొకయు త్త మాశ్వము పై నెక్కి యాజనులనడుమనుండి తప్పించుకొనుచునచ్చు చుండెను. ఈప్రజాసంక్షోభమున కాగుఱ్ఱము బెదరలేదు. దానినాలుగు కాళ్ళయందును, మొగమునందును, శ్వేతచిహ్నములుండెను. అది యశ్వ మునకుఁగల నుంచిలక్షణములలోనొకటి. దీనినేయశ్వశాస్త్రజ్ఞులు "పంచ కళ్యాణి" యని పిలిచెదరు. ఇది మాటలువచ్చినగుఱ్ఱము. కానియెడల నాజనులగుంపులో నెవ్వరిసఁ ద్రొక్కకుండ మెలఁకువతోఁ దప్పించు కొనుచు వేగముగ నెట్లు నడవనేర్చును? మనుష్యులగుం పాయాశ్వికుని వంకఁ జూడసాగెను. భక్తిభావముతోఁ దొలఁగి గుఱ్ఱమునకు దారి నెసంగుచుండెను. ఆపురుషోత్తముని జూచినతోడనే ప్రజలముఖములు వికసించినవి. "న్యాయమును విచారింపుఁడు" అని యాజనమధ్యము నుండి యేకముగానొక్కధ్వని వినఁబడియెను. పురుషుఁడు చేయెత్తి వారి సంభ్రమమును నివారించెను. మాటాడకుండ సంజ్ఞచేతనే యాపని జరిగిపోయినది. జనుల గౌరవభక్తులకుఁ దావైయున్న యీమహాపురు షుఁడు మనచంద్రగుప్తుఁడే. చంద్రగుప్తుని జూచినతోడనే జనులసంభ మాంధకారములు విరిసిపోయినవి. ఆతఁడేమిచేయునో యని ప్రజ లెల్ల నిలువఁబడి చూచుచుండిరి. సందడి కొంత యడఁగినవెనుక చంద్ర గుప్తుఁడు తిన్నఁగ వధ్యస్థానము చెంతకుఁ బోయి యచ్చట గుఱ్ఱమును దిగి విష్ణుగుప్తునిజూచి యిట్లనియెను.

"వసంతుఁ డొనరించినయపరాధ మేమి?"

"ఆదిమహారా జెఱుఁగును"

"నేరమును నిర్ధారణచేయకుండ నికఁదినశిక్ష విధించుట ధర్మవిరుద్ధ మని తలంచెదను"

"ధర్మవిరుద్ధము కాదు. అతనికి విధింపఁబడినశిక్షనుబట్టి యాతఁ డొనరించినది మహాపరాధ మని వెల్లడి యగుచున్నది"

"ఈనేరమున కీశిక్ష యని స్పష్టముగ నెఱింగింపకున్న నాదండ నము ధర్మవిరుద్ధమే యగును"

"ఈతఁడు రాజద్రోహ మొనరించినాఁడు. దానికై యిట్టిదండన మనుభవించుచున్నాఁడు ఇప్పుడు స్పష్టముగఁ దెలిసినదా?

"రాజద్రోహ మనఁగా నెట్టిది?"

"అది మహారాజుచేఁ బ్రకటింపఁబడ లేదు"

"దండనము ప్రకటింపఁబడినదా?"

"ఏల ప్రకటింపఁబడవలయును?"

"ఈనేరమున కీశిక్ష విధింపఁబడిన దని ప్రకటింపఁబడనిచో శిక్ష వలనిలాభ మేమి?"

"అది సామాన్యశాసనము. నిగూఢములగు రాజకార్య విషయ ముల ద్రోహులగువారలను శిక్షించునపుడు నేరములు ప్రకటింపఁబడవు"

"నేరములు విచారింపఁబడునా?"

"అది ప్రభువులచిత్తములో నుండును"

"సర్వస్వతంత్రుఁడగురాజు తన చిత్తవృత్తినే నమ్మి మరణ దండనముల విధించుట ప్రజాద్రోహము కాదా?"

"ఈ చర్చలతోఁ బ్రసక్తి లేదు. రాజాజ్ఞ నెఱవేర్చుటయే ముఖ్యధర్మము"

"నీవే. రాజనఁగా నెట్లుండవలయునో నీకుఁ దెలియునా?"

''తెలియు కేమి? ఇటువంటి స్వామిద్రోహుల యెడల నిట్లే యుండనలయును''

''వసంతుఁడు స్వామిద్రోహి యనియేనా?''

'ఆ! అతనిపక్షమున వచ్చిననిన్నును స్వామిద్రోహివే. ఈ ప్రజలును స్వామిద్రోహులే''

''ప్రజలలో నిందఱు రాజద్రోహులుగాఁ గనఁబడుట కేమి కారణము?''

''బుద్ధిలేక—భయములేక—ప్రాణములపై నాశలేక—''

''నీకా? ప్రజలకా?''

''ఏమీ కండకావరముచే నెడలెక్కుంగక మాటలాడుచున్నావు?''

ఈవాక్యములు చంద్రగుప్తున కసహ్యములుగఁ దోఁచెను. ఇట్టి స్వార్థపరునిపోఁ బ్రసంగించుటవలన నిఁక బ్రయోజనము లేదని యాతఁడు గ్రహించెను. ప్రజ లాతనివాక్యసారమును గ్రహించిపట్టుకని పట్టెను. ప్రజలెల్లఁ జంద్రగుప్తునిమొగమువంకఁ జూచుచు నాతని వాక్కు నుండి యేమి వినఁబడునో యని యుద్రేకించుచుండిరి. చంద్రగుప్తునిహృదయము గంభీరమయినది. అప్పుడొక్కమాఱుగ నెల్లి విధియనై యున్న కోపావేగమును లోలోననె యడంచుకొని ప్రజలపైఁబడ నొక్క సారి దృష్టి సారించెను. ప్రజలచూపులును జంద్రగుప్తునిమీఁదనే యున్నవి. ఈసమయమున విష్ణుగుప్తుఁడు ''నఱకుఁడు. తల తెగ నఱకుఁడు'' అని తలవరులను హెచ్చరించెను. ''వలదు. వలదు. మీ జీవితములపై నాశ గలదేని వసంతునినంకఁగన్నెత్తియు నఁజూడకుఁడు'' అని వారించుచుఁ జంద్రగుప్తుఁ డొక్కయంజలో వధ్యశిల సమీపించెను. తలవరు లూరక చూచుచుండిరి. వా రేమిచేయఁగలరుఁ శాంతమైనధర్మమునందు క్రూరమైనరాజాజ్ఞ యేమియిమ్మని చేయఁజాలుదురు.

ప్రజలకన్ను లన్నియు వసంత చంద్రగుప్తులపై నున్నవి. అప్పుడు విష్ణుగుప్తునిహృదయ మెట్లుండెనో యెవ్వరును జూడలేదు. కోపవేగమునో, భయోద్రేకమునో, యాతఁడు నిలువునను గడగడ వడఁకిపోవుచుండెను తఁవరులు స్మృతి తప్పియుండలేదు. వారిచేతులలోఁ దళతళ మెఱయుచున్న చంద్రహాసములు లేకపోలేదు. అవి చాలఁ బదనైనవే యగును. అయినను వారిహృదయములు మెత్తఁబడిపోయినవి గదా! ఇప్పు డాకత్తు లేమి చేయఁగలవు? విష్ణుగుప్తుఁ డేమిచేయఁగలఁడు?

చంద్రగుప్తుఁడు వసంతునిసంకెలలు విడిచివైచెను. "ఇంకను జూచెదవేమి?" అని హెచ్చరించుచుఁ దనగుఱ్ఱముపై దృష్టి సారించెను. అది చంద్రగుప్తుని హృదయము గ్రహించిన దానినలెనే సకిలించెను. అంతలో మెఱపుమెఱసిన ట్లయ్యెను. ఆజనులసందడినుండి తప్పించుకొని యాగుఱ్ఱు మతివేగముగఁ బోవుచుండెను. అప్పుడు వధ్యస్థానమున వసంతుఁడు లేఁడు. ఇదియంతయు నొకటెప్పపాటుకాలములో జరగుటచే నియదృచ్ఛకృత్యము నందలి యాధార్థ్యము నెవ్వరును గనిపెట్టలేక పోయిరి. వసంతుఁ డాగుఱ్ఱముపై నధివసించియేయుండెను. ఆసమయ మునఁ బ్రజలలోఁ బెద్దకలకలము జనియించెను. జరిగినవిశేషముం దెలిసి కొనుటకై ప్రజ లొకరినొకరు త్రోసికొని ముందునకు వచ్చుచుండిరి. కొందఱు చెట్లకొమ్మలనుండి క్రింది కుఱుకుచుండిరి. కొందఱు విష్ణు గుప్తునిపైఁ బడఁజూచుచుండిరి. వసంతునిమరణము తప్పిపోయిన దని యందఱును దెలిసికొనిరి. ఆయానందమునఁ గరతాళధ్వనులు సేయుచుఁ జంద్రగుప్తునిఁ గీర్తించుచుండిరి.

ఆసందడిలోనున్న వారికి భయంకరకోలాహలధ్వను లేవియు వినఁ బడకుం. ఒక్కింతసేపటిలో వారిచుట్టు నొక ప్రచండసైన్యము ముట్ట డింపఁబడియుండెను. నాలుగు మూలలనుండియును వాఁడి నారసములు

గుంపులుగుంపులుగఁ బైకివచ్చి పడుచుండెను. అబాణాఘాతములచేఁ గొందఱుప్రాణములనువిడుచుచుండిరి. కొందఱకుగాయములగుచుండెను. నిరాయుధులగునాప్రజ లందఱు నాసేనాసాగరమున మునిఁగిపోవలసిన వారై యుండిరి. అప్పు డతిభయంకరంబులగు కేకలతోడను, ధిక్కార ములతోడను, కోలాహలముగ నుండెను. ఆసమయమునఁ జంద్ర గుప్తుఁ డైశ్వర్యవశ్యశిల నారోహించి, సైనికులవంకఁ జేయెత్తి నిలువఁబడి యెను. చంద్రగుప్తునిముఖమండలమున లోకమోహనకరం బగుదివ్య తేజ మేగో యిమిడి యున్నది. తోడనే బాణపాత మాఁగిపోయెను.

అప్పుడు చంద్రగుప్తుఁడు మేఘగంభీరభాషణములతో, "ఓ సైనికులారా! నిరాయుధు లగునిందఱుప్రజల నకారణముగ నేల వధియించెదరు? నాకును, లోకమునకును, బరమేశ్వరునకును, న్యాయమనితోఁచినయీకార్యమునకుఁ గడంగినవాఁడను నేను. ప్రేక్షకు లగునీప్రజల కెంతమాత్రము నిందు నిమిత్తములేదు. దయాపూర్వక ముగ, ధర్మబుద్ధితో, బహిరంగముగ నేనొనరించిన యీకార్యము శాసనవిరుద్ధ మనుమిషచే మహారాజు నేరముగఁ బరిగణించునేని యీ విషయమై న్యాయస్థానమునఁ బ్రత్యుత్తర మిచ్చుటకు నేనే బాధ్యుఁడనై యున్నాఁడను. అక్కతాస్త్రులగుప్రజలు మీకేమియు నపాయము కలిగించువారు కారు. కలిగింపను లేరు. ఈనిర్దోషులను విడిచిపోనిండు. వలయునేని నేను మీతో వచ్చెదను" అనిపలికెను.

ఆవాక్యములు విన్నతోడనే సైనికు లందఱును నిశ్చేష్టులై నిలువఁబడిపోయిరి. ప్రజలు చెల్లాచెదరై పోయిరి.

యువరాజగువిష్ణుగుప్తుఁడు చంద్రగుప్తునిపై నేరమును మోపి మూతనిఁగొనిరావలయు ననిసైనికుల కాజ్ఞాపించి నగరున కరిగెను. తోడనే సైనికు లాతనిఁబట్టి తీసికొనిపోయిరి.

ఇరువదియొకటవ ప్రకరణము.

నిన్నటిరాత్రి యంతయును విష్ణుగుప్తుని కన్నులలోనే గడచిపోయెను. సుందరియాతని నమ్మించి మోసముచేయుటచే నర్ధరాత్రమున శచీభవన మున కాతఁడుపోయిచూచునరికి వసుమతిగాని, సుందరిగాని యందగపడ లేదు. ఆభవనముకొల్లగొట్టఁబడినకోటవలెఁదెఱవఁబడినద్వారములుగలిగి యుండెను. ఆతఁడప్పుడు నిలువున నిర్జీవుపోయెను. మధుపానమత్తుఁడయి తాను సుందరి కొసంగిన ముద్రికామూలమున వారు నిరాతంకముగఁ బాటలీపుత్రపట్టణ కవకాశము గలిగినదని యాతఁడుచాల విచారించెను. వసుమతి ప్రేమతోలిఖించుకొన్న వసంతాంగుళీయకముద్రణపత్రికమును చతురికమూలమున సంపాదించి, దానిపై నసత్యలేఖనస్ఫుటించి కపట మార్గమునఁ దండ్రిని నమ్మించి చేసినప్రయత్నమంతయును విఫలమై నందులకుఁ జింతించెను. చేఁజిక్కిన వసంతుఁడు చంద్రగుప్తసాహాయ్యమునఁ దప్పించుకొనిపోయినందులకుఁ జాలఁ దల్లడిల్లుచుండెను. ఎట్టులైన వసంతుఁడు వసుమతిం గలిసికొని యామె సహాయంచికొని పాటలీపుత్రమునఁ డని యాతఁడు లోలోనఁ గుందుచుండెను. వసుమతి యికఁ దనకు దక్కదని యాతఁడు నిరాశఁ జెందుచుండెను. చంద్రగుప్తునిబట్టుకొనుటచే ప్రజలలోఁ గలుగుచున్న యల్లకల్లోలమునుగూర్చి యాలోచించు చున్న పద్మనందుఁ డీవిషయముంగూర్చి యంతగాఁ గలుగఁజేసికొన కుండుట కాతఁడు మిగులఁ బరితపించుచుండెను. వసుమతి యెట్లు తప్పించు కొని పోయినదో యాతనికి బోధపడలేదు.

ఈసంక్షోభ మడఁగువఱకును వసుమతిని పద్మనందుఁడే దాఁచి యుంచెనో, లేక యీగందరగోళములో నామెయే తప్పించుకొని యెటకేనియుం బోయినదో, యెవ్వరికిని దెలియ లేదు.

విష్ణుగుప్తునిహృదయము చలించిపోయినది. వసుమతీవసంతుల వెదుకఁబంపినసేవకు లేవంకనుండి యేమివార్తలు దెచ్చెదరో యని యాతఁడు పురము నలుదెసలఁ జరించుచుండెను. ఆకల్లోలసమయమున నెంటరిగఁ జరింపఁగూడ దనువివేకమైన నాతనికిఁ గలుగ లేదు. పురము నలువంకలను పిచ్చివానివలెఁ దిరుగుచునేయుండెను. క్రమముగ నాతఁడు చాణక్యునియాశ్రమముకడ కరిగెను.

రేయెల్ల నిదుర లేకపోవుటచేతను, హృదయమునందలివిచారముల చేతను, విష్ణుగుప్తునికన్ను లెఱ్ఱఁబడిపోయెను. ఆసంధ్యాసమయమునఁ బర్ణశాలాద్వారమునఁగూడ నెఱ్ఱనికాంతులే మోఁచుచున్నవి. సూర్యుఁడిప్పుడు తనతేజమునగ్నియం దిడి యస్తమించుచున్నాఁడు. అటఁ జాణక్యకుటీరమునఁ బ్రజ్వలించుచున్న యగ్నిహోత్రునియందును రక్తకాంతులే మోఁచుచుండెను. ఆయాశ్రమద్వారమున నేదో పనిచేయుచున్న చాణక్యునికన్నులును నెఱ్ఱగానే కనఁబడుచున్నవి. ఆతనిమొగము కూడ నెఱ్ఱవడియున్నది. ఇన్నియును గూఢచారిచే నిప్పు డెల్లెడను సంధ్యారాగమే మోఁచుచుండెను.

అప్పుడు చాణక్యుఁడు తప్పగోలచె నొకదర్భమూలమును ద్రవ్వుచుండెను ఆగ్రామాధిపతియగు పలువురునడచుదారిప్రక్క నున్నది. ఆతఁడిటు నటు చూడక, యారి బిట్టుబిగిసికొనిపోయియున్న యానేలను గష్టముతోఁ ద్రవ్వుచుండెను.

విష్ణుగుప్తుఁ డాబ్రాహ్మణుని చేష్టలఁ జూచి యచ్చట నిలువఁబడిపోయెను.

"ఆర్యా! ఏమిచేయుచున్నారు?" అని ప్రశ్నించెను.

చాణక్యుఁడుకోపముతో "మూలచ్ఛేదముఁ జేయుచున్నాఁడను" అని యుత్తరమిచ్చెను. దానియర్థమును మందుఁడగు విష్ణుగుప్తుఁడు తెలిసికొనలేదు

"దేనిని?" అని మరలఁ బ్రశ్నించెను.

"ఈదర్భను. అంకురసహితముగ"

"ఎందుచేత?"

"ఇది నాశాలిలో గ్రుచ్చుకొనినది. దీని నిచ్చట నుంచిన నాకే కాదు. లోకులకుఁగూడఁ జాల నపాయమును దీసికొని రాఁగలదు"

"దీనితల నఱకినైచినఁ జాలదా?అంతశ్రమపడి పెల్లగింప నేల?"

"దీనిని సమూలగ నాశనము చేయవలయును లేనిచో నెన్నటికైన మరల నంకురింపఁగలదు"

"ప్రకృతిసిద్ధమగు నంకురమునే నశియింపఁ జేయుట కష్టము కాదా?"

"సాధ్యమయినంతవఱ కష్టంచేయవలయును. నసుమతికి దుష్ట లోకమునలెనే రాజమార్గమునకుఁ గంటకసముదాయ మంత యపాయ కరమైనది"

విష్ణుగుప్తునికావాక్యములయందలిపరమార్థము తెలిసినదికాదు. కాని, కొంచె మనుమానమును భయమును దోఁచెను. లోకాతీతచరిత్రుఁడగుచాణక్యుఁడనిన నందఱకును భయమే. ఆతనియెదుట నెవ్వరును నిర్భయముగ నిలిచి మాట్లాడఁజాలరు. విష్ణుగుప్తుఁడు నప్పుచు "అయ్యా! ఈదర్భమోమున్పై నింతపట్టుదలయెందులకు!" అనియెను.

చాణక్యుఁడు పరశురాముని యపరావతారమని యాతఁ డెఱుఁగడు. అపాండవము చేయనుద్యుక్తుఁ డైనయశ్వత్థామవలెనే కోపోద్వేగుఁడగుచాణక్యుఁడు నందవంశమునైఁదీవ్రదృష్టులఁ బఱఁగించుచుండెనని యాతనికిఁ దెలియ లేదు. ఆతఁడు నలువంకలకును జూచెను. ఎదుట నున్నకుటీరమున నెవ్వరో యువతీమణి సంచరించుచున్న ట్లాతనికిఁ బొడకట్టెను. ఆమె సుందరివలె నాతనికగపడియెను. సంభ్రమముతోఁ

గుటీరమునఁ బ్రవేశింపవలయునని యాతఁడు చూచెను కాని, యింతలోఁ జాణక్యునియద్భుతచరిత్రములు తలంపునకు వచ్చి యాతనిహృదయమునకు భయము గలిగించెను. కనిపట్టి యూనంకకే చూచుచు నాతఁడు నిలువఁబడిపోయెను.

అంతలోఁ జాణక్యుఁ డాబ్రాహ్మణుని బైకిఁ బెల్లగించివైచెను. దానిని క్రిందఁబెట్టి నలఁగఁగొట్ట నారంభించెను. ఆత్రోవను బోవువారందఱు నాచర్యమును జూచి వెఱగుపడసాగిరి. విష్ణుగుప్తుఁ డావంక జూచుటలేదు. ఆతనిదృష్టి యంతయును గుటీరమువంకనే యున్నది. ఆబ్రాహ్మణుఁ డింకను నాపని ముగింపలేదు. అచ్చటనున్నయొకరాతిపలకపైనాదర్భబ్రహ్మోడు నుంచి తనకలశోదకములం జిలికి దానిని మొదలంట నఱిగఁదీసి, కమండలుజలంబులఁగలిపి యానిటిని గడగడ దాహముపుచ్చుకొనియెను. విష్ణుగుప్తుఁ డియద్భుతకృత్యమునకుఁ జాల నాశ్చర్యపడిపోయెను. ఆతని కేమియుఁ దెలియలేదు. చాణక్యుఁడు తనపని ముగించుకొని తిన్నఁగఁ దనకుటీరమునకుఁ బోయెను. విష్ణుగుప్తుఁడు వానిని వెంబడించెను. ఇరువురును గుటీరమునఁ బ్రవేశించిరి. ఆకుటీరమున సుందరియున్న దేమో యని యాతఁడు వెదకెను. కాని, యామెజాడ కాన్పింపలేదు. విష్ణుగుప్తుఁడు సుందరినిగూర్చి చాణక్యుని నడుగలేదు. అటునిటు కొంతసేపు పరీక్షించి చూచి యాతనియొద్ద సెలవు దీసికొనియెను. చాణక్యుఁ డాచూపులయర్థమును గ్రహించెను. ఆతఁడు "అయ్యా! తలుపు దగ్గఱఁగఁజేర్చిమతిపొమ్ము" అనిచెప్పెను. విష్ణుగుప్తుఁడు తలుపునూసి పైని గొళ్ళెమునుపెట్టి యేమో పనిగలవానివలెనతివేగముగ నాకుటీరమువెనుకదారినే వెడలిపోయెను.

ఇంతలో చాణక్యునికుటీరమున కవ్వలిభాగమునఁ బొగయును, మంటలును, లేచి నిమిషములో నవి కుటీరముచుట్టును వ్యాపించెను. అప్పటి కప్పుడే కనుబీకటి పడుచుండెను. నలుగురు నచ్చటికి నచ్చులోపల నాయిల్లంతయు మహాగ్నిజ్వాలలో బడిమండిపోయెను

ఆచుట్టుపట్టులం దున్న జను లీయకాలప్రళయమును జూచి పరుగెత్తుకొని వచ్చిరి. కాని, వారందఱుఁ జేరుసరికే కార్యము మించిపోయినది. సుందరియు నీకుటీరమునందే యుండియున్నది. ఆమెయును బైకి వచ్చుటకవకాశము లేకపోయెను. పాపము! మేటులకొలఁదిగనున్న చాణక్యాచార్యునినీతిశాస్త్రాదిమహాగ్రంథములన్నియు నాతనిప్రక్కనే పడి యగ్నిహోత్రున కాహుతియై పోయినవి. ఆపుస్తకములె జనులు నచ్చుసరికి మహాజ్వాలలలోఁ గాలిపోవుచుండెను. ఎవ్వరికి నార్పుటకయిన శక్యముకాకపోయెను. ప్రజలనేకవిధముల దుఃఖింపసాగిరి. ఆప్రజలరోదనములకు హద్దులేదు. వారలకుఁ జాణక్యుఁడన్న గురుపదము ఇట్టిసకలనీతిశాస్త్రపారంగతుని, ఇట్టిసర్వోత్తమగురుని, ఇట్టిబ్రహ్మచర్యసిష్ఠాగరిష్ఠుని, ఇట్టిలోకోపకారధురీణుని, ఇట్టిస్వార్థత్యాగశీలుని, ఇట్టిబ్రహ్మతేజోధురంధరుని, ఇట్టివిజ్ఞానసంపన్నుని పోఁగొట్టుకొని యేప్రజలు రోదనము సేయకుందురు? ఏప్రజలు హాహాకారములు సేయకుందురు? ఏప్రజలు తల్లడిల్లకుందురు? ఏమైననేమి? అన్నియును గతించినవి. గృహదాహమైపోయినది. సుందరీచాణక్యులప్రాణములతోఁగూడనందేమియును మిగులలేదు. ఎవ్వరికిసేమియుఁ గన్నులఁ బడలేదు. బండ్లకొలఁదినున్న పుస్తకములన్నియు నుసిమైపోయినవి. "ఓశాస్త్రములారా! ఓపురాణములారా! ఓయితిహాసములారా! ఓమహాగ్రంథములారా! మీరు పవిత్రమైనయగ్నిహోత్రమున నాహుతియైపోయితిరా? ఓచాణక్య

గురూత్తమా! నీగ్రంథరాజములను సితోడనే తీసికొనిపోయితివా అని తత్సమీపప్రజలు మిక్కిలివిలపింపసాగిరి. అందఱును నాబ్రాహ్మణోత్తమునిశిష్యులే. అందఱు నాతనిభృత్యులే. ఎవ్వరు వచ్చి యేమి చేయఁగలిగిరి? ఇంతకును దైవఘటన మిట్లున్నది.

ఇప్పుడు ప్రజలనేకవిధములఁ జెప్పుకొనఁజొచ్చిరి ఈయకార్యకరణము దుర్మార్గుఁడగు విష్ణుగుప్తుఁడు చేసెనని కొందఱు చెప్పుకొనసాగిరి. నసుమతిని ఈచాణక్యుఁడుహరించెనుకోపమున నసంతుఁడింతపని చేయించెనని మఱికొంద ఱనుకొనసాగిరి. ఈరెండువిధములలో మొదటిది ప్రజలలో మిక్కిలి విరియఁబాఁగెను. రెండవది రాజోద్యోగులును, తదనుచరులును, నగరవాసులును, జెప్పుకొనఁజొచ్చిరి. కాని, యందలి యాథార్థ్యమెమో మనకేమియును గోచరించుటలేదు. సుందరీచాణక్యులీకుటీరములోఁ బడిపోవ్రతమనమెఱుఁగుదుము. గృహదాహమునుజూచియున్నాము. ఎవ్వరీదుర్మార్గమున కొడిగట్టిరో మనము నిర్ధారణఁజేసి చెప్పలేము. నిజము నిడివిమీఁదఁ దెలియవచ్చును.

ఇరువదిరెండవ ప్రకరణము.

పద్మనందునిమనసు కుదుటఁ బడినది. ఆతని కిప్పుడు వసుమతిని గూర్చినవిచారముగాని, పాటిపోయినవసంతునిగూర్చిన విచారముగాని యంతఁగా దోఁచుటలేదు. ఎవ్వఁడు తనకు బలవద్విరోధియై, ప్రక్కలోని బల్లెమువలె జరియించుచుండెడివాఁడో, యెవ్వనికడఁ దననిరంకుశప్రభుత్వము తృణప్రాయముగఁ బరిగణింపఁబడుచుండెడిదో, అట్టిచాణక్యుఁడు దురంతమగుకాలమునఁ బడిపోయెను. పద్మనందుఁ డెంతటిచక్రవర్తియైనను, తనయూరనే నివసించియున్న సామాన్యబ్రాహ్మణునియెడఁ దనకుఁ గలశత్రుత్వముసాధించుకొనలేకపోయెను. ఆతనియొద్దనున్న చాలమంది దండనాయకులకును విశేషముగఁ బ్రజలకును, చాణక్యునియెడల గురుభావము గలదు. వారాతనివాక్యములను వేదవాక్యములుగఁ దలంచుచుండిరి. ఆకారణమున నాతనికిఁ బద్మనందుఁడు ప్రత్యక్షముగ నేమియు నపకారము చేయలేకపోవుచుండెను. చాణక్యుఁడు మొట్టమొదటఁ బద్మనందునికడఁ గొంచెముహెచ్చుతగ్గుగ మంత్రిగనే చరియించుచుండెడివాఁడు. ఆతనిబోధనములఁ గపటపర్యాళ్ళుఁడును, దురాశాపరుఁడును, నగుపద్మనందునకు శ్రుతికటువులుగాఁ దోఁచుచుండెడివి. క్రమక్రమముగా నాతనియాలోచనముల నంగీకరింపకుండుటయే గాక సభలో నవమానించుటకుఁగూడ వెనుదీయకుండుటచేఁ జాణక్యుఁడు పద్మనందునికడ నుద్యోగము వదలికొనియెను. చాణక్యపద్మనందులవిరోధముంగూర్చి యనేకు లనేకవిధములుగఁ జెప్పికొనుచుందురు. ఒకనాఁడు చాణక్యుని విందునకుఁ బిలిచి పద్మనందుఁ డవమానించెనని కొందఱును, ప్రత్యక్షముగ నాతని నేమియును చేయఁ జాలక విపాన్నము వెట్టినను నామహాత్ముని కాయన్నము జీర్ణమైపోయెనని కొందఱును, తనబిడ్డలకు విద్యాగురుత్వము నంగీకరింపకుండుటచేఁ బద్మనందుఁ డాతని నిరసించెనని కొంద

ఱును, ముఖ్యమంత్రియగు రాక్షసునిదుర్బోధనవలన జాణక్యుని బరిభవించి యుద్యోగమునుండి తొలగించె నని కొందఱును, చెప్పుకొనుచుందురు. ఏది యెట్లున్నను చాణక్యపద్మనందుల కాంతరంగిక మగుబల వద్విరోధ మున్నమాటమాత్రము సత్యము.

అట్టిచాణక్యునిబలవద్విరోధము నేటితోఁ దీరిపోయినది. ఆ సంతోషమువలనను, చంద్రగుప్తుని బంధించుటవలననేగాక చాణక్యుని మృతిచేఁగూడఁ బ్రజలలోఁ గలిగినయల్లకల్లోలమువలనను, చంద్రగుప్తుని క్రోహామునుగూర్చిన విచారణము నేటిరాత్రి కాఁపివేయఁబడినది. చంద్రగుప్తుని కారాగారమునం దుంపక యొకమేడలోనుంచి ద్వారములయొద్ద సేనలను గాపుంచెను. ఆభవనమునకు దక్షిణమున వెనుకవైపున నగాధ మగుకందకముతప్ప మఱి యేమియును లేదు

రాత్రిరెండుయామము లింకనున్నాలేదు. అంధకారము బంధురమై యుండెను. నాటిరాత్రి పాటలీపుత్రప్రజలకు గాఢాంధకారముగ నుండెను. ప్రజలందఱు నట్లుడికిన ట్లుడికిపోవుచుండిరి. "దయాళుఁడగుచంద్రగుప్తుఁడు మనకోఱ కాపురాత్మునిచేతులలోఁ బడిపోయెను. మహాత్ముఁడగుచాణక్యుఁడుగూడ నాకస్మికముగ మందిరముతోఁగూడ మండిపోయెను. ఇఁక మనకష్టసుఖములకుఁ దోడుపడువా రెవ్వరు? మోపు తప్పకుండఁ జంద్రగుప్తునిపై రాజు తననిరంకుశప్రభుత్వమును నిరాఘాటముగ నుపయోగింపక మానఁడు. అనాథుల మగుమన మేమి చేయఁగలము" అని యీవిధముగ జనులెల్లరు గుజగుజలుపోవుచుండిరి. రక్షకభటులు పుర మంతటను విచ్చలవిడిగఁ జరియించుచుండిరి.

అంధకార మపాయకర మైనది. అందుఁ జాల దుష్కార్యములు జరగుచుండును. కొన్ని మంచిపనులకుఁగూడ నది తోడుపడుచుండును. రహస్యమునకు నిగూఢహృదయమువలెనే గూఢవ్యాపారమున కంధకార మనుకూల మైనది.

అట్టిగాఢాంధకారసమయమున నొకభవనమునకు వెనుకవైపున నున్నకిందకమున కవ్వలిమొండున నొకవిశాలవటవృక్షముపై నెవ్వరో మనుష్యులు నెమ్మదిగా మాట్లాడుకొనుచున్నట్లు వినవచ్చుచుండెను.

"ఆకొమ్మపైఁ గత్తినాటువేసినప్రదేశ మగపడినదా?"

"ఈచీఁకటిలో నేమియు నగపడుట లేదు. చేతులతోఁ దడవుచున్నాను"

"అటనున్న రెమ్మలపై నాకులన్నిటిని దీసివైచితి నని యాతఁ డానవాలు చెప్పియున్నాఁడు"

"సరే! ఆకొమ్మ యిదియే. ఆతనికత్తినాటుపై పాలుపొంగి కత్తి పోటు కలిసికొనిపోయినది. ఇదిగో రెండుపలవలుగల చిన్నకొమ్మగూడ నిట నున్నది"

"ఆపలవలలోనుండియే తిన్నగఁ జూచినయెడల సౌధాగ్రమున నున్న ద్వార మగుపడునఁట! అదియే, గుఱి"

వారల్లు మాట్లాడుకొనినకొన్ని నిమిషములకు మేడగోడకులకుఁ దగిలినధ్వని వినఁబడియెను తోడనేకిందికందగముఁ బుడుంగుమని చప్పుడయ్యెను. కొంతసేపైనతరువాత మరలనట్లే చప్పుళులు కలిగెను. ఈసారి తగిలినదెబ్బ గోడకుఁ దగులలేదు. ద్వారకవాటమునకుఁ దగిలినట్లయ్యెను.

చెట్టుపైనుండి "అదియే" అనునొకధ్వని వినఁబడియెను. కొంతసేపటి కెవ్వరో యామేడతలుపులను దెఱచివైచిరి. మేడపై నున్నవారు చల్లనిగాలికొఱకాతలుపులను దెఱచికొని యుందురు. ఆలోపల వెలుఁగు కనఁబడుచుండెను. ఎవ్వరో యాద్వారముకడకు వచ్చి యిటునటు చూచి మరల లోనికిఁ బోయిరి.

మరలఁ జెట్టుపైనుండి "ఆతఁడే చంద్రగుప్తుఁడు" అను నొక వాక్యము మెల్లగవినవచ్చెను. వెంటనే "రుయి" మనునొకశబ్దమయ్యెను.

అప్పుడే మేడపైనున్న ద్వారమునందలిపైకమ్మిపై టక్కుమని చప్పుడయ్యెను. ఈసామిమాత్రము కందకములోని జలము నిశ్శబ్దముగనే యుండెను.

చంద్రగుప్తుడు మరల ద్వారముకడకునచ్చి పరిశీలించిచూచెను. ద్వారబంధపుగమ్మి కొకయలుగు గ్రుచ్చుకొనియుండెను. దానికొక సన్ననిత్రాడుకట్టబడి యుండెను. చంద్రగుప్తుడాదారమును విప్పి కొంచెముకొంచెముగ లాగెను. అది యింకను వచ్చుచుండుటచే క్రమక్రమముగ దానిని చేతికొనుచుండెను. కొంతసేపటి కాతని కంత కంటె బలమైనత్రాడు వారకెను. అదేప్రకారము చేతికొలఁది నాతనికి వరుసగా నొకపగ్గము దొరకెను. అదిచాల బరువుగనుండెను. ఇంకను లాగెను. కాని యాపగ్గము బిగిసికొనిపోయి మఱిజరగలేదు. అప్పుడాతఁడాపగ్గమును మెలివైచి లోపలిదూలమునకుఁ గట్టివైచెను. వెంటనే దీప మారిపోయినది. చంద్రగుప్తుడాద్వారమునొద్ద నిలువఁబడి నిరీక్షించుచుండెను.

కొంతసేపటి కాపగ్గమును త్రాఁకికొనుచు నెవ్వరో వచ్చుచున్నట్లాతఁడు కనిపెట్టెను. ఆత్రాడు పైనుండి యొకపురుషుఁడు వచ్చి యాద్వారమునుండి లోపలఁ బ్రవేశించెను. ఆతఁడును చంద్రగుప్తుఁడును నొక్కనిమిషములో నేమేమియోమాటలాడుకొని వెనుకకు మరలి యాత్రాడునుండి మెల్లఁగ నవ్వలియొడ్డున నున్నవృక్షముపైకి దిగిపోయిరి. ఇంతలో నాపగ్గమును తెగిపోయెను. ఆగాఢాంధకారమున నావచ్చిన వారెవ్వరో మనకుఁ దెలియలేదు. ఆచెట్టుపైనుండి మఱియేశబ్దమును వినఁబడనులేదు.

ఇది మొదటిభాగము.

శ్రీరామచంద్ర.

వసుమతీవసంతము.

రెండవభాగము.

మొదటిప్రకరణము.

ఇంకను సాయంకాలము కాలేదు. సూర్యుఁడు శాంతతేజుఁడై యాకాశపశ్చిమగోళమునందుఁ జాలదూరమునఁ బ్రయాణము సేయుచుండెను. పూర్వాభిముఖముగ బయలువెడలుచుండిన యాతనినులలాంశువులు చల్లఁగఁ జెట్లయాకులమీఁదను, గొమ్మలమీఁదను, బ్రాఁకుచుండెను.ఆకారణమున వృక్షములన్నియుబంగారునీరానినయట్లు సువర్ణమయములై శోభిల్లుచుండెను ఆసువర్ణవికారకోమల తరుపత్త్రములు మనోహరములై యిండుటచేఁగాఁబోలు, మందపవమానుఁ డల్లనల్లనఁ గదలించుచు వినోదించుచుండెను. చెట్లకొమ్మలసందునున్న కులాయములపైఁ గూడ లేతయెండ ప్రసరించుచుండుటచే నా గూండ్లన్నియు బంగరుశలాకలచే నిర్మింపఁబడినట్లుగఁ గానిపించుచుండెను. వానియందున్న విహంగకిశోరములు తమతల్లులరాకలకయి మెడలుటక్కించి టక్కించి చూచుచుండుటచే వానిముఖములు సువర్ణమయములై కనఁబడుచుండెను. అది యెంతటిభాగ్యము? ఆనీరెండ సోకినంతసేపటిదే. నీరెండ క్రమక్రమముగ వృక్షాగ్రముల కెగఁబ్రాఁకుచుండెను. శకుంతసంతాన మింకను గూండ్లకుఁ జేరుకొనుటలేదు. వాని కలకలారావములు

మాత్రము వినఁబడుచున్నవి. కొన్నిపక్షు లాకాశమునుండి యెగిరి పోవుచుండెను. వానినిలయము లచ్చటికిదూరమున నుండియుండును.

ఆసమయమున గంగానదీపూర్వతీరము మీఁదుగ నుత్తరాభిముఖులై యిరువురాశ్వికులు ప్రయాణముసేయుచుండిరి. వారివెనుక నొకసవారిని మోసికొనుచు బోయలు నడచుచుండిరి. ఆపల్లకితలుపులు బంధింపఁబడియుండుటచే నందున్న వారెవ్వరో మనకుఁ దెలియుటలేదు. బోయలు నూర్లుటలేదు. గ్రుక్కు-మిక్కు-మనకుండఁగనే నడచుచుండిరి. వారివెనుక మఱియిరువురాశ్వికులు గూడ నచ్చుచుండిరి. మొదటి యాశ్వికు లిరువురిలో నొకఁడు.

"మనము చీఁకటి పడకుండఁ గలశపురమునకుఁ బోవఁగలమా" అనియెను

"పోలే మనితోఁచుచున్నది. బోయలు మనతోఁ నడవలేకుండ నున్నారు. ప్రొద్దుగ్రుంకుసమయి మగుచున్నది. ఇంకను నాపురము పది క్రోశము లుండుననుకొనియెదను"

"అయినచో మనమెట్లులో నడివడిగఁ బోయితిమేని కొంచె మించుమించుగఁ జేరికొనవచ్చును."

ఈవిధముగ వారు సంభాషించుకొనుచు కళ్లెములను సడలించి గుఱ్ఱములను హెచ్చరించిరి. గుఱ్ఱములు కొంచెము వేగముగఁ బోవు చుండెను. బోయలును వానివెనుకనే చుఱుకుగ నడచుచుండిరి. వారిని వెంబడించి వెనుకనున్న యిరువు రాశ్వికులును దమతమగుఱ్ఱములను గూడ శీఘ్రముగ నడపించుచుండిరి. గాలియును వారికనుకూలముగనే విసరుచుండెను. ఈవిధముగ వారందఱు నొకయర్ధక్రోశమేగిరి. అది యరణ్యమార్గము. వారునడచుదారిసిబట్టి యచ్చట రెండుమూఁడు త్రోవలువారికిఁగనిపించెను. ఏమార్గమునఁబోయినఁ గలశపురముషోవునో వారికివిశదపడినదికాదు. నిత్యమునడవులయందు సంచరించువారికిఁ గూడ

నొకటిరెండుసారులే ప్రయాణముచేసినవారి కాయడవిత్రోవలు గుర్తించుట చాలఁగష్టము. వెనుకముందుఁజూడక యేగినయెడల నేయరణ్యములోనో పడిపోవ్రుట తటస్థించును. ఉన్న నీరెండయును బోయెను. సూర్యుఁడు పశ్చిమపర్వతపంక్తుల చాటునకుఁ బోయెను. దారి చూచికొనుచు నాలసించినయెడలఁ జీఁకటిలో నాయరణ్యమునఁ జాలఁజిక్కులు పడవలసివచ్చును. తెలియకుండఁ బోయిన దుర్గమారణ్యసంగతి. ఈభయముచే వారిగతి మందగించినది. ఆదారికిఁగొంచెము దూరమున నొకమనుష్యుఁడు నడచుచుండెను. మొదటియాశ్వికుఁడాతనిఁబిలిచి "అయ్యా! కలశపురమున కేమార్గముపోవును?" అని ప్రశ్నించెను. ఆతఁడీమాటలు వినిపించుకొనెనో లేదో సమాధానము చెప్పకుండఁగనే వారిదృష్టిపథంబునుండి దాటిపోయెను. ఆశ్వికులు మానముతో మెల్లఁగ నడచుచుండిరి. మరలఁ గొంతదూరమేగునఁటి కొకయడవివాఁడాసమీపవృక్షముక్రిందఁ గూర్చుండి వారికి దృగ్గోచరుండయ్యెను. ఒకయాశ్వికుఁడాతనియొద్దకేగి "అయ్యా! కలశపురమున కేగుబాటయేది?"అనిప్రశ్నించెను. వాఁడు భాగుగ నెఱిఁగియున్న వానిలెనే తీరమును విడిచియున్నయొకసన్ననిమార్గము వారికిఁ జూపి "మీరీత్రోవనుబోయినఁ గలశపురమునకుఁ బోవుదురు."అని బదులుచెప్పెను.

"ఆపుర మిచ్చటి కెంతదూరమున్నది?"

"పదిక్రోశములుండును."

"త్రోవ సరిగానున్నదా?"

"త్రోవ తిన్నగనేయున్నది. కాని యక్కడక్కడ గుట్టలు మొదలగునవి తగులుచుండును. చీఁకటిపడినచోఁ గ్రూరజంతువులబాధవిస్తారముగ నుండును. వెలుఁగు వేసికొని పోండు భయములేదు."

"నీకేమైన నిచ్చెదము. మాకుఁ ద్రోవ చూపుటకయి వచ్చెదవా?"

వాఁ డందులకంగీకరింపలేదు. వారందఱు మరల దారితీసిరి. ముం దున్న యాశ్వికు లిరువురును నందందుఁగల యానవాళ్లను జూచికొనుచు నిదియే కలశపురమార్గమని సరిపుచ్చుకొని యాదారిని నడవసాగిరి

అప్పటికప్పుడే చీఁకటులు క్రమ్ముకొనుచుండెను. అవి చీఁకటి రాత్రులు. క్రూరమృగసంచారమైన యాయడవియందాచీఁకటిలో నడ చుట చాలనపాయకరమే. అప్పుడు ముందున్న యాశ్వికులలో నొకఁడు బోయలలో నొకని బిలిచి "నీయొద్దనున్న కొఱవిపాలకఱ్ఱను వెలిఁగించి దారిజూపుటకు నడువుము "అని యాజ్ఞాపించెను. వాఁడట్లు కఱ్ఱను వెలిఁ గించి పల్లకిముందు నడచుచుండెను ఆవెలుతురులో వారు ప్రయా ణము చేయుచుండిరి.

తామున్న స్థానముతప్ప నెచ్చటఁజూచిన నంధకారమే. క్రూర మృగముల భయంకర కంఠరవములు వినఁబడుచుండెను ముందుముందుఁ బోయినకొలఁది నడవియంతయు జీఁకుగనుండి భీతిని నెలకొల్పు చుండెను. ఆశ్వికులు తమతమఖడ్గము లొఱలనుండి దూసికొని నడచు చుండిరి. ఒకొక్కచోఁ నడవిమృగములు సమీపమందున్న పొదలనుండి దూసికొని పరుగెత్తుచున్న చప్పుడులు వారికి వినవచ్చుచుండెను. పక్కల నున్న పొదలలోఁ గలగలశబ్దములు తఱుచు వినవచ్చుచుండుటచే బోయలు భయపడసాగిరి. వారిగతి మందగించినది. ఆశ్వికులు వారిని హెచ్చు గించుచు నెట్లోతీసికొనిపోవుచుండిరి. అక్కడక్కడ దూరమునుండి పక్షులకూఁతలో, ఈలలో, వారలకు వినవచ్చుచుండెను. ఆశ్వికు లవి పరిశీలించి యాలకించుచుండిరి. వారికేమియును విశదపడుటలేదు.

వారట్లు నడచుచునే యుండిరి. వెనుక మృగమో, యేదో, పరు గెత్తుకొని పొదలలోనికిఁ బోయినట్లు వారికిఁ జప్పుడు వినఁబడియెను. పల్లకి నాపి యాశ్వికు లాచోటును వెదకిరిగాని వారికేమియుఁ గాన్పింప లేదు. వెల్తుపు మధ్యముననున్న వీరిని దూరమునందున్న మనుష్యుఁడు

గాని మృగముగాని చూడవచ్చును. కాని, వీరికి దూరవస్తుదర్శన మేమియు లేకుండఁబోయెను. అక్కడక్కడఁ జెట్లపైనున్న పక్షుల కెక్కల చప్పుడును, పొదలలోని కూరజంతువుల సీత్కారములును, కీచు రాలనిస్వనమును, దప్ప నావనమున వారి కేమియు వినఁబడుట లేదు. ఇవి యాలకించుచు నాయశ్వికులు బోయలతో నడచుచుండిరి. కొంత దూర మేగిరి. ఒకపొదమాటున నుండి వింతశబ్దమేదియో వారికి విన వచ్చెను. మనుష్యుల గుసగుసయని వారనుమానించిరి. మృగముల యుచ్ఛ్వాసనిశ్వాసములధ్వనియని యింకొకమాటు తలంచిరి. వారు నడక మాని కొందతడవాదిక్కునకేగి చూచిరి. ధ్వని యాఁగిపోయినది. కాని, యేమియును గనఁబడలేదు. అశ్వికులకుఁ గూడ నేమియో భయము తోఁచెను. వారు బోయలను కొంచెము చుఱుకుగ నడుపుఁడని హెచ్చరించిరి. తమగుఱ్ఱముల వేగముగఁ బోసియసాగిరి. అనూర్గము గుట్టలతోఁ గూడినదగుటచే గుఱ్ఱపుడెక్కలచప్పుడు విశేషముగ వినవచ్చుచుండెను వారివెనుకను అదేమాదిరిగ గుఱ్ఱపుడెక్కలసద్దు వినవచ్చుచుండెను. వారికి కిదివినఁబడకపోవుటచేతనో, ప్రతిధ్వనియనియో, వారు దాని శంకింపలేదు. బహుశా అది ప్రతిధ్వనియే యైయుండును. గుఱ్ఱములు కొంచెము వేగముగనే పోవుచున్నవి. బోయలును వానిని వెన్నాడినడచుచుండిరి. నడక వేగమునఁగొఱవిపాలకఱ్ఱమంటలు వెనుకకుఁ బోవుచుండెను. ఆవెలుతురు ముందునకుఁ గాన్పించుటలేదు. ముందు నడచుచున్న గుఱ్ఱము దూరమున నేదియో యొకవింతవస్తువును జూచి బెదరెను. ఆముందు మెఱుపు మెఱసినట్లయ్యెను. అశ్వికుఁడది వీక్షించెను గాని యాతనికి దానిస్వరూపస్థితి తేటపడినదికాదు. ఏపులియో యైయుండునని యాతఁడు భావించుకొనియెను. ఈతొందరలో గుఱ్ఱము కాలున కేదియో తగిలి ముందున కొఱగెను. కాని పడలేదు. వెంటనే యది యథాప్రకారము నడువసాగెను. అశ్వికుఁడు దాని నక్కడ నాపి

యాస్థలమును బరీక్షించిచూచెను. ఆదారికడ్డముగ కొన్ని తీగలు పొదల నుండి జారిపడియుండెను. కొన్ని తెగిపడియుండెను. ఈతీగలే దీనికాళ్లకుఁ దగిలియుండునని వారందఱు నిశ్చయించుకొనిరి. ఒకయాశ్వికుఁడు ముందునకుఁ బోయి పరీక్షించిచూచెను. అందేపులియు నాతనికిఁ గనఁబడలేదు. ఆతని కనుమానము తోఁచి యాచుట్టుప్రక్కలఁ బరీక్షించి చూడసాగెను. అంతయు నంధకారమే. ఏమియునుగోచరింపలేదు. పొదలలో గలగలధ్వనియు, చెట్లకొమ్మలయాకులమర్మరధ్వనియుఁ దప్పనాతని కేమియును వినఁబడలేదు.

ఆశ్వికులు మరల దారివెంట నడవసాగిరి. బోయలు వారి నడుమ నడచుచుండిరి. ఘట్టతికష్టముమీఁద జామురాత్రికిఁ గలశపురసమీప మున నడచుచుండిరి. దూరమునుండి పురమునందలిసందడి వినవచ్చు చుండెను. అందఱకు ధైర్యమువచ్చినది. వారు శీఘ్రముగఁ గొన్ని నిమిషములలోఁ బురప్రవేశముచేసిరి. ఆపురము గంగానది యొడ్డుననే యుండెను. రాజమార్గమునఁ బ్రవేశించి కొంతదూరము పోయిరి. ఆవీధిని దాఁటి పడమటిదిశనున్న యొకవీధికి మరలిరి. ఆవీధిచివరకుఁ బోయిరి. గంగానది సమీపమందే యుండెను. అక్కడ నొకయింటి ముందు పల్లకీనిదింపిరి. ఆయింటికావలఁ గొన్నికుతీరములుతప్ప మఱేమియునులేవు. అనల నదియే. అయింటితలుపు మూయఁబడియుండెను. ఆశ్వికులు తమతమగుఱ్ఱములనుదిగిగంగయొడ్డుననున్న చెట్లకుఁ గట్టుఁడని బోయల కాజ్ఞాపించిరి. ఒకపురుషుఁడు తలుపు తట్టి,

"అయ్యా! చంద్రజూటశాస్త్రిగారున్నారా?" అనిపిలిచెను.

లోపలనుండి "ఎవరువారు?" అనుకేక వినఁబడియెను.

"అయ్యా! మేము పరదేశులము. దయచేసి తలుపుతీయుఁడు" అని పురుషుఁడుపిలిచెను.

"వచ్చుచున్నాము" అని లోపలనుండి మరలఁ గేక వినఁబడి యెను. ఇంతలో నక్కడ కాయిరుగుపొరుగు మనుష్యులు కొందఱు వచ్చిరి. వారు "మీదేయూ" రనిపురుషునిఁ బ్రశ్నించిరి, "కాశీపురమని యాతఁడు సమాధానము చెప్పెను. కాని వారిది కాశిమాత్రముకాదు. కొంతసేపటికి గొల్లెము తీసి తలుపు తెఱవఁబడియెను. అగుమ్ముములో నేబదియేండ్ల పురుషుఁ డొకడుండెను. ఆతఁడే చంద్రజూటశాస్త్రి. ఆతఁ డీవలికివచ్చి,

"విశాఖలుఁడా! అందఱువచ్చినారా?" అనియెను.

"చిత్తము."

"ప్రొద్దుండఁగనే వత్తురని వంటలుచేయించి సిద్ధపఱచితినే! ఇంత యాలస్యమైనదేల?"

"ఓర్వ సరిగఁ దెలియకుండుటచేతను, బోయలు మాఁగో రాలేక పోవుటచేతను, నాలస్యమైనది."

"అందఱును భద్రముగ వచ్చినారా?"

"తమదయవలననట్లే."

ఇట్లు వారు సంభాషించుకొనుచుండఁగా లోపలనుండి నలుబది యేండ్లుకల యొకపుణ్యాంగన యీవలికివచ్చి "ఆచిన్నదివచ్చినదా?" అనిప్రశ్నించెను ఆమె చంద్రజూటశాస్త్రి ధర్మపత్ని. శాస్త్రి "ఆ వచ్చినది. ఆపల్లకిలోనున్నది. ఆ పల్లకిఁ దీసికొనిపొమ్ము" అని యామె తోఁ జెప్పెను. ఆమె తిన్నఁగఁ బల్లకియొద్దకు పోయి తలుపులు తెఱచి "అమ్మాయీ! రమ్ము. లోపలికిఁ బోవుదము" అనిపిలిచెను. ఆపల్లకినుండి యిరువదియైదేండ్లయువతి యీవలికి వచ్చెను. ఆపిమ్మటఁ బదునాఱేండ్ల బాలిక వచ్చెను. ఆయువతిబాలిక చేయిఁబట్టుకొని యాయింటియామెతో లోపలికిఁబోయెను. ఆయుపతీమణి కనకలత. ఆబాలిక వసుమతి. చంద్రజూట శాస్త్రి యాపురుషులనుతగినరీతి నాదరించిభోజనములకు లెండనిచెప్పెను.

వారు తమహస్తులనుదీసి గంగకుఁబోయి స్నానములుచేసివచ్చిరి. వారంద ఱుచితరీతి నందుభోజనములుచేసిరి. భోజనానంతరము శాస్త్రియు విశా ఖలుఁడును నేకాంతముగ నేమేమో చాలసేపు మాటలాడుకొనిరి. బోయలు తిండితిని చల్లగాలికై గంగానదియొడ్డుననుండు చెట్లకిందికిఁబోయి పరుం డిరి. రాత్రి చాల ప్రొద్దుపోయినది. మార్గాయాసమునొంది వచ్చిన వారి నాచావడియందున్న శయ్యలపైఁ బరుండ నియోగించి శాస్త్రి లోపలికిఁబోయి తలుపుగొళ్లెము వేసికొనియెను.

రెండవ ప్రకరణము.

చంద్రజూటశాస్త్రిగృహము పెంకుటిల్లుకాదు. పూరిచే నేయఁ బడినది. ముందు వీధివైపున నొకపెద్దచావడి యున్నది. ఆచావడి దాఁ టినతరువాత విశాలమైనయడనయున్నది. దానికావల మరల నొకపూరి ల్లున్నది. అదియు నంతవిశాలమైనదికాదు. ముందు నసారా యుండెను గోపలి కేగినంతోడనే యొకపెద్దచావడి కనఁబడును. ఆయింటిలోని పడమటివైపున నొకవిశాలమైనహాలున్నది. ఆహాలున కుత్తరపుమూల శాస్త్రి దేవతార్చనపుగదియును, దక్షిణపుమూల నంటగదియు నుండెను. తూర్పువైపున రెండుగదు లుండెను. అందు మొదటిగది శాస్త్రిపడక టిల్లు రెండవది దొడ్డివైపునకుండెను. ఆగదికితూర్పుదక్షిణముల గవా క్షము లున్నవి. ఈనూతనస్త్రీ లిరువురును నాగదియం దుండిరి. భోజ నము లైనపిదప శాస్త్రిగారిభార్య వారియొద్ద జాలసేపు గూర్చుండి కష్టసుఖములను గూర్చి ముచ్చటించెను. రాత్రిచాలప్రొద్దుపోయెను. ఆమె తనపడకటింటికిఁ బోయెను. అందున్నస్త్రీలిరువురును, నాయింటి

యామెయావరమునుగూర్చి ముచ్చటించుకొనుచుఁ దమతమశయ్యల పైఁ బండుకొనిరి. ఆలోపల తైలదీపమొకచో వెలుంగుచుండెను, గాలి వచ్చుటకై రెండునైపులనున్న కిటికీలను దెఱచి యుంచిరి. ఆయింటివెనుక నున్న దొడ్డి చాలఁ బెద్దది. ముందర కొన్ని పూవులచెట్లును, వానిసమీపమునకు నూయియు నుండెను. ఆవెనుకఁ గొన్ని మామిడిచెట్లుండెను. వాని కొమ్మల నడవివృక్షములును, డొంకలును, తీఁగలు విస్తారముగ నుండెను. మామిడిచెట్లు దాఁటినతరువాత నున్న దొడ్డియంతయు నడవివలె నుండెను మనమందులోనికిఁ బోయితిమేని యేమూల నెవ్వరున్నదియుఁ దెలియ లేము. ఆదొడ్డిచుట్టును గోడ శిథిలమైయుండెను.

రాత్రి రెండుజాములు తిరిగినది. దొడ్డియంతయుఁ జీకటిగనే యున్నది. ఆదుబ్బులలో మనుష్యులు నూళ్లాడుచున్న సందడి వినవచ్చుచుండెను. చెట్లనున్న తీఁగలొకొమ్మకొమ్మకో గదలుచుండెను. మఱికొంతసేపటికి గుసగుసలును, ఎగశ్వాసలు వినఁగుచున్న చప్పుడును వినవచ్చెను. ఉత్తరక్షణమున కవి యన్నియునుజల్లాడినవి. ముందున్న మామిడిచెట్లలో నొకచెట్టుక్రింద నిద్దఱునుష్యులు కూర్చున్నట్లగపడుచుండెను ఇంక లోపల నెంతమందియుండిరో మనముచెప్పలేము. అందున్న కీచురాలనిస్వనమే వినవచ్చుచున్నదిగాని వారు మాటలాడుచు నున్న సద్దేమియు వినవచ్చుట లేదు. ఒకఁడు మెల్లగ ముందునకు నచ్చెను. అతనిచేతియందు చక్రాకృతిగల విచిత్రాయుధ మొకటియు, ఖడ్గ మొకటియు నుండెను. వాఁడొకిగవాక్షముప్రక్క నిలువఁబడి లోపలికిఁ జూచుచుండెను. లోపలిస్త్రీ లిరుప్రక్కను నింకను నిద్రింపలేదు, మాటలాడుకొనుచుండిరి. వారిరువురును గనకలతావసుమతు లని వేఱుగఁ జెప్పవలయ లేదు.

వసుమతి "మనమిక్కడ నెంతకాలముండుము?" అనెను.

కనకలత "మనవెనుక నామఱునాఁడే వారును బయలుదేరి యుందురు. వారు రెండుమూఁడుదినములలో వచ్చి మనలను సురక్షిత ముగఁ దీసికొనిపోఁగలరు "

"వారు తప్పక వచ్చెద రని నీవెట్లు చెప్పఁగలవు? వారెట్టి యాప దలలో మునిఁగి యుండిరో మనకెట్లు తెలియును? "

"మఱేమియును భయము లేదు. చాణక్యునిమతివిశేషమే వారి కంగరతో కాఁగలదు"

"విడువకుండఁ బయనము సాగించుటచే మనమిటకు నెలదినము లకు వచ్చితిమి, వారుకూడ నంతలోఁదరగ వచ్చెదరా?"

"రాకేమి? వసంతుఁడు నిన్నెప్పుడు చూతు నెప్పుడు చూతునని త్వరపడుచుండును. సుందరి నిన్ను విడిచి యొకక్షణమైన నిలువఁగలదా?"

"పాపము! సుందరియును, చాణక్యుఁడును మహానలజ్వాలలోఁ బడిపోయి రని వారి కెట్లు తెలియును? వారు పాటలీపురమును, ఆనాఁటి యర్ధరాత్రమునసే విడిచినై చిరిగదా "

వసుమతి దీనవదనయై "వారు వచ్చునఱకైన మనమిచ్చట నిర పాయముగ నుండఁగలమా?" అనియెను.

''భయములేదు. మనపోకడ యెవ్వరికిని దెలియదు."

"మన మిఁక నెక్కడికిబోవుదుమో నీకుఁ దెలిసినదా?"

"అది విశాఖులునకును దెలియ లేదఁట! వాగువచ్చువఱకు మనల నిచ్చట నుంచుటకే చాణక్యునియాజ్ఞయైనదఁట!"

వసుమతి నిట్టూర్పు విడిచి "కనకలతా! మన కంతటియదృష్టము పట్టునా?" అనియెను.

"అమ్మా! మనకష్టదినములు గడచిపోయినవి. నీవు ధైర్యమును వహించి శుభమున కెదురుచూచు చుండుము."

ఈసంభాషణములోఁ దానేమో గ్రహించినట్లుగాఁ గిటికీయొద్ద నున్నపురుషుఁడు సంతోషించెను. ఆస్త్రీ లిరువురు నిట్లుసంభాషించుకొనుచు మార్గాయాసముచే నిద్రకు లోఁబడిరి. పురుషుఁ డిఁకఁ దన పనిచేయవచ్చునని యాలోచించుకొనియెను. ఆతఁ డతివేగముగ మరల మావిడితోఁపునకుఁ బోయి యందేమో గుసగుసలాడి రెండవపురుషుని తోఁగలిసి కిటికీయొద్దకు వచ్చెను. ఒకఁ డొక్కలపురుగు నాకిటికీగుండ లోనికి విడిచిపెట్టెను. అది జుంజురుమని రొదసేయుచుఁ బోయి దీప మార్చివేసెను. ఈసంగతి నాస్త్రీ లెఱుఁగరు. రెండవపురుషుఁడేమో మఱచినట్లుగ వ్రేలు కఱచికొనసాగెను. అది యేమని మొదటివాఁడు ప్రశ్నించెను.

"ఇరుప్రక్కలనుఁగూడ మోయవలసివచ్చినదిలే. గుర్తింప మఱచితిమి" అని యాతఁడు చెప్పెను. ఆపురుషు లిరువురును దనుచేతనున్న యాయుధములతోఁ నాకిటికీ క్రిందిగోడను త్రవ్వ నారంభించిరి. అది మట్టిగోడ. గుసగుసతోఁ ద్రవ్వినయెడలఁ జప్పుడు గాకుండ గన్నము త్రవ్వఁబనిముట్లు వారియొద్దనున్నవి. మూఁడునాలుగు గడియలలో నాగోడకు సడిచప్పుడు లేకుండఁ బెద్దకన్నము త్రవ్వి నారా గదిలోఁ బ్రవేశించిరి. ఇరుప్రక్కలను లోపలికిఁ బోవఁగనే మఱియిరువురు వెనుకనుండి వచ్చి లోపలఁ బ్రవేశించిరి. మొదటియిరువురును నాస్త్రీల యొద్దకుఁ బోయి గట్టిగఁ బట్టుకొనిరి వారు కేకలువేయవలయు ననిప్రయత్నించిరికాని నోరు మెక్కుటచే నవకాశము కలిగినదికాదు. మాటాడినచో గొంతుకోసివేయుదుమని బెదరించిరి. వసుమతి నిర్విణ్ణయై మాటలేకుండఁ బడియుండెను. వెనుకవచ్చినయిరువురును గదితలుపు తీసికొనివచ్చి పెరటితలుపు తీసి చప్పుడుగాకుండ శాస్త్రిపరుండియున్న గదితలుపు పైనిగొళ్ళెము పెట్టిరి. కనకలత కొంచెము కేకలువేయఁబ్రయత్నించెనుగాని యామెనోట గుడ్డలుక్రుక్కివేసిరి. ఆస్త్రీల నిరువుర నా

దొంగలు చల్లగ నాదొడ్డిమార్గమున నావలకుఁ దీసికొనిపోయిరి. పాపము!అబలలు.ఆక్రూరకర్తులచేతులలోఁబడిపోయిరి. వారెట్టికష్టములఁ బెట్టుదురోకదా ! మరలఁ గొన్ని నిమిషములలో నిరుపద్రవమనుష్యులు ఖడ్గహస్తులయి లోపలఁ బ్రవేశించిరి. వారి కింకను దృష్టి జనింప లేదు. ద్రవ్యములకై కాదు. వాఁకిటిలోనున్న వారిని సంహరింపనలయు నని వారు యోచించుకొని లోపలఁ బ్రవేశించిరి.

వారిచేతులయందలికత్తులు తళతళ మెఱయుచుండెను. వారు తిన్నగ నడవతలుపు తీసికొనిరి. ఆచప్పుడు విని విశాఖలుఁడు లేచి "శాస్త్రిగారా! " అని ప్రశ్నించెను. దానికి బలమైనకత్తిదెబ్బయే ప్రత్యుత్తరమిచ్చెను. ఆకత్తి యాతనిభుజముమీఁదినుండి హృదయము వఱకును భేదించుకొనిపోయెను. ఆతఁడొకకేక వేసి మఱి మాట లేకుండఁబడిపోయెను. ఇంతలోఁదక్కినముప్పిరును లేచి "ఏమి? ఏమి" అని కలవరపడఁ జొచ్చిరి. వారికిఁదెలియగోల మేమి చెలియును? నిరాయుధులై యుండిరి. వారికిని మొదటివానివలెనే చంద్రహాస్రహరణములు భాగుగఁదగిలినవి. అర్ధరాత్రిని పంచినిద్రావస్థలో దొంగపోటుగ వచ్చి చేసినపని కెవ్వరర్థముపడఁగలరు? వారునాకత్తిపోటులతోఁ గేకలు వేయుచుఁ గ్రిందఁబడిపోయిరి. ఈకేకలు విని లోపలనున్న శాస్త్రియు వానిభార్యయుఁ దలుపుదీసికొని రాఁబోయిరి. తలుపు వచ్చినదికాను. వారందుండి పెద్దపెద్దకేకలు వేయసాగిరి. ఈకోలాహలమును విని చుట్టుపట్టులనున్ననుష్యులు గోడలుదాటి వచ్చుసరి కాదొంగలు పాఱిపోయిరి. వాఁకిటనున్నమనుష్యులలో ముగ్గురు చచ్చిపడియుండిరి. విశాఖలుఁడు మాత్ర మింకను జీవములు విడువలేదు. మూల్గుచు బాధపడుచుండెను. గాయము బలముగఁ దగిలినది. వాఁకిటనురికినవారు వీధితలుపులు తీసివైచిరి వారికి వారు చాలమంది ప్రోగుపడిరి. విశాఖలునకుఁ దగినచికిత్స చేయ మొదలుపెట్టిరి. కొందఱు లోపలికిఁ బోయి

శాస్త్రి గదితలుపును దీసిరి. ఆయన యీవలికివచ్చి "ఆస్త్రీ లెక్కడ?" అని యొందరగా నాగదియొద్దకు జనియెను. ఆగది చీకటిగా నుండెను. వెంటనే శాస్త్రితనగదిలోనికిఁబోయి దీపమునెలిగించి తెచ్చి చూచెను. అందెవ్వరునులేరు. గోడకు పెద్దకన్న మున్నది అయ్యో! దొంగలు నాకొంపఁ ద్రవ్వి రని యాతఁడు కేకలునై చుచు వాఁకిటిలోనికి వచ్చి, వాఁకిట జరిగినస్థితిఁ జూచి మిక్కిలి తత్తఱమును పొందసాగెను. బాధ పొందుచున్న విశాఖులునెద్దకు వచ్చి "అయ్యో! విశాఖులుఁడా! సముద్ర మంతయును దాఁటి యీపిల్లకాల్వలోఁ బ్రాణములను విడుచుచున్నాఁడవా?" అని దీనముగఁ బలికెను.

"నేను స్వామికార్యమును నెఱవేర్చితిని." అనివణకుచు నాతఁడు ప్రత్యుత్తర మిచ్చెను.

"బలమైనగాయము తగిలినది. నిశాధమెల్లున్నది"

"నాకు సుఖముగనే యున్నది నాకై విచారింపకుఁడు. దొంగలు—శత్రువులు—పాపమాయబలులు—ఈ! ప్రాణములు పోవుచున్నవి" అని యాతఁడు మఱేమాట్లాడలేదు. స్వామి భక్తియుతుండగువిశాఖులునిప్రాణములు తమయనునరులలోఁబోయికలిసికొనియెను.

ఆతనిమృతికిని స్త్రీలరక్షింపలేమికిని చంద్రజూటశాస్త్రి మిక్కిలి విచారింపసాగెను.

"ఈ! రాజకుమారునకేనేమని యుత్తరము చెప్పుదును! నామిత్రుని కేమిజాబుల్వాయుదును?" అనియనేకవిధములఁబలవింపసాగెను. కొందఱుపౌరులు శాకులును బల్లెములునుదీసికొని గంగానదియొడ్డునుండి చాలదూరమువఱకు వెదకుచుఁబోయిరి. కానియది చీకటిరాత్రి యగుటచేసాహసించి యొకరునుడొంకలలోనికిని, పొదలలోనికిని,బోయి చూడలేకపోయిరి. శాస్త్రిగారన్నేహితు లాతని నూరార్చి బోయలను రప్పించి వారికికొంతడబ్బిచ్చి వాఁకిటనున్నశవములను దీయించి గంగానదియొడ్డున వారికుచిత్రక్రియలఁ గావించిరి.

మూఁడవప్రకరణము.



నసుమతియును, కనకలతయును, చోరులచే నపహరింపఁబడి పది మాసములు కావచ్చినది. ఇంతవఱకు వారిజాడ యేమియును తెలియఁ బడుట లేదు.

సింధునదంబున కుపనదియగు విపాశానదీతీరంబున నున్నలతా నికుంజమునఁ దొకయోధుఁడుశయనించియుండెను.ఆతఁడేమో యాలో చించుచున్నట్లుండెను. అది చల్లనివెన్నెలరాత్రి. ఆతఁడు మధ్యవయ స్కుఁడగుదృఢతరశరీరుఁడు. యౌవనమున శారీరకమానసికశక్తులు సంపూర్ణముగ నుండును. యౌవనులహృదయములు భూమ్యంతరాళ ముల సంచరించుచు నెన్నెన్ని యో పరిణామములఁగాంచుచుండును. ఆ పరిణామములకు లెక్కలేదు. ఆయూహల కవధిలేదు. ఇప్పు డాతని హృదయమున నేమున్నదో యథార్థముగ మనము తెలిసికొనఁజాలము.

రాత్రి రెండవజాముకూడ గడచినది. ఆతనికి నిదుర వచ్చుట లేదు. ఇటునటు పొరలుచుండుటచే నాసాంద్రములగు నీలకుంతలములు విడివడి చెదరియుండెను. అతనిహృదయతాపమునం బొడమినచిఱుచెమ్మ టలతో లేదీవగొమ్మలచిగురుటాకులనుండి దొరలువిపాశానదీతరంగ శీకరము లేకీభావమును పొందుచుండెను. ఆఘర్మసలిలబిందువులలోఁ జంద్రకిరణములుమిలమిలమెఱయుచుండెను. చలువగాలితాఁకునంగదలు ననదీఁగగొమ్మలమాటుననుండి దాఁగిలిమూఁత లాడుజాబిల్లి రేకయా తనివిశాలనయనములలోఁ బ్రతిఫలించుచుండెను. తరంగశీకరసేచనంబున నార్ద్రీకృతంబులగు చిగురుటాకులపై వెన్నెల పూఁపులుపూయించు చుండెను. లేఁజిగురుటాకుల మెక్కుచుండులనో, నిదురమంపుననో గాని తీయమామిడిగున్నపైనుండి కోకిల యొకటి 'కో' యనిగూయు

చుండెను. అరవిరిమొగ్గల విఁగియించుచు నాకుబైటవెన్నెలలోనుండి కమ్మతెమ్మెరలు వీతెంచుచుండెను.

ఇవి యన్నియు నాతని హృదయాకారములనుద్దీపింపఁ జేయుచుండెను. ఎడతెగనిమనఃపరిశ్రమనలన నాతని కాయాసమధికమయ్యెను. దేహపరిశ్రమమున నిద్రయు, మనఃపరిశ్రమమున జాగరమును, తోఁచుట సామాన్యధర్ము. దేహమనఃపరిశ్రమముల నలసియున్న యాతఁడాయాలోచనములనడుమ నిద్దురయును జాగరమును గానియొకయవస్థకు లోనయ్యెను. అప్పుడాచంద్రికిరణప్రసారమున నార్ద్రంబులగునాతనికన్నులు మూతవడియెను.

అప్పు డాతనిహృదయమునందలి స్మృతిపటంబున నేదియో పూర్వగాథ గోచరించుచుండెను. ఒకమనోహరకేళీభవనమున జగన్మోహనరూప యగుపదునాలుగేండ్లతరుణి యాతని యెదుట నిలువఁబడియుండెను. అట నొకబంగరుపూఁగుటయ్యెలలో నైదేండ్లయాఁడుబిడ్డ శయనించియుండెను. ఆయువతీమణి తనవంక భయసంభ్రమములతోఁ జూచుచుండెను. వారిరువురికి నివిధముగ సంభాషణజరిగెను.

"ప్రియా! నాకు దేశాంతరము పోవలసివచ్చినది, అని యోధుఁడు పలికెను ఆయువతీమణి సుకుమారతను లత చంచలవిద్యుద్వల్లరివలెఁ గంపించుచున్న ట్లయ్యెను. గద్గదస్వరముతో "ప్రాణేశ్వరా! అది యేమి? అబల నగుననన్నిట నొంటి విడిచి యేగుటకు మీహృదయ మెట్లంగీకరించినది" అనువాక్యము లాతనికి వినఁబడియెను. ఆచెలువ కాటుక కన్నులనుండి యశ్రుబిందులు ముక్తామణులవలె జాలువారుచున్నట్లు తోఁచెను.

యోధుఁడు "జీవితేశ్వరీ! విచారమేల? వియోగమును సహింపనోర్చినకాంతయే వీరున కిల్లాలుగావలయు నని యెఱుఁగవా?"అనియెను.

"నాథా! మనము కలిసికొని యెన్నాళ్లయినది? ఇంతలోనే యెడఁబాయవలసివచ్చెనా? "

"రాజకార్యములు మనయిచ్ఛనచ్చినట్లు జరగవు. నే నిప్పుడు పాంచాలము పోవలయును."

"నన్నుఁగూడ మీవెంటఁ గొనిపోఁగూడదా? "

"అయ్యో! అదియెట్లు? మహరాజునకును, రాజ్యమునకును, ధనకును గూడ నాధారమైయున్న తల్లిలేనియీముద్దుబిడ్డ నెవ్వరు పెంచెదరు? "

ఆమాట వినినతోడనే యాతరుణీమణి యాబిడ్డనెత్తికొని ముద్దు పెట్టుకొనుచు, "ఈచిన్నతల్లినిగూడ మనవెంటఁ గొనిపోనచ్చును" అని యెను.

"వలదు. అది చాలశీతలప్రదేశము. ఈపసికూన నటకుఁగొనిపోవలనుపడదు. "

ఆకాంత కన్నుల నిరుదెచ్చుకొనుచుఁ దలవంచుకొని నిశ్చేష్టయై నిలువఁబడిపోయెను.

యోధుఁడు "ప్రాణప్రియా! నీవు క్షత్రియస్త్రీవి కావా? ఇంత యధైర్యము నేల వహియించెదవు? " అనియెను.

ఆమాటల కాచెలువ కోపగించుకొని "నేను ధైర్యవతినే కాని, నిర్దయాత్ముఁడ వగునీవిలాసములు నాహృదయమును గలఁచివైచినవి" అనియెను.

"సతీమణీ! క్షమింపుము" అని యోధుఁడు వేఁడుకొనియెను.

ఆసుబోధన మామె కేదియో బోధించెను. పతిమాట కెదురాడఁగూడదనునుద్దేశ మామెసుందరవదనమునఁ బొడగొట్టుచుండెను.

"ప్రాణేశ్వరా! నేనీముద్దుబిడ్డతో నెట్లో దినములఁ గడపుకొనియెదను" అనియెను.

"ప్రియా! నీసౌశీల్యమునకు నంతసించితిని. నామారుగ నిముద్దు బిడ్డను ప్రాణపదముగఁ బెంచికొనుచుండుము ధైర్యమునువహించి నిర్మలహృదయముతో నాకు సెలవిమ్ము"

"మరల మీరెన్ని నాళ్ళలో నచ్చెదరు? "

"ఈచీఁకటిరాత్రులు గడచినతోడనే వెన్నెలరాత్రులలో వచ్చెదను"

ఆమె మఱి మాట్లాడలేదు. యోధుఁడు కలంగినహృదయముతో నాసుందరచుబుకమును బుడుకుచు "ప్రియా! ఏమందువు" అనియెను. కొంతసేపటి కాతనికి "ఎన్ని వెన్నెలరాత్రులు గడచినవి! ఎన్ని యేండ్లు గడచినవి " అనువాక్యములు వినఁబడియెను ఆతఁ డులికిపడి కన్నులు విచ్చిచూచెను.

అప్పటికిఁ జంద్రాస్తమయమయినది. ఆపొదరిల్లంతయు నంధకారపూరితమై యుండెను. ఆతనిహృదయమునఁగూడ గాఢాంధకారము వెల్లివిరియుచుండెను. ఆతని భావనాప్రపంచమంతయును నాయమై పోయినది. కొంచెముసేపటికాతఁడు నిశ్చేష్టుఁడయి యుండెను. ఒక్కనిట్టూర్పువిడిచి లేచి నిలువఁబడియెను. మరల నిట్లాలోచించుకొనియెను. "జీవితములు స్వప్నములవంటివి. జరగిపోయినదానికై విచారింపఁగూడదు. ఈమాయాప్రపంచమున నిశ్చలమగునానంద మెట్లుకలుగును? ఈ హృదయవికారములు ముందుప్రయత్నముల కభ్యంతరములు కావచ్చును. అంతయును మఱచిపోవలయును. ఇతఁ డాతఁడుకాఁడు. ఇది మఱియొక జన్మము" అని యనుకొనుచు నాతఁ డాతీరమున నున్న యెత్తైనకొండలగుంపులోఁ బ్రవేశించెను.

ఆనడుమదుర్గ మున్నది. ఆదుర్గమున కుత్తరమున హిమాలయ పర్వతములున్నవి. దక్షిణమున శతద్రూనదివఱకును మహారణ్యము. దానినే తపోవనమందురు. అందె చాలమందియోధులు సంచరించు

చుందురు. అచ్చటచ్చట తపస్వులయాశ్రమములున్నవి. ఈచరిత్రము జరుగుచున్న కాలమున రాజకీయకల్లోలములు విశేషముగ నుండుటచే నచ్చట నిప్పుడు యోధులుగూడఁ దిరుగుచుండిరి. పైనిర్వాసినదుర్గమునకుఁ బశ్చిమమున సింధునదినవఱకు నరణ్యమేగాని జనవదము లేదు. ఉత్తరమున హిమాలయముప్రక్కగఁ గాశ్మీరమునకుఁ బోవుమార్గమున్నది.మూఁడువైపుల నదులు, ఒకవైపునహిమాలయమునుండుటచేనాదుర్గముపరులకభేద్యమైదుర్గమమై యున్నది.అంచెంతసైన్యమున్నదోయెచ్చటనున్నదోలోనికిఁబోయిచూచినవారికే తెలియను. ఇతరులకచ్చట దుర్గమున్న సంగతియే తెలియదు. ఆదుర్గమునందే మనయోధుఁడు ప్రవేశించి యటనున్నభటునితో నేమో యాలోచించుచుండెను.

"విజయా! వారెవ్వరై యుందురు? "

"అయ్యా! గంగాతీరమువఱకుఁ బోయివచ్చిన మనచారులు చెప్పినయోధులే యయియుందు రని నాయభిప్రాయము"

"నిజముగ వారేయగునచో మనకార్యమునకెల్లవిధముల సహాకారులు కావచ్చును"

"ఎవ్వరైననేమి? దేవర సంపూర్ణముగఁ దలంచినచో దేవునినైన దాసునిగఁ జేయగలరు"

"వారిరువురు నొకరికొకరు రీతియు లేకుండఁ బనిచేయుచున్నారఁట! "

"ఇరువురగుటలోఁగూడ నాయనుమానమునకు బలీయముకారణ మగపడుచున్నది"

"ఔను. నేను నట్లె యూహించితిని"

"ఊహయేకాదు. నిశ్చయముకూడనదియే యయియుండును"

ఇట్లు సంభాషించుచుండఁగాఁ దపోవనమార్గముననుండి యొక బాలయోగి యాదుర్గమునఁ బ్రవేశించెను. యోగులకుఁ బ్రవేశింపరాని చోటు లేదుకాఁబోలు! ఆతఁడు నిరభ్యంతరముగ నారహస్యస్థలమున నున్న యోధుని సమీపించెను. ఆతఁడు వచ్చినతోడనే భటులెచ్చటికో వెడలి పోయెను. ఆదుర్గమున నెవ్వరెచ్చటికిఁ బోవ్రచున్నదియుఁ గ్రొత్తవారికిఁ దెలియదు.

యోధుఁడు యోగిఁజూచి "విశేషములేనైనఁ దెలిసినవా?" అని యడిగెను.

"అన్నియుఁ దెలిసినవి. వారేవీరు"

యోధుఁడు సంతోషముతో "నిజముగానా? నిజముగానా?" అనియెను.

"సత్యము. సత్యము. ఆకాలము నికాలమును సరిపోయినది. ఆరూపములు నీరూపములు సరిపడినవి. ఆగుణములు నిగుణములు నొక్కటియే"

"ఇటఁ గూడ నద్భుతకార్యములు చేయుచున్నారా?"

"ఆ. చేయకేమి? దైవము వారిపక్షమునఁ బనిసేయుచున్నది"

"వారిచరిత్రమాతయును మొదటినుండియును గ్రహించితివా?"

"రాజయోగానందుని శిష్యుఁడనగు నాకంతమాత్రము వివేకముండుటలోఁ వింతయేమున్నది?"

"వదీచెప్పుము!"

అంబోకనియం దొకవిధముగు నాకర్షణశక్తి యున్నది. మూఁడు లోకములు నేలఁదగినలక్షణము లాతనికడ నున్నవి. వాని జూచిన తోడనే యెట్టిరాజాధిరాజైనను దాసానుదాసుఁడు కావలసినదే. రెండవ యోధుఁ డాతని కించుమించుగా సమానుఁడు. ఆతేజోమూర్తుల

దర్శించినంతమాత్రమునసే రాజ్యకల్లోలములచే దేశమువిడిచి యడవులం దిరుగుచున్న యోధులు చాలమంది తమసేనలతో వారినాశ్రయించిరి. అందొకని ప్రభునిగను, ఒకనిసేనానాయకునిగను జేసికొనిరి?"

"వా రిప్పుడేమిచేయఁజూచుచున్నా రు?"

"ఏమిచేయుట కేమున్నది? రాజున్నాఁడు. సేనలున్నవి. ఇంకఁ గావలసిన దేమున్నది? రాజ్యమును స్థాపింపఁదలఁచి ప్రయత్నించు చున్నారు"

"రాజ్య మెచ్చటనుండి సంపాదించెదరు?"

"వారెచ్చటనుండిన నచ్చటనే రాజ్యస్థాపనమగును"

"వారిప్పు డెచ్చటనున్నా రు?"

"శతద్రూనదీతీరమునందలి శైలారణ్యమున"

"మనకుఁ జాలసమీపమునకే వచ్చియున్నా రే! "

"వచ్చటయేగాదు. అచ్చటఁ గొంతకాలము నివసించుటకుఁ దగిన ప్రయత్నములు సేయుచున్నారు."

"వారికి మనసంగతు లేవైనఁ దెలిసినవా?"

"తెలియలేదు. కాని, తపోవనమాహాత్మ్యమును, రాజయోగానంద స్వామివారిప్రభావమును, మాత్రము వారు వినియున్నట్లు తెలియ వచ్చినది.

ఇట్లు సంభాషించుకొని వారిరువురును వెడలిపోయిరి.

నాల్గవ ప్రకరణము.



నిర్జనారణ్యములయందును, పర్వతగుహలయందును, మహాము నులు నివసింతు రని మనము వినియున్నాము. సంగరహితులై, నిశ్చల జ్ఞానముచే నెలుంగువారల కాప్రదేశము లత్యంతయోగ్యములై విశేష జ్ఞానప్రదములయి యొప్పారు ననుట సత్యము. నిజముగ మనకుఁ గాన వచ్చుప్రకృతిచిత్రము లన్నియు నందుండియే వారుగ్రహింతురు. తత్వ విజ్ఞానులయి, నిర్మలపరబ్రహ్మస్వరూపమును దిలకింతురు. కాపున నట్టి వివిక్తపదేశము లెట్టినూర్గముల నున్న నేమి ముక్తిసాధనమునకు మెట్టులవంటి వని పెద్దలు చెప్పుచున్నారు. ఆమెట్లమీఁదనే మనము మహాత్ములఁ జూడఁగలుగుదుము.

ఒకనాఁటియుదయకాలమున శతద్రూనదికిని, యమునకును, మధ్య భాగమునందున్న శైలారణ్యమున నొకమహాతపస్వి యొంటరిగఁ బోవు చుండెను. ఆతఁడు కాషాయనస్త్రధారియయి యుండెను. కాషాయ వస్త్రధారణమాత్రమున మునియని చెప్పరాదని తలంపరాదు వంచక యోగులు, జనపదములయం దుండిన నుందురేమో కాని, మహారణ్య ములు దుర్గమశైలముల నెవ్వరిని వంచించుటకయి యాతఁ డీవేషమును ధరించెను? ఇచ్చట నెవ్వరు లేరే! నిశ్చయముగ నీతఁడు సంసారకామిని వంచించుటకయి యీప్రాంతములం జేరి యుండును. ఈయరణ్య వృక్షములనిడఁ గోరి యుండును.

ఆమునీంద్రునికాయము బలిష్ఠమైన దని తెలియుచుండెను. నలు బదియేండ్లకు మించనివయసునకుఁ దగినట్లుగనే యాతనిశరీరదార్ఢ్యము వెలయుచున్నది. ఆతఁడు కంఠమున మనోహరరుద్రాక్షమాలికలును, హస్తమున దండకమండలములును గలిగియుండెను. నల్లనిగడ్డమును

ఒత్తగుమీసములును, సువర్ణచ్ఛాయలఁ దులకించుచున్న యాతని ముఖమండలమునకు విశేషాలంకారములయి యొప్పుచుండెను. కన్నులతి విశాలములయి యించుక రక్తరేఖామిశ్రితములయి యున్నవి. యోచనా సదన మగుఫాలము సమవిలాసమయి సంపూర్ణతేజోవిరాజిత మగు చుండెను.

ఆతఁడు హిమాలయమునుండి దక్షిణాభిముఖుండయి చను చుండెను. శైలారణ్య మత్యున్నతపర్వతపంక్తులతోడను, ఆకాశము నొయుచున్న వృక్షములతోడను, సూర్యాతపమున కభేద్యమై రాజ యోగులకొకపెట్టనికోటగ నలరారుచుండెను. తపస్వి వలయాకారముగ నున్న పర్వతమధ్యప్రదేశమునఁ బ్రయాణము సేయుచుండెను.ఆమధ్యభాగ ము మనోహరలతాగుల్మములచేఁ జుట్టుకొనఁబడియుండెను. ముని యా ప్రదేశమునకుఁ గుడిచేతిమీఁదుగ మఱికొంతదూర మేగెను.అదిగతద్రూ నదీతీరప్రాంతము. ఆసమీపమునసేయొకదుర్గము నిర్మింపఁబడుచుండెను పరిజను లాయాపనులయందు నియోజితులయి పనులు సేయుచుండిరి. ముని దానిని గాంచినతోడనే యత్యాశ్చర్య మగ్నుఁడయ్యెను. ఆతఁ డీవఱకిందు మనుష్యులు నుసలుటయే చూచియుండలేదు. ఇప్పుడు దుర్గమే నిర్మింపఁబడుచున్నది అందొకవృక్షచ్ఛాయ నిరుప్పురుమను ష్యులు గూర్చుండి యేమియో యాలోచించుకొనుచుండిరి. యోగి వారి నల్లంతదూరమునఁ జెట్లచాటునుండి చూచెను. వారిని చూచిన తోడనే యాతనికి బదరికాశ్రమవాసు లగునరనారాయణులు జ్ఞప్తికి వచ్చిరి. వారిట్లు పిలాసార్థము వచ్చియుండిరా? యని యాతఁడు శంకిం చెను. ముని ముందునకు నడువలేదు. అక్కడనే నిలిచి వారియాకార ములను బరీక్షించుచుండెను.

అందొకపురుషమూర్తి మునిచిత్తము నాకర్షించెను. ఆమనో హరగంభీరవిగ్రహము నాతఁడక్కట్టె తెప్పవేయక చూచుచు నాలక్షణ

ముల, మనసము సేయఁదొడంగెను. ఆతనివదనమండలమునుండి వింత తేజ మొకటివెలివిరియుచుండెను. ఆతేజమును సంపూర్ణచంద్రబింబము నందును, నాతఁడు సున్యక్తముగఁ గాంచియుండఁడు. లావణ్యతేజో మయము లగునాముఖలక్షణముల నాతఁడు చూచుచు నత్యాశ్చర్య ముతో "లోకపాలనాదక్షతవహించినయీమూర్తి యీమహర్షిమారణ్య ముల నేలవసియించియుండె" నని తలపోయసాగెను. సర్వమును దనకు వ్యక్తమైనట్లు తలయూఁచెను. అనంతసంచారిణి యగులక్ష్మి వివశ యయి యాతనివిశాలవక్షస్థలమునఁ గన్ను లఱమోడ్చియున్నట్లు లాత నికి ద్యోతకమయ్యెను. ఈలక్ష్మి యిట్లేల నిమీలితనేత్ర యయ్యె నని యాతఁడు తనదివ్యదృష్టిచే జూడసాగెను. మహాత్ముల యంతర్దృష్టికి గోచరింపనియంశ మెచియుండును? సర్వము నాతఁడు గ్రహించెను. మెల్లఁగ నాపురుషపుంగవులున్న తావునకు సమీపముగఁబోయెను. పురు షులిర్వురును నీమహాత్ముని జూచి లేచి నమస్కరించిరి. "మనోరథఫల సిద్ధిరస్తు" అని ముని యాశీర్వదించెను. ఆమువ్వురు నావృక్షచ్ఛాయ నాసీనులయిరి. ముని వారిప్రశ్నల కవకాశ మీయకుండఁగనే యిట్లనియెను.

"వత్సలారా! మీవృత్తాంతము సర్వమును నీశ్వరానుగ్రహమున నేను గ్రహించితిని. మీకు సర్వవిధముల జయము కలుగును. మీ కష్టదినములు గడచినవి. అచిరకాలములోనే మీకు మనోరథములు సిద్ధింపఁగలవు" అని వారికుచ్చెను.

పురుషులిరువురు నావాక్యముల కాశ్చర్యమగ్నులైరి. యోగి కన్నులుమూసికొనియోచనానిమగ్నుఁడయికొంతవడికి మరలఁ గన్నులు తెఱచి యొకపురుషునిగాంచి యిట్లనియెను.

"నత్సా! మీపూర్వవృత్తాంతమును దెలుపు మీకంతయిష్టముగ నుండదేమో దాని నాఁపి భవిష్యత్తునుగూర్చి యించుకఁ జెప్పవల

నని యుత్సాహపడుచున్నాఁడను. ఇప్పుడు లక్ష్మీకటాక్షము నీకుఁ గలిగినది. ఆమె సోత్సాహినియయి నీకెల్లవిధముల మేలుసేయవలయు నని నిరీక్షించుచున్నది. శీఘ్రకాలములోనే నీవు మహా రాజాధిరాజ వగుదువు. అప్పుడు నీరక్షణము మాబోంట్ల కవశ్యకర్తవ్యము. మాయాశ్రమప్రదేశములును, సర్వమును, నీయధీనమం దుండును. నీవు సాధుసంరక్షకుఁడవై చిరకాల మీయవనిని పాలింపఁగలుగుదువు నీనీప్రదేశమున నీశక్తిసామర్థ్యములచేనిందున్న యోధులకొకసైన్యముగాఁ జేర్చుకొని యీయుద్యమును గట్టుచున్నాఁడవు. ఈపని నీకు సులభసాధ్యమై యీశ్వరకటాక్షమున నిది దిగ్విజయముగఁ బరిసమాప్తి కాఁగలదు"అని వచించెను.

ఈసాధువాక్యములు వినినతోడనే యాపురుషునకు నటంత యద్భుతము కలిగెను.

యోగి ''నలయునేని నీవు మాయాశ్రమునకు రావచ్చును. ఈశత్రుభూమి కవ్వలియొడ్డుననే మాతపోవన మున్నది" అని వచించెను.

పురుషుఁడు "మహాప్రసాదము" అని వినయమును జూపి "తాము రాజయోగానంద స్వాములవారా?" అనిప్రశ్నించెను.

రాజయోగానందస్వామి తపోవనమునందు నివసించియున్నాఁడనియు నాతఁడు చాలమహిమాసంపన్నుఁడనియుఁ బురుషుఁడివలకు వినియుండుటచే నట్లు ప్రశ్నించెను.

స్వామి "అవును" అనియెను.

ఈమునిపుంగవునియద్భుతమేధాశక్తి మన కత్యాశ్చర్యమునే కలిగించుచున్నది. కాని, దివ్యమునులహృదయములకుగోచరింపనియంశ మేమిండును? జ్యోతిషశాస్త్రవేత్తలగుమహానుభావులు కొందఱు గ్రహగతుల గణించి మానవుల భూతభవిష్యదర్థంబులఁ గరతలా

మలకంబుగ నిశదీకరింతురు. కొందఱు పండితులు కేరళశాస్త్రీను సారముగ మనుజులయోగాదులు నిర్ధారణ సేయుదురు. సంసారక్లేశభార విముక్తులగుయోగులుకొంద ఱుత్తరయోగిసీమతము ననుసరించి సర్వప్రపంచసంగతులనంతలో గ్రహించి వ్యక్తీకరింతురు. ప్రాపంచకతత్త్వము నామూలముగ గ్రహించి పరబ్రహ్మస్వరూపమును దివ్యజ్ఞానముచేఁ జూచుచున్న మహర్షుల కన్నిశాస్త్రములును తలంపులోననే నూర్తి భవించి మెలంగుచుండును అన్నివిషయములును నద్దమునందువలెనే స్పష్టముగ గోచరించుచుండును. ఈయోగి చాలమహిమగలవాఁడనియే మనము నిశ్చయింపవలసి యున్నది. మహాత్ముల శక్తి సామర్థ్యములనంతము లగునవిగదా!

పురుషుఁ డించుక యోచించి యోగ యథార్థస్థితి చెలియు నుపాయమును కనిపెట్టెను. ఈపురుషునిక్రింది నున్న యోధులందఱును సీయోగి నెఱిఁగియే యుందురు. వారంద రాదేశవాసులే. ఆకారణమునఁ బురుషుఁడు.

'మహాత్మా! దుర్గప్రదేశమును జిత్తగింపఁ గోరుచున్నాఁడను" అనివిన్నవించెను.

యోగి యాతనిభావమును గ్రహించెనో లేదో కాని "అట్లే యక్కడికిఁ బోవుదమురండు" అనియెను. ముప్పురును లేచిరి. తిన్నఁగ నాకట్టుచున్న దుర్గములోఁ బ్రవేశించిరి

ఆయోగిమహిమయేమి చెలిసికొనిరో కానినాఁడు మొదలాపురుషులిర్వురు నాతనికిఁ బ్రియశిష్యులయి మెలంగుచుండిరి. వారు మన చంద్రగుప్తవసంతులే. శైలదుర్గమున నాటిరాత్రి యోధుఁడు ప్రశ్నించినది వీరినిగూర్చియే

అయిదవప్రకరణము.

రాజయోగానందస్వామి యాశీర్వచనప్రభావమునఁ గొన్ని మాస ములలోఁ శైలారణ్యమునంచలిదుర్గము నిర్విఘ్నముగ నిర్మింపఁబడియెను. ఆదుర్గమునకుఁ బడమటిదిక్కునఁ బ్రవహించుచున్న శతద్రూనది నాధా రముచేసికొని తక్కినమూఁడుదిక్కులందును గభీరమైనయగడ్త యేర్ప ఱుపఁబడియుండెను. ఆదుర్గమునకు బండ్రెండు ద్వారములుండెను. అందేబదివేలసైన్యమువఱకు నుండవచ్చును. దానికిగుప్తదుర్గ మనిపేరు పెట్టిరి. కోట యన్ని ద్వారములయందును ద్వారపాలకులు ఖడ్గపాణులై కావలికాచుచుండిరి. కోటకందకమునకవ్వల చుట్టను గొండలచే నావ రింపఁబడి యుండెను. ఆపర్వతపంక్తులచేతనే యందు దుర్గమున్న దని పైనుండిచూచువారెవ్వరును దెలిసికొనఁజాలరు. అవి యెత్తైనవృక్షముల చేతను, దట్టమైన లతలచేతను, పొదలచేతను, నల్లుకొనఁబడియుండెను. ఆ దుర్గమునకు దక్షిణమునమాత్రము చిన్నచిన్న గుట్టలుండెను. కాని యంతయునరణ్యమే. ఆకారణమున నట గజకచ్ఛటులెప్పుడునుండియూ త్రోవనెవ్వరైనవచ్చుట తటస్థించినయెడల నేక్రూరమృగభయమో కల్పించిమత్రియొకమార్గమునకు మరలించుచుందురు. ఆమాటలవినక యందుఁబ్రవేశించినవారు మరలఁ బ్రాణములతో నిలకువచ్చుట యెవ్వరునుజూడలేదు.

ఒకనాఁటిరాత్రి పర్వమువిశేషముగఁగురియుచుండుటచే గొండ కనుమలనున్నగజకచ్ఛటులందఱును నిలువలేక దుర్గమునకుఁబోయి యుండిరి. వర్షమువెలిసినపిదప మరల రావచ్చునని వారూహించు కొనియుందురు కొండలప్రక్కనుండి నిర్ఝరప్రవాహములు గలగల ప్రవహించుచుండెను. వర్షమింకను బాగుగ వెలియలేదు.

చీకటియంతట దట్టముగ నల్లికొని దారితెన్ను నగపడకి యుండెను. ఇది చెట్టు, ఇది పుట్ట, ఇది కల్లము, ఇది మొరక, యను వివేచనము కలుగుట కనకాశము లేకుండఁబోయెను. మేఘగర్జనములు కొండగుహాలలోఁ బ్రతిధ్వనించుచుండెను. అందందు సంచరించు వన మృగములు వర్ష వేగమునకునిలువలేక యిటునటుపరువెత్తుచు పెద్దపెద్ద బొబ్బలతో నావనమంతటను జెల్లాచెదరుగఁ దిరుగుచుండెను. నీటివెల్లు వలకుఁ గొట్టుకొనిపోవుచున్న కృష్ణసర్పము లందందు దొరకిన వృక్ష మూలముల నాశ్రయించి బుసలుకొట్టుచుండెను. కప్పలబెకబెకారావ ములచే భూనభోంతరాళములు మారుమ్రోయుచుండెను. అయంధ కారమున నట్టిభయంకరారణ్యమున నాక్రూరజంతుసంకుల భీషణారావ ములనడుమ మనుష్యమాత్రుఁ డెవ్వఁడు బ్రదికి సంచరింపఁగలఁడు?

క్రమక్రమముగ వర్షము వెలిసినది. కొంతసేపటికి జలప్రవాహ ములును తగ్గినవి. భూమి నీటిలోనుండి బయటఁ బడియెను. రాత్రి రెండు జాము లైనది. అది కృష్ణపక్షము మగుటచేతను, నాఁడష్టమి యగుట చేతను, అప్పుడే చంద్రోదయ మగుచుండెను. ఇంకను మబ్బు బాగుగ విడిపోననికారణమున వెన్నెల యంతతేటగ లేదు. ఆవెన్నెలకాంతియై నను వృక్షాగ్రముల మీఁదను, పర్వత శిఖరములమీఁదను, మాత్రము ప్రసరించుచుండెను. చెట్లక్రిందను, పొదలలోనను, గాఢాంధకారమే. చంద్రుఁడు పైకెక్కినకొలఁది కొమ్మలసందులనుండి తొడిసియున్న నల్లని భూమిపైఁ బూడపూడలుగఁ దోఁచువెన్నెలకాంతులు నీలాంబరము పై నున్న మల్లెపూలరాసులవలె రమణీయముగఁ గనఁబడుచుండెను.

ఆసమయమున నాయరణ్యదక్షిణపార్శ్వమునుండి కొండకనుమల దాఁటి యొకపురుషుఁడు ఖడ్గహస్తుఁడై మెల్లగదారిఁజూచుకొనుచువచ్చు చుండెను. అతఁడందు సంచరించునలవాటు లేనికారణమున నొక కొండ కనుమవెంటవచ్చుటకుమారుగ నొక రాతిమిట్ట చిట్టచివరకెక్కినలుదెసలఁ

బరికించుచుండెను. దూరముననుండి యెవ్వరో యాదారిని వచ్చుచున్నట్లు కనిపెట్టెను. "రానిమ్ము స్వామియాజ్ఞ నెఱవేర్చి కృతకృత్యుఁడ నయ్యెద" నని యనుకొనియెను. వెంటనే మెట్లపైనుండి దిగి దుర్గ సమీపమున నున్న వృక్షపంక్తిలోఁ బ్రవేశించెను. ఆచెట్ల దాఁటి యాతఁడు ముందునకుఁబోవక లతాపత్రములచే నిబిడకృతం బగునొక వృక్షము నెక్కి గుబురుగొమ్మలలో దాఁగియుండెను.

కొంతసేపటికి వెనుకనున్న పురుషుఁడు దాసమీపమున నందందుఁ దిరుగుచుఁ గ్రమముగా నిచ్చెట్టు నొద్దకు వచ్చెను. అతని కెట్టయెదుట దుర్గము గానిపించెను. అతఁడు దుర్గమును జూచి యాశ్చర్యముతో "ఈదుర్గ మెవ్వరిదై యుండును? నేనుకొన్ని మాసములక్రిందటఁ దక్షశిలా నగరి మేగునప్పు డీమార్గమునసే నాసహచరులతోఁ బోయి యుంటిని. అప్పు డిందీదుర్గమును జూచియుండ లేదు. ఇదెవ్వ రుండియుందురు? మాప్రభు వనేకప్రయత్నములు చేసి వెదకుచున్న పురుషు లిందుండి యుందురేమో? దీని కానుపాను లన్నియును జూచి మతిపోవలయును. ఈ వృత్తాంతము మాప్రభునకు నివేదించి బహుమానము నందెదను" అని యనుకొనుచు వెన్నెలవెలుతురునఁ దన్నెవరైనఁ జూచెదరేమో యని మొదటిపురుషుఁ డెక్కి యున్న చెట్టుచెడను నిలువఁబడి యుండెను.

ఆచెట్టు పొన్నచెట్టు. దానికొమ్మలు గుబురుగను, నేలకుఁ జాల సామీప్యముగను నుండెను. ఆచెట్టుపై నున్నపురుషుఁడు కదలినయెడల నాకులపైనున్న వర్షబిందువులు క్రిందివానిపై జలజల రాలును. ఆకారణ మునఁబై నున్న యాతఁడు చిన్నకొమ్మలపైకి దిగుటకుఁ బోక నెమ్మదిగాఁ జెట్టు మొదటి పలవలోనికి దిగియెను. క్రిందిపురుషుఁ డచ్చటికి రెండు మూఁడుగజములదూరముననుండెను. అప్పుడు మొదటిపురుషుఁడు పలవ

పైఁ గూరుచుండి తిన్నగ గురిచూచి తన కుడిచేత నున్న ఖడ్గమును ముందునకు వఁగి క్రిందనున్న వాని పైకి విసరెను. అగి గురితప్పక యాతని వెన్ను నుండి గుండెలవఱకును బలముగ గ్రుచ్చుకొనియెను. ఆపోటుతో నాతఁడు "హా! చచ్చితిని" అని యొక పెద్ద కేక వైచి క్రిందఁ బడిపోయెను.

చెట్టుమీఁద నున్న యాతఁడు క్రిందికి గుమికి తనకత్తిని దీసికొన వలయునని ప్రయత్నించుచుండెను. ఈలోపలఁ గోటదక్షిణద్వారమున నున్న రక్షకభటులు లీయార్తనాదమును విని పరుగెత్తుకొని వచ్చిరి. వారు వచ్చులోపల మొదటివాఁడు రెండవవానిహృదయమును భేదించి తనఖడ్గమునూడఁ బెఱికికొనియెను. ఆకత్తిదీసినతోడనే యాతనిప్రాణము లెగిరిపోయినవి పురుషునియొడలును మొగమును రక్తమయమయ్యెను. ఇంతలో రక్షకభటులు వచ్చి మొదటిపురుషుని బట్టుకొని "నీవెవ్వరవు? ఈతని నేల చంపితివి?" అని బలవంతపెట్టి యడుగసాగిరి. కాని, వారి కాతఁ డేమియు నుత్తర మీయలేదు.

అప్పు డాభటులు హంతకుఁడగు మొదటి పురుషుని, చచ్చిపడి యున్న రెండవ పురుషుని మృతకళేబరములతోఁగూడ దుర్గద్వారము చెంతకుఁ దీసికొనివచ్చిరి. అప్పటికిఁ జాలమంది సేవకులు లోపలినుండి పరుగెత్తుకొని వచ్చియుండిరి. "వీఁడెవ్వఁడో మన వృత్తాంతమును దెలిసి కొనుటకయి వచ్చెను. చంపుఁడు! పొడువుఁడు!" అనికొందఱును "చంపిన కారణమేమియో తెలిసికొనినవెనుక నీతనిగూడ నాతనితోడనే పంప వచ్చును" అని మఱికొందఱును బిగ్గఱగ మాటలాడసాగిరి. కోటముంగు వినఁబడుచున్న యీకలకలము విని దుర్గములోనివారు కొందఱు లేచిరి. కొందఱు "దొంగలుదొంగ" లని కేకలువైచిరి. ఆకేకలతో నందఱును లేచిరి. ఇంతలో దుర్గాధిపతి యగుచంద్రగుప్తుఁడు లేచి యుచితరీతి

నచ్చటికి విచ్చేసెను. అతని వెనుక వసంతుఁడుకూడ లేచి వచ్చెను. రక్షకభటులు జరిగినదంతయును చెల్పి శిక్షార్హుఁడగు నాపురుషుని రాజు ముందఱఁ నిలువఁబెట్టిరి.

ఆపురుషుఁడు చంద్రగుప్తునకును వసంతునకును నమస్కరించి నిర్వికారముగ నిలువఁబడియెను. వారాతని ధైర్యమునకు మిగుల నాశ్చర్యపడిరి.

అప్పుడు చంద్రగుప్తుఁడా పురుషుని గూర్చి "నీవెవ్వరు?" అని ప్రశ్నించెను.

" నేను స్వామిభక్తుఁడను" అని పురుషుఁడు బదులుచెప్పెను.

" అకారణముగ మార్గస్థులను దొంగపోటుగ హింసించు హంతకులు స్వామిభక్తు లెట్లగుదురు? "

" ఈతఁడు మార్గస్థుఁడు కాఁడు, రాజద్రోహి"

" ఈతనిప్రభు వెవ్వరు ?"

" నందుఁడు"

చంద్రగుప్తుఁడు మండిపడి " నీవు నందునిచారుఁడవా?" అని గద్దించి పలికెను.

" నేనట్టినాఁడను గాను. నందభటునిప్రాణముల హరియించిన వాఁడను."

" ఆతని నీవేల చంపితివి?"

" చంద్రగుప్తునకు ద్రోహము తలపెట్టుటచేత"

చంద్రగుప్తున కనుమానము కలిగెను. ఆతఁడు ప్రాణముల కాసించి కపటమార్గమును ద్రొక్కుచున్నాఁ డని తలంచెను. "నినివాస మెక్కడ?" అని ప్రశ్నించెను.

" పాటలీపుత్రమున"

"పాటలీపుత్రప్రజలకుఁ జంద్రగుప్తునిపై నభిమాన మెందు లకు"

"ఆప్రజలకన్ను లన్నియును జంద్రగుప్తునిమీఁదనే యున్నవి. అందుఁ జాణక్యునిశిష్యుఁడ నగునా కాతనిపై భక్తి యుంఁటఁ గాశ్చర్య మేమి?"

చంద్రగుప్తునకు మతీంతయనుమానము కలిగెను. ఈయొక్క ప్రశ్నలో నాతనిసత్యచరిత్రమును దెలిసికొనవచ్చు నని తలంచెను "ఓయీ! చాణక్యుఁ డగ్నిజ్వాలలోఁ బడిపోయెనుగదా! ఇంక నాతనికి శిష్యులెక్కడ నుందురు?" అనియెను.

పురుషుఁడు కర్ణములమూసికొని "అమంగళము శాంతించుఁ గాక! శత్రుప్రులును, హెలియనిప్రజలు, నట్లునమ్మియున్నారు. ఆమాట మే నిజమైనయెడల నీయుత్తర మెట్లు మీకు వ్రాయుటతటస్థించును?" అని తనయంగీలోనుండి యొకయుత్తరముఁ దీసి చంద్రగుప్తున కొసంగెను.

చంద్రగుప్తుఁ డాయుత్తరము నందుకొని యిట్లుచదువుకొనియెను.

"వత్సా! ముదాకుమారా! కలశపురమున వసుమతిని శత్రువు లెత్తికొనిపోయి రని విని చాల చింతించితిని. అది దైవగతి.ఆమెకై. యీప్రాంతముల వెదకించుచున్నాఁడ. నందపక్షపాతు లగురాజుల నారసి నీవుకూడ నాయాచోటుల వెదకించుచుండుము. వసంతునకు ధైర్యము చెప్పుచుండుము. నేనిచ్చట నందనధోద్యోగమున నున్నాఁడ. సమయమును నిరీక్షించుచున్నాఁడను. నీయభ్యుదయమును విని పర మానందము నొందినాఁడను. ఇక్కడ విశేషములంగూర్చి మరల నుత్త రము వ్రాసెదను. అచ్చటివిశేషములఁ దెలుపుచుండుము."

చాణక్యుఁడు"

ఈయుత్తరము చదివినతోడనే చంద్రగుప్తున కమితానందము కలిగెను. వసంతునిహృదయముమాత్రము వసుమతీస్మరణమునలన కలక

నొందుచుండెను. ఆయుత్తరమునుబట్టి యాపురుషుఁడు చాణక్యశిష్యుఁడే యని చంద్రగుప్తునకు నమ్మకము కలిగెను.

ఈసందర్భమునందెలిసినచాణక్యుని చరిత్రముంగూర్చి చదువరులు సందేహింపనక్కఱలేదు. ఆతఁడు సకలవిద్యాపరిపూర్ణుఁడు. అగ్ని స్తంభన విద్యవలననో మఱి యేమాహాత్మ్యమువలనో, యాతఁడు జీవించి యుండవచ్చును. అలనాఁటిరాత్రి మిత్రుఁడగు నిందుశర్మతోవచ్చి చంద్రగుప్తునిఁ గోటలోనుండితప్పించిన మహాత్ముఁడుచాణక్యుఁడే. నందవంశమును నాశనముచేయకుండ, మగధరాజ్య సింహసనమునఁ జంద్రగుప్తుని స్థాపింపకుండ నాసంకల్పసిద్ధుఁడు మూరక మరణించునా?

చంద్రగుప్తుఁడు పురుషునివంకఁ జూచి "నీముఖమండలమురక్తసిక్తమై యుండుటచే నిన్నానవాలు పట్టలేకున్నాను. నీవు ఱేమి?" అనిప్రశ్నించెను.

"భద్రుఁడు" అని యాతఁడు చెప్పెను.

చంద్రగుప్తుఁడాపేరు నిదివఱకు వినియే యున్నాఁడు. "నీవు విశాఖులునితమ్ముఁడవుకావా? నిన్నుగుర్తుపట్టలేక పోతిని! భద్రా! నీవీపురుషునెందులకుఁ జంపితివి?" అనియెను.

"నేటి యుదయమునుండియు నీతఁడు నన్ను వెన్నాడి వచ్చుచున్నాఁడు. ఆతనికిఁ దెలియకుండ నేనును, నాకుఁదెలియకుండ నాతఁడును నిసుమాపవనమునఁ బ్రవేశించితిమి. యమునానదియొడ్డున నీతఁడు తనమిత్రునితో సంభాషించినమాటలనుబట్టి యీతఁడు డీపాంచాలరాజులలో నెవ్వరికో వేగునడుపుచున్నట్లు తెలియవచ్చినది. ఈతఁడే దోలేఖకూడఁ దీసికొనిపోవుచున్నట్లనుమానించితిని. ఆకారణమున నీతని నూరక విడిచిన నపాయము రాఁగలదని యూహించి యీతని వెనువెంటనేవచ్చితటి వేచియిచ్చటసంహరించితిని" అని పురుషుఁడు చెప్పెను.

"అటులైన నీతనిసుస్తులలో నేదైన లేఖ దొరకునేమో వెదకుఁడు" అని చంద్రగుప్తుఁ డాజ్ఞాపించెను.

రక్షకభటు లట్లు వెదకి యతనియంగీలో నున్న లేఖను దీసి చంద్రగుప్తునకిచ్చిరి. ఆతఁ డాయిత్తరమునందుకొని యీక్రిందివిధముగఁ జదివెను.

"ప్రియమిత్రమా !

రత్నగిరిరాజు పరిచారికాసహితముగ నీయొద్దకుఁ గొనిరాఁబడిన దని విని యానందించితిని. కల్లోలము లణంగువఱకు నామెను నీయొద్దనే యుంచి సంరక్షింపుము. ఇచ్చట ప్రజలందఱును రాజద్రోహులైపోవ్రచున్నారు. నేనును, సమయానుకూలముగ శాసించుచున్నాఁడను. చాణక్యుఁడు చచ్చియును సాధించుచునే యున్నాఁడు. చాల నలజడిగానున్నది. నాకు శత్రువులైపోయినవారినిగూర్చి నీవును తగినంతప్రయత్నము చేసి వెదకించుచుండుము. తఱుచుగ నుత్తరములు వ్రాయుచుండుము.

మహారాజాధిరాజ పద్మనంద"

ఇట్లు లేఖను జదివెను. కాని, యది యెవ్వరికి వ్రాయఁబడినది యేమాత్రము బోధపడలేదు. చాకుఁడు చంపఁబడినందులకుఁ జంద్రగుప్తుఁడు విచారించెను. వసుమతిజాడ నరయుటకయి మరలఁ గొంతయవకాశము దొరకెను. ఆమె పాంచాలదేశమునం దున్న రాజులలో నెవ్వరియొద్దనో యుండు నని నిశ్చయింపఁబడియెను.

ఈయుత్తరముల మూలమున వసంతునిహృదయము కలఁగిపోయెను. వసుమతి యెట్టిపాటునకు లోనైనదో యనువిచార మాతని హృదయమును వేధించుచుండెను. వసుమతినిఁ జోరు లపహరించిన మూఁడుదినములకు వసంతుఁడును జంద్రగుప్తుఁడును కలశపురమునకుఁ బోయిరి. అచ్చట పిడుగువంటి యీవార్త నాలకించిరి. నాఁటనుండియు నామెయీగడ యేమియును దెలియుటయే లేదు.

ఆఱవప్రకరణము.

ఎచ్చట హృదయము లగ్న మగుచుండునో యచ్చట భావముదయించుచుండును. భావమునకు వికారములున్నవి. అదిక్షణక్షణమునకును, వింతవింతరూపములను దాల్చుచుండును. దానిరూపము లనంతము లైనవి. ప్రపంచమునందలియన్నిరూపముల నది ధరింపఁగలదు. హృదయముకురమునందుఁ బ్రపంచమంతయుఁ బ్రతిఫలించుచుండును. దానికొకతెర యున్నది. అట్టితెరఁ దీసినయంతభాగమందు నది గోచరించుచుండును. అది యెంతవఱకు గోచరించుచుండునో యంతవఱకే దానితో భావమైక్యము నొందుచున్నది. లేదా యారూపమును ధరించుచున్నది. భావమునఁ దిట్టియద్భుతశక్తియే లేనియెడల నిప్పుడా వసంతునిహృదయమునందు వసుమతీమోహనవిగ్రహ మెట్లు ప్రదీపిత మగుచున్నది?

వసంతుఁ డిప్పు డెందున్నాఁడు? దేహపరిశ్రమాగారమున లేఁడు కార్యాలోచనామందిరాంగణమునం దిరుగుట లేదు. సమరశాస్త్రాధ్యస్తులఁ బరీక్షించుటలేదు. శత్రుకార్యశంత్రములకుఁ బ్రత్యాలోచనము

సేయుటలేదు. అవృష్టాధిదేవత యుషీలో వినోదించుచున్న చంద్రగుప్తుని పజ్ఞ గూర్చుండి యుండలేదు. నూతనదుర్గమున శయనాగారములోఁ బరుండి యుండెనా? లేదు. మఱి యెందున్నాఁడు?.

శీతలమందమందాలవిలసితం బగుచోట, సరసప్రసూనసౌరభ సమంచితం బగుచోట, తరంగశీకరవిక్షిప్తం బగుచోట, తరులతాపల్లవ క్షోభితం బగుచోట, రసాలశాఖాచుంబిత నదీజలంబగుచోట, నానా విధవిహంగవిలాసయోగ్యంబగుచోట, నాతఁడు కూర్చుండి యున్నాఁడు. అది శతద్రూనదీతీరము.

నదివేగముగఁ బ్రవహించుచున్నది. ఆప్రవాహవేగమున మర్మర ధ్వనులు బయలువెడలుచుండెను. పవనసంచలనంబున నానదినుండి బయలువెడలుచున్న తరంగమాలికలలో మనోహరశబ్దంబు లుత్పన్నంబు లగుచుండెను. చందమామ యాయూర్మికాంతోలికలలోఁ జూఁగు చుండెను. తారకలుగూడ నందంద పూవులవలె మెఱయుచున్నవి. తరంగచలనవేగంబున నదియంతయు మెఱుపుతీఁగలతో నిండిపోవు చుండెను. చంద్రునినిర్మలాకారమంతవిస్పష్టముగఁగనఁబడుటలేదు. ఆకా శమును నందుఁ బ్రచలిత మగుచునే యుండెను. తరంగములయించుల యం దది తలనూపుచుండెను. వసంతుఁ డిప్రకృతిచిత్రములను జూచు చుండెనా? లేదు.

అంచాతఁ డేమి చేయుచుండెను. హృదయమునందుఁ బ్రదీపిత మగుచున్న వసుమతీమోహనమూర్తిని గాంచుచుండెను. దానితో మాటాడుచుండెను. ఆతనిభావనాబలమే యట్లు మాటాడించుచున్నది. అందులకాతనిహృదయమే సాక్షి. వసుమతి యెవ్వరికిఁ గనఁబడకుండఁ బోయినను వసంతునకుమాత్రము లోపలను, వెలుపలను నంతటను, గాన్పించుచునేయున్నది. వసుమతి యిప్పుడు విశ్వరూపమును దాల్చినది. అట్లుకానియెడల నాతఁడు సంపూర్ణకళలచే నాకసమున వెలుఁగుచున్న

చందురు నేల "వసుమతీ" యనిపిలుచును? ఆవెన్నెలనిగ్గు నామె మైచాయయని యేల కొంగిలించుకొనఁబోవును? రూపముగలవస్తువులకు రూపమునుగల్పించుట యుక్తమే. భూమ్యాకాశముల యంతరాళమున నెచ్చటఁజూచిన నాతనికి వసుమతియే కాన్పించుచున్నదే! అది యెట్లు? అది మోహవికారమువలనఁ గలిగినతన్మయత్వము. దానిచే నాతనికి సర్వమును వసుమతిగనే కనఁబడుచుండెను. ఆతఁడు కన్నులుమూసికొనియెను. అప్పుడువసుమతి కాన్పించుచునేయున్నది. మరలఁ గన్నులు విప్పెను. ఎదుట వసుమతి యున్నది. మునుపటిలెఁ జెంత సుందరి మాత్రము లేదు. మాటలాడుపట్టున సుందరి యాతనికిఁ బ్రత్యుత్తర మిచ్చుచుండెడిది. ఇప్పుడు వసుమతితో నేమని మాటలాడును? నిత్యసాన్నిధ్యముచే వసంతున కాశంకయును వీడిపోయినది.

ఆతఁడు "వసుమతీ"యని పిలిచెను. ఆమె యాతనితో మాటాడ లేదు. వసుమతిముగ్ధ ఎప్పుడునీవఱకువసంతునితోమాటాడియుండలేదు. ఇప్పుడునుమాటలాడలేదు. వసంతునిహృదయమున కీయగ్ధమే వ్యక్తమైనది. ఇదిపూర్వపరిచయస్మృతి. ఈస్మృతి కర్థమేమని మీరడుగవచ్చును. దీనికనుభవజ్ఞానమే టిప్పణమై యున్నది. వసంతునకు వసుమతినిజూచుట మాత్రమే యనుభవమున్నది. ఆతఁడప్పుడు మాటాడలేదు. ఇప్పుడామెమాత్ర మెట్లుమాటాడును? ఆకథాంశమంతయు ముగిసినది. ఆతఁడు మరలఁ బిలువలేదు. ఆతఁడా మోహనాకారమును జూచుచుండెను. తెప్పవాల్పకచూచుచుండెను. ఆతేజోనుయాకారము, నామోహనతేజోమయాకారము, నాపరిపూర్ణమోహన తేజోమయాకారము, నాతఁడుచూచుచుఁజూచుచునుండఁగనే కనుదమ్ములిట్టిమూఁతవడియెను. అమితతేజస్సును గన్నులు భరింపకయో, వివశత్వమునఁ గనుతెప్పలు బరువులెక్కియో! మూఁతపడియుండును. ఆతఁడు కొంతసేపటివఱకు

మరలఁగన్నులువిప్పలేదు. ఆసమయమునం దాతనిపై నిద్రయావేశించి నది. కాని, యది సుషుప్తిమాత్రము కాదు. ఆనిద్రలో "వసుమతీ! వసుమతీ"యనియాతఁడు రెండుపర్యాయములుమాత్రము పలవరించెను. దీనినిబట్టి యాతఁడెదియో స్వప్నమును గనుచుండెనని తెలియుచున్నది. ఆస్వప్నవృత్తాంతమును వినుఁడు.

వసంతుఁడు వధ్యశిలయొద్ద నుండెను. కూడఁ దలవరులున్నారు. కాని, వారందఱు సుందరియాకారముతో నుండిరి. వధ్యశిల కొంత సేపటికి వసుమతి యైనది. వధ్యశిలకును వసుమతికిని గలసంబంధము నాతఁడు యోచింపసాగెను ఎంతయోచించినను నది యాతనికి విడి పోయినదికాదు. వధ్యస్థానమం దున్నతోఁట యంతయు శచీసౌధమై పోయినది. అన్నియును మారినవి. విష్ణుగుప్తుఁడుమాత్రముమారిపోలేదు. అన్నియు నాతనికి సమంజసముగనే తోఁచినవిగాని తలవరులు సుందరీ రూపమును దాల్చుట యాతని కర్థమైనదికాదు. సుందరియగ్నిజ్వాలల నుండి తప్పించుకొని పాతిపోవుచుండెను. వసంతుఁడుపన్యాసమునిచ్చు చుండెను. ఆయుపన్యాస మంతయు వసుమతినిగూర్చియే. విష్ణుగుప్తుఁ డాయుపన్యాసమును వినుటలేదు. వసుమతివంకఁ జూడసాగెను. వసం తుని యుపన్యాస మంతటిలో నాఁగిపోయినది. విష్ణుగుప్తుఁ డుపన్యాస మును జెప్పుమని యాతని బలవంతపెట్టెను. ప్రజలందఱును జంద్ర గుప్తునితనుబుజములపై నిడుకొనితీసికొనివచ్చిరి. అందఱుబుజములమీఁ దను జంద్రగుప్తుఁడే కనఁబడుచుండెను ఇంతలో శచీసౌధము శత్రుపూ నదిలో మునిఁగిపోయినది విష్ణుగుప్తుఁడాసమయమున వసుమతిని తొ త్తి కొనియెగిరిపోయెను ఎగురుచున్న విష్ణుగుప్తుని బట్టికొనుటకై వసంతుఁడు చేతులుసాచెను. అందలేదు. ఆతనిబుజములమీఁద వసుమతి లేదు. అదివసంతుఁడు చూడలేదు. విష్ణుగుప్తుఁడు తలక్రిందుగఁ బడిపోయెను.

అప్పుడు వసుమతికి దెబ్బతగిలిపోవునేమోయని వసంతుఁడు "వసుమతీ! వసుమతీ" యని కేకవై చెను. దీనిగాథ యింతవఱకు మనకుఁదెలిసినది. ఇంతలో వసంతుఁడు కదలుటచే స్వప్న మాఁగిపోయినది. ఆతఁ డులికిపడి లేచెను. అప్పుడు శతద్రూనదీజలతరంగశబ్దములలో మనోహరగానరసమాధుర్యము లీన మగుచుండెను.

కాంభోజిరాగము—ఆదితాళము.

* 1. చాగుమతి రాధిక యబలరా!
జయ మదనగోపాల! ॥చారు॥

2. నిరంతరమధురానగరవిహారణ
పరతఁ జిక్కి చెలువ నేల మఱచెదు ॥చారు॥

3. అనునిమిషము మనమున నినుఁ దలఁచుచు
నతనుశరనిహతి నలసి తడఁబడుచు
తనులత వడఁకఁగ నదరి బెదరి వగ
మనసు చెదర నుసురు విడునఁగలదుర! ॥ చారు॥

ఈపాట పాడుచున్న వా రెవ్వరో మన కగపడుట లేదు. వసంతుఁ డేమో యాలోచించుకొని యాస్వరము వినవచ్చుదిక్కు ననుసరించి వెడలిపోయెను.

---

* 1. సా స్స ని ధ పా ధ ప మ గ రి సా
ధ ధ ప మ గ గా పా ధ ॥ సాస్స॥

2. స రీ స ని ధ ప ధా ప మ గ ప ధ స రి
స రి గ సా ని ధ ప ధ పా ధ మ గ ప ధ ॥ సాస్స॥

3. స రి స ని ధ ప ధ ని ధ ప మ గ మ ప ధ ని
ప ధ ప ని ధ ప ధ ప మ ప మ గ మ ప ధ ప
మ గ మ ప మ ప ధ ప ని ధ ప స ని ధ ప ధ
రి స ని ధ ప ధ స ని ధ ప మ ప మ గ ప ధ ॥ సాస్స॥

పీఠికాప్రకరణము.

చరిత్రజ్ఞానము పూర్వజన్మస్మృతివంటిది. పూర్వము మన మెట్లుంటిమో, ఏమేమి చేసితిమో, తెలిసికొనవలయు ననుకోరిక ప్రతి మనుజునకునుగలిగియుండును. కాని, యది యసాధ్యమైనవిద్య. మనఋత్ములావిద్యను సాధింపఁగలుగుదురు. సామాన్యులకది దుర్భేద్యముగానుండును. మహానుభావులగుమనఋషులు పూర్వజ్ఞానమునుగలిగియుండిరని మనము పురాణాదులవలన వినుచున్నారము. మనదేశమున నాదినములలో నట్టిమహనీయులు చరిత్రకోశములనలేఁబ్రకాశించుచుండిరి. రానురాను, నట్టిశక్తి ప్రజలయం దడఁగిపోయినది. పూర్వజ్ఞానము నశించినది. అందువలన మనకు నిజమైనచరిత్రములు కావలసినచ్చినది. కాని, యవి వ్రాయువా రెవ్వరు? వాని నెఱింగియున్న మహాత్ములు మనకిప్పు డగపడుటలేదు. ఆకారణమున మనకుఁ జరిత్రములు లేనికొఱఁత కానవచ్చినది. మనమిప్పుడు మనపూర్వచరిత్రమును దెలిసికొనఁగోరుట తొక్కలు లేనిదే యాకాశమున కెగురఁదలంచుట యైనది.

పశ్చిమఖండవాసు లట్లుగాక మొదటినుండియు గ్రంథరూపముగఁ దమతమదేశచరిత్రములను వ్రాసియుంచికొనిరి. వారిలోఁ గొందఱు మనదేశమునకు వచ్చుట తటస్థించినప్పుడు మనదేశచరిత్రములనుగూడఁ దామెఱిఁగియున్నంతవఱకుపక్షపాతబుద్ధితోడనో, న్యాయైకమతితోడనో, న్యూనాధిక్యముల నిరూపించుచు వ్రాసియుంచిరి. ఆయితరభాషా చరిత్రముల నాధారము చేసికొని మనపూర్వచరిత్రము కొంతకొంత యస్పష్టముగనో, సూచనమాత్రముగనో, తెలిసికొనఁగలుగుచున్నారము. మనపూర్వరాజులు స్థాపించిన శిలాశాసనములనుబట్టియు శాశ్వతకార్యములనుబట్టియుఁగూడఁ గొంత తెలిసికొనుచున్నారము. మనకథాకాలము

నాఁటికి గ్రీకుదేశరాజగు నలెగ్జాండరీదేశముపై దండెత్తివచ్చుటచే నా కాలమును, నప్పటికొందఱుకొందఱురాజులును, వారిచరిత్రములయం దెక్కిరి. ఆకారణమువలన నితరభాషలయందు రచియింపఁబడినచరిత్ర ములే మన కాధార మైనవి. అట్టియాధారములచేతనే మనము, చరి త్రములను, మఱియితరగ్రంథములను, విప్పుడు గ్రాహికొనఁగలుగు చున్నాము. ఈసందర్భమున మనకథాకాలమునాఁటి దేశచరిత్రములఁ గొంతవఱకుఁ దెలిసికొనవలసి యున్నది. ఇంతమాత్రమునఁ జదువరుల కీప్రకరణమునం దభిరుచి యుండకపోదని తలంచుచున్నాము.

క్రీ॥ము. 327 సం॥ లో గ్రీకుదేశపురాజగు నలెగ్జాండరు మనదేశ మునుజయించుటకై యాఫ్ఘనుస్థానముమీఁదుగసింధుదేశమునఁ బ్రవేశిం చెను. క్రమముగ నాయాదేశములను జయించుచు సింధునదిని దాఁటి పాంచాలదేశమ్ములోని తక్షశిలానగరప్రాంతములనాశ్రయించి దండువిడిసెను. ఈసమయమునఁ బాంచాలరాజు పలనోన్యకలహాములలో మునిఁగి యుండిరి. అప్పటి తక్షశిలరాజు "అంభీరుఁడనువాఁడు" సింధువితస్తానదుల మధ్యదేశమునుపాలించుచుండెను. అంభీరునకును, నాకేకయీవితస్తానదుల మధ్యదేశమును పాలించుచున్న పురుషోత్తమునకును, బ్రబలవిరోధము. ఆకారణమునఁబురుషోత్తముని సాధింపవలయు ననియంభీరుఁడు తనసేన లతో నలెగ్జాండరునకుసాహాయ్యమేగి పురుషోత్తమునోడించెను. మఱియు వితస్తానదిప్రక్కనున్నలావణదేశాధీశ్వరుఁడగుసౌభూతినికూడ నలెగ్జాం డరునకు దాసునిఁ జేసెను. కాలవశమున సౌభూతి లొంగిపోయెనే గాని యంభీరునిపైఁ గోపాగ్ని యాతనిహృదయమున రాజుచునే యుండెను.

పురుషోత్తముఁడు చాల బలశాలి. విశేషసైన్యములు గల వాఁడు. పాంచాల మంతయుఁ బాలింపఁగల శక్తిమంతుఁడు. అట్టివాని యౌన్నత్యమును నంభీరుఁడు చూడలేక పోయెను. మగధదేశమును

బాలించుచున్న పద్మనందుఁ డితని నెలుఁలైనఁ గడతేర్చి పాంచాల మంతయు నాక్రమించుకొనవలయుననియంభీరునితోఁ స్నేహము జేయుచుఁ గాలమును గనిపెట్టి యుండెను. కాని, పిట్టపోరు పిల్లితీర్చినట్లుగ నడుమ నన్యదేశీయుఁ డగు నలెగ్జాండరు వచ్చి పాంచాల మంతయు నాక్రమించుకొనియెను అలెగ్జాండరు మహావీరుఁడు ఆతనికి యుద్ధ ములోఁ బరాజయమనునది లేనే లేదు. పురుషోత్తముఁ డాతనితోఁ జేరి తనజ్ఞాతియు, శీలకోలరాజునగుమఱియొకపురుషోత్తముని జంపించెను. అతని సంతతివా రాశ్రయవిహీనులై కొండలఁబట్టి పోయిరి. ఇట్లు క్రమ క్రమముగఁ బాంచాలమంతయు జయించి ఆదేశమును పురుషోత్తముని యాధిపత్యముక్రిందనుంచి క్రీ.పు.325 సం॥లో నలెగ్జాండరు తనదేశము నకు మరలెను.అన్యోన్యవైరములచే చాలమంది రాజులు తమప్రాణము లతో రాజ్యముల నావిదేశీయున కొప్పగింపనలసినవారైరి.

అంభీరునికోరిక నెఱవేఱినను పాంచాలప్రభుత్వమాతనికి సంపూ ర్ణముగ దక్కినది కాదు. అది పురుషోత్తమునియందె నిలుపఁ బడినది. అంభీరునకా కారణమున మరల తోతోపలఁ గోరిధాగ్ని రవులుచునే యుండెను. అలెగ్జాండరు తాను జయించిన దేశమును రక్షించుటకై తన సైన్యము కొంత సింధునదికవ్వల నిలిపి దాని కొక యధ్యక్షుని నియ మించెను. ఆసేనావ్యయ మంతయు నంభీరునె త్రిమ్మిఁదనే పడియెను

కొంతకాల మయినపిమ్మట పాంచాలదేశనాయకుఁ డగుపురుషోత్త ముఁడు వ్యాధిగ్రస్తుఁడై యీలోకమును విడిచెను. ఈ సమయమున కయి చాలమంది రాజులు వేచియుండిరి. వారిలో మగధదేశ సార్వ భౌముఁ డగుపద్మనందుఁ డొకఁడు. అంభీరుఁడు రెండవవాఁడు. అలెగ్జాండ రావలికిఁబోయినప్పటినుండియుఁ బాంచాలమంతయు నొక్క కబళముగా గబళింపవలెనని చిన్నచిన్న సేనలతో దొంగిసాహాయ్యమునవిశేషసైన్య మునకధికారియైనమీపదుర్గములనుగొన్నిటినిసాధించి,ప్రచండతేజస్వియై

యున్న చంద్రగుప్తుఁడుమూఁడవవాఁడు. మొదటిరాజు చాలదూరము సంచున్నవాఁడు. ఏమి చిక్కులలో నుండెనో యాతఁడురాలేదు. రెండవవాఁడగునంభీరుని కీసమయమున లావణాధిపతి యగు సౌభూతితోఁగలహము సంప్రాప్తమయ్యెను ఆతఁడిఁకఁ గోటనెట్లు విడిచిపెట్టిరాఁగలఁడు? ఇంకను గాశ్మీరము మొదలగు చిన్నచిన్న దేశముల రాజులు కలరుగాని వారాపురుషోత్తముని సేన నెదిరించుసాటిసామర్థ్యము లేనివారు. మూఁడవవాఁడగుచంద్రగుప్తుఁడీసమయమునఁ దనబుద్ధిసామర్థ్యములచేఁ బురుషోత్తమునిబలముతో సమానమగు బలమును జేర్చుకొనియుండెను. చారులమూలమునను, యోగికరుణవలనను,నీసమాచారము నాతఁడు తెలిసికొనియెను. సేనలుమడియకుండ రాజ్యమునుస్వాధీనముచేసికొనవలయుననియాతఁడు యోచింప సాగెను. తనసేనాసమూహముతో శతద్రూనదినిదాఁటియోగియూశ్రమమునకువచ్చిచేరెను. మహాయోధుఁడచ్చటికిఁ రాలేదు. కాని, యాతనిసైన్య మంతయును వచ్చినది. ఆసైన్యమున కిరువురురాజపుత్రవీరులధ్యక్షులుగ నుండిరి. వారిలో నకలెగ్రాండరుచేఁ జంపఁబడిన శీలకోటరాజగు ద్వితీయపురుషోత్తముని పుత్రులగుమహావీరులు. శత్రుల కోటలోని రహస్యముల బాగుగఁ దెలిసిన వారు. చంద్రగుప్తుఁడన్నిసైన్యములను మూఁడుభాగములుగఁజేసి యారాజపుత్రుల కిరువురకును నొకభాగమును, నొకభాగము వసంతునకును, నొకభాగము మహాయోధునకును, విభజించి యిచ్చెను. మఱికొందఱు, స్వామిభక్తిగలరాజపుత్రవీరులను, గూర్చుకొనితా నాసేనలమధ్యమున ముందును వెనుకనుగూడ నుండుట కేర్పాటుచేసికొనియెను. ఆమట్టి పట్టుల నుండు మఱికొందఱుచిన్న చిన్న రాజులుగూడఁ దమపూర్వవైరమును బాటించి చంద్రగుప్తునకు సాహాయ్యముఁ జేయ తమ సేనలతో వచ్చి కలిసికొనిరి. రాజయోగానందస్వామియనుజ్ఞ వడసి చంద్రగుప్తుఁడు విపాశానదిని దాఁటెను. ఈలోన మహాయోధుఁడుగూడ వచ్చి చేరెను

వీరందఱు హిమవత్పర్వతమునకుఁ గొన్నిమైళ్ల కివ్వలనున్న మెట్ట మార్గమున లోయలవెంటఁ బ్రయాణము చేయసాగిరి. కొన్నిదినముల లోఁ వారపురమునకు దగ్గఱనున్న యొకయరణ్యప్రాంతమున విడిసిరి.

రాత్రియైనది. పౌరపురప్రజ లందఱు నింకను విచారములోనే మునిఁగి యుండిరి. కోటలోనివారందఱును ప్రభువియోగముచే నితర మును మఱచియుండిరి అంతఃపురములును దుఃఖాశ్రయములుగనే యున్నవి. ఈకోట కిరువదినాలుగుద్వారములు గలవు. ద్వారము లన్ని టిని మాత్రము బంధించి యుంచిరి. రాత్రి రెండుయామములు దాఁటి నది. అన్ని ద్వారములను నెక్కినారిగ కొన్నిసైన్యములు వచ్చి ముట్ట డించినవి. అన్ని ద్వారములయందున్న రక్షకులను నెక్కుడుణములో గ్రుక్కుమనకుండ సంహరించినవి. తలుపులు మూయఁబడి యుండుటచేఁ గోటలోఁ బ్రవేశించుట దుస్సాధ్యముగ నుండెను అప్పు డిరువ్రుపురుషు లేమేమో యూహించుకొని, కొన్ని త్రాటినిచ్చెనల నాయత్తపఱ చిరి. అవి పైకెక్కలు పోఁగలవు? ఇంతలోఁ గొందఱువీరులు ముందు నకు వచ్చి యొకబురుజుసమీపమున ద్వారమునకుఁ బక్కఁగ నొకని పై నెక్కఁగుగ గోడ నాధారముఁ జేసికొని నిలువఁబడిరి. ఒకఁడెట్లో శ్రమపడి బురుజుపై కెగఁబ్రాఁకెను. అతఁడువసంతుఁడు. వానివెనుక మహాయోధుఁడును, నావెనుక శీలకోటవీరులును, త్రాటినిచ్చెనలపై నెక్కి బురుజుల నాక్రమించిరి. ఇట్లుచాలమంది సైనికులు బురుజులపై కెక్కి లోపలికి దుమికి కోట యుత్తరద్వారములలో నొకదానిని తెఱచివైచిరి. తక్కినద్వారములయందు శత్రువులు రాకుండ ఖడ్గ హస్తులయి చాలమంది సైనికులు యోధులతోఁ గాచికొని యుండిరి. చాలసేన లోపలఁ బ్రవేశించుసరికి కలకలము హెచ్చయ్యెను. అప్పటికిఁ గోటలోనిసైనికులు మేలుకొనిరి. పాపము వా రసంసిద్ధులై యుండిరి.

ఆయుధములకై కొందఱు పరుపులెత్తుచుండిరి. అట్టి శత్రువులపైఁ గవిసి వారల వారుణాస్త్రధారలకుఁగొందఱు గుఱియగుచుండిరి. అంతటను మహా కల్లోలము పుట్టెను. పదులు వందలు వేలకొలఁదిజనులు శత్రువుల తోఁ బెనఁగులాడి వీరమరణము నొందుచుండిరి. కోటయంతయును మహా కల్లోలములో మునిఁగిపోయెను. ఏమూలఁజూచినను నేడ్పులే. ఏమూలఁ జూచినను శత్రుల యట్టహాసధ్వనులే ఏమూలఁజూచినను కత్తుల తళతళత్కారంబులే ఆర్తనాదములు హెచ్చయ్యెను. అంతఃపురము నందుఁగూడఁ గోలాహలము బయలుదేరినది అందుఁగూడ నేడ్పులును, పెడబొబ్బలును, చాలవినవచ్చుచుండెను. అందిప్పుడిరువురశ్వత్థామలు విహరించుచుండిరి. వారు శీలకోటరాజపుత్త్రులు. ఈసంకులప్రయత్నములఁజంద్రగుప్తుఁడొనుఁటియుఁగడలేదు.ఒకయుత్తమాశ్వమునెక్కి యన్ని చోట్ల వీరవిహారమొనరించుచుండెను. ఎదిరించినశత్రువునే యాతఁడు చంపుచుండెను. అంతఃపురములోఁ జాలసైన్యము చొరఁబడినది. కొందఱుయోధులును, రాజబాంధవులును, బ్రాణములకుఁ దెగించి శత్రువులపైఁ గత్తిగట్టి నిలిచిరి. పాపమీమహాసముద్రములో వారు నలుసులుగాలేదు. శీఘ్రకాలములోనే వారు వీరశయన మలంకరించిరి. కోటయంతయు నశ్రమముగఁ జంద్రగుప్తునికి స్వాధీన మయ్యెను. బురుజులపై నిప్పుడు చంద్రగుప్తుని కేతనములే శత్రువులకు భయంకరముగఁ బ్రకాశించుచున్నవి. చంద్రగుప్తుఁడు తనమహోన్నత పదవియందలి కొన్నిమెట్ల నిప్పుడు దాఁటెను. కోటలోఁ జానక మిగిలియున్న సేనావారి మంతయు నాయకవిరహితంబగుటఁ జంద్రగుప్తునికి లోఁబడిపోయెను. అక్షణమె జయదుందుభులన్నిదిక్కులనెక్కసారిగ విజృంభకమోగియుచుండెను.

ఎనిమిదవ ప్రకరణము.

తక్షశిలానగరమునకు దక్షిణమున నున్న దుర్గమారణ్యమునందలి యొకకొండగుహాలో నిరుపురుసన్యాసులు నెలదినములనుండి నివసించి యుండిరి. వారిలోఁ బగలొకరు రాత్రియొకరునుగా నానగరమునకు భిక్షకొఱకుఁ బోవుచుందురు. పగలు పోవుచుండుయోగి జ్యోతిషము నందు నైపుణ్యము గలవాఁడై యుండెను. జనులఁదఱుచు వానికడఁ దను యదృష్టమును దెలిసికొని యానందించుచు వానిఁ బరమైవతిముగ భావించుచుండిరి. రాత్రిపోవుసన్యాసి ప్రశ్నశాస్త్రమున గట్టివాఁడు. ఆనగరమువారిలో నందఱునునాయోగులమాహాత్మ్యమును దెలిసినవారే గాని వారియాశ్రమము నెఱింగినవా రొక్కరును లేరు. యోగులకడ మంత్రము లుండును. ఓషధులయం దద్భుతశక్తు లున్నవి. నిరంతర మారణ్యకు లగుయోగులకడ నిరెండుమహిమలు నుండును. వారగ పడుచు నంతలో మాయ మగుదురు. ఆకస్మికముగ సాక్షాత్కరింతురు.

రాత్రి పదిగడియ లైనది. భిక్షకుఁబోయినసన్యాసి యింకను రాలేదు. రెండవసన్యాసి యాతనికొఱ కెదురుచూచుచు నాలోచించు చుండెను. దివ్యజ్ఞానముగలమునిచంద్రున కంతయూలోచన మొదుల కని సందేహము కలుగవచ్చును. ఇతరులకుఁ బ్రశ్నలు చెప్పునప్పుడన్ని యును నిశ్చయముగ నే తోఁచుచుండును. స్వవిషయమున నన్నియును సందేహములే. అన్యవస్తుప్రకాశకం బగుదీపస్తంభమున కంతయు నంధ

కారమేగదా! నెలుపలఁ బండియూరఁబోవఁజాలు వెన్నెల కాముమండఁగా గాఢాంధకార పూరితమగు నాపర్వతగర్భమున సన్యాసి యొక్కఁడు నింక నాలోచించుచునే యుండెను.

ఇంతలో రెండునయోగి భిక్షఁ దీసికొనివచ్చెను.

"ఇంతమూలస్యమైనదేల?" అని మొదటిసన్యాసి ప్రశ్నించెను.

"నగరుదాసి యదృష్టమును జూచుచుంటిని"

"అందు విశేషమేమైన నగపడినదాయేమి?"

"విశేషమున్నను లేకున్నను, నాప్రసంగమునలన రహస్య చరిత్ర మొకటి బయటఁ బడినది."

"రాజరహస్యమా?"

"ఔను."

"ఏమది?"

"ఆరాజభవనమున నొకసుందరి నిర్బంధింపఁబడుచున్నదఁట"

"ఏమీ! అభీకునిరాజ్యమున సతీమణులుగూడ బాధింపఁబడు చుందురా?"

"ఆమె మగనాలు కాదు. కన్యక."

"ఆరాజున కిప్పుడు మరల నొకచిన్నపడుచును బెండ్లియాడ వలయునని యున్నది కాఁబోలును! పడుచుఁదనము నెడలుచున్న కొలఁదిని దుడుకుఁదన మధిక మగుచున్నది."

"ఆతఁడు పెండ్లియాడవలయు నని కాను. తనమిత్రునకుఁ బెండ్లి చేయవలయు నని యామెను గొని తెచ్చెనఁట."

"అసుందరి యాతని వరించి యున్నదా?"

"లేదు మఱియొకని వలచియుండుటచేతనే యింతనిర్బంధము."

''అది యన్యాయముకాదా?''

"అధికారుల అన్యాయ మన నెట్టిది"

ఆమె వలచియున్న పురుషుఁ డామెను రక్షించుటకుఁ బ్రయత్నించుట లేదా?

"ఆతఁ డెటనుండునో యీరాజునకుఁ దెలియను. పాపమాకన్యక కునుదెలియదు"

'పోనిమ్ము ఆమె యెవ్వరో చెలిసినదా''

"ఆవిషయమును దేల్చుటకొఱకే యీతయారులస్య మైనది"

''చేలినదా?''

"ఆదాసికిఁగూడఁ దెలియదని తేలినది"

'' పాపమాయనాథస్త్రీరక్షణమునకుమనముపూనుకొనవలదా? లోకావనంబునకై స్వార్థత్యాగముం గావించుకొనిన సన్యాసులమైన మన కది విధాయకకృత్యము గాదా?''

"అవును. కొలఁదికాలములోఁ నామెకు నిర్బంధవివాహమో, ప్రవాసశిక్ష యో, తటస్థింపనున్న దని కూడఁ దెలిసినది"

''అట్లయిన మనము త్వరపడవలయును. తపోననంబునకుంబోయి గురుస్వాములతోఁ నాలోచించి, యీసులకుఁ బ్రతీకార మవశ్యముగ జేయవలయును.

''సరే. భోజనము చేసి యిప్పుడే ప్రయాణము సేయుదము''

వారిరువురును దమతమ కొబ్బరిచిప్పలయందు భిక్షాన్నమును వడ్డించుకొనిరి. లోపల గాఢాంధకారము. ఆసన్యాసికాపురమునకు వెన్నెలయును గఱువైనది. ఆచీఁకటిలో వారెట్లుభుజించుచుండిరో? మన కుఁదెలియను. వారుసిద్ధులు. వారికడ నంజనము లుండవచ్చును. లేక పోయినను నోటికిని జేతికి నడమేమున్నది? భోజన మైనది. కమండ

లూదకముచేఁ జేతులుదొలఁచుకొని ప్రయాణోన్ముఖులయిరి. వారుసరుదు కొనుట కేమున్నది? దండకమండలములం దీసికొని బయలుదేరి గుహా వెలుపలికి వచ్చిరి. పుచ్చపుప్పవలె వెన్నెలఁ గాయుచుండెను. వారి కావెన్నెలవెల్తురున నొకపురుషుండు దృగ్గోచరుం డయ్యెను.

ఆతఁడీరహస్యసంభాషణమును వినియుండునా? ఆయర్ధరాత్రమున నాగాఢాంధకారపూరితమగు పర్వతగుహాంతరాళమున నేకాంతముగ నిరువురు సంభాషించుకొన్న విషయముఁగూడ నెవ్వరైన వినిపోయిరేమో యని యనుమానింపవలసివచ్చినది. ఔను. రహస్యమునకు నియతిలేదు. దాని కగ్నిజ్వాలవలెఁ బైకిఁ బ్రాంగుటయేస్వభావము. రెండవకంటివాఁ డెఱుఁగకున్నంతవఱకే రహస్యము. పెదవి దాఁటినఁ బృథివిదాఁటును. గోడలకుఁగూడఁ జెవులున్నవి. ఆపురుషునకుమాత్రము చెవులులేవా?

అందొకసన్యాసి యాపురుషుని సమీపించెను. ఆపురుషుఁడతలపై నొకతెల్లనిపాగయుండెను. శరీరముంతయు నున్నితోఁ జేయఁబడిన కంచుక ముతోఁ గప్పఁబడియుండెను. ఆతఁడు తనవామభాగము నానించుకొని సారంగియనుజంత్రమునుమీటుచుండెను. వెన్నెలవెల్తురుననాతనిమొగ మునన్న పట్టెవర్ధనముగూడ స్పష్టముగఁ గానవచ్చుచుండెను. సన్యాసి కేదియోస్మృతికలిగినది.

"భక్తస్వాములా?" అనిప్రశ్నించెను.

స్వామియు సన్యాసికంఠస్వరము నానవాలు పట్టినట్లుగ "యతీంద్రా!" అనియెను

"మిమ్ముఁ జూచి చాలదినము లయినది. కలశపురమునందలి పావన మగు నామందాకినీతీరము నిప్పుడు చూచుచున్నట్లే యున్నది. ఆవృక్ష చ్ఛాయను మనము మాట్లాడుకొనుచున్నట్లే యున్నది"

"యోగీంద్రా! అవును. శతద్రూతీరమున మఱియొకసారి కలిసి కొంటిమి. జ్ఞప్తియున్నదా?"

"అది క్షణకాలము అయినను నావెన్నెలరాత్రి యిప్పుడు మరల మనోగోచరమగుచున్నది. ఆ నీగానము మావీనులలోఁ బ్రతిధ్వనించుచున్నది"

"యతీంద్రా! మీరు సర్వాంతర్యాములవలెనన్ని చోటులఁగనం బడుచున్నారు. మీమహిమ చాలగొప్పది"

"శ్రీవిష్ణుభక్తాగ్రేసరా? నీముందు మాగొప్ప యేమున్నది? నిర్ధనుమాతోడనే యెక్కడఁజూచినను బ్రత్యక్ష మగుచున్నావు"

"అది మీకరుణామాహాత్మ్యమునకే కలుగుచున్నది"

"హరిదాసస్వామి! నీరాక యెక్కడనుండి?"

"కర్ణాటకము"

"ఇప్పు డెందాఁకఁ బోయెదవు?"

"అది యీశ్వరుఁడొనిపోవునందాఁక"

"మాతోఁదపోవనమునకు మాగురుస్వాములకడకు వచ్చెదవా?"

"అయ్యా! ఈదాసుఁడు రాజయోగానందస్వాముల వారిని దర్శించియే వచ్చుచున్నాఁడు"

హరిదాసుఁడు సత్యమునే వచించెను. ఆతనికి రాజయోగానంద స్వామిదర్శన మిచ్చినాఁడు. ఒకటి రెండు దినము లాతిథ్యమును గూడ నిచ్చెను కాని, యీతని మతాంతరభావములు తన యోచనా సముద్ర మును గలఁచివేయుచుండుటచేతనో, భక్తిశీలుఁడగు నీతని మధుర వాక్య శ్రవణమునను, మనోహరగాన సుధారసనేచనంబునను, గలుగు తన్మ యత్వముచే నితర కార్యములయందు మఱపు గలుగుచుండుటచేతనో, గాని మూఁడవదినమునకే యాతని కనుజ్ఞ యొసంగెను. దాసుని కింకను దపోవనమునఁ గొన్నిదినము లుండి యాస్వామివలనఁ గొన్నివిషయము లను దెలిసికొనవలయు ననియే యున్నది. కాని, తనయంతఁ బానందు నివసించుట కాతని కిష్టము లేకపోయెను. ఆతని కింకను బోవలసిన తీర్థము

లున్నవి. తిరుగవలసిన దేశము లున్నవి తెలియవలసిన విశేషము లున్నవి క్రుంకవలసిన నదులున్నవి ఒక్క-చోటనే చిరకాల ముండుట కవకాశమే లేదు.

"అయ్యా! నాకు సెలవొసంగుడు. ఈపరిచయము మాత్రము మఱవకుడు. దయ యుంచుడు" అని వారియొద్ద సెలవు గయికొని హరిదాసుడు వెడలిపోయెను.

సన్యాసు లిరువురును దపోనదీనాభిముఖులయిపోయిరి.

తొమ్మిదవ ప్రకరణము

సంగీతము లోకమోహనకర మైనది. దానియం దొకవిధమైన యాకర్షణశక్తి యున్నది. పరబ్రహ్మానంద సంపన్ను లగు తుంబురునార దాదులుకూడ నీగానామృతసేవనమున మైమఱచుచున్నారు. శారదాదేవి నిరంతరవీణాగానమువలననే సరస్వతి యయినది సంగీతమాధుర్యమునకుఁ జొక్కి జీవలోక మంతయుఁ దన్మయత్వమున సంపూర్ణానంద మనుభవించుచున్నది. ఇట్టిపరిపూర్ణానందము ప్రేపల్లెయందలి గొల్లపడుచుల కొక శరద్రాత్రియందు లభించినది. నాఁడు గోపాలకృష్ణుని మురళీగానమున నమృతము వర్షించినది. ఆయనుభవముచే నందలి పశుపక్ష్యికీటకాదులుగూడ నిప్పటికి నాస్వరముల ననువదించుచున్నవి. షడ్జపంచమశ్రుతులవలె రాధాకృష్ణులీగానములోననే యైక్యమయిపోయిరి. రాజగోపాలుని మోహనాకారముతో నాతని మధురగానము యమునానదీనిర్మలజలంబులఁ జాలకాలము ప్రతిఫలించినది. ఆయల వాటుచే నిప్పటికి నానదీతరంగము లాపాటలకు లయనెఱపుచున్నవి.

బృందావనమునందలి పూపుటేరములలో నాపాట లింకను ప్రతిధ్వనించుచునే యున్నవి. రాధాకృష్ణునివేణుగానమున రాగమున్నది. ప్రతివసంతమునందును బృందావనమునందలి లేజిగుర్రుగొమ్మ లారాగమునే ప్రకటించుచుండును. బృందావనకోకిలములు పూర్వము రాధామాధవులతోఁ గలిసి పాడుచుండెడివి. ఆదినములు గడచి చాలకాల మైనది. అంతయును మఱచిపోయినవి. అవి యిప్పు డొక్క-పంచమస్వరమునే గానము సేయుచున్నవి. వసంతకాలమునఁ జగురుగొమ్మలచాటునుండి కోకిల కంఠమెత్తి యొక్క-పంచమస్వరమును గానముసేయు నంతమాత్రమునసే లోకము పారవశ్యము నొందుచున్నది. తాండవకృష్ణునివేణుగాన మెంతమనోహరముగా నుండెడిదో యారాధాదేవికే తెలియును. ఆశరద్రాత్రియందలిపండువెన్నెలలో నావేణుగోపాలుని మొగంబునఁ జూపుకలు నిలిపి తమ్మును లోకమును మఱచియున్న గోపసుందరీమణులకే తెలియును. మోరలుపైకెత్తి చెవులు తిక్కించి మేఁతలుమాని వినుచున్న గోవత్సములకే తెలియును. ఈయిన్నిటికిని సాక్షీయయి యమునానదీతరంగముల నుయ్యెల లూఁగుచున్న చందమామకే తెలియును. మన కెట్లు తెలియును? మనము భక్తిభావహృదయులగు తపోధనులము గాము. అనురాగహృదయులగు గోపికాసుందరులము కాము. మన మాకాలమును, నామనోహరగానమాధుర్యమును, మనహృదయమున భావింపలేము

సంగీతమున శృంగారరసము మూర్తిభవించియున్నది. అదియే భక్తిభావమున కంగము. భక్తులగానమునందు వేణుగోపాలకృష్ణుఁడు రాధాసహితముగ నృత్యము సేయుచుండును. ఇట్టిసంగీత మన్న తిరుశిలానగరనాథుఁడు చెవిఁగోసికొనును. నేఁడాతనికట్టి యదృష్టముపట్టినది. ఆతఁ డిప్పు డంతఃపురమున రాణులచేఁ బరివేష్టింపఁబడి సవిలాసముగఁ గాలము గడపుచున్నాఁడు. గోపసుందరులనడుమనున్న గోపాల

కృష్ణునితో నాతని బోల్చుటకు వలనుపడను. తారకాగణమధ్యస్థుం డగురాకాచంద్రునితోఁ బోల్పవచ్చును. చంద్రుఁడు సనాథలగుయువతీ మణులకు మనోహరుఁడే కాని విభోగవతులకుమాత్రము మారకుఁడు. ఆకారణముచే నీతనికి నాతనికిఁ బోలిక సరిపడినది. ఆభవనము విశా లమై, చంద్రశిలాని ర్మితమై, యుండెను. గ్రీష్మాతపతాపములేకుండ గవాక్ష ములకడఁ బన్నిటిచేఁ దడుపఁబడినవట్టివేళ్ళ తడకలు గట్టఁబడి యుండెను. ఆగది యంతటను దట్టమగుమెత్తని రత్నకంబళములపైఁ దెల్లనిపఱుపు వేయఁబడి యుండెను. ఆగదిగోడలపైఁ జుట్టును, రాధాకృష్ణ విలాసము, బృందావనవిహారము, గోపగోపికాపాలనము, గోవర్ధనోద్ధరణము, కాళీయ మర్దనము, గోపికావస్త్రాపహరణము, రాసక్రీడ, జలక్రీడ, అష్టమహిషీ గోపాలము మొదలగు కృష్ణలీలలం దెలుపుచిత్రపటము లమర్పఁబడి యుండెను. వీవనలు విసరుటకును, నడుమ నడుమఁబన్నిరు చిలుకుచుండు టకును జేటికలు నియమింపఁబడియుండిరి అంతఃపురస్త్రీలెల్లరు రాజును బరివేష్టించి కూర్చుండియుండిరి.

వారికెదురుగా నొకహరిదాసుఁడు సారంగమును వఱుమున నానించుకొని శ్రుతిచేసికొనుచుండెను ఆభక్తుని మీరిదివఱకు వెన్నెల వెల్తురునఁ జూచుటచే నానవాలు పట్టలేక పోవచ్చును. నాఁడిరువుర సన్యాసులకు గుహాముఖమున సాష్టాంగపడిన దీతఁడే. ఈహరిదాసుఁడు సంగీతమున భూలోకగంధర్వుఁడు.

కొంతకాలముక్రిందట మగధదేశమునందలి యొకసామంతరాజ్య మున రాధాకృష్ణవర్మ యనునొకరాజపుత్రకవి యుండెడివాఁడు. అతఁ డిరువదియయిదేండ్లప్రాయమునకే సంగీతసాహిత్యచక్రవర్తి యయ్యెను. అతఁ డనేకకృతులను రచియించెను. ఆదేశమునందలి గాయక చక్ర వర్తులు మహారాజసభలలోఁ బాడుచుండుకృతులలో మిగులఁ బ్రశస్తి వహించిన వానికవిచంద్రునికృతులే. ఆకారణమున నారాజపుత్రుని

పవిత్రనామమును, కృతులును, జగద్విదితములై యుండెను. ఒకచిన్న రాజునకు సేనానాయకుఁ డగునాతనిచరిత్రముమాత్రము చాలమందికిఁ దెలియదు. ఈహరిదాసుఁడు పూర్వాశ్రమమున నాతనికిఁ బ్రాణప్రియుఁడయి యుండెను. చిన్నతనమునుండియు నతనియొద్ద సంగీతవిద్య నభ్యసించెను ఆతఁడు రచియించినకృతు లన్నియు నీతఁడు మనోహరముగఁ బాడఁగలఁడు. ఆరాజపుత్త్రునకు గార్యాంతరమున నాదేశమును విడిచి పోవలసివచ్చెను. అప్పటి కీతఁడు పసివాఁ డగుటచేఁ నితనిగూడ దీసికొనిపోలేదు. తరువాత నింతవఱకాతనికినితనికి సమావేశము కలుగలేదు క్రమముగా నితనికాగీతములవలననే భక్తిభావ ముదయించినది. ప్రపంచవిషయములం దభిమానము పోయి వైరాగ్యముకలిగినది. ఇప్పుడు మునివ్రత మవలంబించి తీర్థయాత్రలం జేయుచు నిశ్వరతత్త్వమును గానముచేసి తన్మయత్వమున నానందించుచుఁ గాలము గడపుచున్న వాఁడు. అంభీరులుసపర్యల కానందించి యాతనిప్రార్థనచేఁ గొంతకాలమిట నుండుటకుంగీకరించెను. ఈతనికంఠస్వరమాధుర్యము వర్ణనాతీత మైనది.

శ్రుతులు సరిపడినవి. గాయకుఁడు సభవంకఁ జూచెను. అందఱి దృష్టులు నాతనిముఖముపైనే ప్రసరించుచున్నవి. అందఱిముఖపద్మములు వికసించియున్నవి అందొకపదియేడేండ్లకన్నియమాత్రము కృష్ణచతుర్దశీచంద్రరేఖవలె శుష్కించి యున్నది. ఆసుకుమారశరీరము గ్రీష్మ్రపతప్తంబగుచుల్లికావల్లరివలె నెగిలి యుండెను. అయినను కాంతిమంతముగనే యుండెను. ఆసునోహరాంగకములు చిక్కి యున్నవి. ఆయధరపల్లవము వాడియున్నది. ఆమెవదనబింబమున వికసనభావ మగపడుటలేదు. వెలవెలపోవుచుండెను. కచమండలము సంస్కరింపఁబడియుండలేదు. మాసినచీరధరించియుండెను. ఆమె పరిచారికయా? కాదు. రాణులనగుమనే కూర్చుండి యున్నది. ఆమెకడ నొకపరిచారిక నిలువఁబడి యుండెను. ఆ కన్నియకూడ హరిదాసు జూచుచుండెను.

అచూపులలో నానందము లేదు. ఆమెహృదయమునకుఁగూడ నానందము లేకపోవచ్చును. ఈయానందసమయమున నామె నెవ్వరును జూచుటలేదు. ఆయువతీమధ్యమున నున్నయామెను గాయకుఁడు చూచెనో, లేదో?

హరిదాసుఁడు రాగము నాలాపించెను. కంఠస్వరము తంత్రీస్వనముతో లీయమై వచ్చుచుండెఁ. ఆగానమాధుర్యమున నందఱహృదయములు నైక్యమై పోయినవి. సభ్యులకాస్వరకల్పనములనడుమ హృదయసంకల్పము లేవియుఁ బుట్టుట లేదు. చిత్రసంగతులలోఁ దామును జిత్రములై పోయిరి. మూర్ఛనలకు మూర్ఛిల్లుచుండిరి. నడుమనడుమఁ జిలుకుచుండు పన్నిటితుంపురులవలన వారికిఁ జైతన్యము కలుగుచుండెను. ఆమెహృదయ మెంతసుకుమారమయినదోకాని యాకన్నియ రాగమాలాపించినతోడనే తన్మయత్వమున మైమఱచెను. మరలఁ దెలివిఁ దెచ్చుకొనలేదు. పాప మీగానామృతమును తనివిదీరఁ గ్రోలుభాగ్యమామెకు లేకుకాఁబోలును!

గాయకుఁడు ముంగుగా వసంతమునుగూర్చి పాడెను. చంచలతరంగములఁ బ్రతిఫలించుచంద్రకిరణములవలె సభ్యులహృదయములయందు భావములు మెఱసిపోయెను. పొడపుపెన్నెలలోనిసముద్రమువలె నానందరసము పొంగిపోయెను. కాని యింకను వారికిఁ దనివి తీరలేదు. కేవలగానప్రియుండగురాజుమాట చెప్పవలసిన దేమున్నది? సభ్యుల కందఱకును గోరికలు మొండయ్యెను. ఒకరు నవనీతచోరుని దుండగములం బాడించిరి. ఒకరు రాసక్రీడయందలిపాటఁ బాడించిరి. గోపికాగీత మొకరుపాడించిరి కృష్ణలీల లొకరుకోరిరి. కాని, గాయకుఁడు రాధామాధవసంవాదమును బాడెను. రాణులందఱు నొక్కొక్కపాటఁ బాడించిరి. హరిదాసుఁ డన్నియునుబాడెను.

గాయకుఁ డింకను పాడుచునే యుండెను. ఆయువతీమణి యీ పాట లేవియు వినినట్లు లేదు. మరల స్మృతి కలిగినట్లే యున్నది. గాయకునివంకఁ జూచుట లేదు. ఆమెతల తిరుగుచుండెను. పెదవులు మెదలుచుండెను. గాయకులకొకయలవాటున్నది. శ్రుతి వినినంతనే వారికి లోపల నొకవిధమయినయుత్సాహము కలుగును. ఒక్కసారి కంఠమెత్తి పాఁటవఱకు నాయుత్సాహము పొంగుచునే యుండును. ఆయువతీమణి గాణకావలయును. లేదా, యీగాన మామె కున్మాదము కలిగించి యుండవచ్చును

మనోహరవస్తుసందర్శనమునఁ గాని ప్రియవాక్యశ్రవణమునఁ గాని హృదయతాపము శమించుట స్వభావము ఒకానొకసమయమున నట్టిసందర్శనశ్రవణములే సంతాపకారణములు కానచ్చును. సకలజీవానందదాయకం బగుసంగీత మామె కిప్పుడు శ్రవణభేదనముగ నున్నది. సకలలోకనయనానందకరం బగునాతేజోమయాకార మామెకన్నులకు మిఱుమిట్లుగొలుపుచున్నది. అప్పటియామెయవస్థ నెవ్వరు చూతురు? ఎవరియానందము వారిది. పాప మామెకూడ నేదో పాడుచునే యుండెను. ఆపాట యెవ్వరికిని వినఁబడుట లేదు. గాయకుసగానమున లీనమయి పోయినది ఆయున్మాదావస్థలో నామెహృదయమున నెన్ని యోభావములు పుట్టెను. అవి యన్నియును బైకి పొంగుట లేదు. హృదయమునఁ దే యడఁగిపోవుచుండెను. హృదయావేగమునఁ దనులత కంపించుచుండెను కన్నులు తిరుగుటచే నామె చలువరాతిగోడకుఁ జేరగిలఁబడియెను సమీపమునున్న పరిచారిక యామెను బట్టుకొనియెను.

సాయంతన మయినది. గాయకుఁడు గానము నాపివేసెను. సభయంతయును దన్మయత్వమునఁ గొంతసేపు నిశ్శబ్దముగ నుండెను. ఈ భవనమున నింకను మనోహరతంత్రీస్వనములు వినవచ్చుచునే యుండెన అవి వారలహృదయభావప్రతిబింబములా? లేకయాకన్నియ యేమయిన బాడుచున్నదా ?

గాయకుఁ డాబాలికవంకఁ జూచెను. ఆమె స్మృతితప్పి పడిపోయినది. దయాళుఁడు జగన్నాథభక్తుల కామెపై నకారణవాత్సల్యము కలిగెను. భక్తులహృదయము లతిమృదులములు.

"రాజా! ఆబాలికయెవ్వరు?" అని ప్రశ్నించెను.

"ఈమె రత్నగిరిరాణి"

"రత్నగిరి యిటకుఁజాలదూరమే! ఈమె యిక్కడ కేలవచ్చినది?"

"చోరులచే బలవంతముగఁ గొనిపోఁబడుచు నాచే సంరక్షింపఁబడినది. నాఁటినుండియు నాయొద్దనే యున్నది"

"ఎంతకాలమునుండి"

"ఇంచుమించుగ నేఁడాది కావచ్చినది"

అంభీరుఁడుచెప్పినదానిలోఁ గొంత యసత్య మున్నది. ఆతఁడామెను చోరులనుండి రక్షింపలేదు. నందభటులు వారిని వెంబడించి నాఁటిరాత్రి చంద్రజూటశాస్త్రియింటఁ బ్రవేశించి పరిచారికాసహితముగ నామెనుహరించి యీతని కొప్పగించిపోయిరి. గుప్తదుర్గప్రాంతమున జంపఁబడినపురుషునియొద్దనున్న యుత్తరము పద్మనందుఁ డీమెనుగూర్చి వ్రాసినదే. పాపము వసుమతి యేఁడాదినుండి కనకలతాసహాయయయి యీతక్షశిలానగరదుర్గమునఁ ద్రిజటాసహాయయయి లంకలో నశోకవనమున నున్న సీతామహాదేవివలెఁ బరితపించుచు నతికష్టముఁ గాలము గడపుచున్నది. నిరంతర వసంతస్మరణమున నామె జీవించియున్నది. ఇప్పటి హరిదాసునిపాటలవలన నామెకుఁ బూర్వస్మృతి కలిగినది. ఈపాట లన్నియు నామెకుఁ గూడ వచ్చును. సుందరి యీపాటల నామెకు నేర్పెను. ఆకారణమున సుందరి తలంపునకుఁ బారి నిర్దయురాలయి తన్ను విడిచియున్నదనువిచారమున నామె మూర్ఛిల్లినది. మహానలజ్వాలలం బడి మండిపోయినసుందరి యీమె నెట్లు కలిసికొనఁగలదు?

పదియవ ప్రకరణము.

పౌరనగరరాజ్యలక్ష్మి సంపూర్ణముగఁ జంద్రగుప్తుని వరియించినది. ఆదయాశీలునిపరిపాలనమునఁ బ్రజలెల్లరును బురుషోత్తముని మఱచిపోయిరి. అచ్చటి చిన్న చిన్న సామంతు లందఱును జంద్రగుప్తునకు లోఁబడి కప్పముల నర్పించి యాతనిచల్లనివెల్లగొడుగునీడను హాయిగఁ గాలము గడుపుచుండిరి. అనంతమగువిజయసేనాసముద్రము చంద్రగుప్తునకుఁ గొంగుబంగారమై యుండెను. ఆతని కంగబలము నర్థబలముఁ గుదిరినవి. దైవబలముకూడ సంపూర్ణముగ నున్నట్లాతనివిజయములే నిదర్శనముగఁ దోఁచుచున్నవి. ఆతఁడు తేజోబలపరాక్రమాదిగుణంబుల కోటువడి పురుషోత్తమునిదాయాదులు కూడఁ జంద్రగుప్తునకు మిత్రులైరి. ఆకారణముచే నూతనరాజ్యమున నాతనిప్రభుత్వము నిరాఘాటముగ నెలకొల్పఁబడినది. అయినను నచ్చటచ్చట గ్రీకునాయకులవిజయధ్వజములాదేశమున నిరంకుశముగ నెగురుచున్నంతవఱకుఁ జంద్రగుప్తునికి నెమ్మది కలుగదు. ఇంకను నందందుఁ జిన్న చిన్న రాజ్యములలోఁ గల్లోలములు పుట్టుచునే యున్నవి.

చంద్రగుప్తుఁడు గంభీరహృదయుఁడు. దూరదృష్టి కలవాడు. తలపెట్టినకార్యమును సాధించువఱకును వెనుదిరుగని తీక్ష్ణహృదయుఁడు. ఆతనికిరణమన్నఁ బండువుగా నుండును. ప్రజలను బిడ్డలవలెఁ గాపాడుటయే యాతనిపరమధర్మము. ఆతనియూహకిఁ దిరుగు లేదు. తనయుద్ధములును, విజయములును, రాజ్యసంపాదనమును, జీవితమును, ప్రజారక్షణమునకే యని చంద్రగుప్తనియుద్దేశము. వసంతుఁ డాతనికి దక్షిణభుజమై యుండెను. ధీరోదాత్తుఁడగువసంతుఁడు వసుమతీవియోగమున మగ్నుఁడై

యుండినను, రాజకార్యావసరంబుల నద్వితీయ ప్రజ్ఞానిధియై చంద్ర గుప్తునకుఁ దోడునీడయగుచునే యుండెను. చంద్రగుప్తుఁ డొకనిమిస మైన వసంతు నెడఁబాసియుండలేడు. వారెప్పుడును రాజ్యాంగవిషయ ములనుగూర్చియే యాలోచించుచుందురు. నిరంతరమట్టివ్యాసంగమే లేని యెడల వసంతునిజీవితకుసుమ మీసరికి వసుమతీవియోగదావానలమున హుతమై పోవలసినదే.

చంద్రగుప్తవసంతు లిప్పు డాలోచనామందిరమున నున్నారు. వారు రాజకీయవిషయములనుగూర్చియే మాట్లాడుకొనుచుండిరి.

"వసంతా! వార్త లేవైనఁ దెలిసినవా?"

"కాశ్మీరదేశాధీశ్వరుఁ డగు పుష్కరాక్షుఁడు నెలదినములనుండి సైన్యములను గూర్చుకొనుచున్నాఁ డఁట. యుద్ధయాత్రకు వలయు సాధనసామగ్రు లన్నియును సిద్ధపఱచుచున్నాఁ డని తెలియనచ్చినది."

"ఎందులకో యేమైనఁ దెలిసినదా?"

"లావణదేశాధిపతి సౌభూతియు నట్టి ప్రయత్నములలోననే యున్నట్లు తెలిసినది. వారిపురికి నేమైనఁ గలహము జరుగు నేమో యనితలంచెదను"

"కాదు కాదు. అట్లెన్నఁడును జరగదు. ఆతనికి సీతకిని నట్టి సంబంధ ముండుటకుఁ గారణము లేదు ఒకవేళ వారిరువురును గలిసి మనపైకి వచ్చుటకుఁ బ్రయత్నము సేయుచుండి రేమో?"

"అది యసంభవము. వారికి స్వప్నమున్నైన నట్టి మూహ కలుగుట కవకాశము లేదు. అగాధ మగు మహాసముద్రము నీద వలయు ననియు, నాఁకలిగొనియున్న సింగము నదలింపవలయు ననియు జీవితాశగల యెవ్వఁడు కోరుకొనును?"

"అయినను మన మేమఱి యుండరాదు. నేనలఁ బదిలపఱచి జాగరూకులమై కనిపెట్టియుండవలయును"

ఇట్లాలోచించుకొనుచుండఁగా రాజయోగానందస్వాములవారు వారియెదుట సాక్షాత్కరించిరి. తోడనే వారిపుత్రుని మహానందముతో లేచి యామహాత్మునకు నమస్కరించిరి. యోగి వారిని దీవించెను. అంగఱు నుచితాసనములఁ బరివేష్టించిరి.

యోగి "వత్సలారా ! విజయుల రగుమీకు సేమమా?" అని కుశలప్రశ్నముఁ జేసెను.

"దేవరయకారణవాత్సల్యంబున నింతవఱకు సేమముగనేయున్నారము" అని చంద్రగుప్తుఁడు ప్రత్యుత్తరమిచ్చెను.

"విశేషము లేవైన నున్నవా?"

"త్రికాలవేదు లగు మీరెఱుంగనివిశేషము లేవియుండును?"

"ఇన్ని నాళ్లకు మనప్రయత్నము ఫలించినది"

"వసుమతినృత్తాంత మేమైనఁ దెలిసినదా?"

"ఆ తెలిసినది."

వసంతునియెడలు జల్లుమనియెను. "మహాత్మా! వసుమతి జీవించియున్నదా?" అని యాతురముతోఁ బ్రశ్నించెను.

యోగి—తక్షశిలాదుర్గమున నంభీరునిచే రక్షింపఁబడుచున్నది.

చంద్ర—ఆమె నాతఁ డెల రక్షింపవలయును?

యోగి—అపహరించి కొనితెచ్చుటచేత—

చంద్ర—ఆతఁ డపహరించెనా?

యోగి—పద్మనందునిభటులాతని కామె నొప్పగించిపోయిరి.

కోపవేగమున వసంతునియెడలు వడఁకిపోవుచుండెను. ఏమి! పద్మనందునిక్రూరవ్యాపారములు పాంచాలమువఱకును వ్యాపించినవా? కపటబుద్ధి యగునాపాపాత్ముఁడు మగధపాంచాలములకు నడుమ రక్తనదులు ప్రవహించు నని యెఱుంగఁడు కాబోలును" అని వీరావేశ వివశుఁడై పలికెను

చంద్ర—"వసుమతి యెంత కాలమునుండి యటనున్నది?"

యోగి—"రెండుసంవత్సరములనుండి."

హరిదాసునితోఁ గపటచిత్తుఁడగునంభీకుఁ డేఁడాదినుండి వసుమతితనయొద్దనున్న దని చెప్పినమాట యసత్యము. యోగిచెప్పిన యీ విషయమే సత్యమైయుండవచ్చును.

యోగి—"మాశిష్యుల కొకహరిదాసునివలనఁ దెలియవచ్చిన దఁట!"

చంద్ర—"అట్లైన మన మిప్పుడు తడయరాదు. అంభీకుఁ డెప్పుడెత్తి వేగమ పోవలసియున్నది గదా!"

యోగి—"సేనలన్నియును సిద్ధముగ నున్నవా?"

వసం—"అన్నియును సిద్ధముగ నున్నవి దురాత్ములనిర్జించుటకుఁ జంద్రగుప్తసేన లెప్పుడు నెనుఁబదివేలుచొప్పునఁ బ్రతీక్షించుచునే యుండును. ఈవసంతుని కరవాల మంభీరునిశిరఃకర్తనము సేయుటకుఁ ద్వరపడుచున్నది."

యోగి—"ఆతనిజయించుటకుఁ గూడ మనకుఁ దటస్థమైనది."

చంద్ర—"ఎట్లుమహాత్మా?"

"లావణదేశాధిపతి యగుసౌభూతికిని తక్షశిలానాయకుండగు నంభిరునకును జాలకాలమునుండి విరోధమనుసంగతి మీకుఁ దెలిసినదా?"

"అవును. వినియున్నాము. ఇప్పుడేమి?

"సౌభూతి మనతోఁ మైత్రి నెఱపుచున్నాఁడనుచుఁ బంపెట్టి యాతని జయించుటకయి యంభీరుఁడు గ్రీకులను బుట్టికొల్పెను. వారు లావణదుర్గమును ముట్టడించుటకు వారముదినములలో రానైయున్నారు."

"అట్లయిన గ్రీకులచ్చటికి రాకుండ, మార్గమునఁ బోవుమన మనసైన్యములతోఁ నడ్డుకొనవలసియుండును వారిని మరల నీదేశమున నడుగుపెట్టనిచ్చితిమేని మనకుఁగూడ జాల నపాయకరమే"

"అట్లు కాదు. అగ్రీకుసైన్యముతో నాభీరుని సైన్యములోఁ గొంత భాగము సాహాయ్యముగా రావలసియుండును. ఆతనికి ముందుముందు మనపై నెత్తిరానలయు ననుదురుద్దేశముకూడనున్నది ఈసమయమున మనము తక్షశిలాదుర్గమును ముట్టడించితిమేని సులభముగా జయింపవచ్చును. లావణదుర్గము గ్రీకులకుఁ జిక్కకుండ మనయోధుని సైన్యములతో సౌభూతికి సాహాయ్యముగఁ బంపవలయును. ఇందువలన గ్రీకులకు తక్షశిలానాయకుని గోలుపోవ్రటయు, లావణదుర్గమును జయింపలేకపోవ్రటయు, ననురెండునష్టములు కలుగును. ఆనిరుత్సాహమున నలసియున్న గ్రీకుల మనము జయింపట సులభముగా నుండును. కాఁబట్టి మీరు మీసేనలతోఁ దక్షశిలాదుర్గమును ముట్టడించుటకుఁ ద్వరపడనలయును."

"కాశ్మీరరాజుకూడ సైన్యములను గూర్చుచున్నాఁడట! ఎందులకో తెలియలేదు"

"మనకొఱకే. ఆయేర్పాటు లన్నియు నిదివఱకే చేసితిని. ఆతఁడు సేనాసహితముగఁ దక్షశిలాదుర్గమును ముట్టడింపనున్న మీకు సాహాయ్యము చేయనైయున్నాఁడు. ఇంతకాలమున కంభీరునియందలి పగఁదీర్చుకొనుటకు సమయము లభించిన దని యాతఁడుప్పొంగిపోవుచున్నాఁడు. పాంచాలరాజ్యలక్ష్మి యిఁక సంపూర్ణముగ నిన్నాశ్రయించినది. రత్నగిరిరాజపుత్రిక యగువసుమతికిఁ గంఠమున దీరఁగలవు. వసంతకళ్యాణముతో నివును బట్టాభిషిక్తుఁడవు కాఁగలవు. తగినయాలోచనమంతయుఁ దెలిపి యోధుని సైన్యములతో లావణమున కనిపెదను. మీరు మీకార్యములయం దప్రమత్తులై మెలంగవలయు. ఈశ్వరానుగ్రహమున జయము కలుగుఁగాక!" అని యాశీర్వదించి గురుస్వామి యంతర్ధానుఁడయ్యెను. వసంతచంద్రగుప్తులు విజయయాత్రాప్రయత్నములం జేయఁబోయిరి.

పదునొకండవ ప్రకరణము.

నేటిరాత్రి యంభీరునకు హరిదాసునిపాటలు వినుచుండుటకుఁ దీఱిక లేదు. సేనానాయకుల కానతు లొసంగుటయందును, సేనల బురి కొల్పుటయందును, మగ్నుఁడై యుండెను. మహాబలుం డగునాశూరశిఖా మణి యుద్ధములయం దారితేరినవాఁడు. ఆతనిదుర్గముకూడఁ గనశిలా నిర్మితం బగునెత్తైనప్రాకారము నడుమనుండుటచే నెట్టిశత్రువులకు నభే ద్యమై యుండెను. ప్రాకారముచుట్టు పండ్రెండుగజములవెడల్పున నున్న యగడ్డ యగాధజలపూరితమైయుండెను. దండనాయకులు సేనలతోబురు జులపై నిలిచి జాగరూకులై కనుగలిగి చూచుచుండిరి. కోటలోనిసైనికుల ప్రోత్సాహకోలాహలధ్వనులును, భయంకరభేరీరవంబులును, దిక్కుల మారుమ్రోయుచుండెను. అంధకార బంధురమగునానిశాసమయమున శరదీపికాసహస్రములచే దుర్గప్రాకార మంతయు మహాశివరాత్రినాఁటి దేవాలయప్రాకారమువలెఁ బ్రకాశించుచుండెను. ఆప్రదీపప్రకాశము నడుమ మెఱయుచున్న యాదుర్గము దావానలజ్వాలాపరివృతం బగువెండి కొండవలెవెలుంగుచుండెను. వివిధాయుధద్యుతులును, కిరీటప్రభలునుఁ, గన్నుల మిఱుమిట్లు గొలుపుచుండుటచే సైనికుల కాదీపప్రకాశము గాఢాంధకారముకంటె నెక్కువయుపయోగము నీయకుండెను. దీపము లకు సమీపప్రకాశము స్వభావము. వెలుతురున నున్నవారిదృష్టు లంధ కారమునఁ బ్రవేశింపఁజాలవు. చీఁకటిలోనున్నవారు వెలుఁగున జరగు చున్న దంతయును గనిపెట్టఁగలరు. వారిచూపులు వెలుతురున్నంత వఱకుఁ గనిపెట్టుచుండెను. జామురాత్రి యైనది. బురుజు లన్నియు సేనలతో నిండిపోయెను. రణభేరులు మ్రోఁగుచునే యున్నవి. దండ

నాయకులు సైనికుల హెచ్చరించుచుండిరి. ఎవ్వరు నెక్కటిణమైన నేమటి యుండుట లేదు. అందఱును కార్యన్యగ్రులై యుండిరి. ఆరాత్రి నిద్రాదేవత యానగరమును విడిచిపోయినది. జాములు గడచుచున్నవి. ఆనీలాకాశమధ్యమునమినుకుమినుకుమని మెఱయుచున్నచుక్కలొక్కటొక్కటిగ నాయోధులశిరస్సులను దాటిపోవుచుండెను. వారి కేమియు నగపడుట లేదు వారిదృష్టులుమాత్రము నలుదెసలఁ బ్రసరించుచున్నవి. ఆచూపులలోనే వేగుచుక్క పొడిచినది. వారికాసందడిలోఁ గోడికూత వినఁబడుట లేదు. ప్రభాతవాతపోతములు విసరుచున్నవిగాని యెప్పటివలెఁ బరిఖాసరోజపరిమళములు వచ్చుటలేదు. గజమదగంధమిశ్రితమై వీఁచెంచుచుండెను. చూచుచుండఁగనే తెల్లవాఱినది. దుర్గముచుట్టును ప్రచండసైన్యము ముట్టడించియుండెను. రాత్రియంతయు నిశ్శబ్దముగ నేనుఁగులచేఁ బట్టి నాఁడినారసాలపైఁ గొంతసేనపరిఖదాఁటి వచ్చి ద్వారస్థానమును జేరినది.

ఇప్పుడు కోలాహలముగ లోపలను, వెలుపలను గూడ రణభేరులు మ్రోఁగుచున్నవి. చంద్రగుప్తుఁడు తూర్పుదిక్కునసింహద్వారము కడ ననంతమగు గజసైన్యముతో నిలిచి యుండెను. ఆద్వారమున కెదురుగనున్న పరిఖ పూడ్చివేయఁ బడియెను. వెనుక భాగమునఁ బుష్కరాక్షుఁ డాశ్వికసేనలతో నుద్రేకించుచుండెను. సేనావాహిని దుర్గమును జుట్టుముట్టుకొని యున్నది. వసంతుఁడు సేనలను బ్రోత్సహించుచు నెకయశ్వముపైనుండి చుట్టును దిరుగుచుండెను. భేరీభాంకారములవలనను, వసంతుని వీరాలాపములవలనను, సేనలకు వీరావేశము కలిగెను.

ఆదుర్గము దుర్గమమైనది. పైకెగఁబ్రాఁకుటకుఁ గాని గునపములతోఁ ద్రవ్వుటకుఁగాని వలనుపడుట లేదు. అనంతమగుసైన్యము

బుగుజులపై నుండి బాణవర్షమును గురియించుచుండెను. ఆబాణఘాత ములవలన నసేకు లొక్క-సారిగఁ బడిపోవుచుండిరి. రక్తమును జూచిన కొలఁది చంద్రగుప్తసైనికులకు నీరావేశ మధిక మగుచుండెను. వారికిఁ బ్రతిపక్షులశరవాహినుల నష్టముకొనుట తోడనే సరిపోవుచున్నదిగాని దుర్గ ప్రవేశమున కవకాశముకలుగుటలేదు. తెగించి కోటగోడలకెగఁబ్రాఁకు చున్న వారిని పైవారు బల్లెములతోఁ బొడిచి కూలఁ ద్రోయుచుండిరి.

కోటఁ బట్టుకొనుటకు మార్గ మేదియును వారికి గోచరించుట లేదు. దుర్గద్వారములు దుర్భేద్యములై యుండెను. అయినను, చంద్ర గుప్తసైన్యమునకుఁ బ్రభుమంత్రోత్సాహశక్తులు పూర్ణముగ నున్నవి. వారు తమప్రయత్నములను వదలుట లేదు. కోటగోడల కెగఁబ్రాఁకు చునే యుండిరి. గునపములతోఁ ద్రవ్వుచునేయుండిరి. శరాసారమును గురియించుచునే యుండిరి. [illegible] యుండిరి. వారికిఁ జావు లేదును, భయమును లేదు.

"ఆహాహా! యోధులారా! అసహాయశూరులగుభటులారా! లోకమునఁ బవిత్రజన్మనున్న మీదేయని చెప్పవచ్చును. మీరాజు కొఱకు మీజీవితమును వినియోగించుచున్నారు. మీరాజ్యముకొఱకు మీరక్తము నొలికించుచున్నారు. మీకీర్తికొఱకు మీప్రాణములను దృణప్రాయముగ విసుచుచున్నారు. స్వామిభక్తి మీహృదయములం దున్నది. సాహసము మీప్రయత్నములం దున్నది. స్వర్గము మీచేతిలో నున్నది. కాని జయముమాత్రము చంచలస్వభావముగలయదృష్టము ననుసరించుచున్నందుల కెంతయు విచారముగనున్నది. ఆయదృష్ట దేవతాశీతలకటాక్షములు మీరాజుపైఁ బ్రసరించుచున్నవి ఆవిషయమున ననుమానము లేదు. దానికి మీయుత్సాహమే నిదర్శనము" అని వారల యుత్తరాత్మ ఘంకాధ్వనులతో బోధించుచుండెను.

సైనికులు తమపట్టు విడువక పనిచేయుచుండిరి. ఒక్కసారిగ బురుజులపై శరాసారమును బంగించి శత్రు సేనల నురుమాడు చుండిరి. మరల బురుజులన్నియును భటులతో నిండిపోవుచుండెను. శత్రుసేనలతోడ జంద్రగుప్తసైనికుల ధైర్యసాహసములును వర్ణిల్లు చుండెను అంతటను వసంతునివీరాలాపములు వినవచ్చుచునే యుండెను. వెనుకడ బుక్కరాయుడును, నెదుటడ జంద్రగుప్తుడును, నంతటను వసంతుడును హెచ్చరించుచుండుటచే సేనాసాగర మంతయు నుప్పొంగి పోవుచుండెను.

అంభీరుడుమాత్రము సామాన్యుడు కాడు. ఆతనిసైనికులు నసామాన్యులే. వారు పైనుండుటచే గ్రిందివారి నక్షమమున నోడింపడగల మను నుత్సాహముతోడ బనిచేయుచుండిరి. ఒక్కొక్కసారి వారు గురియించుశిలావర్షమునడ బడి చంద్రగుప్తభటు లెందఱో పేరులేకుండడ బోవుచుండిరి. వారి వాడినారసముల కనేకులు ప్రాణముల నర్పించుచుండిరి. గాయములనుండి నెత్తురు వరనలై ప్రవించుచున్నను తెక్కలుగలడ జేగురుకొండలవలె వారు కోటగోడల కెగబ్రాకుచుండిరి. బలమైనగాయములు తగిలినను గునపములతోడ దుర్గప్రాకారము నెక్కపోటు పొడిచి మఱి ప్రాణములను నదలుచుండిరి. వారిప్రయత్నము లేవియుడ గొనసాగుట లేదు.

కోటలు మాటలతోడ జేజిక్కునా? ఎంతరక్తము భూమిపైడ బ్రసరింపవలసియుండును? ఎందఱుస్వార్థత్యాగులయి తమజీవితముల ధారపోయవలయును? ఎంతబలము నాశనము కానలయును? ఎన్ని కష్టములకు సహింపవలయును? ఎంతకాల మోర్చి యుండనలయును?

చంద్రగుప్తుడు ప్రళయకాలరుద్రునివలె మహోగ్రుడై యుండెను. సైన్యమున రక్తము ప్రసరించుచున్న కొలఁది నాతనికన్ను లెఱ్ఱ వడిపోవుచుండెను. భటులప్రాణానిలము లెగురుచున్నకొలఁది నాతని

హృదయములనందలి క్రోధానలము ప్రజ్వలించుచుండె. దుర్గద్వారమును భేదించుటకు గజఘటలను బురికొల్పెను కవాటములను దాకుట కేనుఁగులఁ బురికొల్పుమండిరి. ఒకదానివెనుక నొక్కటిగ వచ్చి తమ కుంభస్థలములతో నేనుఁగు లాయినుపతలుపులను దాకుచుండెను. కాని గ్రంథుల్పైఁ గూర్పఁబడిన బలమైనవాఁడిగల గుబ్బలతాకుటన కుంభములు పగులుచుండుటచే నొకసారి తాకినయేనుఁగు మఱియొకసారి తాకలేఁ పోవుచుండెను. కవాటము లింకను పగులలేదు. శత్రుసైన్య మావంక కనంతముగ వచ్చి గజసైన్యమును జెల్లాచెదరు చేయు చుండెను. అరుణకిరణుఁ డాకాశమధ్యమునఁ బ్రతాపమూర్తియై వెలుఁగుచుండెను. ఇరువాగులందును ప్రతాప మతిశయించుచుండెను.

ఆసమయమున "వాఁడిమేకులతాకునకోర్వక యేనుఁగులు వెను దిరుగుచున్నవి. ఈదుర్గమింకను నరబలి గోరుచున్నది. రాజభక్తిగల భటులు కీర్తికొఱ కిప్పుడు ప్రాణములను విడువవలసి యున్నది. దుర్గ ద్వారములతో స్వర్గద్వారములను భేదింపఁగలధీరు లెవ్వరో కవాట ముల కడ్డముగఁ వెన్నుల నానుకొని నిలువఁబడుఁడు. త్వరపడుఁడు" అను గంభీరాలాపములు వినవచ్చెను. ఆవాక్యములు వసంతునివి.

తోడనే చంద్రగుప్తుఁ డేనుఁగుపై నుండి క్రిందికుఱికెను ఒక్క యుదుటున శరవేగముతోఁ గోటగోడ కెగఁబ్రాకి బురుజుపైనున్న సేనలఁ జెల్లాచెదరు చేసినై చెను. భటులు గుంపులుగుంపులుగ వచ్చి కవాటముల కడ్డముగ నిలువఁబడుచుండిరి. వసంతుఁడు వారిపై నేనుఁగు లను దాఁకించుచుండెను. పిడుగులు పడుచున్నట్లు భయంకరశబ్దములు పుట్టుచుండెను. సాహాసము! రాజనీతి యొక్కొక్కప్పు డతిదారుణ మైనది. ఉద్రేకజనకములగువీరాలాపములలో నద్భుతశక్తి మూర్తీభవించి యుండును. అనేకులగుభటులప్రాణము లాదుర్గద్వారమున నెగిరిపోవు చున్నవి. ఇంకను సైనికులు వచ్చి పడుచునే యుండిరి. ఏనుఁగులు

తాఁకుచునే యుండెను. కొంతసేపటికి వేయిమందిభటులను బలిగొన్న యాకవాటము పాపము బ్రద్దలయ్యెనో యనునట్లు తలుపులు బ్రద్దలయి విరిగి పడిపోయెను. సైనికుల జయజయధ్వనులతో దిక్కులు బ్రద్దలగుచుండెను గుంపులు గుంపులుగ యోధులు కోటలోఁ జొరఁబడిరి. ఆసంరంభమునకు సంభ్రమించి వెనుకబుజుజాపైనున్న సేనలు క్రిందికి దిగెను. ఇరువాగులకును సంకులసమర మారంభమయ్యెను కోట ద్వారము మొకసారిగ తెఱచివేయఁబడినవి. నాలుగుమూలలనుండియును వీరభటులు కోటలోఁ బ్రవేశించి శత్రువుల నురుమాడుచుండిరి. కోట లోనివారందఱు ప్రాణములకు తెగించి పోరాడుచుండిరి. ఒకమూల చంద్రగుప్తుఁ డఖండసైన్యమును దననిశితకరవాలమున కెరసేయుచుండెను యోధుఁడు నాతనియంగరక్షకులును వచ్చి కలిసికొనిరి. ఒకమూల వసంతుఁడు గజబలమును మరలించి శత్రుభటులను మట్టించుచుండెను. పుష్కరాక్షుఁడశ్వబలముతో శత్రులనరికట్టి బల్లెములతోఁ గ్రుమ్మించుచుండెను. ఆసంకులయుద్ధమున నెవ్వరెట్లుమరణముచేయుచున్నారో విమర్శించిచూచుట కనువుపడలేదు. ఎక్కడఁజూచినను జంద్రగుప్తునికిరీటకాంతు లపరాహ్ణసూర్యకాంతులతోఁ గన్నులు మిఱు మిట్లుగొలుపుచుండెను.

ఉభయసేనాసాగరంబులు నుప్పొంగి యొండొంటిపైఁ బడునప్పుడారణరంగ మల్లకల్లోలమై యుండెను. వివిధాయుధసంఘర్షణంబులును, భేరీ భాంకరణములును, గజఘీంకారములును, హయ హేషలును, భీరుపాలాపములును, శ్రవణభేద్యములయి వినవచ్చుచుండెను. ఉద్రిక్త రక్తప్రవాహముంగూర్చి యూహించితెలుపుదమన్నచో నిప్పటివారి కట్టివర్ణనములు రుచియింపక యూహార్థ్యవిషయంబున ననుమానము జనియించునేమో యని సందేహించుచున్నాము.

అంభీరుఁడు తన యఖండసైన్యముతో రణరంగమున నిలిచి తన పేరునకును, ప్రతిష్ఠకును, దగినట్లు పోరాడెను. వసంతచంద్రగుప్తుల కోల్తల నెదిరింపలేక సేనలన్నియును జెల్లాచెదరయ్యెను. పాఱిపోవుచున్న సేనలఁ బుష్కరాక్షుఁడు మారిమసఁగినట్లు నాశనముసేయుచుండెను. అంభీరునియదృష్టము తిరిగిపోయినది. కాలమునకనుసరించి ప్రభుత్వములు మారుచుండును. కర్మము కాలమునకనుసరించియే యుండును. ఎక్కడ సహనముండునో యెక్కడ నధర్మము తలయూపుచుండునో యచ్చట జయము దూరమగుచుండును. అసూయ దావానలమునలె జన్మస్థానమునశింపఁజేయుచుండును.

పాపము పాంచాలదేశమంతయు నేకచ్ఛత్రముగఁ బరిపాలింప వలయునని యెన్నియో ప్రయత్నములుచేయుచు నెట్టిదారుణకర్మములకైన సంగీకరించియున్న యంభీరుడిప్పుడు మహావీరశిఖామణియగు వసంతునిచేతులలో దారుణరణరంగమునఁదనయాశలతోఁబాటు ప్రాణములను విడిచిపెట్టవలసినవాఁడయ్యెను. వసంతునిసాహసాదిసద్గుణములు చంద్రగుప్తుని సంతతవిజయములకుఁ దోడుపడినవి.

పండ్రెండవ ప్రకరణము.

స్వదేశరాజులలో నంతఃకలహాములు కల్పించి యొకపక్షమున నిలిచి పోరాడినప్పుడును, విజేయులగుగ్రీకులతోఁ గలిసి తోడిరాజుపైఁ గత్తిగట్టినప్పుడును, తక్షశిలానగరేశ్వరునిపక్షమువహించిన విజయులక్ష్మి నేటికిఁ జంద్రగుప్తునివశమై పోయినది. ఎల్లవిధములఁ నాతనియభ్యుదయమునకుఁ దమజీవితములు ధారపోసినసైనికు లెల్లరును,

భేరులేకుండఁ బోయిరి. పాంచాలదేశమునందలి దుర్గములలోని కెల్ల నభేద్యమని ప్రశస్తివహించిన తక్షశిలాదుర్గ మిప్పుడు శాత్రవులకు స్వాధీన మైపోయినది. ఎవ్వఁడు గ్రీకుసేనాసాహాయ్యమునఁ బాంచాల మునం దంతటను దననిరంకుశప్రభుత్వమును స్థాపింపఁ దలంచెనో, ఆయంభిరుఁ డిప్పుడాయుాహాలను భాగ్యములంగోఁగూడ సంపూర్ణముగ వదలినై చెను. కాలము తిరిగిపోయినది. తెర పడిపోయినది. పౌర్వుఁడు గ్రుంకిపోయినది. చంద్రగుప్తుఁ డిప్పుడు పాంచాలమున కంతకును ప్రభు వయ్యెను. ఆతనివిజయధ్వజము తక్షశిలాదుర్గముపైఁ గూడఁబ్రకాశించు చుండెను.

చంద్రగుప్తునియభ్యుదయమున సేనాసాగర ముప్పొంగి పోవు చుండెను. చంద్రగుప్తుఁ డెంతప్రతాపమూర్తియో యంతదయాళుఁడు. ఎంతగౌరవమహితుఁడో యంతవినమ్రుఁడు.ఎంతచండశాసనుఁడో యంత కార్యవాది ఆతనికిఁ బ్రభుత్వమువలనరాజసము కలుగలేదు. ఐశ్వర్య మువలన గర్వము జనింపలేదు. పరాక్రమశక్తినలన దారుణోద్దేశములు పుట్టలేదు. ఆతఁడుసేనలను స్వయముగనాదరించెను. పౌరులను నంతఃపుర జనంబును నలజడిపెట్టకుండుటకయి వారికాజ్ఞాపించెను. వసుమతీ కనక లతలకుఁగాని రాజాంతఃపురజనంబునకుఁగాని,యలజడికలుగకుండుటకయి చుట్టునుసేనలకుఁ గట్టడచేసెను.

ఆతఁడువిజయరసాస్వాదానందమునమైమఱచియుండలేదు.లావణ దుర్గమును ముట్టడింపఁబోయినగ్రీకుసేన లాతనిమనసులోనసేయుండెను. తనసేనల కన్నిటికి నిట్లాజ్ఞాపించెను.

" యోధవరులారా! నాయందలిప్రేమచే నాయభ్యుదయమును గోరి నాపక్షమునఁ బనిచేసి విజయమును సంపాదించినందులకుఁగృత జ్ఞుఁడనై యున్నాఁడను. చుట్టుపట్టుల గ్రీకుసేనావాహిను లున్నంత వఱకు మనకు నెమ్మది కలుగదు. ఆవాహినుల గాంధారదేశమున కవ్వల

మరలించినపుడుగాని మనవిజయము స్థిరపడినట్లు తలంచుటకు వలను పడదు. ఈమధ్యద్వారము బలహీనమై పోయినది. దీని నెల్లవిధముల మనము కాపాడికొనుట కీరాత్రి యప్రమత్తులమై ప్రయత్నింపవలసి యున్నది. వసంతుఁడు గజబలముతో నిమధ్యద్వారరక్షణమున నప్రమత్తుఁడై యుండవలయును. కొంతబలముతో నేనును బశ్చిమద్వారమునందిలిచి యుండెదను. పుష్కరాక్షుఁడు దుర్గముచుట్టును దిరుగుచు హెచ్చరించుచుండవలయును. కొంతమంది దండనాయకులు తమతమసేనలతో బురుజులపై నిలిచి యుండవలయును. రాజనీతికిని దాక్షిణ్యమునకును జాలదూరము. ఈశాసనము నతిక్రమించి ప్రమత్తుఁడై యెవ్వఁడు సంచరించునో యాతఁడు మరణదండనమునకుఁ బాల్పడవలసి యుండును"

యోధులందఱును నంగీకారసూచకముగ జయజయధ్వానముల నొనరించిరి. చంద్రగుప్తునిశాసనము నిరాఘాటమైనది. ఆగంభీరవచనములు ప్రతిభటునిహృదయమునందును, ప్రతిధ్వనించుచున్నవి. ఆసైనికులిదివఱకు స్వదేశరాజులయంతఃకలహములవలనఁ గలిగిన దేశోపద్రవములలోఁ జాల నాయాసపడి యుండిరి. ఆయల్లరులలోఁ దమతమరాజ్యములను సర్వస్వమునుగ్రీకురాజుల కొప్పగించి చాలకాలము వనవాసకష్టముల ననుభవించిరి. వారిశనిదినములు పోయినవి. చంద్రగుప్తుని సాహాయ్యము లభించినది. ఒక్కింతకాల మోర్చుకొని పనిచేసినచో నందఱుయభీష్టములు సంపూర్ణముగ సిద్ధింపఁగలవు. దేశమునశాంతి వెలకొల్పఁబడును. శ్రీరామరాజ్యము స్థాపింపఁబడును. చంద్రగుప్తనియోగమున నందఱును తమతమయుద్యోగములఁ బ్రవేశించి జాగరూకులయి యుండిరి. ఆనాఁటివిజయమున వారిహృదయము లుత్సాహపూరితములయి యుండెను. ఇంకను వారికి యుద్ధమునఁ దనివితీరలేదు. మరల యుద్ధమున కెదురు చూచుచుండిరి.

వసంతుఁడు ప్రాగ్ద్వారమున గజబలముతోఁ గనిపెట్టియుండెను. ఆతనికి విచార మగపడుట లేదు. కాని కొంతవఱ కాతనిహృదయము కోటలో నంతఃపురమునన్నున్న వసుమతివంకకుఁ గూడఁ బోవుచుండెను. అగాధాంధకారమునఁ గన్ను మిన్నుఁ గనఁబడుటలేదు. ఆచీఁకటిలో నాకస్మికముగా వసుమతి సాక్షాత్కరించినట్లయ్యెను. నిర్దయుండగు తన్నుఁ జూడనెల్లక తప్పించుకొని పోవుచున్నట్లుండెను. ఇది యంతయు నాతని హృదయవికారము. వియోగవంతుల కగపడునదంతయుఁ బ్రియావిలాసముగనే తోఁచుచుండును. గాఢాంధకారమున నేదో నొక ఛాయ పార్శ్వమునఁ బోవుచుండుట నాతఁడు చూచియుండును. తన్మయత్వముచేఁ దన్ను విడనాడి పోవుచున్న వసుమతిగ భావించుకొని యెను తోడనేయాతఁడు స్మృతిఁ దెచ్చుకొనియెను. కార్యాలోచనాధారము, వియోగవిచారము, ఈరెంటికిని హృదయమున సరిపడినంతతావు దొరకుటలేదు. ఆభావములు పొంగిపొంగి పైకిరచ్చుచుండెఁ. విచారమును హృదయమునదాఁచి తీక్ష్ణభావమునువహించెను. కరవాలమునొక్కసారి రుళిపించి తదేకదృష్టితోఁ జేనల బరీక్షించుచుండెను.

సైనికులందఱును మేల్కనియే యుండిరి. విజయవార్తల నత్యుత్సాహముతోఁ బ్రశంసించుకొనుచుండిరి. రాత్రిరెండవజామగంట వినఁబడినది. భేరిమోగించుచుండిరి. ఆసమయమున మనహరిదాసుఁడు వసంతునియెదుట సాక్షాత్కరించెను.

"ఎవరువారు?" అని వసంతుఁడు ప్రశ్నించెను.

"హరిదాసుఁడు" అని యాతఁడు పలికెను.

వసంతుఁడేమో యాలోచించుకొనియెను. అలనాఁడు శతద్రూనదీతీరమున గానముచేయుచున్నప్పు డీహరిదాసుని వసంతుఁడు చూచి

మాటలాడియున్నాఁడు. ఆతని నానవాలుపట్టి, ఇచ్చటికిప్పుడేలవచ్చితిరి?. అనియెను.

" అనాథయువతీరక్షణముకొఱకు మీసాహాయ్యముకోరి వచ్చితిని. దయయుంచి వేగమ రావలయును. "

" ఎచ్చటికి? "

" అంతఃపురమునకు "

" అంతఃపురముచేరుటకు మాకు రాజాజ్ఞలేదు. సతీరక్షణమునకు మహారాజగు చంద్రగుప్తుఁడే చాలియున్నాఁడు. ఆతనిఁ బ్రార్థింపుము "

" ఆమె యొకులచే రక్షింపఁబడదు. నీవే రక్షింపవలయును "

వసంతుని గుండె జల్లుమనియెను. ప్రియముగలచోటఁ గీడు శంకించుట సహజము. పాప మంతఃపురమున నున్ననసుమతి కేమైన కీడు మూఁడినదేమోయనియాతనిహృదయము తల్లడిల్లుచుండెను." అయ్యా! అంతటివిపత్సముద్రమున మునిఁగియున్న యబలయెవ్వతెయో మీకుఁ దెలియునా? " అనియెను.

" ఈప్రశ్నోత్తరములతోఁ గాలముగడుపుచుంటకీది యుదను గాదు.ఒక్కింతసే పాలసించితివేని శరణాగతనిరాసనము వలని దోషము.

" శాసనాతిక్రమణము వలననేరముమాత్రము లేదా? "

" పాపము ! నీవంటిదయాళుఁడగు యోధుని రక్షణమునాసించిన యాయబల బలవంతముగఁ బ్రాణముల విడువవలసినదేనా? "

వసంతునిహృదయము చేవెట్టి కలఁచినట్లుగ నుండెను. ఆహృదయమున వసుమతి యాపదలోఁ బడిపోవుచున్న ట్లాతనికిఁ బొడకట్టెను. ఆతఁడుమనసు కుపురుపఱచుకొని యమంగళముల శంకింపఁగూడదని ధైర్యము తెచ్చుకొనియెను అంతఃపురమున సురక్షితముగ నున్న

వసుమతి కేమియు నపాయముకలుగదని నిశ్చయించుకొనియెను. వసుమతీసందర్శనమునకుఁ ద్వరపడుచున్న యాతనికి తృణమొకయుగముగ నగపడుచున్నను రాజకార్యభారమును వహించియున్న యాతఁ డారాత్రి నొక నిమిషముగ గడపవలయునని ధృఢనిశ్చయుఁడై యుండెను.

"అయ్యా! నాకేమియును సంబంధములేని కార్యమునకుఁ బూనుకొని రాజకార్యము నతిక్రమింపఁజాలను. ఇందుమూలముననేదేని యుపద్రవమేతటస్థించిన యెడలఁ బ్రజలకును, దేశమునకును, రాజునకును, రాజ్యమునకును, గూడ మహాద్రోహము చేసినవాఁడ నగుదును." అనియెను.

"ఇప్పుడిచ్చటఁ గలిగిన యిబ్బంది యేమియునులేదు. ఒకవేళ గలిగినను దానిని తప్పించుకొనుటకు మార్గములున్నవి. నీయుపకారికి నాకన్నియ ప్రాణములే పోయినయెడల మఱిరావుగదా!"

వసంతునియూహలు చెదరిపోవుచుండెను. అతనికి ధైర్యము నిలువఁబడుటలేదు. ప్రాణప్రియులవిషయమున నాపదనుగూర్చిన యనుమానము గూడ సత్యముగనే హృదయమును వేధించుచుండును. "అయ్యా! ఆకన్య యెవ్వతెయో యామెకుఁ గలిగినయాపద యేమో చెప్పకుండ నిట్లేలకలఁగించెదవు?" అనియెను

"ఆమె యెవ్వతెయో నే నెట్లు చెప్పఁగలను? ఇది యామె ప్రాణావసానసమయమునఁనాపైఁ బ్రయోగించిన యుంగరము" అనియెను.

"ఉంగరము" అనువాక్యము వసంతుని శ్రవణములకు హాలాహలమునఁ లె నుండెను. వడఁకుచున్న హస్తముతో నాయుంగరమునందుకొని పరిశీలించి చూచెను.

వసంతునిగుండె బ్రద్దలై పోయినది. అతని రక్తనాళములలో దావానలము ప్రవేశించినది అంగుళీయకస్పర్శనమాత్రమునఁ గలిగిన పూర్వస్మృతి హాలాహలమువలె లోపలఁబ్రవేశించి యాతని హృదయమును దహించివేయుచుండెను. కన్నులనుండి యొక్కయశ్రుబిందు

వైన వెడలినచో హృదయతాపము కొంతయుపశమించియుండును. కాని, విరహతాపతప్తంబులగు నాతని విశాలనయనము లట్టియవస్థలో లేవు. కాలసర్పమువలె రోజుచు నిశ్చేష్టుఁడై నిలువఁబడిపోయెను. అట్టి యవస్థలో నాతనికి మరల రాజశాసనము తలంపునకు వచ్చుటచే నించుక బాహ్యస్మృతి కలిగెను. ఆమండుచున్న హృదయానలమున నెన్నియో భావస్ఫులింగములు వెడలుచుండెను. అప్పటి యవస్థను బట్టి యాతఁడొక్కింత ధైర్యమును దెచ్చుకొనవలయునని ప్రయత్నించెను. పగటియుద్ధమును జ్ఞప్తికిఁ దెచ్చుకొనియెను తన్నెదుర్కొని యంభీకుఁడు పొడిచిన బల్లెపుపోటును, ఆసమయమునఁ దనకుఁ గలిగిన తీవ్రక్రోధమును ధ్యానించుకొనియెను. నిశితకరవాలాఘాతములచేఁ గూలుచున్న శత్రుభటుల వెచ్చని నెత్తురుతుంపురులవలన నలంకరింపఁబడిన తనభయంకరాకారమును స్మరించుకొనియెను. ఇప్పు డాతనిహృదయమున శోకానలముపై వీరరసము ప్రధూమితమగుచుండెను. అది యెంత సేపునిలుచును?

"అయ్యా! ఈయుంగరము నాది. నీకెట్లు వచ్చినది?" అని యడిగెను.

"ఈయుంగరము నీదైనప్పుడు దీనిని ధరించినయామె నీ ప్రాణమైయుండును. మహావీరశిఖామణివగు నీవు నీప్రాణము నితరుల రక్షణమునకుఁ బాల్పడుచుట పౌరుషముకాదు"

వసంతునిహృదయమున నిప్పుడు శోకానలము ప్రజ్వరిల్లుచుండెను. వీరరస మెగిరిపోయినది. గద్గదస్వరముతో "ఆయాపదనొందుచున్న యబలామణి నాప్రాణమగు వసుమతియేనా?" అని నిశ్చేష్టుఁడై నిలువఁబడిపోయెను.

హరిదాసుఁడు వసంతునిచేతులతోఁ దట్టి "అయ్యా! నిమిషములు గడచినకొలఁది నామెకు మృత్యువు సమీపించుచున్నది. త్వరపడవలయును. ఆలోచించుట కవకాశము లేదు. ఆమెను రక్షించి ఋణ

కాలము ల్లో యథాస్థానమునకు రావచ్చును. ఇంతలో వచ్చునపాయ మేమియును లేదు. సైనికులెల్లరును జాగరూకులై యున్నారు. ప్రాణ ప్రియయగు సతీరక్షణముకంటె నుత్తమధర్మము వేఱొండులేదు. నీ హృదయమును పదిలపఱచుకొని లెమ్ము" అని హెచ్చరించెను.

వసంతుఁడు తెలివిఁ దెచ్చుకొని చాలదూర మాలోచించుకొని యెను. ఒకవంక ప్రాణప్రియాప్రాణరక్షణము, ఒకవంక రాజకార్య నిర్వహణము. ఇవి రెండు నాతని కవశ్యానుష్ఠేయములేయైయుండెను. ఒకటి ప్రాణోపద్రవమునుండి కాపాడుట. ఒకటి రానున్న సంఘోపద్రవ మును దొలఁగింప సంసిద్ధముగ నుండుట. ఈరెంటికిని సామాన్యధర్మ మగపడుటలేదు. ఒకటి స్వార్థపరత్వము. మఱియొకటి స్వార్థత్యాగ ముతోఁగూడిన ప్రభుభక్తి ఈయాలోచనములేవియు నాతనికి సరిపడుట లేదు. ఇంకను హృదయమున మననముచేయుచునే యుండెను. ఎమిట నెవ్వరో యిరువురు యోధులు గుసగుసలాడుచున్న ట్లాతనికి వినఁ బడియెను. వారు వసుమతిని జంపఁబోవువారివలె నాతని కగపడిరి. హరి దాసుని హృదయము, వసుమతిపై నుండుటచే నాతని కీగుసగుసలు వినఁబడలేదు. వసంతునకు హృదయావేగము కలిగెను. అందు "హా ప్రియా! కడసారి విన్నపము నాలింపుము! కడపటిదర్శన మొసంగుము! రక్షింపుము. రక్షింపుము" అనునార్తవాక్యములు ప్రతిధ్వనించు చుండెను. ఆర్తత్రాణపరాయణులకు దీనాలాపములే యాకర్షణమంత్ర ములు. వసంతునకు దూరాలోచనసేయుట కవకాశములేదు. సైనికు లందఱు మేల్కనియే యుండిరి. ఒక్కింతసేపటిలో మరలిరావచ్చు ననితలంచెను. "అయ్యా! ఆస్థలమునకు దారి చూపుము" అని చెప్పుచు నాహరిదాసునితో వెడలి పోయెను.

పంచమాంకనప్రకరణము.

"హానాథా! మమ్ము వీడి స్వర్గమును జూడఁబోయితివా? నిర్భాగ్యులగు మీరాణుల కేమిగతిచూపితివి? మాకంటె నీవు ముందుగ స్వర్గముఁ జూఱఁగొనుట న్యాయమా? మేము నీసహధర్మచారిణులము కామా! సుఖదుఃఖములకు సమభాగినులము కామా? మేము నివెనుకనే వచ్చుచున్నాము. కొంతనేపాగుము. నికెట్టిపాయచాపు తటస్థించినది?"

అను నార్తనాదము లంభీరునియంతఃపురమునుండి వినవచ్చుచుండెను. అది కోటదక్షిణపార్శ్వమునం దున్నది. దానికి దక్షిణముగ నొకయంతర్గృహమున్నది. దానియం దగ్ని ప్రజ్వరిల్లుచుండెను. అంభీరునిరాణులందఱును భర్తృనియోగసుఖమున నగ్నిప్రవేశము చేయఁ జూచుచుండిరి. ఆయూర్ధ్వనులు చారివే. ఆస్త్రీలమధ్యమున నొక బాలిక కూడ దుఃఖించుచుండెను. మూర్తీభవించిన శోకదేవతవలె నున్న యాబాలికను జేరి యాస్త్రీలందఱును—

"ఓనిర్భాగ్యురాలా! నీమూలముననే మాకిట్టిగతి కలిగినది. నీవు మాకోటలో నడుగుపెట్టితివి. నిర్ధూమధామముఁ జెయువఱకు విడువలేదు. నిపాపపుఁజూపులలో విషమున్నది. మాజీవితేశ్వరు నెడఁ బాపిన నీకు నిప్రాణేశ్వరుఁడు మాత్రము దక్కునా? రమ్ము మాతోఁ గూడ నగ్నిప్రవేశముం జేయుము." అని బలవంతపెట్టుచుండిరి,

పాపమాయబల "అమ్మా! నావలన దోషములేదు. నేను మీ కేమియు నపకారము చేసియెఱుంగను. కాలకర్మదోషమునఁదటస్థించిన మీపతిమరణమునకు నన్ను త్తరవాదినిం జేసి యేల పాపము గట్టుకొని యెదరు? చిరకాలమునుండి నేనొక్కకోరికతో నున్నదాననను. నడుమ

నెన్నియో విఘాతములు కలిగినవి. ఎన్నియో కష్టములు వచ్చినవి. ఎప్పటికిఁ గాన నాకోరిక సిద్ధింపఁగలదను నాశతో నింతకాలము జీవించి యుంటిని. అట్టియభీప్సితము సిద్ధింపనున్న యిక్కాలమున నన్నేలచంపఁ జూచెదరు? మీరు సతీజనసామాన్యధర్మమును నాముష్మికసుఖకారణంబు నగు సహగమనవ్రతము నూనియున్నారు. నిరంతరప్రియసమాగత సౌభాగ్యము నుత్తరజన్మమునైనఁ బడయఁ గోరుచున్న మీరు చిర వియోగపరిత ప్తహృదయనై ప్రియసందర్శనభాగ్యమున కెదురుచూచు చున్న నాయానందమున కేలవిఘాతము సేయఁ జూచెదరు? ప్రియమరణ దుఃఖాతిరేకమున యుక్తాయుక్తవివేకమును విడిచి కేవల సామాన్యస్త్రీ సాధారణంబగు నసూయాపిశాచంబునకు లోనై యిట్టిదారుణకర్మమున కేల యొడిఁ గట్టుకొనియెదరు? స్వర్గరాజ్యమును జూఱగొనఁదలంచిన మీరు మహారౌరవనరకద్వారముల నేల తెఱవఁ జూచెదరు? ఎలజవ్వన మంకురించుచున్న సమయమునఁ బెండ్లియన్న నెంతసంతోషముగనుండె డిదో, ప్రప్రథమముననుదయించిన మోహమునం దెంతశక్తియున్నదో, జీవితేశ్వరునిప్రథమసమాగమమెంతయానందకరమైనదో, ప్రియవియోగ మెంతదుస్సహమయినదో లోకానుభవముగల మీరెఱుంగనిదికాదు. ఏమియు నెఱుంగని యీపూపపిండెనేల తునిమివేసెదరు? నాయీ యవస్థ మీకుజాలిగలిగించుటలేదా? నాదీనాలాపములు మీహృదయ మును గఱగించుటలేదా?"

అని యనేకవిధముల దీనముగఁ బ్రార్థించుచుండెను. పాప మీకోమలియెవ్వరు? వసుమతియెకాదా? మానపాలుని గర్భమునఁ బుట్టి మగధరాజుచే బలవంతముగ నరికట్టఁబడి చోరులబాధకు లోనై కడకు తపశ్శీలాదుర్గాంతఃపురమున నిష్ప్రయోజనవస్థలో నున్నది. ఆమెముఖమండలము కళాహీనమయి యుండెను. ఆచూపులలో నిప్పుడు ధవళకాంతులు స్ఫురించుటలేదు. వేడియూర్పులచే నధర

బింబము నల్లవడిపోయినది మనోహరాలంకారము లన్నిటిం దృణీకరించు నామెకచకలాప మిప్పుడు విరిసి యెండలంతటను జెదరి ప్రవేలాడు చుండెను. అసుకుమారశరీరము కృశించి పలుచని నల్లమబ్బుచేఁ గప్పఁ బడినకృష్ణచతుర్దశీ చంద్రరేఖ వలెనుండెను. ఆమెకన్నులనుండియొక్కటే ధారగ నశ్రువులు జాలువారుచుండెను. ఆమె నోదార్చునా రెవ్వరు? ప్రాణాపదముగఁ బెంచుకొనుచున్న సుందరి యీలోకమునే విడిచి పోయినదిగదా! ఓయీశ్వరా! నీవెంతనిర్దయుఁడవు? శిరీషకుసుమకోమలులగు సుకుమారిణులకు భరింపరానికడగండ్లంగూర్చి నవ్వుచుఁ జూచుచుందువు. ఆమె యెంతకష్టపడుచున్నదో చూచుటలేదా?

పాపము! వసుమతి చావుఁగోరుకొనుచున్నంతకాలము చచ్చుటకు వలనుపడినదేకాదు. ఇప్పుడు వసంతువివార్త తెలిసినప్పటినుండియు నామెకు జీవితమునం దాశ కలిగినది. ఈసమయమున నామెకు బలవన్మరణము తటస్థించియుండెను. పిశాచములవలె నారాణులు చుట్టుకొనియుండిరి.

శోకానలము క్రోధాకారమునఁ బరిణమించుటచే నున్మాదినులై యున్న వారికి జాలియెట్లు కలుగును? వసుమతి దీనాలాపములు వారి తల కెక్కలేదు. బలవంతముగఁ దలపెట్టినకార్యమును దీర్పఁదలంచిరి. ద్వారము వెలుపలి దొడ్డిలోపలఁ జితిప్రజ్వరిల్లుచుండెను. కాలుచుండు కట్టెలచిటపటధ్వనులలో యమకవాటఘంటాధ్వనులు వినవచ్చు చుండెను. అగ్నికుండమునుండి నిలివెడెత్తుగా నగ్నికీలలు వ్యాపించు చుండెను.

అయ్యో! వసుమతి! చిన్నతనమున నెట్లుంటిప్రాణాని నిన్నెఱిఁగి నంతవఱకు మాకు నికృష్టములను జూచుటతోడనే సరిపోయినది. ఈ విపత్సముద్రతరంగములకు నేఁటితో విశ్రాంతి కలుగునాయేమి? విరహపాండురంబులగు నీకోమలాంగకంబులువై శ్వానరజ్వాలలలో మాయము

కావలసినదేనా? ఈవిధముగా నీకష్టములన్నియుఁ దీరిపోవలసినదేనా? నీమనోహరతనుకాంతులగ్నికీలలలో నైక్యముకావలసినదేనా? నీసుందరవదనచంద్రమండలమువహ్నిశిఖాసంతాపముఁగఁ అఁగిపోవవలసినదేనా? నీకీలోకమున ననుభవింపఁదగిన సౌఖ్యమేమియును లేదా? కటకటా! నీహృదయమిప్పు డెంత పరితపించుచున్నదో? నీకీకష్టకాలమున నీతలిదండ్రులు జ్ఞాపకమునకు వచ్చుచున్నారు? లేరు. నీవు వారిని చిన్నతనమున నే మఱచిపోయితివి? నిమిషసుఖందరిపైకిఁ బోవుచున్నదా? ఆమె యీలోకమున నున్నదను నాశయేమియును లేదే? నీవిప్పుడు వసంతుని ధ్యానించుచున్నావు. దైవమును ధ్యానించుటలేదు. నీకు వసంతుఁడే దైవము. దేవుఁ డొన్నఁడును దృగ్గోచరుఁడుకాఁడు. నీకు వసంతుని నట్లే భావించుకొనుచున్నావు. నీతనులత కంపించుచున్నది. నీవునోహరుఁడు నీయెదుట సాక్షాత్కరించెనాయేమి? నీప్రాణనాయువుల వసంతుని ప్రాణానిలములతో నైక్యముచేయఁ దలంచుచున్నావా! నీవలపు చాలఁ జెడ్డది నీయనురాగమునకుఁ బరిమితి లేదు. నీజీవితమే దుఃఖభాజనమై పోయినది. అదృష్టదేవత నీపైఁ బగసాధించుచున్నది.

అగ్నిప్రవేశసమయమైనది. రాణులామెను బలవంతముగఁ గట్టితీసికొనిపోనలయునని నమీపించిరి.

"హా! ప్రియా! వసంతా! రక్షింపుము! రక్షింపుము" అనిపెద్దపెట్టున రోదనముసేయుచు వసుమతి స్మృతిదప్పి పడిపోయెను. రాణులామెను గట్టితీసికొనిపోవుటకు సిద్ధముగ నుండిరి. ఇంతలో నతివేగముగ నొకయోధుఁ డాస్థలమును సమీపించెను. శత్రుభీతిచే రాణులు చెల్లాచెదరైరి. ఒక్కపెట్టున నందఱు నవ్వలిదొడ్డిలోనికిఁబోయి తలుపులు మూసికొనిరి. ఒకనిమిషములో "హా! పరమేశ్వరా!" యను నార్తధ్వను

లతోఁజిటపెటధ్వనులు వినవచ్చెను. ఇఁక నేమున్నది? రాణులయగ్ని ప్రవేశకర్మము పరిసమాప్తి నొందినది.

ఆయోధుఁడు వసంతుఁడే. ఆతఁడు లోనికరిగి చూచునప్పటికి వసుమతి స్మృతిదప్పి పడియుండెను. ఆమెను గాంచినతోడనే వసంతుని హృదయభావములన్నియును బొంగిపోయినవి. ఎక్కడిపాటలీపురము! ఎక్కడితక్షశిల! ఎక్కడినసుమతి! ఆక్షణికిఁ గన్నీరు చెక్కులఁ జాలువారుచుండెను. పెద్దపెట్టున "వసుమతీ!"యనిపిలిచెను ఆమె మాటలాడలేదు సుడిగాలితాకున నల్లాడు నరుణపల్లవములవలె వడవడవడకుచున్న హస్తములతో నామెతనువల్లిని స్పృశించిచూచెను. అప్పుడామె మైదీగ తప్తకాంచనసదృశమై యుండెను. ఆమె నక్షోభాగమునఁ జెవియొగ్గి వినెను. గుండెలుతటతటఁ గొట్టుకొనుచుండెను. ఆమె సుందరవగనారవిందమును తెప్పవేయకి చూచుచుఁ గొంతసేపుండెను. బాష్పావరోధమువలన నాతనిచూపులకు నడుమ సంతరాయము కలుగుచుండెను. కొంతసేపటి కామె కనులు విచ్చి యొక్కసారిచూచెను. తోడనేకన్నులు మూతపడిపోయెను. వసంతునకదియేకడనారిమాపుగ దోఁచెను మరల "వసుమతీ!వసుమతీ!" యనిశోకగద్గదస్వరముతోఁబిలిచెను. ఆమెపలుక లేదు. ఆమెకనుగొలుకులు బాష్పపూరితములైయుండెను. ఆమెమనోహరవదనబింబమును గప్పివేయుచున్న ముంగురులను జక్కఁజేసి సకరుణముగ నానురాగముగ, సాభిప్రాయముగఁ జూపులుపఱగించెను. కన్నీటిచేఁ దడిసినచెక్కులపై నంటియున్న కుటిలకుంతలముల నెడలించి కడసారియొక్కముద్దుఁ బెట్టికొనియెను. మూఁఖాతిరేకమునఁనాతనికన్నులనుండి వెడలుచున్న యశ్రుధారలచే వసుమతివదనమండలమును దడిపినై చెను. ఇప్పుడిప్పుడు వసుమతికి వసంతసంస్పర్శనమున నించించుక స్మృతి కలుగుచున్నట్లున్నది. సాయంతనచంద్రకిరణప్రసారమున నించించుక తేటి కొనుచున్న గ్రీష్మప్రతప్తవల్లికవలె వసుమతి సుకుమారాంగకములు

చైతన్యప్రకాశితము లగుచుండెను. తనుతాప ముపశమించుచున్నది. మఱియొకసారి కనుదమ్ములను విచ్చి చూచెను. ఆమూపులలో స్మృతి యున్నది. మరలఁ గన్నులు మూసికొనియెను.

ఎంతసిగ్గువసుమతీ! నినుకుమారశరీరమును బరితపింపఁజేయుచు క్షణక్షణమునకు జీవితసంశయము గలిగించుచున్న నీమోహముతోఁ గూడ నిలజ్జాభావమును వర్ధిల్లుచునేయున్నదా? ఎవ్వనిసందర్శనభాగ్యమును నిరంతరమును గోరుకొనుచుంటివో, యెవ్వనిహృదయానురాగమును నియనురాగములో సరిచూచుకొనఁజాలుచుచుంటివో, యెవ్వనిసంస్పర్శనానందము ననుభవింప హృదయమునఁ బరితపించుచుంటివో, యాసమనోహరుఁడు, నీవలపులపంట, నీజీవితేశ్వరుఁడు, నియెదుట నిలిచి నీకొఱకుఁ బరితపించుచు నీకోమలాంగసంస్పర్శమునసుఖమో, యానంద మో, యెఱుఁగక యనుభవించుచుండఁగాఁ జూచియు నేలపలుకరింపలేక పోవుచున్నావు? ఫక్కలింతలై వచ్చుచున్న యానందరసాంబుధి యందలి లజ్జాతరంగములలో నేల మునిఁగిపోయెదవు?

వసుమతి తీవ్రశోకదావానలమానందరసప్లవసముద్రమునఁ బూర్ణ మించినది. మోహబడబానల మాసముద్రమును బొంగించుచుండెను. లజ్జాతరంగోద్రేకము మాత్ర మింకను నడఁగిపోలేదు. వసుమతి మఱి కన్నులు తెఱచి చూడలేకపోయెను. తన సమున్నతవక్షస్థలంబున వామకపోలమునాని వదనమండలమున నిశ్చలకటాక్షములఁబఱగించుచుఁ దన్మయుండయి యున్న ప్రాణేశ్వరుని కంఠమును తనవామబాహు వల్లరిచే బిగించి యించుక యెడమప్రక్కకొఱిగి బిగ్గఁవుంగిలించుకొనియెను. ఇదినఱకు వసంతునిచెక్కిలి చేరియున్న తావున నాతని విశాల వక్షస్థలమున్నది. ఆతని వామశిరఃపార్శ్వము వసుమతిదక్షిణకపోలమునాని యుండెను. తుమ్మెదతొక్కలవలె నల్లనై యున్న మీసములు వసుమతి యధరబింబమును గప్పివేసెను. బింబ ప్రతిబింబన్యాయమున

వసుమతి హృదయభావములన్నియును వసంతునియందుఁ బ్రతిఫలించెను. ఇరువురశరీరములును దపించుటలేదు. ఇరువురికన్నులును మూతపడియెను. ఇరువురకు నిట్టూర్పులు వెడలుచుండెను. ఇరువురు నానందరసాంబుధిలోమునిఁగి పోయిరి ఇరువురును మోహాన్మాదమున మైమఱచిరి. ఇట్లిరువురు స్తబ్ధులై పడియుండిరి.

విరాధవధానంతరమునఁ బర్ణశాలలోఁ బరస్పర గాఢాలింగన సుఖంబున విస్మృతివహించినసీతారాములయిననుసీయూనందమును, వసుమతీవసంతుల యిట్టిమహానందమును, ననుభవించి యుండరు.

ఈసమయమున హరిదాసుఁ డచ్చటికివచ్చి చూచెను. ప్రపంచకవిషయముల నుజ్జగించి లోకాతీతచరిత్రుఁడయి చరియించుచున్న యీభక్తశిఖామణికిఁ గూడ మహానందము కలిగెను. వారియానందమునకు స్మృతి కలిగింపవలయునని యాతనికిఁ దోఁచెను. సారంగమున రాధామాధవవిలాసము పాడవలయునని తలంచెను. శ్రోతులు సరిజేయఁ జూచుచుండఁగా "కోటలో! శత్రువులు! గ్రీకులు! కోటలోఁ జొరఁబడుచున్నారు! అడ్డుకొనుఁడు. పొడువుఁడు! యుద్ధము! యుద్ధము! లెండు! లెండు! త్వరపడుఁడు. త్వరపడుఁడు." అనుకోలాహలధ్వనులును, భయంకరభేరీధ్వనులును వినవచ్చెను. ఆనందపారవశ్యమున దమ్మును లోకమును మఱచియున్న వసుమతీవసంతుల కాభయంకర కోలాహలమేమియును వినఁబడలేదు. దేశద్రోహముచేసిన వానివలె హరిదాసుడు నిశ్చేష్టుఁడయి నిలువఁబడిపోయెను.

పదునాల్గవప్రకరణము.

కోటయంతయును గ్రీకులచే నిండిపోయెను. ద్వారమునెద్ద నసంతుఁడులేఁడు. భటులు వారికోల్తల కెదురలేక ద్వారమును వదలి వైచిరి. వేలకొలఁదిగ్రీకు లిఁక నాద్వారమువెంబడి వచ్చుచునే యుండిరి. కోటలోనున్నదండనాయకులు తమబలములతో వచ్చి వారి నాఁపవలయు ననియెదిరించుచుండిరి. కాని మహాశూరు లగుగ్రీకు భటులు వారిని దూసికొని ముందునకుఁ బోవుచుండిరి. పుష్కరాక్షుఁడు వారినాఁగి సమరము చేయుచుండెను. పుష్కరాక్షునిసేనాసముద్ర మున గ్రీకువాహిని లీనమై పోవుచుండెను. గ్రీకుల కిరువంకలను చంద్ర గుప్తుని దండనాయకులు నిలిచి వారిని తాఁకుచుండిరి. గ్రీకునాయకులు యుద్ధములయం దారితేరినవారు. వారు చంద్రగుప్తుని నెటులైనఁ బట్టి కొని పోవలయు ననితలంచియుండిరి. సాహసముతోడను, ధైర్యము తోడను, మెలఁకువతోడను వారు శత్రువుల నెదిరించి పోరాడుచుండిరి. గ్రీకుసేనానాయకుఁడెటఁజూచినఁ దానయ్యె పరాక్రమించు చుండెను. ఆకస్మికముగ నర్ధరాత్రమునం గలిగినయుద్ధదారుణసమరంబున నిరువాగు లందును భటులు గూలుచుండిరి. సంకులసమరంబున స్వపక్షపరపక్ష వివక్ష లేకుండఁ బొడుచుకొనుచుండిరి. చిమ్మనగ్రోవులనుండి వసంతము వలె యోధులశరీరములనుండి రక్తము ప్రసరించుచుండెను. మహాసము ద్రమున గాలివిసరునం బడునోడవలెఁ జంద్రగుప్తసేనామధ్యమున నున్న గ్రీకుసైన్యము ముందునకును వెనుకకును భార్శ్వములకు నూఁగు చుండెను. అటనుండి పుష్కరాక్షుని గడచి చంద్రగుప్తునిపైకిఁ బో నలయునని గ్రీకునాయకుఁడు ప్రయత్నించు చుండెను. కాని,యదియెట్లు పొసఁగును? ఈకల్లోలమంతయునువిని పశ్చిమద్వారమునన్న చంద్ర

గుప్తుఁడు ముందునకు బయలుదేరివచ్చెను. ఆయదటున గ్రీకుసేనలు దుర్గ ద్వారమునఱకు వెనుకకు జరిగెను. మరల ముందునకుఁ జొచ్చి యతి దారుణముగ సమరమునకు డీకొనుటచేఁ గోటలోని సేఁలన్నియును జెదరిపోయెను.

ఆసమయమునఁ జంద్రగుప్తుఁ డొకయశ్వముపై నుండి గ్రీకు లలోఁ బ్రవేశించెను. ఆతనిచంద్రహాసమునుండి రక్తముకర్షించుచున్నది. ఎందఱు గ్రీకుభటుల యుత్తమాంగములు నవదుర్గమునకు బలియ్యె నవియో చెప్పలేము. ఆతనిజవనాశ్వము పీనుఁగులపైనుండి దాఁటుకొని వచ్చుచుండెను. గ్రీకుభటులు ప్రాణములకాశింపక యెదురుకొని పోరు చుండిరి. ఆచంద్రగుప్తునింబట్టుకొనవలయునని గ్రీకునాయకుఁడు సేనల హెచ్చరించుచుండెను. ఇరువాగులును పరస్పరజయకాంక్షచే సమరము చేయుచుండెను. ఇరుబలఁగములు గెలుపోటముల వెనుకముందుల కూఁగులాడుచుండెను.

కోటలోని ముందరిభాగమున నెదిరించువారు లేక గ్రీకుభటులు విచ్చలనిడిగఁ జరియించుచుండిరి. బురుజులపై ధవళకాంతుల నీనుచు వర్ధిల్లుచున్న చంద్రగుప్తకేతనమును నఱకివైచి యటగ్రీకులజెండా నెత్తిరి. ఆసంరంభముంజూచి సహింపక చంద్రగుప్తబలంబులు మహా గ్రహావేశమున నొక్కుమ్మడి వారిపయింబడి కాల్చిచ్చువలె గ్రీకుసేనా కాననమును దహించివైచుచుండెను. గ్రీకుభటులు పిక్కచెదరు లేకుండఁ దమనాయకుని ప్రోత్సాహమున గుంపులుగుంపులయి వచ్చి చంద్రగుప్తునిపైఁ బడుచుండిరి సముద్రమువలె నుప్పొంగివచ్చుచున్న యాసేనకుఁ జంద్రగుప్తపుష్కరాక్షులు చెలియలికట్టవలె నిలిచిరి గాని, పార్శ్వములనున్న కాల్బలము గ్రీకులయపరిమితసేనలో మడఁగిపోవు చుండెను యుద్ధరంగమునఁ నెచ్చెలినువసంతుఁడగపడకుండుటచేతను, గ్రీకు సేనలనిరాఘాటముగలోనఁబ్రవేశించుచుంటచేతను, వసంతుఁడు తప్పక

మరణించియుండునని చంద్రగుప్తుడుతలఁచుకొనియెను. ప్రాణమిత్రుఁడగునసంతునిముంచివైచిన గ్రీకుసేనాసముద్రము నింకించువఱకుఁ జంద్రగుప్తుఁడు నాతఁడు విడువఁదలఁచుకొనలేదు. గ్రీకునాయకుని తల నూడఁబెఱుకునంతవఱకు గుట్టమునుద్రిప్పఁదలఁచుకొనలేదు. దుర్గమారణ్యముం జొచ్చి పోవు కొదమసింగమువలె నాసేనాకాననమునఁ బ్రవేశించిచీల్చి చెండాడుచుండెను.

ఇప్పుడువసంతుఁడేమిచేయుచున్నాఁడు? శత్రుసేనలవలనవసుమతి కపాయము కలుగకుండ నాద్వారసమీపమున ఖడ్గపాణియయి నిలిచియటనున్న గ్రీకుయోధుల నుఱుమాడుచుండెను. తానెనరించిన యకృత్యమునకుఁ దన్ను నిందించుకొనుచుఁ జంద్రగుప్తునకుఁ దనమొగమగపఱపలేకపోయినను, తానుగూడఁ జాలినంతవఱకుఁ బోరాడుచునేయుండెను. అతఁడు గ్రీకుసేనలోఁ బడి చెల్లాచెదరు చేయుచుండినను మరల మరల సింహావలోకనమున నంతఃపురమువంకఁ జూచుచునేయుండెను.

ఇంతలోఁ గోటసింహద్వారమునొద్ద మహాకల్లోలముదయించెను. ఆద్వారముగుండసేనలు తండోపతండములుగవచ్చి ప్రవేశించుచుండెను. నేల యీనినట్లుగ నేమూలఁజూచినను వాఁడే. ఆసేన యెవ్వరిదో? కోటయంతయును మరల హాహాకారములతో మునిఁగిపోయినది. కపిత్థఫలంబులవలె శిరంబులెగిరి పడుచుండెను. కొందఱుభుజములు తెగి పడుచుండెను. కొందఱుకాళ్ళు ఖండింపఁబడుటచే బోరగిలఁ బడిపోవుచుండిరి. కొందఱు గ్రుక్కుమిక్కుమనక ప్రాణములను విడుచుచుండిరి. కొంద ఱర్ధప్రాణముతోఁ గ్రిందఁబడి మూల్గుచుండిరి. ఏమఱుపాటునఁ దలయెగిరిపోవుటచేఁగొందఱమొండెములు కొంతవఱకు నడచికొందకొఱగుచుండెను. "కొట్టుఁడు. పొడువుఁడు. నఱుకుఁడు." అనువీరాలాపములు విశేషముగ వినవచ్చుచుండెను. కత్తులయొక్కమెఱుపు

లకును, రాపిడులకును, భయపడక వారుగ్రీకువీరులు బెగడొందఁగన్నులు మూసికొని వారిశిరస్సులఁ దెగనఱకుచుండిరి. పోటున కొకఁడు మొదలు పదిమందివఱకుఁ గూలుచుండిరి ఈవిధముగ సంకులసమరము జరగిపోవ్వచుండెను. విజయోత్సాహములోమునిఁగి విజృంభించుచున్న గ్రీకుసేన చాలనఱకు భూమిపై ద్రొక్కినది. నూతనసేన యెవ్వరిదో మనకింకను దెలియలేదు. కోటలో ముందరిదెస నున్నగ్రీకువీరులు నిశ్శేషమై పోయిరి. ఈనూతనసేనలోఁ గొంతభాగము చంద్రగుప్తుఁడున్న నైపున కేగెను. అచ్చటగ్రీకుసేనానాయకుఁడు పోరుచున్నాఁడుగదా! ఈనూతన సేనానాయకుఁడు పుష్కరాక్షునకడ్డముగ గ్రీకుసేనాధిపతితోఁ బోరాడ సాగెను. పోరు మహాఘోరముగ నాదెస మరల నయ్యెను. అపరిమితమైయున్న యీనూతనసేనయెదుట నిలువఁబడి పోరలేక గ్రీకులు నలుదెసలకును బర్వులెత్తుచుండిరి గ్రీకునాయకుఁడు నూత్రముతనపట్టు వీడక శత్రువులతోఁ బోరుచునే యుండెను.

ఈయోధుఁ డెవ్వఁడైయుండునో? ఈతఁ డొనరించెడి యుద్ధమతి భయంకరముగ నున్నదే! అని గ్రీకునాయకుఁడు తలపోయసాగెను. ఆతఁడు రాజయోగానందశిష్యుఁడగు మహాయోధుఁడు. మహాయోధుఁడుగా కిట్టిదోర్బల మెన్నఁడు నెఱుఁగలుగుదురు? ఈతఁడు తనసేనతో నానాధిపతియగుసౌభూతికి సాహాయ్య మేగెను. ఆకోటనుముట్టడించిన వార లీగ్రీకువీరులే వారికాదుగఁ బ్రాణము స్వాధీనముకాకుండుటచే విసివి ముట్టడివిడిచియిటకువచ్చుచునంభీరునిమరణమునుఁ జంద్రగుప్తవిజయమును విని చెదరియున్న తూర్పుద్వారమును, వసంతుఁడు విడిచిపోయిన సమయమును, గనిపెట్టి బలవంతముగనీకోటలోఁ బ్రవేశించిరి. వీరులావరణదుర్గమును విడిచిన కొంతసేపటిలోనే మహాయోధుఁడును, సౌభూతియును, వీరికిఁ దెలియకుండ వీరినివెంబడించియే వచ్చుచుండిరి. గ్రీకులు

కొంచెముముందుగఁ బ్రవేశించుటచే నాగీకోటలోఁబడిరి. వెనుకనచ్చిన వీరీసంగతిని దెలిసికొని యిట్లువచ్చి కలిసికొనిరి.

మహాయోధుఁడును గ్రీకునాయకుఁడు నిప్పుడు పోరుచుండిరి. ఇరువురు సమానయోధులు. వారు కత్తియుఁగత్తియుఁగలిపి చేయు యుద్ధము దర్శనీయ మైనది. గ్రీకునాయకుఁ డీవఱకుఁ జంద్రగుప్తునితోఁ బోరి చాల నలసియుండెను. అయినను ధైర్యమును వీడక యోధుని మార్కొని పోరుచుండెను. మహాయోధుఁడు తనపై వచ్చుచున్న శత్రుని చంద్రహాసపుప్రవేటుల నతిలాఘవముతోఁ దప్పించుకొని యాతని నెప్పించుచుండెను. ఆమెఱపులిసువంకలనున్న వీరులకన్నులకు మిఱుమిట్లు గొలుపుచుండెను. ఈసమయమున నలసియున్న గ్రీకువీరునిచంద్రహా మాకస్మికముగ యోధునిఖడ్గప్రహారమున రెండుతుండెములయి నేలపైఁ బడిపోయెను. మహాయోధుఁ డాయుధములేనివారితో యుద్ధము చేయఁడుకాఁబోలు! తనఖడ్గమునుగూడఁ గ్రిందఁ బడవైచి మెఱపు మెఱసిన ట్లొక్కఁడాటున గ్రీకువీరునిపైఁ బడి యాతని తనభుజాంతర మున బంధించివైచెను. నాయకుఁడు పట్టువడినతోడనే యున్న వారును వెనుకకుందిరిగిరి. వారందఱును జంద్రగుప్తునియొద్దనున్న వీరులచేఁ బట్టు కొనఁబడిరి. మిగిలినగ్రీకులందఱును జంద్రగుప్తునకు లోఁబడిపోయిరి. కోటయందు మరల జయభేరులు మ్రోగఁ నారంభించెను. చంద్రగుప్తుఁడు బురుజులపైకి దృష్టి సారించెను అందిప్పుడు గ్రీకులధ్వజము లేదు. ధవళకాంతులతోఁదన కేతనమే మెఱయుచుండెను. సౌభూతియు, నాతని కుమారుఁడు జయభూతియు, నందుండి చెడరినసేనల హెచ్చరించుచు జయజయశబ్దములతోఁ గోలాహలముసేయుచుండిరి. ఇంకను దెల్లవాఱ లేదు. వర్షముకురిసినెలిసినట్లుగ నొక్కింతసేపటిలో రణవిప్లవము చల్లారి పోయెను.

పదునేనవప్రకరణము

పాంచాలదేశమహారాజైన చంద్రగుప్తుఁడు నేఁడు సంపూర్ణవిజయోత్సాహముతోఁ దక్షశిలాదుర్గమునందలి రాజసభాస్థానమున సింహాసనాసీనుఁడయి కొలువుసేయుచుండెను. రణరంగమున నీరవిహారసమయమున నాతనిప్రతాపతేజోమయాకారము శత్రసేనాసముదయంబునకువలెనే యిప్పుడాతనికిరీటమణిప్రభాపటలంబును సభ్యులకన్నుల మిఱుమిట్లు గొలుపుచుండెను ఆతనిసమీపమున దపస్తేజోమూర్తియగు చాణక్యుఁడు రాజయోగానందస్వాములవారొత్తుగఁబెట్టఁగియున్న నల్లనిగడ్డమును సవరించుకొనుచు దనధీరశాంతస్వభావములు చూపఱహృదయములందు భయభక్తుల నుదయింపఁజేయుచుండ నుచితాసనమునఁ బద్మాసనస్థులయి కూర్చుండియుండిరి.

దక్షిణపార్శ్వమున వరుసగాఁ గాశ్మీర, కాంభోజ, గాంధార, సింధు, యవన, కౌలూత, మలయనగరాధీశ్వరులును, మఱికొందఱు సామంతరాజులును, వినమ్రులయి సముచితాసనంబుల నాసీనులయి యుండిరి. వారినడుమ గ్రీకురాజప్రతినిధి వినమ్రవదనుఁడయి కూర్చుండియుండెను. వామపార్శ్వమునఁ బదియాఱుగురుదండనాయకులు తమతమబిరుదములం దాల్చి వీరరసతరంగములపలెఁ గ్రమముగా నొకరితరువాతనొకరు కూర్చుండి యుండిరి సభయెల్లను నిశ్శబ్దముగ నుండెను. సభ్యుల వినయవీక్షణములు చంద్రగుప్తప్రభునిపాదపీఠమునఁ బ్రసరించుచుండెను. మహాయోధుఁడును, వసంతుఁడును, మాత్రము నాఁటి సభకు రాలేదు.

అప్పుడు చంద్రగుప్తుఁడు సభవంకఁజూచి "నామిత్రులగు రాజశేఖరులారా! రాజభక్తిశీలురగు యూథనాథులారా! నిన్నటియుద్ధమున

మనచేఁ జిక్కినగ్రీకురాజప్రతినిధి నేమిచేయవలసియుండునో మీ మీ యభిప్రాయములను వినఁగోరుచున్నాఁడను" అని మృదుమధుర భాషణములఁ బ్రశ్నించెను.

ఇంతకుముందీరాజ్యము లన్నియును గ్రీకునాయకుల నిరంకుశప్రతాపమున నట్టుడికినట్లుడికిపోయినవి దేశభక్తులగుచాలమంది యోధులకుఁజిరకాలము దారుణవనదుర్గములు శరణ్యములైనవి. భయంకరరణరంగమున ననేకయోధులు బలిచేయఁబడిరి గొప్పగొప్పపట్టణములు తగులఁబెట్టఁబడియెను. వేలకొలఁదిసతీమణులు మానరక్షణమునకుఁ బ్రాణములను గోలుపోయిరి. నిరంతరకలహాములనలనఁ బ్రజలనెమ్మదికి భంగము కలిగినది. క్షణక్షణమునకుఁ బ్రభుత్వముఁ మారుచుండుటచేఁ బ్రజ లగతికు లగుచుండిరి. యుద్ధయాత్రావ్యయంబులు తమపైఁ బడుచుండుట వలనఁ గాపులు నిర్భాగ్యులై పోయిరి. చాలసుందికి యుద్ధమే పనియగుటవలనను, కొన్నికుటుంబములవా రీకల్లోలములను సహింపలేక దేశమునువిడిచిపెట్టి పాఱిపోవుటవలనను, కృష్యాదివ్యాపారముల కత్యంతరముకలుగుటచే దేశమునఁ గఱవులు తటస్థించెను. అందందుఁ బండిన పంటలయినను బ్రజలకుఁ జిక్కుటలేదు రాజభటులు సేనలకొఱకు బలవంతముగఁ దీసికొని పోవుచుండిరి. ఆఁకటిబాధ కోరువలేక ప్రజలందఱు నడవులఁబడి కాయగసరులుం దినుచు మునిగతి మవలంబించి యుండిరి. ఆకష్టముల ననుభవించిన ప్రజలే, ఆయవమానములను సహించిన యోధులే, యాకల్లోలములఁ దప్పించుకొనిపోయినరాజులే, మొట్ట మొదట నిచంద్రగుప్తుని నాశ్రయించినవారు. వారే శతద్రూనదీతీరమున గుప్తదుర్గమును నిర్మించినవారు. వారే నిన్న మొన్నటియుద్ధములలోఁ దమ దేశముకొఱకుఁ బ్రాణముల ధారపోసినవారు వారే చంద్రగుప్తునిసైనికులు.

వారిలోఁ గొలఁదిమంది మాత్రమే స్వర్గమును జూఱఁగొని యున్నారు. చాలమంది యింకను జీవించియే యున్నారు. వారికా కష్టము లింకను జ్ఞాపకమున్నవి. వారి హృదయముల నున్న తీవ్రక్రోధానలంబునకు గ్రీకుశబ్ద మూర్ఖ్యాహుతివలె నున్నది. వా రనుభవించిన కష్టముల కన్నిటికిని జాలవఱి కంభీరుఁడు కారకుఁడై యున్నాఁడు. ఆతఁడుస్వర్గమునకో నరకమునకో పలాయనుఁడై పోవుటచేనిప్పుడు గ్రీకు నాయకులు మాత్రమే యీయుపద్రవముల కన్నిటికి నుత్తరవాదులై యున్నారు. గ్రీకుశబ్ద మాదేశమున వినఁబడకుండఁ జేయవలయునను నంతటిదారుణకోపము వారిహృదయముల జాజ్వల్యమానమగుచుండెను.

చంద్రగుప్తుఁడు గంభీరుఁడు. ఆతనియెదుట నోరెత్తి యెవ్వరు తమ సంపూర్ణాభిప్రాయమును దెలుపసాహసింపఁ గలరు? అందఱు నేక వాక్యముగ "మహారాజా! దేవర దివ్యచిత్తమునకు న్యాయమని తోచిన రీతిని జరగింపవచ్చును. చిరప్రవర్ధిత క్రోధానలమునఁ బ్రజ్వలించుచున్న హృదయములు గల మేము మీవాక్యముల యంతఁ బక్షపాతమును శంకించుచున్నారము" అనుపలికిరి.

చంద్రగుప్తుఁడు రాజయోగానందస్వాములనారివంకఁ జూచెను. స్వామి యిట్లు చెప్పెను. "స్వదేశరాజుల యంతఃకలహములలో గ్రీకులీదేశ మాక్రమించుకొనిరి. ఇంపు బలనంతుఁడగు తక్షశిలామహర్షినాయకుని సాహాయ్యమున వారిరాజ్యము స్థిరపడినది స్వార్థపరత్వమున దేశద్రోహమొనరించినయంభీరుఁడు శిక్షాపాత్రుఁడు. ఆతఁడిలోకమునే విడిచిపోయినాఁడు. ప్రాణమిత్రుఁడగు నాతనియందలి కృతజ్ఞతవలనను, జేజిక్కినరాజ్య మూరకపోవుచున్న దను విచారముచేతను, గ్రీకుసేనలు మనపై నెత్తివచ్చుటకుఁ గారణమైనది. విజితుఁడగు శత్రువునకు శిక్షయేమున్నది?"

"ఇందుల కీగ్రీకునాయకుఁ డేమిచెప్పునో వినవలసి యున్నది" అని చంద్రగుప్తుఁడు పలికెను.

గ్రీకురాజప్రతినిధి లేచి నిలువఁబడియెను. ఆతని కాయపజయము మరణముకంటె నధికమై యుండెను. పాంచాల రాజ్యమంతయు నేకచ్ఛత్రముగఁ బాలించిన యాతఁడిప్పు డారాజ్యసింహాసనము నెదుటనే విచారింపఁబడుచున్నాఁడు ఆచంద్రగుప్తునిప్రతాపము, దయ, సాహసము, శౌర్యబుద్ధి, మొదలగు నుదారగుణములును, నాతనియందుఁ బ్రజలకుఁగలభక్తియును, సంపూర్ణముగఁ దెలిసికొనినవెనుక తనకుఁ బాంచాలము మరల దక్కుననునాశ వదలి పోయినది. నిరుత్సాహులగునాతనిసైనికు లాయుద్దేశమును బలపఱచిరి. ఇని యన్నియు నాలోచించుకొని యాతఁ డిట్లనియెను.

"అయ్యా! చాలకాలముక్రిందట నలెగ్జాండరునకు నశురాలయి పోయిన పాంచాలరాజ్యలక్ష్మి యాతఁడు స్వర్గరాజ్యలక్ష్మిని చేపట్టెనను నసూయతో నేటికి నిపాలఁబడి నిన్ను వరించినది. అపజయమన్న నేమో యెన్నఁడు నెఱుఁగని యాతనిసైనికులు కాలవశమున నీచే నిర్జింపఁబడిరి. ఎటులయిన నీపోరు నా ప్రాణములతోడను, నీకొలఁది భటుల ప్రాణములతోడను, దీరునది కాదు. సమబలులగు రాజులశత్రుత్వమునలన దేశమునకును బ్రజలకును నెప్పుడియుఁడదు. జయ మెట్లున్నను కల్లోలములుమాత్రము తప్పవు. నాప్రాణములపై నాశచే నేను మనవిచేయుట లేదు. మహావీరుఁడగు యోధున కపజయమునకంటె మరణము వేఱేమున్నది? ఇప్పట్టున నీకలహములను మరలఁ బెంచుకొనుటకంటె నిరువురమును సంధిచేసికొనుటయే లోకమునకుఁ, బ్రజలకు, మనకును గూడ శ్రేయకరము" అని విన్నవించెను

చంద్రగుప్తుఁడు బాగుగ నాలోచించి యిట్లు చెప్పెను "ఎటులయినను మీమూలమున నీదేశము మాహాపద్రవముల పాలయినది.

జరగిపోయినదానింగూర్చి యెవ్వ రేమిచేయఁగలరు? ఇంతటినుండి మీరును, మీసేనలును, గాంధారదేశమును వాటి యివ్వలకు రాకుండ నుండుటయే సంధి."

రాజప్రతినిధి కానాక్యములు శూలములవలె నుండెను. ఏమి చేయఁగలడు? కోపవేగమున నోడలు వడఁకుచుండెను. అయినను యుద్ధమునందు విసుగు జనియించినది. ప్రతాపనిధి యగుచంద్రగుప్తుని తోడివైరము సామాన్యముగఁ దోఁచుట లేదు.

"అయ్యా ! మీమైత్రిగోరి యట్లే యంగీకరింతుము" అనియెను.

చంద్రగుప్తుఁడు సభవంకఁ జూచి మీయభిప్రాయమేమని యడిగెను. వారికి గ్రీకు నీదేశమును వదలిపోవుటయే కావలసినది. అందఱు నంగీకారమును సూచించిరి. సంధి కుదిరినది. గ్రీకురాజప్రతినిధి సేనలతో విడిచిపెట్టఁబడియెను. ఆనాఁడే వారటనుండి వెడలిపోవుట కేర్పాటు కాఁబడెను. ఇరుపుగు దండనాయకులు గ్రీకుప్రతినిధిని సాగనంపిరి. తరువాత వసంతుఁడు సభకుఁ గొనిరాఁబడియెను.

వసంతుఁ డిప్పుడు కంచుకోష్ణీషాదరాజోచితాలంకారములను ధరించి యుండలేదు. ఆతనిహృదయ మిప్పుడవమానశల్యముచే వేధింపఁ బడుచున్నది. ఆతని ముఖమండలమున వీరపురుషోచిత మగు వికాసము లేక దీనభావము వ్యక్తమగుచుండెను. ఆతఁడు చిత్రప్రతిమవలె నిశ్చేష్టుఁడై సభాస్థలంబున నిలుచఁబడి యుండెను.

చంద్రగుప్తుఁడు కృతఘ్నుఁడు కాఁడు. వసంతుఁడు తనకు దక్షిణ భుజమై చేసినసాహాయ్యము నాతఁడు మఱచిపోలేదు. కాని, వసంతుఁడు రాజాజ్ఞోల్లంఘనము చేసియుండెను. రాజశాసన మాతని శిక్షసేనలు నిగా నిరూపించుచుండెను. చంద్రగుప్తునిశాసనమునకు భేదమునకు లేదు. భగవంతునికివలెనె దానికిని సర్వసమత్వమున్నది. ఆ

మున చంద్రగుప్తుఁ డిప్పుడు ప్రాణమిత్రుఁ డగువసంతునకు మరణదండనము విధింపవలసినవాఁడై యుండెను. రాజనీతి క్రూరమయినది.

"రాజశాసనము నుల్లంఘించుటవలన మరణదండనము విధింపఁదగినవేరము నీపైఁ మోపఁబడినది. నీవీవిషయమునఁ జెప్పుకొనవలసిన దేమైన నున్నదా?" అని చంద్రగుప్తుఁడు వసంతునిఁగూర్చి పలికెను.

వసంతునకుఁ గ్రొత్తగా విచారము కలుగలేదు. ఆవాక్యముల వలన నాతనికి భయముగలుగలేదు. ఏమనిన—చంద్రగుప్తునిఋజువర్తనమును, నాతనిశాసనమునందలిదార్ఢ్యమును, వసంతుఁడెఱింగియుండి యిదివఱకే కృతనిశ్చయుఁడై యుండెను

"మహారాజా! నేను రాజాజ్ఞోల్లంఘనము చేసినమాట వాస్తవము" అని పలికి యూరకుండెను.

"నివృత్తిశిక్షార్హుఁడవైనట్లంగీకరించితివా?"

"దేశద్రోహము నంగీకరించినవేను శిక్షార్హుఁడనే"

సభ యంతయు నిశ్శబ్దముగ నుండెను. వసంతునిమరణదండనముంగూర్చి సభ్యుల కందఱికిను చాల విచారముగ నుండెను. అట్టి సుగుణాలంకారుని, నట్టిరాజభక్తిపరాయణుని, నట్టిపరాక్రమతేజోధురీణుని, నట్టిపవిత్రచరిత్రుని, నట్టిదయాళుని మరణము దేశాభివృద్ధికిని, రాజ్యాభివృద్ధికిని, జాలభంగకరమైన దని వారు తల్లడిల్లుచుండిరి. చండశాసనుఁడగు చంద్రగుప్తునియెదుటనెవ్వరునేమియు మాటలాడలేక పోవుచుండిరి.

అప్పుడు రాజయోగానందస్వామి యించుకసే పాలోచించి రాజశాసన మతిక్రమించుటకుఁ గలకారణమునుఁగలవలయునని చంద్రగుప్తమునకుఁ, నను.

చంద్రగుప్తుఁడు. "వసంతా! రాజశాసనము నతిక్రమించుటకు లయినమీమేమో చెప్పెదవా?" అని ప్రశ్నించెను.

"అనాథస్త్రీసంరక్షణము" అని వసంతుఁడు ప్రత్యుత్తర మిచ్చెను.

"అయబల యెవ్వరు"?

"వసుమతి"

"ఆమెకుఁ గలిగినయాపద యెట్టిది"

"అగ్నిప్రవేశమునుఁ జేయఁబూనియున్న యంభీరునిరాణులు వసుమతిని బలవంతముగఁ గాల్చివేయఁదలఁచిరి."

"దుర్గద్వారరక్షణమున నున్నసి కీసంగతి యెట్లు తెలిసినది?"

"ఒకదయాశీలునివలన—"

"ఆతఁ డెవ్వరో తెలిపెదవా?"

"ఆతనివృత్తాంతమును నేను చెప్పఁదలఁచికొనలేదు."

అప్పుడు చంద్రగుప్తుఁడు "నీవు కేవలస్వార్థపరత్వమున రాజకార్యమునం బ్రమత్తుఁడవై చరియింపలేదని తెలుపుటకు నీకథార మేమున్నది." అని పలికెను.

వసంతుఁడు మఱి మాటాడక యధోముఖుఁడై నిలువఁబడి పోయెను. సభ్యులహృదయములందు కరుణరసము పొంగి పొరలు చుండెను. "తుదకు విజయమే లభించినదికదా; వసంతుని యీచిన్న తప్పిదము దేవర క్షమింపవలయు" నని యందఱు నేకగ్రీవముగ రాజుతో మనవిచేయవలయు నని తలంచుచుండిరి. ప్రతాపనిధి యగు నా తేజోరాశియెదుట నెవ్వరును మాటాడలేక పోవుచుండిరి. రక్షించుటకుఁ గాని శిక్షించుటకుఁగాని యాతఁడే దక్షుఁడై యున్నాఁడని యందఱు నిశ్చేష్టులయి చూచుచుండిరి.

చంద్రగుప్తుఁడు యోగివంకఁ జూచి "అయ్యా! ఇందలిసత్యము మన కెట్లు తెలియఁగలదు." అనియెను.

" ఇంకను చెలియుఁ దగిన దేమున్నది"

" వసుమతియపాయమును గూర్చియ, వసంతుఁ డెట్లు పో యెనో దానిని గూర్చియు తెలిసికొనవలయును"

" అందునుగూర్చి వసంతుఁడు చెప్పుచునేయున్నాఁడు గదా!"

" అదియంత విస్పష్టముగ లేదు."

రాజయోగానందస్వామి మఱి మాట్లాడలేదు. వసుమతిని సభకుఁ గొనిరావలయు నని చంద్రగుప్తుఁ డాజ్ఞాపించెను. తోడనేయిరువురు భటులు పోయి యామెనుగొనితెచ్చిరి. ఆమెకు భాసటగఁ గనకలత కూడనుండెను.

అదృష్టహీన యగువసుమతిజీవితమునకు సుఖమనుమాట లేదు కాబోలును! జీవితేశ్వరుని గాఢాలింగనమున నెడలు మఱచియున్నప్పు డెట్టి యానందము ననుభవించినదో కాని మరల విచారముతోడనే మేల్కాంచినది. ఆమెలఁకునతోఁ గూడ విచారమునే కాంచినది. ఆమె కెప్పుడును గష్టములమీఁదఁ గష్టములే వచ్చుచున్నవి. ఆమె నాశ్రయించిన సుఖముగూడ నిమిషమునులోఁ గష్టముగా మారిపోవుచున్నది. ఆమె రాజశాసనమునుగూర్చి వసంతునివలన వినియున్నది. ఇప్పు డామె సభ కేలకొనిపోఁబడుచున్నదో యామెయెఱుంగును. తప్పక కీఁడుగానున్న దని యామె నిశ్చయించుకొనియెను. ఆమె యెట్టికష్టములనైన ననుభవించినదిగాని యిట్లు సభకుఁ దెచ్చునవమానమును మాత్రముగాంచి యుండలేదు ఆమె సుందరియెమటఁ గూడ నిశ్చలముగ నిలువబడుటకు సిగ్గుపడుచుండెడిది. రాజసభలో నెట్లు నిలువఁగలదు?

జనపదమునకుఁ గొనితేఁబడిన యడవిలేఁడిపిల్లవలె బెదరుచుఁ దలవంచికొని యుండెను. దీనాననుఁడై పార్శ్వమున నిలువఁబడియున్న ప్రాణేశ్వరుని గాంచుసరి కామెహృదయము జల్లు మనియెను. భయముచే పర్యాంగములు వడంకుచుండెను. కృశించినమైదీఁగతో, మాసిన

చీరతో, వాడినమోముతో, బాష్పపూరితము లగు కనుదమ్ములతో, చెదరినముంగురులతో, వంచినశిరముతో, మూర్ఛిల్లిన శోకదేవత నలేఁగంపించుచునిలువఁబడిన యాబాలికను సభ్యులుచూడలేక జాలిచేఁ గొట్టుకొనుచున్న హృదయములతోఁ దలలు వంచికొనిరి.

అట్టిదీనావస్థలో నున్న వసుమతిని వసంతుఁ డొక్కింతసూచెను. బాష్పపూరితనయనుఁడై కొయ్యనడిపోయెను.

అప్పుడు చంద్రగుప్తుఁడును వసుమతిం జూచి "అమ్మా! నీవీమర్మమున కెట్లువచ్చితివి?" అని ప్రశ్నించెను.

వసుమతి శోకగద్గదస్వరముతో "నందభటులు కలశపురమునుండి నన్నపహరించికొని తెచ్చి యంభీరుని సిర్బంధమున నుంచిరి"

"నీతో నెవ్వరయిన వచ్చిరా?"

"కనకలతకూడ వచ్చినది"

"పాటలీపుత్రమెట్లు విడువఁగలిగితిరి"

"మహాత్ముఁడగుచాణక్యునియనుగ్రహమున"

సుందరికొఱకు మరల విష్ణుగుప్తుఁడువచ్చి యేమియల్లరిచేయునో యనుభయముచే నాటిరాత్రియే చాణక్యుఁడీమెను తప్పించెను.

"రక్షకభటుల నెట్లు తప్పించుకొంటిరి.?"

"వసుమతి వీరివెంట నంతఃపురమునకు రాఁగలదు. మీరేమియు నభ్యంతరము చేయవలదు." అనివిష్ణుగుప్తునిచే వ్రాయఁబడిన యుత్తరపును జూపించుటచే వారేమియు నడ్డుకొనలేదు"

చాణక్యుఁడాయుత్తరపును సృష్టించి దానిపై విష్ణుగుప్తుని యుంగరపుముద్రను వైచెను.

"సుందరియేమైనది?"

ఆమె మాటాడక యూరకుండెను.

"నీవిట నెన్నాళ్లనుండి యున్నావు?"

"రెండేండ్లనుండి" యని పలుకునప్పు డామెకన్నులనుండి యొక్కటేధారగ శోకబాష్పములు వెడలుచుండెను

ఆమెపలుకులకును, నప్పటియవస్థకును, సభ్యులహృదయములు నిర్వైపోయెను. రాజయోగానందస్వామి కావిచేలముతో దనకన్నులను దుడిచికొనియెను. వసంతుడిప్పుడు మనలో లేడు.

రాజయోగానందస్వామి చంద్రగుప్తునిం జూచి "అయ్యా! ఈప్రశ్నలవలనఁ బ్రయోజన మేమి? ప్రస్తుతము తెలిసికొనఁ దగిన యంశమేమైన నున్నయెడల దానింగూర్చి యడుగుము" అనియెను.

చంద్రగుప్తుఁడు ప్రష్యేక మావిషయమునుగూర్చియే యడుగఁ దలంపలేదు. సంభాషణవశంబున నిజము తెలిసికొనవలయునని యాతని యుద్దేశము "అమ్మా! నిన్నిచ్చట నంభీరుఁ డైనమైన నిర్బంధించుచుండెడి వాఁడా" అని ప్రశ్నించెను.

"దురాత్ముఁడగువిష్ణుగుప్తుని పెండ్లియాడు మని బోధించుట కంటె వేఱునిర్బంధ మేమియును లేదు"

"ఆతనిరాణులు నిన్ను బాధించుచుండిరా?"

"వారెన్నఁడును నన్నేమియును బాధింపలేదు"

"వారు నీయెడ దయఁగలిగియే యుండెడివారా?"

"సిన్నటివఱ కట్లే"

"పాపము! వారు నిన్న రాత్రి సహగమనమే చే

"ఔను. నామూలమున వారికి వైధవ్యము
దను కోపతీవ్రమున ననున్ఁగూడబలవంతముగ పగి
దలఁచి చాలవఱకు నిర్బంధించిరి."

"కనకలత నిన్ను రక్షించినదా?"

"లేదు. ఆమెను వారొకగదిలోనికిఁ ద్రోసి పైని గొళ్లెము వైచిరి"

"అట్లైన నివాయాపదనుండి యెట్లు తప్పించుకొంటివి?"

వసుమతి మఱిమాట్లాడలేకపోయెను కన్నుల నీరునించుచుఁ దలవంచికొని నిలువఁబడిపోయెను.

"నిన్నాయాపదనుండి వసంతుఁడు తప్పించెనా?"

"ఔను" అని యేడ్చుచు వసుమతిపలికెను.

"ఆతని కీసంగతి యెట్లు తెలిసెనది"

"అయ్యా! ఆవిపత్సముద్రమునఁ బడియున్న నేను పెద్దపెట్టున నేడ్చుచుఁ దయాళుఁడగువసంతున కీయుంగరము జూపి నాకష్టములం దెలిపి యాతని గొనితెచ్చుపుణ్యాత్ము లెవ్వరును లేరా! అని ప్రార్థించుచు నాయుంగరమును విసరివైచి శోకవేగమున మూర్ఛిల్లితిని. ఏపుణ్యమూర్తి లీతని కెట్లెగించి కొనితెచ్చినో నేనెఱుంగను. ఈనేర మంతయును నాది. ఈదయాళునియం దేమియును దప్పులేదు. మరణ దండనము నాకే విధియించి నేటితో నాకష్టముల నన్నిటిని తీర్చి వేయుఁడు. లోకావనంబునకై పరోపకారపరాయణుఁడగునీదయాళుని రక్షించి పుణ్యము గట్టుకొనుఁడు అబలను వధియించుట పాపమని తలంపవలదు. జనియించినదాది సుఖమనుమాట లేక నిరంతరహృదయ పరితాపమున నతికష్టముల ననుభవించుచున్న నన్ను నాదుఃఖ ములనుండి వేఱుసేయుటవలన మీకుఁ జాల పుణ్యము రాఁగలదు" అని ప్రార్థించెను.

"అమ్మా! చంద్రగుప్తునిశాసనము ధర్మమార్గమును విడిచి చరియింపదు. అనపరాధిని యగునొకయబల నకారణముగ శిక్షించుటకు శాసన మంగీకరింపదు. ఆపత్సమయమున నసహాయ వగునిన్ను ప్రార్థించుట నేరము కాదు. ఒక సామాన్యభటునిమూలమునఁ దీర్ఘదగినపనికిఁ గార్యభారమును వహించియున్న తానే రాజశాసనము నతిక్రమించి మ్లేచ్ఛనందులకు వసంతుఁడు శిక్షాస్పాఁడై యున్నాఁడు. నన్ను మరల నంతఃపురమునకుఁ బోనిచ్చును. రాజశాసనము నిన్ను సభకుఁ దెచ్చి నందులకు మన్నింపుము" అని చెప్పి చంద్రగుప్తుఁడు వసుమతి నంతఃపురమునకుఁ బంపివైచెను

పదియాఱవ ప్రకరణము.

సభాసదులు ముందేమిజరుగునో యని సంభ్రమముతోఁ జూచుచుండిరి. వసుమతివాక్యములవలనను, వసంతునివర్తనమువలనను, వసుమతీవసంతులొండొరులఁ బ్రేమించి యున్నారని వారికిఁ దెలియవచ్చెను

అప్పుడు చంద్రగుప్తుఁడు యోగివంకఁ జూచి "గురువర్యా! మీయభిప్రాయ మేమి?" అనియడిగెను.

యోగి చంద్రగుప్తుని హృదయమును గ్రహించెను. ఆతఁడు తనశాసనమునందలి దార్ఢ్యమును బ్రజలకుఁ జూపఁదలఁచి యున్నాఁడని తెలిసికొనియెను. "సభ్యులయుద్దేశమును గనుఁగొనవలయును" అని చెప్పెను.

చంద్రగుప్తుఁడు సభాసదులం గాంచి "శాసనానుసరణముగ మీకేమి తోఁచుచున్నది" అనిప్రశ్నించెను.

సభ్యులపక్షమునఁ బుష్కరాక్షుఁడు లేచి "మహారాజా! వసంతుఁడు నిష్కారణముగ శాసనము మీరి చరియింపలేదు. అనాథస్త్రీరక్షణముగూడ రాజధర్మము. అంతేగాక తనప్రాణప్రియ యగునొక యబలామణి ప్రాణాపాయము నొందుచున్నదనుమాట వినినప్పు డెవ్వని హృదయము చలియింపదు? చెదరిపోయినహృదయముతోనున్న వసంతుఁడు దూరమాలోచింపలేక యింతలో నేమి యుపద్రవము వచ్చునను ధైర్యముతోఁ బ్రస్తుతోపద్రవము నుండి వసుమతిని సంరక్షించుటకుఁ బోయియుండును. ఆతని కిది విధాయకకృత్యమే యని తెలుపుటకు సంశయము లేదు. మనము కలఁగిపోవుటచేఁ దొందరపడి రాజకార్యమును మఱచినందుల కీతఁడు పశ్చాత్తాపమును బొందుచునే యున్నాఁడు. ఇంతకంటె నీమహాపురుషునకు మరణదండనము వేఱుగ నక్కఱలేదనియే తోఁచుచున్నది. ఇందుమూలమున మనకుఁగూడ నంతగా నష్టము కూడఁ గలుగ లేదు" అని విన్నవించెను.

చంద్రగుప్తుఁడు చాలసే పాలోచించెను. వసంతునివంకఁజూచి "నీవు కేవలస్త్రీరక్షణమునకే గాక స్వార్థపరత్వమునఁగూడ రాజశాసనము నతిక్రమించితివి. అప్పుడు మహాదోషము తనసేనలతో వెంటఁ బడకుండినచో దేశమంతయు నీమూలమున మహోపద్రవమున మరల మునిఁగిపోవలసివచ్చును. నీప్రియురాలిరక్షణముకొఱకు నీవు దేశద్రోహమునకైనసమ్మతించితివి. మోహాతిరేకమునయుక్తాయుక్తముల నెఱుంగక రాజభక్తినిగూడ మఱచిపోయితివి. శాసనము ననుసరించి నీకు మరణదండనము విధింపవలసి యున్నను, దేశమునకును, రాజునకును, ప్రజలకును, నీవుచేసిన సాహాయ్యము నిష్పారిణములను గావాడినది. ఏ తరుణీనుశయందలి యనురాగమునసిన్న రాజకార్యమునుదృణీకరించితివో యాసతీమణి నీకింక దక్కదు. ఇదియే నీయపరాధమునకుఁ దగినశిక్ష" అని కఠినముగా దీర్పు చెప్పెను.

వసంతునిపైఁ బడుగుపడినట్లయ్యెను. ఆతఁ డిప్పు డధోలోకమునఁ బడిపోయినాఁడు. అతనికావసుమతికంటె ప్రపంచ మేమున్నది.! నిరర్థక మగునాతని జీవిత మింక నెవ్వరికొఱకు? మరణదండనములో నింత కంటె నాధిక్య మేమున్నది? నిరంతరము నాతనిహృదయమునఁ బ్రతి ఫలించుచున్న వసుమతీదివ్యసుందరవిగ్రహము సద్దములోని ప్రతిబింబము వలెఁజూచుచు నావిచారమునదుఃఖపూరితమగునీజీవితము నతికష్టముగఁ గడపనలసినదా? ఈ! యెంతటికష్ట మెంతటికష్టము! ఆతఁడు నిలువున నిరై పోయెను. సభ్యులాదఱును విచారసముద్రమున మునిఁగి పోయిరి. పరస్పరానురాగముగల నాయికానాయకుల నిరంతరనిర్బంధి వియోగదుఃఖ మెవ్వరిహృదయములఁ బగిలింపకుండును? దృఢతరుఁ బగురాజశాసనమునకుమాత్ర మట్టిజాలి కలిగినదికాదు. ఔరా! రాజ సేవ యెంతకఠినమైనది!

ఆసమయమునఁ బ్రతీహారి యొకపురుషునితోఁ బ్రవేశించి రాజు నకు వందనముచేసి యొకయుత్తరము నెసంగెను. ఆయుత్తరమును చంద్రగుప్తుఁడయాపూర్వకముగనందుకొని యొకసారి చదువుకొనియె ను. చదువుకొన్నకొలఁది నాతనిముఖకమలము వికసించుచుండెను. మఱి యొకసారి చదువుకొనియెను. ఆనందమును బట్ట జాలక సభ్యుల కా యుత్తరము నీక్రిందివిధముగాఁ జదివి వినిపించెను.

"వత్సా! నాయాశీస్సునకు మించినవిజయమును గాంచితివి. పద్మనందుని సేనానాయకు లందఱును దైనాన్యగ్రహమున మనపక్షము నకుఁ దిరిగిరి. నందపుత్త్రులందఱును మరణమునకు లోఁబడిరి. పాటలీ పురదుర్గము మనకు స్వాధీనమయినది. రాక్షసామాత్యునితో నందుఁడు నందకటకమునకుఁ బాఱిపోయెను. మరల నచ్చట యుద్ధప్రయత్నములు చేయుచున్నట్లు తెలియవచ్చుచున్నది. ఇచ్చటి మనసేనలును, ప్రజలును, సార్వభౌముఁడ వగునీకొఱ కెదురుచూచుచున్నారు. నీకు సహాయముగ

నున్న రాజమండలితోడను సేనలతోడను తత్క్షణమ వచ్చి నందుని సంపూర్ణముగజయించినమగధరాజ్యసింహాసనమునఁజక్రవర్తిపట్టణమును స్వీకరింపఁ ద్వరిపడుము. విజయమగుఁగాక !

చాణక్యుఁడు"

ఇట్లు చదివి వినిపించినతోడనే సభయంతయును మహానందమున మునిఁగి పోయెను. "వేగముగ బయలువెడలనలయును" అనునుత్సాహ వాక్యములతో సభాస్థల మంతయుఁ బ్రతిధ్వనించుచుండెను.

రాజయోగానందస్వామి కొంచెముసేపు యోచించి "కుమారా! మనకు విజయములపై విజయములు వచ్చుచున్నవి. నీకు శత్రుఁడనఁదగినవాఁ డొక్కనందుఁడుమాత్రమే యున్నాఁడు. ఆతఁడు పుల్లవిరిగినచెట్టువలెఁ బుత్ర్కిశోకమునఁ బొగులుచున్నవాఁడు. అయిననునాతఁడు సామాన్యుఁడు కాఁడు. రాజనీతినిపుణుఁడు. పరాక్రమనిధి చావునకైన తెగించి పోరాడకమానఁడు. ఇప్పుడు నాకొక్కయాలోచనము తోఁచుచున్నది. ఎవ్వఁడు నందునితోఁ బోరాడి జయించి యాతనిశిరస్సునుగొని తెచ్చునో యాతనికివసుమతి నిచ్చి పెండ్లిచేయునట్లుశపథముచేయవలయును. ఇందు నీకుఁ గోడునిడఁదగు సీవిజయమునకు జీవితమును ధారపోయుచున్న వసంతునకుఁగూడ నవకాశ మీయవలయును. దయసీయుఁడగువసంతున కట్టియవకాశ మెసంగవచ్చును"

చంద్రగుప్తుఁడు రాజయోగానంద స్వామివాక్యసారమును గ్రహించెను. యోధుల కిది ప్రోత్సాహకరముగ నుండు నని తలంచుకొనియెను. రాజనీతినిపుణుఁడగుచంద్రగుప్తుఁడు సభ్యులవంకఁజూచియిట్లనియెను.

"పరాక్రమనిధులగుయోధవరులారా! ఎవ్వఁడు మహారణంబున నందశిరశ్ఛేదముం జేయఁజాలునో యాతనికి వసుమతి నిచ్చి పెండ్లి

చేయుదుము. ఒకవేళ దైవవశంబునఁగాని మఱియేకారణంబునఁగాని యట్లుతటస్థింపనియెడలరత్నగిరిరాజ్యలక్ష్మికినాతనిందప్పకకర్తగాఁ జేయుదుము ఇది మువ్వాటికిని సత్యము. మీమీపౌరుషములం జూపఁదగిన దైనది. ఉత్తమోత్తమస్థానము నలంకరింప శూరులగుయోధులు ప్రయత్నించెదరుగాక!"

ఈయాజ్ఞ వినఁబడినతోడనే తరుణవయస్కులగు యోధుల హృదయము లుత్సాహపూరితము లగుచుండెను. వారికోరికలు క్రేళ్లు దాఁటుచుండెను. సభ్యులకరతాళధ్వనులతో నాఁటికి సభ ముగింపఁబడియెను.

పదునేడవప్రకరణము.

నెలదినములుగడచెను. తక్షశిలానగరమున నేఁడు సమరప్రయాణసన్నాహములు జరుగుచున్నవి. సైనికులందఱును ప్రయాణసన్నద్ధులగుటకు సూచకముగా దుర్గమున భేరీనినాదములు వినవచ్చుచుండెను. ఈభేరీరవము వినినతోడనే సైనికులందఱును వీరరసపూరితము లగునంతరంగములతోఁ దమతమనియమితకార్యములయందుఁ బ్రవేశించుచుండిరి. పురజను లీసేనావిన్యాసముఁ జూచువేడుకతోఁ గోటయొద్దకు గుంపులుగుంపులుగ వచ్చుచుండిరి. రణదుందుభులు విని యేనుఁగులు తొండములఁ బైకిసారించి యుత్సాహజనకము లగుఘీంకారములు సేయుచుండెను. గుట్టములు మెడలుసాచి మోరలుపైకెత్తి సకిలించి ముందఁజవేయఁ గమకించుచుండెను. అప్పుడప్పుడె కూడుచున్న సైనికులందఱును మీసములు దువ్వుచు, భుజములు నప్పళించుచు,

తొడలఁ జఱచుచు, వీరాలాపములతోఁ దమతమహృదయోత్సుక్యమును బ్రకటించుచుండిరి. యోధవరులు సింహనాదములు సేయుచు నిజశంఖములఁ బూరించుచుం దమతమవాహనములపై సగర్వముగ మందగమనంబుల బయలువెడలిరి. పురము నాలుగుదిక్కులను సైనికులకోలాహలధ్వనులు వినఁబడుచుండెను నేలయీనినచందమునఁ బట్టణమున నెక్కడఁజూచినను సైనికులగుంపులే, ఎక్కడఁ జూచిన నాశ్వికులే, ఎక్కడఁజూచిన నేనుఁగులసమూహమే, కానవచ్చుచుండెను. చతురంగబలసంకీర్ణములై రాజమార్గంబులు క్రిక్కిరిసి యుండెను ఈ సేనాసంకులసన్నాహములచేఁ బట్టణమంతయు ఘూర్ణితమగుచుండెను ఆకదలివచ్చువివిధసేనావాహినియు మహాసముద్రమువలెనుప్పొంగుచుండెను. రథస్కంధములఁగట్టినవివిధవర్ణముల పతాకలు మనోహరకాంతులు సీరుచుఁ బురజనుల కానందమును గూర్చుచుండెను. యోధవరు లందఱును వీరపురుషోచితము లగు కంచుకాద్యలంకరణములఁ దాల్చియుండిరి.

తనహృదయమునఁ బొంగిపొరలు వీరరసౌత్సుక్యమును బ్రకటనము సేయఁగోరి కాఁబోలు నొకయోధుఁడు వక్షస్థలంబున ధరించిన కవచమునకు వామభాగమున రక్తధారాచ్ఛాదిత మగుహృదయకమలమును జిత్రించుకొనియెను. మఱియొకఁడు నిజబాహోత్సేకమును బ్రకటనము సేయఁ దనవిశాలోన్నతవక్షస్థలమును, దీర్ఘబాహుదండములను, సగర్వముగఁ జూచికొనుచుండెను వేఱొకఁడు తానెక్కినగుఱ్ఱపు గళ్లెమును బిగించి రికాబులలోఁ గాళ్లు తన్నికొని రిక్కించినవక్షస్థలముతోడను, నెయ్యారముగ నెత్తిన మొగముతోడను, జిత్రవిచిత్రగతులఁ జనుదెంచుచుండెను. పురయువతీజనములు తమతమయున్నతసౌధోపరిభాగములనుండి కుసుమాక్షతలుచల్లుచు యోధుల కమితోత్సాహమును గూర్చుచుండిరి.

సైన్య మంతయు కోటసింహద్వారము కడనున్న విశాలబహిరంగ స్థలమున విడిసెను. ప్రయాణసన్నాహము లన్నియు ముగిసెను. సైన్యములకు మార్గావరోధములుగ నుండు నదులకును, నేటికాలువల కును, వంతెనలు కట్టుట, కంటక లతావృక్షములఁ దొలఁగించి బాటలు తీర్చుట, ప్రయాణశ్రమ నపసయింప సైనికు లందందు విడిసి భోజనాది కృత్యములు నిర్వర్తించుటకయి తగినవసతు లేర్పఱచుట, మొదలగు కార్యములయందు నిపుణమతులయిన సేవకు లీవఱకే నియమింపఁబడిరి. మహాయోధుఁడు సర్వసైన్యాధిపతిగ నియమింపఁబడియెను. వసంతుఁ డాతనికి సహకారిగ నుండుట కేర్పాటు జరిగెను. కాశ్మీరదేశాధ్యక్షుఁ డగుపుష్కరాక్షుఁడు గజసమూహమున కధిపతిగ నుండెను. లావణ రాజకుమారుఁ డగుజయభూతి యశ్వదళము ల కధ్యక్షుఁ డయ్యెను. మహాయోధునకుమిత్రుఁడగుకాంభోజరాజు కాల్బలమునకంతకును దొర యయ్యెను. అంతఃపురస్త్రీలను దదితరపరివారమును సురక్షితముగఁ గాపాడుటకయి శీలకోటరాజపుత్త్రి లగువిక్రమసుందరసేను లిరువురును నియమింపఁబడిరి. భోజనవస్తుసామగ్రియును, నాయుధసమూహము లును, తదితరపదార్థములును, వారిసంరక్షణమునందేయుండెను. ఆయా సేనాధిపతులక్రింద దండనాయకులును, వారిక్రిందసహకారులును, వారి క్రింద లెక్కలేనిసైనికులును నియమింపఁబడిరి.

సైన్యమంతయు బారులుతీరి ప్రయాణోన్ముఖమైయుండెను. కదలు టకు సేనాధిపతి యుత్తరపు కావలయును. అట్టిచోట సర్వసైన్యాధి పతి యగుమహాయోధుఁడు సేనామధ్యమున నొకయున్నతస్థానంబున నిలిచి యోధనరుల నుద్దేశించి యెలుగెత్తి మేఘగంభీరభాషణంబుల నిట్లనియెను.

"మహాయోధులారా! శ్రీమన్మహారాజాధిరాజ చంద్రగుప్త సార్వభౌమునిప్రకటనమును మీరందఱు వినియున్నారు గదా! శత్రు

సైనికమధ్యమున నందునిశిరఃఖండనము చేయుమహావీరాగ్రణికి వసుమతీ కరగ్రహణమహోత్సవమును, రత్నగిరిరాజ్యప్రాప్తియు, సిద్ధించును. కావున మీరందఱును మీమీబలపరాక్రమములఁ జూపి కీర్తిపాత్రు లగుటకు సమయము దొరకినది. అదిగాక పురుషుఁడు జన్మ మెత్తినందు లకు సార్థకముగ రణరంగమున శత్రుల నిర్జించి భూలోకసౌఖ్య మనుభ వింపనలయును. లేదా, వీరమరణంబున స్వర్గలోకసుఖముఁ జూఱఁ గొనవలయును. ఈరెండును గీర్తిపాత్రములె. ఇది వీరధర్మము కావున మీరీధర్మమును నెఱవేర్చుటకయి సంసిద్ధులయి యుండవలయును."

యోధు లీవాక్యరత్నములను శిరసావహించిరి. అందఱు నంగీ కారసూచకముగఁ దమతమశంఖంబులఁ బూరించిరి. అప్పు డొక్కమా రుగ రణదుందుభులును మ్రోఁగింపఁబడెను. సేనాధిపతి యగుమహా యోధుఁడు సేనలు నడచుట కాజ్ఞ యొసంగెను. అప్పు డెల్ల యెడల శుభసూచకము లగుమంగళతూర్యములు వినవచ్చుచుండెను. వసుమతీ కరగ్రహణమహోత్సవమెకదా దీనిఫలితము. తోడనే యిద్దఱిద్దఱు చొప్పునముప్పదిమంది యాశ్వికులు కేతనములతోఁ గ్రాలుచున్న కుంతము లం బూని గుఱ్ఱముల నేకలయప్రమాణముగ నడపించుచు సేనావాహిని మార్గము దీసిరి. ఈయాశ్వికులకు వెనుక నేనుఁగులు బారులుతీఱి నడచుచుండెను. వుష్కరాక్షుఁ డెఱ్ఱనినేత్రములతోడను, ముడివఁ చున్నకనుభ్రూమలతోడను, నించుకచలించుచున్న యధరముతోడను, వికృ తములగుచున్న ముకుళపుటంబులతోడను, దనసమగోత్సాహమును ప్రక టించుచు భద్రదంతావళమునెక్కి దిక్కులఁ బరికించుచు నరుదెంచు చుండెను. ఆయేనుఁగులగుంపు వెనుకనలువదిమంది యాశ్వికులు మునుపటి వలెనే యిద్దఱువెనుక నిద్దఱుగఁ బోవుచుండిరి. వీరలవెనుక పండ్రెండు ధవళాశ్వములను బూన్చిన మనోహర మగువిచిత్రరథమున వజ్రగీత-

ప్రభలును, మణిమయకంచుకాద్యలంకరణకాంతులును, దక్షిణకరము నందలి చంద్రహాసద్యుతులును, శోభిల్లుచుండఁ జంద్రగుప్తుండరుదెంచుచుండెను. ఇరువురురాజకుమారు లాతని కిరుపార్శ్వములఁ బ్రకరక్షకులై వచ్చుచుండిరి. ఆతనిరథమున కెత్తినసింహకేతనము భయంకరముగ మెఱయుచుండెను. శౌర్యలక్ష్మికి విలాసరంగస్థలమై యొప్పు నావిశాలోన్నత ఫాలప్రదేశమును, నర్ధనిమీలితపద్మాంచలములనుండి వెలివిరియుచున్న గంభీరకటాక్షములును, విరళిత పుటంబులం ప్రాలు సమగ్రదీర్ఘ నాసికయును, వక్రభావవిలసితంబులగు సాంద్రభ్రూలతలును, నప్పుడప్పుడె కొనలుదేఱుచుఁ జుంబనాభిలాష రమణీయగండభాగముల నొఱసికొన యత్నించు నొత్తుమీసములును, పరిపూర్ణ చంద్రాకృతి నున్న ముఖమండలమును, నాతని శౌర్య గాంభీర్య ధైర్య సౌందర్యాది లక్షణములఁ బ్రకటించుచుండెను. పురయువతీజనమంతయు నారాజ చంద్రునిపైఁ గుసుమవర్షమును గురియించుచుండెను.

చంద్రగుప్తునివెనుక నొక యున్నతరథమునపై సేనానియగు మహాయోధుఁడు పోవ్రచుండెను. ఆతనిదక్షిణకరమున భయంకరఖడ్గము మెఱయుచుండెను ఉజ్జ్వలవిసిలకాంతుల నినునాతనిశిరోవేష్టంబునఁ దెల్లనితురాయి మనోహరముగఁ గానవచ్చుచుండెను. ఒత్తుగఁ బెఱిగి విశాలోన్నతవక్షస్థలమువఱకు వ్యాపించియున్న నల్లనిగడ్డమును, గండ భాగములకడ చుట్టలుచుట్టలుగ విరిగియున్న గండమీసములును, కొన దేరియున్న దీర్ఘనాసికయును, సాంద్రముఖై వంగి యొండొంటి నెఱసికొనుచున్న కనుబొమ్మలును, రక్తరేఖామిశ్రితము లగువిశాలనేత్రములును, వీరరౌద్రరసంబు లొలుకుచున్న యాతనిముఖమండలమునకు మరింత దుర్నిరీక్ష్యభావము నెలకొల్పుచుండెను.

మహాయోధునకు వామభాగమున వసంతుఁడున్న తాశ్వము నెక్కి- వచ్చుచుండెను. ఆతనిమొగమున వీరశృంగారరసములు మూర్తీ

భవించి యుండెను. ఆతఁడు తనసోదరకన్యకావివాహమునకు మలపి కాంక్షములఁ బరగించునప్పుడా ప్రక్కల మెఱుపులు మెఱసినట్లగు చుండెను. వానింగాంచినసైనికులకు వీరోత్సాహము లుప్పతిల్లుచుండెను. సుందరులకు మనోవికాస ముదయించుచుండెను.వీరులకాముఖసుండలము నీరరసప్రపూరితమై చండకిరణమండలంబుక్రియఁ దుల్యరీక్ష్యంగ బగు చుండెను. విలాసినీముఖుల కయ్యది శృంగారరసప్రపూర్ణంబై దర్శని యంబగు పరిపూర్ణచంద్రమండలంబునలెఁ గానఁబడుచుండెను. విరళిత పుటంబులగ్రగాలు నాతనిసమ్ముఖనాసికయును, గనపించుచున్న యధర బింబమును జూడ నాతఁ డెందులకో కృతనిశ్చయుండయి, తననిశ్చిత కార్యపర్యవసానంబునకు వేగిరపడుచున్న ట్లగపడుచుండెను. ఆతనిఁజూచి సైనికులందఱును బరమోత్సాహము నందుచుండిరి. మేడలపై నుండి సుందరియువీక్షణంబు లందినంతనఱ కాతనిపైఁ గుసుమాక్షతలు జల్లు చునేయుండిరి.

ఈరభసములవెనుక నాశ్వికులు గొరులుతేరి నచ్చుచుండిరి. లావణ రాజకుమారుం డగుజయభూతి యుచితాలంకార శోభితుఁడయి వారిని నడపించుచుండెను. ఆవెనుక నంతఃపుస్త్రీలున్నరథములును. నానారి పదార్థముల మోచికొనినచ్చుగాట్టములు మొదలగునవియు నడచు చుండెను.విక్రమసుందరసేను లిరుప్రక్కలనుచితనాహనంబులనెక్కి చూప ఱకు మహానందముం గూర్చుచు నావెనుక వచ్చుచుండిరి. వీనివెనుక మరలఁ గొంద ఱశ్వికులును,వారివెనుకఁ గాల్బలమును,నడచుచుండెను. కాంభోజుఁ డశ్వాల్బలమున కధీశుఁడుగ నుండి నడపించుచుండెను. ఈ మహాసేన కిరుప్రక్కలను గొంచెముదూరముగ నైదాఱుగజము ల కొక్కఁడునంతున నాశ్వికులు కుంతధరులయి నడచుచుండిరి. వంది మాగధులై వారణబులును, ఘంకాభేరీనిస్వనములును, సేనామధ్యమున నక్కడక్కడ సైనికులకుత్సాహకరముగ వినవచ్చుచుండెను. సేనలు పట్ట

ణమువీడి చాలదూర మేగెను సైన్యపరీక్షకై వసంతుఁడు మహాయోధు నాజ్ఞచే సేనాసనూహమున నందందు సంచరించుచుండెను.

కాని, యాతనిమఁ స్నాతనింలో లేదు. అది యనేకవిధముల సంచరించుచున్నది ఒకింతలో నది వసుమతీసుకుమారివదనసందర్శన సుఖంబు ననుభవి ఁప గోరి వసుమతికడ కేగును. కాని, యప్రసు ధారాచ్ఛాదితం బగునాకోమలముఖమండలమును జూచుటకు దానికి ధైర్యము చాలకుండెను. ఇఁక నచ్చట నిలుచుట సుఖాకర్షము. అది కోపభూయిష్ఠమై నందకటకమునకుఁ బోయి నగరుఁడెందఁగనుఁగొనో యని వెదకుచుండెను వసంతునిమన స్సీవిధముగఁ బరిభ్రమించుచుండెను. ఇంకి నాతని కెన్నియో తలంపులు పుట్టుచుండెను. ఎన్నెన్నియో కోరిక లూరుచుండెను. కాని, యొక్కవిషయమునమాత్ర మాతఁడు కృత నిశ్చయుఁ డయ్యెను. రణాంతమునఁ దనకు నసుమతికరగ్రహణమో, లేక మరణమో కలుగవలయు ననిమాత్ర మాతఁడు కృతనిశ్చయుఁ డయ్యెను. పూర్వానుభవ మంతయు స్మృతికిఁ దెచ్చికొనుచు నాతఁడు తన యదృష్టముయొక్క స్వభావవిధుల నూహించుకొనియెను. తనకుఁ దప్పకుండ రెండవపక్షమే సిద్ధించు నని నిర్ధారణ చేసికొనుచుండెను. మరల నాశ యాతనివెనుక కీడ్చుకొనిపోవుచుండెను

వసంతుఁ డిట్లాలోచనలలోఁ జిక్కుకొని పరధ్యానముగఁ బోవు చుండెను. అతనికడ కొకయాశ్వికుఁడు వేగముగ వచ్చి వినమ్రుఁడై యాతనికి విధేయతను జూపెను కాని వసంతుఁ డాతనిఁ బరికింపలేదు.

"నుహరాజునకు జయముగుఁ గాక!" యనియాశ్వికుఁడు పేర్కొ ర్చెను. ఈనవకేతవాక్యమును వినినంఁ డనే వసంతుఁ డులికిపడి యాశ్వికునివంకఁ జూచెను. ఆశ్వికుఁడేమియు మాట్లాడలేదు. వినమ్రుఁ డయి దూరముగ నిలువఁబడి తనబల్లెమును వసంతునికడకుఁ జాచెను అందొక యుత్తరము కట్టఁబడి యున్నది. వసంతుఁ డదిగైకొని "ఇదియె

క్కడిది?" అనియడిగెను. ఆశ్వికుఁడు ప్రత్యుత్తరమీయలేదు. ఆతఁడు తనగుఱ్ఱమును మరలించి యొక్కయుడానున మాయమై పోయెను. వసంతుఁడాశ్చర్యముతో నాలేఖను విప్పుకొనియెను. కాని, యాతని చేతులు గడగడవడఁకుచుండెను. శరీరమంతయు జెమ్మటలతో నిండి పోయినది. తత్క్షణమున నందలిలిఖితార్థమును జదువనయత్నించెను. కాని, యందలియక్షరము లేవియు నాతనికి గోచరించినవికావు. ఆతఁడు తన మనసును దిటవుచేసికొని యెట్టకేల కిట్లు చదువుకొనసాగెను.

"మహావీరాగ్రణీ!

అంతయు నిట్లున్నది. ఇది దైవప్రేరితము. నాయదృష్టమును గూర్చి నేనంతగాఁ జింతింపను. అది నాకుఁ బరిపాటియైనది. బాల్యము మొదలు నేటివఱకు నొక్కవిధముగనే యున్నది. ఇప్పు డావిషయమున నామనసును రాయిచేసికొంటిని. కాని యొక్కదానికై చింతపడము చున్నది. నాబాహాప్రాణము నాకొఱకు సర్వమును, బరిత్యజించుకొను చుండుటయెగాక పొందరానియిడుములఁ బొందుచున్నది. అందులకై చాల దుఃఖించుచున్నాను. నాయీదుఃఖమునకుఁ దుది యెప్పుడో తెలియ కున్నది. నాఁడు రాజసభలో నాప్రాణేశ్వరునియొక్కయవస్థను జూచి నప్పుడే నేనీలోకమును విడువవలసినది. కాని నాకాయదృష్టము పట్టి నదికాదు. దాని కంతరాయముగ నాశాపాశ మొకటి పొడచూపి నాప్రాణములను బంధించినది. ఈపాశమే నన్ను భావికాలమున కీడ్చి కొనిపోవుచున్నది. పూర్వానుభవము కలిగియున్న నాకు నాయదృష్టము నందంతనిమ్మకము లేకపోయినను నదృష్టవంతులయదృష్టబలముచేనై న నేమియును జక్కనగునని నమ్మియున్నాను. కష్టములపై నచ్చుకష్టములు నేమీ చనము లేయని నాయాశయము నేను సంపూర్ణముగ విచార మును వదలినైచితిని. అమంగళశంకచే నాకన్నులనుండి యొక్క యశ్రుబిందువైన వెడలుట లేదు. మనయదృష్టము క్షత్రియోచితమగు

పౌరుషముపై నిలిచియున్నందులకు సంతసింపవలసి యున్నది. ఇప్పట్టున ధైర్యమును వహించి పౌరుషమును జూపి విజయము సంపాదింప వలయును. దురాత్ముడగు నందునికంఠనాళములనుండి వెలువడువెచ్చని నెత్తురుతో మనయాదృష్టదేవతకు బలిభోజనము పెట్టవలయును. నా కొఱకు విచారింపవలదు. ప్రాణేశ్వరా! నిపాణిగ్రహణశుభసమయమునకు గాని, సహగమనపవిత్రక్షణమునకుఁగాని సంసిద్ధముగ నున్న దానను. విజయోత్సవానంతరమున రత్నగిరిరాజస్థానమునకో, వీరమరణానంతర మున సుధర్మాస్థానమునకో. మనము కలిసికొనఁగలము. పురుషప్రయ త్నమున లోపము లేకుండఁ బనిచేయుదము. ఆవలదైవమున్నది. ఆదియాళుఁడగు పరమేశ్వరుఁడు మనజీవితముల నిరర్థకములుగఁ జేయకుండుగాక! మనయనురాగహృదయములయందలి యుత్సాహమే మనకు సంపూర్ణ విజయము నెసంగుఁగాక! అంభీరుని నశ్శేషమున జయింపఁ గలిగిన నీకు దుష్కృతదూషితుండును, జరాదూషితుండు నగు నందుని వధించుటొక లెక్కకాదు. జీవితేశ్వరా! భామ్ము! చంద్రహాసద్వితీయుం డవై యుద్ధమునకుఁ బొమ్ము! ఇంకేమి వ్రాయను? నాచెతులు వడఁకి పోవుచున్నవి. నాలేఖినినుండి రక్తము స్రవించుచున్నది. నాకన్నులు చెదరిపోవుచున్నవి. నాకిఁక గష్టములన్న భయములేదు. పొమ్ము! నీకు శుభ మగుఁగాక! విజయోత్సాహముతో మరల దర్శనమిచ్చెదవుగాక! కులదేవతలు నిన్నుఁ గాపాడుదురుగాక!

"వసుమతి"

ఈయుత్తరము చదివికొని వసంతుఁ డొక్కింతసేపు నిశ్చేష్టుఁ డయ్యెను. నిష్ఠూర్పు విడిచెను హృదయమేమియును చెదరిపోలేదు. కాని, యందెన్నియో భావములు కలిగెను. ఆప్రియలేఖ నొక్కసారివక్షమునఁ జేర్చికొనియెను. కన్నులనద్దికొనియెను. ఎంతధైర్యమును వహించి యున్న నొకటిరెండశ్రుబిందువులుమాత్రము వెడలక మానినవికావు.

ఉత్తమక్షత్రియకులాలంకార యగుప్రాణేశ్వరి ధైర్యముతో వ్రాసిన శుభలేఖ నశ్రుదూషితము చేయవలసివచ్చినవనులకు నిందించుకొనియెను. అప్పటిప్రయాణభేరీధ్వను లాతనిహృదయమున విజయోత్సాహమును బురికొల్పుచుండెను. నందశిరశ్చేదానంతరమునఁ గాని కవచమును విడువ నని ప్రతిజ్ఞకొనర్చి రోషకషాయితాక్షుఁడయి చంద్రగుప్తుఁడు సవరించు కొనుచు సేనలతోఁ గలిసి ప్రయాణము సాగించెను.

పదునెనిమిదవప్రకరణము.

ఇది గంగాతీరమునఁదలియుత్తరపుననభూమి. రాత్రి వెన్నెల యంతస్పష్టముగ లేదు. ఆకాశమునం దక్కడక్కడ మేఘము లావరించు కొనుచుండెను. ఆమేఘములు వర్షంపుమేఘము లగునో కాదో తెలియ కున్నది. వానివెనుకనుండి నిమిషనిమిషమున కొకసారి మెఱుపు తీవలు తళుక్‌తళుక్‌ మని బయలుదేఱుచుండెను. గాలియును రేగి క్రమ క్రమముగ హెచ్చుగాఁ జొచ్చెను. దానిమూలమునఁ జెట్లన్నియును నాకు తెక్కల విప్పిపై కెగిరిపోవుచున్నట్లుండెను. మేఘము లాకసమున వడివడిగఁ గూడికొనుచున్న కొలఁది నున్న వెన్నెలయును బోయి చీఁకటి యావరింప నారంభించెను. ఉఱుములుమాత్రము లేవు. మబ్బు దట్టముగఁ బట్టుటచే భూమ్యాకాశము లేకమై పోయినవి. మెఱుపు లంత కంతకు హెచ్చయ్యెను. వానిచంచలకాంతులవలన భూమిపైనున్న పదార్థసంచయమునకు వింతరూపు లేర్పడుచుండెను. అవియును క్షణ భంగురములే. మనకవి శాశ్వతానందమును గూర్చలేవు. ప్రపంచకమే యశాశ్వత మైనది. అట్టిదానియందుఁ బుట్టినవిమాత్రము శాశ్వ

తము లగునా? ఇప్పటిగాలిచే సంగీతవృక్షములుతలలూఁచుచు హాయిగ గానముసేయఁదొడంగినవి. తరుపత్త్రములు కొమ్మలపై నత్యంత మనోహరముగఁ దాళముల నెఱపుచున్న వి. ఆకాశనీలపటమును భేదించు కొని వచ్చుటకై యప్సరోంగనలు తొంగితొంగి చూచుచున్నట్లు తటి ల్లతలు మెఱసిపోవుచుండెను. గాలి కొంచెము తగ్గుచున్న ది. అప్సరోం గనల వీణాగానామృతమును నీవెప్పుడయినఁ జవిగ్రోలితివా? లేదు. పోనిమ్మతుంబురనారదులగానమునైనవినియున్నా వా?అదియును లేదు. పోనీ గానమును వింటినా? వినియుంచుము. అయినచో మనోహరగానము వినుటకునీకిష్టమే. ఇప్పుడీవనమధ్యమునుండి యొకమధురగానము—— వినఁబడుచున్న ది. నీవు వినుచున్నా వా?' అది కిన్నరీనాదమో ? వీణా నాదమో?అప్సరోంగనామధురకంఠనినాదమో? కనిపెట్టలేము.దూరము నుండివచ్చుచున్న ది. కాని,స్వర మత్యంతమనోహరమై యున్న ది. సంగీత మునకు దూరశ్రవణమె యోగ్యమైనది. దానియందున్న మోహనశక్తి ప్రపంచమున మఱి దేనియందును లేదు. ఎంతసుఖము! ఎంత యానందము! వినుము! వినుము! గాలివిసరున వనతరుపత్త్రముల దూసి కొని మాంద్యమును బొంది చల్లఁగ శ్రుతిసుఖముగ గాన మెట్లువినఁ బడుచున్నదో? ఈమోహనగాన మెవ్వరిదై యుండును? నిర్జనప్రదేశము ల్ఖేచరులు విహానాకాంక్షులై తిరుగుచుఁ దమగానకళామాధుర్యమున భూతసంచయము నరికట్టుచుందురని వినియున్నాము. ఈగానము తిప్పక యాఖేచరులదే యైయుండును. గాన మంతకంతకు సమీపముగనే వినఁబడుచున్న ది. పదములు విస్పష్టముగనే వినవచ్చుచున్న వి. గీతము చాల సరసమైనదియే. ఆగీతమునొక్కయర్థమును నీవు తెలిసికొను చున్నా వా?భీమజరాసంధులయుద్ధమున శ్రీకృష్ణుఁడుతాండవముసేయుచు జరాసంధమర్మభేదనమును గూర్చి యర్జునునకుఁ జెప్పువాక్యములఁబ్రకా శముసేయుచున్న ది. ఈగాథ భారతములో నున్న ది. దీనిలోఁ జాలఁబర

మార్థమున్నది. ఈమహారణ్యములో నిట్టిభావప్రకటనము సేయుట కేమివచ్చినదో? కళ్యాణిరాగమాలాపింపఁబడుచుండెను ఆగానామృత లహరిలో వనమంతయు మునిఁగి తేలుచున్నట్లుండెను. గానమన్నిదిక్కులనొకేవిధముగఁ బ్రతిధ్వనించుచుండెను. ఇప్పుడుచునకు గానమేదియో, ప్రతిధ్వనియేదియో, తెలియుట లేదు. అదేవిధముగ రాగ మాలాపన సేయఁబడుచుండెను.

కళ్యాణిరాగము వీరరసోచిత మైనది ఈనిర్జనారణ్యములో నట్టివీరరసప్రబోధ మెందులకో? క్రమక్రమముగా మబ్బు విడిపోయినది. ఆకాశము కాంతిమంతమైనది. చంద్రకాంతు లంతటను మరలఁ బ్రసరింప సాగెను. గాలివిసరుట తగ్గినతోడనేయాసమయమున నెవ్వరో మనుష్యులు మాట్లాడుచున్న సందడికూడ వినవచ్చుచుండెను. క్రూరమృగారణ్య మధ్యమున నీయర్ధరాత్రివేళఁ దిరుగుట కెవ్వరు సాహసించిరో? ఆవిన వచ్చుచున్న సందడివలన నెంతకిద్దఱుగఁ దోఁచుట లేదు. జనసమూహమువలెఁ బొడకట్టుచున్నది. ఈవెన్నెలవెల్లుర్వున నీయరణ్యమునుబరిశోధింతము.

వరుసగనున్న యాన్మృడుపంక్తులను గాంచినచో నొకమైదానము గానఁబడుచుండెను. అందెవ్వరో దండువిడసిరి. అదిసామాన్యసేనకాదు. ఈదెన లెక్కలేనియేనుఁగులసమూహము. ఆప్రక్క నత్యధికమైనగుఱ్ఱములగుంపు. నలుదిక్కులను నంతటను గాల్బలము. మధ్యమధ్యమునఁ బటకుటీరములు చాలఁగ నున్నవి అందుమహాయోధులు నివసించి యుందురు. వారివారివిచిత్రరథము లాపడమటిదిక్కున శిలాకుడ్యము వలె నెట్లున్నవో? కాల్బల మంతయు నిద్రించుట లేదు. అక్కడక్కడ మేలుకొనియున్న వారు మాటలాడుకొనుచుండిరి. సేనాసమూహమున కావల నీవల నీప్రక్క నాప్రక్కఁగూడఁ గొందఱు మహాయోధులు శస్త్రాస్త్రోద్ధారులై జాగరూకతతోఁ దిరుగుచుండిరి. ఆసేనాబాహుళ్య

మునుగనుఁగొనుటకై మనము ప్రయత్నించుచున్నాము. కాని లెక్కించుటకు సులువుగ లేదు. ఇది చాలఁ బ్రచండసైన్యము. ఈసేన యెవ్వరిదో కనుఁగొనుటకై యీస్కంధావారమునఁ బ్రవేశించితిమేని మన మే యోధునిచేతిలోనో చిక్కుఁబడి పోవుదుము. కావున నట్లు పోవలదు. సత్యమును గ్రహించుటకై సన్నాహము సేయుదము.

గాన మాఁగిపోలేదు. అది మనవీనులకు విందుసేయుగుసే యున్నది స్కంధావారము సుదుఁగూడ నది పూలగుత్తులనో, ముత్యాల సరములనో, విరియఁజిమ్ముచునే యుండెను. సేనలప్రక్కల సంచరించు వీరులుకూడ నాగానామృతమును జవిగ్రోలుచుండిరి. ఆసంగీతమున వీరరస ముప్పొంగిపోవుచున్నప్పు డేవీరుఁడు దాని నాలకించుట కిచ్చ గింపఁడు? తద్రసానుభవమునకు లోనైన నారిని మన మానవాలు పట్టనచ్చును. వారిశరీరములు గగుర్పొడుచు చున్నవి. సమరోత్సాహ పూరితములై యుప్పొంగిపోవుచున్నవి. ఇప్పుడుగాన మాఁగిపోయినది.

మరల నింకొకప్రక్క నాస్వరము లుదయించినవి. స్వరము రస ప్రధానమైనదో, రసము స్వరప్రధానమైనదో మన మూహింపఁజాల కున్నాము. ఇందు స్వరముచేత రసోదయ మగుచున్నది. రసభావము స్వర మునకుఁ బట్టినది. స్వరము మధురమైనది. రసమామాధుర్యమునందు లీనమై యున్నది. రసమునందును మాధుర్యము లీనమైయున్నది. ఈ ద్వైక్యభావముచేతనే మురాధరుఁడగు బాలకృష్ణుని గోపగోపికాజనము మోహించినది. లోకమంతయును మోహించినది. విషోగ్రుఁడగుకాళియుఁ డామోహమునకు లోఁబడలేదు. ఆగర్భశత్రుఁడగుకంసుఁడును లోఁబడ లేదు. అయినను వారల కాగానకళానిధి యగుబాలకృష్ణుని పావన దేహస్పర్శనము లభించినది. జన్మాంతరమునందైన వారల కాభాగ్యము కలుగకుండునా? ఇప్పుడు వినఁబడుచున్నగీతమున, కాళీయమర్దనము, కంసవధ, వీనినిగూర్చినగాథయే. ఇందు వీరరసము ప్రవహించుచుండుట

కేమి యాశ్చర్యము? ఈగీత మాసేనాపార్శ్వమునఁ దిరుగుచున్న యొక యోధునిచెవింబడెను. ఆతనిశరీరము జలదరించెను. హృదయము వివశత్వమును బొందెను. "రాధా — కృష్ణా — నీవే నీరుఁడవు. నీవు కనఁబడకుండఁ బోయితివిగదా!" యనియగ్గించెను. రాజ యోగానందస్వామీ! యని సంబోధించెను. రాజయోగానందస్వామి రాజ్యకార్యములయందు నిపుణుఁడై తన్నీయుద్ధమున నియోగించి నందుల కాతఁ డట్లు సంబోధించియుండును. ఆతఁడు రాజయోగానందస్వామి శిష్యుఁడగు మహాయోధుఁడే. ఈసేనయంతయు నాతని యాధిపత్యము క్రిందనే యున్నది. ఈసేనచంద్రగుప్తప్రభునిదే. మహాయోధుని హృదయ మాగానములో లీనమైనది. ఆతఁడు నాగాధనే గానము సేయ నారంభించెను. ఏకసంతఁగ నప్పుడాతఁడు విని గ్రహించెనో, లేక పూర్వమాతని కాగీతము కంఠపారముగ వచ్చునో గాని, యొక్కతప్పైన లేకుండగీతమును మరలఁ బాడ నారంభించెను. ఇది వినఁబడినతోడనే యెంతటిగీత మాఁగిపోయినది. మహాయోధుఁడును మానివేసెను. మరలఁ గొంతసేపటికి మఱియొకదిశనుండి సంగీతము వినఁబడుచుండెను. అది గీర్వాణభాషలో నున్నది. కాఁబట్టి యది గీర్వాణులే పాడుచుండిరని తోఁచుచున్నది. దాని యర్థ మిది.

"సౌమ్యస్వభావుఁడ వగునోరాజచంద్రుఁడా! నీవు లోకమునందంతటను నమృతమును వర్షింపఁజేయుచున్నావు. అందులకు జనము నిన్ను వేనోళ్లఁ గొనియాడుచున్నది. నీవు దేవతలకుఁగూడ నాహారము నిచ్చుచుందువు. దేవతలు నీయందు కరుణాళులై యున్నారు. కాని దుష్టులగురాహు కేతువులు నీయందు మత్సరమూని నిన్నుఁ బట్టవచ్చుచున్నారు. చలింపక నిలిచెదవేని వారియంతమును నీవు చూడఁగలవు. నీవమృతమూర్తివి."

ఇందెంతపరమార్థ మున్నది? చంద్రగుప్తన కీసంగీతము వినఁబడి యుండునా? అతఁడు తనశిబిరములో నిదురించుట లేదు. ఆయుధహస్తుఁడై యిటునటు తిరుగుచుండెను. ఇంతలో నాగానము గాలివాలున సామీప్యమున వినఁబడియెను. సేనాసమూహము ప్రక్క యోధులనుండి కొన్నియీల లావెంటనే వినవచ్చినవి. తోడనే చంద్రగుప్తుని పటకుటీరముకడనుండి ఖడ్గహస్తులగునిరువురుయోధు లొక్క టేపరుగునఁ బాటిపోవుచుండిరి వారు మాఱువేసములతోఁ జంద్రగుప్తుని రహస్యముగ వధింపవచ్చినకుండలదండధారులను యోధులు. వారు నందుని సేనానాయకులు. కొందఱు యోధులు వారిని వెనుదవిలిరి గాని వారు దొరకలేదు. అసందడివలన గీత మాఁగిపోయినది.

పందొమ్మిదవప్రకరణము.

సూర్యోదయము కావచ్చుచున్నది. వనశకుంతముల కలకలారావమంగళవాచకములు వీనులవిందు సేయుచుండెను. గంగాతరంగమాలికలలోఁ దూఁగితూఁగిచల్లనిపిల్లవాయువులు వనవిహారము సేయుచున్నవి. చెట్లక్రీనీడలఁ జేరిన చీఁకటి దొంగలు మనకిప్పుడు కాన్పించుటలేదు. ఆక్రీనీడలును గనఁబడుటలేదు. ఆకసముతొంటినైల్యమును వీడినది. ఉషస్సునకుఁ బూర్వమునఁదోఁచు వెలవెలపాటును వీడినది. అరుణతేజ మాతూర్పుదిక్కునం దవతరించెను. ఆకాంతులలోఁ గరకర ప్రొద్దుపొడుచుచుండుటచే నాకాశమునం దొకవింతకాంతులు తోఁచుచుండెను. బాలభానునిలేతకిరణము లిప్పుడు పర్వతాగ్రములయందును, నున్నతవృక్షాగ్రములయందును బ్రాఁకుచు, మెల్లఁగ ముందునకుఁ దారు

చుండెను. అవి, క్రమముగఁ జెట్ల యాకుల మీఁదను, కొమ్మల మీఁదను, పరువడపుఁదీఁగల నల్లుచుండెను. తరుపంక్తు లన్నియుఁ జిత్రవిచిత్ర వర్ణములు గలపత్త్రిసంతతులచే మనోహరముగఁ గానవచ్చుచుండెను. ఆయుదయశక్తి వాని కాద్యమణి యభ్యుదయముచేతనే లభించినది. ఇప్పుడు ప్రభాతతేజము లోకమునం దత్యంతప్రభావముచే సంచారము సేయుచున్నది. అది పరబ్రహ్మమునొక్క సౌమ్యతేజము. దానిమాహాత్మ్యమును మనమువర్ణింపఁజాలము. త్రిమూర్త్యాత్మకమైన యీబాల భాస్కరుని, నాతఁడవగాహనము సేయుచున్న యీ పావనగంగా స్రవంతిని, ఫలభరిత తరువిలసితం బగు నీ వనస్థలిని, మన మొక్కసారి స్మరించుకొందము—

ఇట్టిసమయమున గంగాతీరమునఁ దొకమఱ్ఱిచెట్లుక్రింద నిరువురు పురుషులేమిటో ముచ్చటించుకొనుచుండిరి. అందొకపురుషుఁడు యౌవనము నతిక్రమించి యున్నాఁడు. అయినను నాతని శరీర మింకను పటుత్వమును వీడియుండలేదు. ఆతనిముఖమున బ్రహ్మతేజము తాండవమాడుచుండెను. రెండవయాతఁడో, నవనవోన్మేషయౌవన విరాజితుఁడు ఆతనిస్వరూపస్వభావ లక్షణములచే నాతఁడొకసుక్షత్రియ ప్రభుపుంగవుం డని తోఁచుచున్నది. వారీవిధముగ సంభాషించుకొనుచుండిరి.

"వత్సా! వృషలా! సార్వభౌముఁడ వగుదువుగాక! ఆయుష్మంతుఁడవై చిరకాల మీయవనిఁ బాలింతువుగాక!"

"ఆచార్యోత్తమా! అనుగ్రహింపఁబడితిని."

"చంద్రగుప్తకుమారా! పాంచాలదేశమున నిప్పుడు ప్రతినిధిగ నెవ్వరున్నారు?"

"భక్తియుక్తుండను, సత్యసంధుండు నగులావణ ప్రభువు; సౌభూతి"

"నమ్మకమునకును, రాజనీతికిని, జాల దూరమే. ఆప్రాంతప్రభు వైనే యంకుంచితి వేల?"

"ఆతఁ డొక్కఁడే యందున్నవాఁడు. మనమహాసైన్యమందున్నది. అదియునుగాక యాతనిసేనతో నాతనిప్రియతనయుఁ డగు జయభూతి నిటకుఁ దీసికొని వచ్చితిమి"

"బిడ్డా! నీయేర్పాటు ప్రయోజనకరముగనే యున్నది. ఇఁక నాతఁ డేమాత్రమును ద్రోహము తలపెట్టఁడు. ఒక వేళనీచవర్తనమునకుఁ గడంగెనేని సైన్యమునకుఁ జెడును. పుత్త్రునకుఁ జెడును. మాన ప్రాణములకుఁ జెడిపోవును."

"గురూత్తమా! నందపుత్త్రునధనుగూర్చి వినవేఁడుకపడుచున్నాఁడను."

"దానిగాథ చాలగ నున్నది. చెప్పుటకు నాకును దొండరగనే యున్నది. నివును, వసంతుఁడు నేగినపిదప పురమంతయుఁ జాలఁగల్లోలమునకు లోఁబడియెను. పురజనులు చాలమంది నంమనిచే బాధింపఁబడిరి. నధ్యశిలయొద్దకు నచ్చినవారిని రాని వారినిగూడఁ బట్టించి చెఱఁ బెట్టించెను. తమకు వ్యతిరేకముగఁ బనిచేసెనన్న వారినెల్ల బంధించెను. ఈసమయమున నాగృహదహన వృత్తాంత మాతనికి వినఁబడినది. గొడ్డలిచేఁ జేయపని గోటనే తీరిపోయినదని యాతఁడు సంతసించెను. నామరణవృత్తాంతమును వినినతోడనే ప్రజల బాధించుట తగ్గించెను. క్రమముగఁ గొన్నాళ్ల కాప్రజలు విడుదల చేయఁబడిరి ఇదియంతయును ప్రజలయందుఁ దాను దయఁగలిగియున్నట్లుగ వారనుకొనుటకయి యొనర్చిన యాతనికపటనము."

"మాపోకడ నెఱింగినవెనుక నందుఁడు మాకొఱకు వెదకింప లేదా?"

"నిన్నును వసంతుని బట్టుకొనుటకై యానందుఁడు చాలమంది చారులను బ్రచ్ఛన్నముగఁ బంపఁదొడంగెను. నేను మనశత్రుదాసు మొదలగుభృత్యుల నందందుఁ గాపుంచి శత్రుచారుల రహస్యముల నారయుచువారినినయమునను, భయమునను, ధనాదిసాధనములను, మన లోనికిఁ ద్రిప్పికొంటిని. అట్లు స్వాధీనముకానివారల రహస్యముగ నరణ్య మార్గములనో, మతియెచ్చటనో, మనగూఢసంచారులచే మట్టు బెట్టించి తిని. ఒక్కచారుఁడును దనకెట్టి వృత్తాంతమును జెప్పకుండుట కను మానించు నని కొందఱమొగములు మాత్రము రాజునకుఁగనఁబడునట్లు చేయుచుంటిని. వారేమిచెప్పఁగలరు ? ఈసందర్భమున నందునకుఁ జాలననుమానము కలిగెను. వసంతచంద్రగుప్తులనృత్తాంతముఁ దీసికొని రాకుండ వచ్చినవారికి మరణదండనము విధింతు నని యాతఁ డాజ్ఞా పించెను. బ్రదుకఁదలంచినచారుఁ డెవ్వఁ డాతనికి మరలఁగన బడును? వా రందఱు క్రమక్రమముగ నెచ్చటికో పాఱిపోవుటయో, లేక మనగూఢ చారులచేతనుఁ జిక్కుటయో, తటస్థించెను. అట్టివారికి యిననుఁగనరహస్య వృత్తాంతములు తెలియనీయకుండ మనమిత్రుఁ డగుమాళవరాజకుమా రునియొద్దఁ జేర్పించితిని."

"అయినను, నందుఁ డూహకుండువాఁడు కాఁడే. ఆతనిమంత్రి యగు రాక్షసుఁడు చాల బుద్ధిమంతుఁడు. మీరహస్యమును గనిపెట్ట లేక పోయెనా?"

"ఆతనిప్రయత్నము లన్నియును వ్యర్థమగుచుండుటచే నందు నకునామరణవిషయమున ననుమానము కలిగినది"

"తరువాత నేమి చేసిరి?"

"నీతిశాస్త్రనిపుణుండును, తంత్రజ్ఞుండు నగు, రాక్షసామాత్యుఁడు మనయాశ్రమరహస్యములఁ దెలియఁగోరి, చాణక్యునియావరణమునందలి

స్థలమంతయును ద్రవ్వి యందుఁజాణక్యాలయముఁ గట్టింతుమని యుత్త రవు చేసెను."

"అది యేమి?"

"నామరణమునుగూర్చియే తల్లడిల్లుచున్న ప్రజలు నాయాశ్రమ మును త్రవ్వించినయెడలఁదిరుగఁబడక మానరని యుక్తిగా నట్లు చేయ నిశ్చయించెను."

"గూఢమార్గమును గూర్చి వారు తెలిసికొనిరా? అట్లైన మీ మరణము కృత్రిమమే యని భ్రేతపడకమానదే' "

"అది యెట్లు జరుగును" ఈసంగతి యంతయును నేను జీవసిద్ధి వలనఁ దెలిసికొని నాసహాధ్యాయియు, నందునిభోగినియగు పుష్పమంజరికిఁ బ్రియుండు నగు, నిందుశర్మమూలమున నొకతంత్రమును బన్నితిని"

"ఎట్లు?"

"చాణక్యుఁడు బ్రహ్మరాక్షసుఁడై తన్నుఁ బీడించుచున్నాఁడని పుష్పమంజరి కపట భూతావేశాభినయముఁ జూపించునట్లు చేయించితిని. దానిమూలమున నామరణమునుగూర్చినసందేహము పోయినది. పుష్ప మంజరియే ప్రాణముగనున్న నందుఁడు దాని కష్టములను జూడలేక యనేకులగుభూతవైద్యులను బిలిపించి చికిత్స చేయింప నారంభించెను. అప్పుడు మాళవమునందున్న మన మిత్రుఁడగు భేతాళశాస్త్రి వచ్చి రాజునుదర్శించి తానాభూతమును వదలించెదనని ప్రతిజ్ఞ చేసెను. ఆతని చికిత్స యారంభించినది మొదలు కొంచెముగుణ మగపడియెను. శాస్త్రి మారణహోమముఁ జేయుటకుఁ దనకువలనుపడదనియు, చాణక్యుని తోఁటలో నక్కడక్కడ విభీతకవృక్షముల నాటించినచో మరలఁ బైకి రాకుండ నావృక్షములం దాభూతము నావహింపఁ జేయుదు ననియు నందు నితోఁ జెప్పెను. నందుఁడట్లొనరించెను. పుష్పమంజరిని బట్టిన బ్రహ్మ రాక్షసి శాస్త్రిమంత్రప్రభావమునఁ జెట్ల నాశ్రయించెను. ఆప్రదేశమున

కిప్పటికి నితరులు పోవవెఱతురు. రాక్షసుని యుక్తి దానిచేఁ గొనసాగినది కాదు"

"మహత్తా! మొట్టమొదట గృహదహన మెవ్వరివలన నైనది?"

"నావలననే"

"అది యేమి?"

"నాఁడు విష్ణుగుప్తుఁడు మనయాశ్రమమున సుందరిని జూచెను. తరువాత లోనికి వచ్చి యంతయును వెదకెను గాని యామె పాతాళ ద్వారమునఁ గోప్పుటచే నాతని కగపడలేదు. మరల నాతఁడు రక్షక భటులతో వచ్చి వెదకింపవలయు ననిపైని గొళ్లెము పెట్టి వెడలి పోయెను. నాయం దనుమానము కలుగుటయును, పాతాళ గృహ వృత్తాంతము బయలఁబడుటయును, గూడ మనకుఁ జక్కులకు మూలమని యోచించి చాణక్యుఁ డీగృహమునఁ బడి కాలిపోయె నని నమ్మించు టకు నేనట్లు చెసితిని. ఆనమ్మకమువలననే చాలకాలమువఱకు వారు ప్రమత్తులై యుండఁగలిగిరి."

"పాపము! సుందరి యేమైనదో గదా!"

"మీవెనుకనే యామెనుగూడఁ బంపితిని. ఆమె మిమ్మును గలిసి కొనలేకపోయిన దనియును, కలశపురమున వసుమతి చోరులచే నపహరింపఁబడిన దని విని యాదుఃఖమున రాత్రివేళ గంగానదిలోఁ బడి మునిగి పోయిన దనియును, చంద్రజూటశాస్త్రి నాకు జాబు వ్రాసినాఁడు."

"అయ్యో! ఆమె కెట్టియవస్థ వచ్చినది? రాక్షస ప్రయత్నము భంగమైన వెనుక మీరేమి చేసితిరి?"

"తరువాత నేనాభూగృహమును విడిచి మహావనములోఁ బర్వత సామీప్యమున నున్న మన పాతాళపురమునకుఁ బోయి యందుండియే తగినయేర్పాటులను జేయుచుంటిని. ఈలోపల జీవసిద్ధి పర్వతకుని ప్రబోధించి నందరాజ్యములో సగ మాతనికిప్పించెద ననియు నాతని

సేనలతో నందునినుండి విడిపోనలసిన దనియు నమ్మించెను. నందుఁడు రాక్షససహితుఁడై కోసలమునందలి మహాకటకమునకుఁ బోయినప్పుడు పర్వతకుఁడు తనసేనలతో మనపట్టమునఁ జేరెను. ఆతఁడును, మాళవ రాజకుమారుఁడును, తమతమసేనల బలపఱచుకొనిరి. భరతపురరాజును, కాశీప్రభువును, మఱికొందఱు నందవిరోధులగురాజులును, మాళవసేనతో నచ్చి చేరుట కేర్పాటులు కావింపఁబడినవి. ఈరహస్యరాజ్యమునకుఁ బర్వతకునే రాజుగ నేర్పఱచుకొనిరి. ఆతనికే యందఱును బ్రమాణ పూర్వకముగా గంగాతోయముల నభిషేకించి పట్టాభిషేకము గూడఁ గావించిరి.''

''గురువర్యా! నందపుత్త్రి లెట్లు నిర్మూలింపఁబడిరి?''

''భేతాళశాస్త్రి యింద్రజాలమునందును గట్టివాఁడె కదా! తండ్రిలేనిసమయమున విష్ణుగుప్తుఁ డీయింద్రజాలకుని బిలిపించి వినోదించుచుండెను. ఒకనాటి రాత్రి శాస్త్రి నాతఁడు బిలిచి ''అయ్యా మీరు చాణక్యుని జూపఁగలరా'' యని ప్రశ్నించెను. తోపు చూపెద నని యాతఁడు బదులుచెప్పెను మఱునాఁటిరాత్రి కోటయంతర్నగర మునను న్న భూగృహమునుండికోటలోఁ బ్రవేశించి చీఁకటిలో నేనొకగది యందుఁ బ్రవేశించి యుంటిని. ఆగదిగుమ్ము నొద్దనే విష్ణుగుప్తుఁ డుచి తాసనమునైఁ గూర్చుండి శాస్త్రియింద్రజాల విద్యనుగాంచి వినోదించు చుండెను. ఆతనియెదుటగోడ కొకనిలువుటద్ద మున్నది. నేనుకత్తి నెత్తి కొని యాతని వెనుక నిలువఁబడితిని. నిలువుటద్దములోఁ దోఁచునాకృప మును విష్ణుగుప్తుఁడు చూచెను. ఆతని మొగము వెలవెల ఱోయెను. ఒకింతలోఁ గోపమువచ్చెను. అది యద్దము, మహేంద్రజాలము, అను మాట నాతఁడు మఱచి ''ఓరీ! బ్రాహ్మణహంతకా! చచ్చియును ధైర్యమునువిడువవేమిరా? నీకీకత్తి యెందులకు?''అని లేచియాయద్దము పై, నొక్కతన్ను తన్నెను. అద్దము పగిలిపోయినది. అక్కడి

చాణక్యుఁడు మాయమై పోయెను. ఆతఁడు వెనుకకుఁ దిరిగెను. మరల నక్కడఁగాన్పించెను. మరలఁదన్నుటకయి కాలు పైకెత్తెను. నాఖడ్గ మాకాలునకు బుద్ధిచెప్పినది. వెంటనే యాతఁడొక్క కేకవేసి క్రిందఁ బడిపోయెను. ఒక్క-నిమిషములో నాతనిశిరము శరీరమునుండి వేఱు చేయఁబడినది—అప్పటి కప్పుడే పర్వతకాములు తమతమసేనలతో నగోట లోఁజొరఁబడి నందపక్షపాతులనందఱ నఱకుచుండిరి. అంతటనుగలకలము ప్రారంభమైనది. బేతాళశాస్త్రి యింద్రజాలము కొంప ముంచివేసిన దని యందఱు నాతని బట్టుకొనుటకయి మీఁదఁ బడిరి. ఆగుంపులోఁ గొంతమంది నాఖడ్గముపాలై క్రిందఁబడిపోయిరి ఈలోపల నంతర్న గరమునుండి నేనువచ్చినదారినేమాళవకుమారుఁడు మహావీరులతోవచ్చి పడియెను. అప్పటిచర్య నేమనిచెప్పఁగలను? అంతఃపురమున నాసేనతోఁ బ్రవేశించినందపుత్త్రుల నెదకి పట్టుకొంటిని. వారి ప్రాణములతోఁ గోట యును మనస్వాధీనమై పోయినది. కాని, వారిప్రాణములు మాత్ర మెగిరి పోయినవి. ఆరాత్రియంతయుఁ గల్లోలములో నాకోట మునిఁగి పోయి నది. తెల్లవాఱుసరికి నిశాతంకముగఁ బాటలీపుత్త్రి మంతయు మనకు స్వాధీన మైనది. ప్రజలుకూడ నేమియు ననలేదు. వృషలా! ఈఘనకార్య మునకు నందునిపై నాకుఁ గలక్రోధమును, శిష్యవత్సలతయు, నన్ను ప్రేరేచుటచే నేను బూనుకొంటిని. దైవము మనపక్షముగ నుండుటచే నిరపాయముగఁ బని జరిగిపోయినది ”

“ఈవార్త విని నందుఁ డూరకుండెనా?”

“తరువాత నందున కీవార్త తెలిసినది. సేన లన్నియుఁ దిరిగి పోయిన సంగతియును దెలిసినది. కార్యము మించి పోయినది ఏమి చేయును? ఆతఁడు కోసలమున నందకటకమునందేయుండి మరల సేనలఁ గూర్చుకొనుచున్నాఁడు.”

“పర్వతకుఁ డేమయ్యెను?”

"రాక్షసామాత్యుఁడు నన్నుఁ జంపుటకయి నాపైకి విషకన్యక నంపెను. దాని నేనాపర్వతకునిపైఁ బ్రయోగించి యర్ధరాజ్య మీయ వలసిన యగత్యము లేకుండఁ జఁపించితిని"

"ఇదివఱ కాతని రాజుగాఁ జేసికొన్నప్రజలు మీపైఁ దిరుగఁ బడలేదా?'

''ఇది యెవ్వరికిఁ దెలియును? చాణక్యునిచేఁ జేసినకారణమునఁ బర్వతకుని రాక్షసుఁడే చంపించెనని లోకులు చెప్పుకొనసాగిరి."

"ఇప్పుడు రాజ్య మరాజకముగనే యున్నది కాఁబోలును,,

నేను చాలవఱ కాకొదన లేకుండఁ గాపాడుచున్నాఁడను. ఈకల్లోలములోఁ బ్రజలు నిన్నాకాంక్షించిరి. సామంతరాజులును, దండనాయకులును, మాళవరాజకుమారుఁడునుగూడ, నీకొఱ కెదురు చూచుచున్నారు. నీవు పాంచాలమును జయించి వచ్చినవార్త విని వాఱంద ఱును బరమానందము నొందుచున్నారు."

ఈవాక్యములు విని చంద్రగుప్తుఁడు పరమానందమును బొందెను. గురునకు సాష్టాంగదండప్రణామంబులు గావించెను. చాణక్యుఁడాతని నెత్తి శిరము మూర్కొని చిరాయుష్మంతుఁడవగుమని మరల దీవించెను.

చంద్రగుప్తుఁడు ''ఆర్యా! ఉభయసేనలను నడపించుపాటి సామర్థ్యము మహా యోధునియం దున్నది. మనము నందకటకమునకుఁ బోవుదమా?" యనియెను.

చాణక్యుఁ డందులకంగీకరించెను. ఆసేనాసాగర మాయుధ యమే నందకటకమునకు దాఁటి వెడలెను.

ఇరువదియవ ప్రకరణము.

అనుటునాఁటిసాయంకాలమునకుఁ జంద్రగుప్తుఁడు సేనలతోఁ నందకటకసామీప్యమునకు వచ్చినిలిచెను ఆపట్టణముచుట్టును ప్రాకారమున్నది. కాని ద్వారము లన్నియుఁ దెఱువఁబడియే యుండెను పద్మనందునిమిద్ద నిప్పుడు చాలసేన కూడినది. నైశాలినగరేశ్వరుఁడగు వైరోచనుఁడును, నేపాళిభూపాలుండగువిజయకేతుండును, తమ తమ సేనలతోఁ నాతనికి సహాయులయి వచ్చిరి. తన తండ్రియగు పర్వతకుని చాణక్యుఁడు విషముపెట్టి చంపెననుసూయతోఁ మలయకేతువుకూడఁ బగఁదీర్చికొనఁదలంచి ప్రచండసేనతోఁ నందుని నాశ్రయించెను. నందుని సమీపజ్ఞాతి యగుసిద్ధార్థుఁడుకూడ నాతనినే కలిసికొనియెను. ఆతని సేనయుఁ జాలఁగ నున్నది. అది సముద్రముతోఁ బోల్పఁదగియున్నను నిప్పు డేమికాని ఘోషిం ంట లేదు.

నందుఁడు యుద్ధకార్యనివుణుఁడు. తతివేచిశత్రునృపులజయించుటలోఁ నాతని మంత్రి యగు రాక్షసుఁడు చేయు ప్రయత్నము లత్యద్భుతముగ నుండును. ఆతఁడు శత్రునృపుల నెదిరించి యుద్ధము సేయ దలఁచికొన లేదు. ఆకారణమునఁ గోటవిడిచి సేనలతోఁ బట్టణమునఁ బ్రవేశించెను. ఆపట్టణమున నేమూల నేసందు లున్నవ్రొ, యెచ్చటినుండి యెచ్చటికి మార్గమున్నదియో, క్రొత్తవారికిఁ దెలియదు. ఆతఁడు సేనల నన్నిఁటిని జిన్నచిన్న భాగములుగ విడఁదీసి యాయాస్థలములలోఁ నిలిపి యుంచెను. శత్రుసైన్యములు పట్టణమునఁ బ్రవేశించినతోడనే వారిని చుట్టు ముట్టి చిందరవందరఁ జేయవలయు నని యాతని యుద్దేశము. నందుఁడు సమయము ననుసరించి, యేయెండకాగొడుగు పట్టువాఁడేకాని వృథాభిమానమునఁ జావునకుఁ దెగించి విజయోత్సాహమున నెలుపోటములకు సిద్ధపడి

యుండువాఁకు కాఁడు. ఓటమివచ్చినప్పుడు పాఱిపోవుటకు వెనుదీయు వాఁడు కాఁడు. ఆతని కొక్కసారి తెక్క- యెన్నఁడును నట్టి యవస్థ తటస్థింపలేదు. అదియైనను బాఱిపోవుట కాఁడు. సర్వసేనానాయకులుఁ జాణక్యునితోఁ గలిసిపోవుటచే నక్కడకు మరల రాలేకపోయెను. అది మనమునం దుంచియే శత్రుసైనికులను లోనికి రానిచ్చుటకును, తాము వారిని చుట్టుముట్టి తాఁకుటకును, నిశ్చయించుకొనియెను. ఇది కేవల ఫలాయన మాత్రమునకే గాగు. విజయము గలుగుటకుఁ గూడ ననుకూలముగా నుండునని యాతఁ డాలోచించెను.

చంద్రగుప్తునిసైనికు లందఱును శూరశిఖామణులు. వారికి రణ మన్నఁ బండువుగా నుండును. ఇప్పుడు యోధు లందఱును, ఫలాపేక్ష కూడనెకటి యుంఘటచే, విజయోత్సాహమున నుద్రేకించి యుండిరి. ఎట్లైన నందునిపైఁ బడిపోవలయు నని ప్రతియోధుఁడును ద్వరపడు చుండెను. ప్రతిదండనాయకుఁడును దనసైన్యముతో ముందుఁ బ్రవేశింప వలయునని తలంచుకొనుచుండెను జగన్మోహని యగు వసుమతీ కర గ్రహణసౌభాగ్యమును, నమూల్యమణినిధాన మగురత్నగిరి రాజ్యసింహా సనసంపత్తియుఁ, బేరుగలప్రతియోధుని హృదయమునందునునాశాలతలఁ బ్రాఁకించుచుండెను. అయుద్రేకముచే సేనాసముద్ర మంతయుఁ బొంగి పోవుచుండెను.

దట్టముగ మబ్బు పట్టినది. ఇంకను సూర్యాస్తమయము కా కుండుటచే గాఢాంధకారము కాలేదు. కాని, దూరపుచూపానఁటలేదు. సేన లన్నియు ముందునకుఁ బోవునుత్సాహముతోఁ గ్రమముఁదప్పి యుండెను. యోధులును సైనికులఁబురికొల్పుచుండిరి. పరేంగితజ్ఞాన ధురీణుండగు చాణక్యుని మతిప్రౌఢిమ లోకాతీత మైనది. ఒక్క యోధుఁడైన లోనఁ బ్రవేశింపఁగూడ దని రాజుచే నాజ్ఞ చేయించెను. ఈరాజాజ్ఞ యంత

టను వ్యాప్తమగుటకుఁ బూర్వమే ముందున్న కాశ్మీరరాజసైనికులిర్వురు దండనాయకులలో ద్వారమును దాఁటి పట్టణమునఁ బ్రవేశించిరి. వెనుకనే యిరువంకలను శత్రుసైనికులు బిలబిల లాడుచు వచ్చి వారి నరికట్టిరి. అక్కొలఁదిసేనలో నొకచిన్న కయ్యము ప్రారంభమైనది. భేరీధ్వనులు లేవుగాని యప్పు డుఱుముల పెళపెళధ్వనులును, సైనికుల కోలాహల ధ్వనులును వినవచ్చుచుండెను. భయంకర దావానలమువలె శత్రు సైన్యము కాశ్మీరదండనాయకులను బరివేష్టించి నాశనము చేయుచుండెను. ఆచీఁకటిలో నాసంకులసమరమున నెందఱెందఱు పడిపోయిరో తెలియ లేదు. కాశ్మీరదండనాయకులకుఁ దోడుపడుటకును వారిని రణసంరంభమునుండి మరలించి తెచ్చుటకు మఱికొందఱు దండనాయకులు లోనఁ బ్రవేశించిరి. వారుకూడ శత్రుసేనలచే నరికట్టఁబడిరి. అచ్చటి కయ్యము దారుణముగనే జరిగినది. గాఢాంధకార మైనది. ఎత్తఁబడిన కత్తులు, బల్లెములు, మొదలగు నాయుధములనుండి స్రవించుచున్న రక్తబిందువులు మెఱుపుల వెలుతురున నగపడుచుండుటచే వెలుపల నున్న చంద్రగుప్త సైనికుల కందఱికిని హృదయములందు వీరరసము పొంగి పొరలుచుండెను. కాని, పురప్రవేశమున కభ్యంతరముగ నున్న రాజాజ్ఞ వారికి నిర్బంధముగ నుండెను.

చంద్రగుప్తసేనలు పట్టణమునకు వెలుపలనున్న యొక పేటలోఁ విడిసి యుండెను. అందఱును రాజాజ్ఞచే నిశ్శబ్దముగ నుండిరి. మహా యోధవసంతులు దమ సైనికులను వ్యూహాకారములఁ బగులఁగొట్టుట యందును, కంచెల భాగుచేయుటయందును, మార్గమును సుగమము చేయుటయందును నియోగించిరి. లోనఁ బ్రవేశించిన వారలలో గొందఱు రాజాజ్ఞ విని తప్పించుకొని వెనుకకు వచ్చుచుండిరి. కోపోద్రేకమున నెడలెఱుంగని కొందఱు ముందునకుఁ బోయి శత్రుసేనాసముద్రము నీది నంతవఱకీదితుద కందు మునిఁగిపోవుచుండిరి. ఈవచ్చు పోవువారివలన

నాపురద్వార మంతయును క్రిక్కిరిసియుండెను. ఆచిన్నసేన శివమెత్తినట్లు శత్రువులతోఁ బోరుచునే యుండెను.

ఆగాఢాంధకారమునకుఁదోడప్పుడు పెద్దగాలియునుధూళియును బయలుదేఱెను. ఆపైఁదుమార మారంభించి క్రమక్రమముగా జడివాన కురియుచుండెను. అది చీకటిరాత్రి. దానిపై మేఘావరణము. అందును, ధారాపాతవర్షము. బొడిబురదలవలనఁ గాళ్లు జారుచుండెను. కన్నెత్తుటకు వలనుపడకుండ వర్షము మొత్తుచుండెను. ఒకరికొకరు రగపడుటలేదు. ఆసందడిలోఁ బట్టణములోనిపోరాగిపోయినది. సేనలు చెల్లాచెదరై పోయెను. కాశ్మీరదండనాయకులు మిగిలిన సేనతో నిలఁబడిరి. ఆజడివానలోఁ జంద్రగుప్తుని సైనికులు చెట్టుచెట్టునకుఁబోయి తలఁదాఁచుకొనుచుండిరి. ఆసేనలు నిలిచినచోటుఁగుడివైపున నొకపెద్దచావడియుండెను. అందుఁ జాణక్యుఁడును, ఆతనియంగరక్షకులును, మాళవరాజును, గొంతమందిదండనాయకులును, గూర్చుండియుండిరి. కొంతసైన్యమాపంచను జుట్టువారి యుండెను. ఆచావడి కెడమభాగమున నొకవినోదమందిరములోఁ జంద్రగుప్తుఁడును, గాశ్మీరగాంధార కాంభోజాదిభూపాలురు, వారివారి యంగరక్షకసైన్యముతో నిలిచియుండిరి. అందే యంతఃపురస్త్రీజన ముండెను. వసంతుఁడును మహాయోధుఁడును, వినోదమందిరమునకును చావడికినినడుమనున్న యొకమట్టిచెట్టు క్రిందఁ దమసేనలతోఁ దల దాఁచుకొని యుండిరి. వినోదమందిరమునకు వెనుకనున్న మామిడితోపునందు తక్కినసైనికులును, దండనాయకులును, నిలిచియుండిరి.

రెండుగడియలసేపు వర్ష మొక్కటేరీతిగాఁ గురిసి వెలిసెను. వీధులనుండి వర్షోదకము ప్రవహించుచుండెను. భూమియందలి కమ్మనిపరిమళముతో నీటిపై నుండి చల్లనిగాలి వీచెంచుచుండెను చెట్లయాకుల తుదలనుండి జారుచున్న జలబిందువుల చిటచిటస్వనంబును, వర్షజల

ప్రవాహములయందలి గలగలధ్వనులును, నీటిగుంటలలోనుండియొక్కటే మాదిరిగ గూయు మండూకతండముల బెకబెకారావమును, గింగురు గింగురుమని కూయుచీకువాల రొదయును, గలిసి యొకయనిర్వాచ్యమగు వింతశబ్దముత్పన్నంబగుచుండెను. ఆతంత్రీస్వనముతోడ గోములకలకంఠ స్వరములీనమయి యున్నట్లు తోచుచుండెను.

ఆసమయమునఁ జంద్రగుప్తుఁడు వినోదమందిరమునకుఁ జాణక్యుని, తక్కినరాజలోకమును, రావించి యుద్ధకార్యముల విషయమై యాలోచించుచుండెను మహాయోధుఁడుకూడ నక్కడకుఁ బోయి యుండెను. అప్పుడువసంతుఁ డొక్కడనుండియో ససంభ్రమముగ వచ్చి "నాకుఁగూడ నివిషయమున సమయ మీయవలయును" అని లోనికి విన్నప మంపికొనియెను. వసంతుఁడుగూడ వచ్చుటకు సమ్మతించిరి. వారందఱును దెల్ల వారువఱకు నాయానియమితస్థలములలోనే జాగ్రత్తగ నుండుటకును, నుదయమున యుద్ధ మారంభించుటకును, నిశ్చయించిరి.

వసంతుఁడు లేచి నిలువఁబడి వినయముతో— "మహారాజా! శత్రువీరులు మనసైనికులపోలిక దుస్తులను ధరియించి యీరాత్రియే మనపైఁబడనున్నారఁట" అనియెను.

చంద్రగుప్తుఁడు వసంతునిదృఢప్రయత్నమును, జాగరూకతయు, సూక్ష్మగ్రహణశక్తియు, పరాక్రమమును, తనయందలి యభిమానమును, జూచి జాలిపడుచునేయుండెను. హృదయమునఁ దన్ను నిందించుకొనుచునే యుండెను. కాని, రాజనీతి నట్లుపయోగింపవలసివచ్చుటచే నాతని నపరాధునిగనే చూచుచుండెను. ఇప్పుడాతఁడు కనిపెట్టిన రహస్య వృత్తాంతము మూలమున మరల నాతనిహృదయమున జాలికలిగెను

"వసంతా! నిజముగానా? నిజముగానా"? అనియెను.

"నిజమే"

"ఇది నీకెట్లు తెలిసినది?"

"ఒక హరిదాసునివలన"

"ఆహరిదాసుఁడెవ్వఁడు?"

"ఆతనియథార్థచరిత్ర మేమియో నాకుఁదెలియదుకాని కొంత కాలమాతఁడంభీరునికడఁ దక్షశిలానగరమున నున్నాఁడట"

"శత్రుపక్షమునన్నున్న వానివాక్యము లెట్లువిశ్వసింపవచ్చును?"

అప్పుడు మహామంత్రి లేచి "మహారాజా! మొన్నగ్రీకు సేనలు లావణమును ముట్టడింపఁబోవుటయు, నంభీరునిసేనలు కొన్ని వారి మీఁదబోవుటయు, మొదలగురహస్యము లాతనివలననే తెలియవచ్చినట్లు మనరాజయోగానందస్వామివారు సెలవిచ్చి యున్నారు. ఆతఁడు శత్రుస్థానమున నుండియు మనపక్షమునకే పనిచేయుచుండును ఆతనిమాటలు విశ్వసింపఁదగినవే కాని సందేహింపఁదగినవి కావు." అని విన్నవించెను.

అది విని చంద్రగుప్తుఁడు వసంతుఁడా! ఆతనికి నందసన్ముఖమునకుఁ బోవుట కవకాశ మెట్లు కలిగినది?" అనిప్రశ్నించెను.

"అంభీరుఁ డాదరించుటచే నాతనిమిత్రుఁ డగునందునకుఁగూడ నాహరిదాసునియందు గౌరవభావము కలిగినది. ఆతని కాపట్టణమునను, దుర్గమునను గూడ, యథేచ్ఛముగ సంచరించుట కనుజ్ఞ యున్నది."

"ఆతనికి నీకును బరిచయ మెట్లుకలిగినది?"

"అకారణవత్సలుఁ డగునామహాత్ముఁడు నాకొకప్పుడు పరిచితుఁ డయ్యెను."

"మనకుఁగావలసినవిషయము తెలిసినది. ఇప్పుడు సైనికులంద ఱును గుంపులుగుంపులుగ నందందు నిశ్శబ్దముగ నుండవలయును. ఒక గుంపునుండి మఱియొకగుంపునకు వేగునడపుచారులు సంచరించుచుండ వలయును. శత్రువులు వచ్చువార్త వారిమూలమునసే సేనలకన్నిటికిఁ దెలియుచుండవలయును. సైనికు లందఱు నీవఱకున్న వస్త్రములను మార్చి,

ఆయుధహస్తులై జాగరూకులై యుండవలయును రాజులందఱును దమ యంగరక్షకసైన్యమును భద్రముగ నుంచుకొనవలయును. ఈగాఢాంధ కారసమయమున మనము నిద్రించుచుంటి మని శత్రువులుకొలఁది సేన లతోఁ బడఁబోవుదురు. ఆసమయమున నందఱము నేకముఖముగఁ జేరి వారిని ముట్టడింతుమేని యతిసులభముగ జయింపవచ్చును." అని చంద్ర గుప్తుఁ డాజ్ఞాపించెను. పైనిజెప్పిన ప్రకార మందఱును దమతమ కార్య ములలో నప్రమత్తులయి యుండిరి

రాత్రి రెండుజాములయినది. కాలము కొందఱతో నెగిరిపోవు చుండును. కొందఱతోఁ బరువెత్తుచుండును. కొందఱతోఁ నతివేగముగ నడచుచుండును. కొందఱతో నెమ్మదిగఁ బయనము సేయుచుండును. కొందఱతో మాటలాడుచుండును కొందఱతోఁ గరినముగ నిలునఁబడి యుండును. కొందఱు కగపడకయే యుండును. మన్నసైనికుల కందఱు కారాత్రి వేకువజాము త్వరగా వచ్చుటలేదు. వారుచాల నలసి యుండిరి.

నిద్రాదేవత వారిని జోకొట్టుచున్నది. ఉన్మీల లూఁపుచున్నది. ఒడలుమఱచునంతటి యుపచారములఁ జేయుచున్నది. కఠినములగువారి చేతులయందలి యాయుధములఁ గ్రిందఁ బడవేయుచున్నది. అనిర్వాచ్య మగు ప్రకృతిసుఖమును గూర్చుచున్నది. ఆకారణమున వారు వసుమతి యందలియాశను మఱచిపోయిరి. రత్నగిరిసింహాసనమును మఱచిరి. ప్రపంచమునందలి యన్ని విషయములను మఱచిరి. తుదకుఁ దమ్ముగూడ మఱచి హాయిగ నిదురించుచుండిరి. అంతట నిశ్శబ్దముగనుండెను.

ఇరువదియొకటవ ప్రకరణము.

వసుమతీమధురభాషణములు వీనులఁ బ్రతిధ్వనించుచుండుటచే వసంతునకుమాత్రము నిద్రాదేవత జోలపాటలు వినఁబడుటలేదు. క్షణక్షణమునకు వసుమతీదివ్యసుందరవిగ్రహ మగపడి మాయమగుచుండుటచే మరలమరలఁజూడఁగోరుచున్న యాతనికన్నులు మూఁతవడుటలేదు. వసుమతీపాణిగ్రహణసుఖానందము గూర్చు తనయదృష్టము గూర్చి ధ్యానించుకొనుచుండుటచే నాతనికి మఱపు తోఁచుటలేదు. నంద శిరశ్ఛేదనసమయమును నిరీక్షించుచున్న యాతఁడు ప్రతినిమిషమును, ప్రతిఘటికయు, లెక్కపెట్టుకొనుచుండెను. ఆతనికి నిమిష మొకయుగముగా నుండెను. ఆరీతిగా రెండుజాములు గడపెను.

ఆతనికడనున్న మహాయోధుఁడును జాగరూకుఁడయ్యే యుండెను. అంగరక్షకసైన్యమును, వేగులవాండ్రునుదక్క, సేనలన్నియు నిద్రాదేవతయొడిలో హాయిగ మైమఱచియుండెను.

ఆసమయమునఁ బట్టణమునైఋతదూరముగ నేదియో మర్మర ధ్వని వినవచ్చుచుండెను. వసంతయోధు లిరువురుఁ జెవియొగ్గి వినుచుండిరి అది యేమో వారికి బోధపడలేదు. గాలిచేఁ గదలుచున్న చెట్ల యాకులచప్పుడైనను గావచ్చును. వర్షప్రవాహముల చప్పుడైనను గావచ్చును. వారేదియును నిశ్చయించుకొనలేదు. ఆధ్వని క్రమక్రమముగా సమీపించుచున్నట్లు తోఁచెను. అదిత్రేనెపెఱనుండి చెదరింపఁబడి గుంపుచెదరిపోవుచున్న తేనెటీఁగలరొదవలెనే యుండెను.

"ఆధ్వని యేమో వినుచున్నావా?" అని మెల్లఁగ మహాయోధుఁడు ప్రశ్నించెను.

"వినఁబడుచునేయున్నది. అది యేమో యూహించుటకు నాధ్య
ము కాకుండ నున్నది."

"జాగరూకులమై యుండవలయును. ఏమైనను భయములేదు"

ఒక్కింతసేపటిలో నాధ్వని యాఁగిపోయెను. వారింకను జెవి
యొగ్గి యాలకించుచునే యుండిరి. యోధుఁడు "వసంతా! ఏమైన వినఁ
బడుచున్నదా?" అనియెను.

"ఆ. ఆధ్వని కానను. ఇప్పుఁడు మఱియొకమాదిరిగ నున్నది" అని
వసంతుఁడు పురద్వారమునంకఁ జూపులు పరగించెను అటఁ గొందఱు
వీరభటులు బారులుతీరియున్న ట్లాతఁడు కనిపెట్టెను.

"అయ్యా! ఆధ్వనియొక్కయర్థము బోధపడినది. పురద్వారమున
శత్రువులు ప్రవేశించినారు." అని యోధునితో మెల్లగ ననియెను.

"కుమారా! నీకన్నులయందు సూక్ష్మదృష్టి యున్నది. నీవీను
లకు దూరశ్రవణశక్తి యున్నది. నీహృదయమున ధైర్యలక్ష్మి నృత్యము
సేయుచున్నది. వారెంద ఱున్నారో చూచి వచ్చెదవా?"

అట్లే యని వసంతుఁడు వింట నమ్ములు సంధించుకొని యా
యంధకారమున భూమిపైఁ బ్రాఁకుచు ముందునకుఁ బోయెను. ఆభటులు
పురద్వారముదాఁటి చాలదూరము బారులుగట్టి వచ్చుచుండిరి. వారిని
లెక్కింప ననువుపడలేదు. కాని, లెక్కలేకుండ నున్నారనిగ్రహించెను
ఇఁకఁ గొంచెమరిగి చూచుసరికి వసంతునకు మూఁడునాలుగుగజముల
దూరములో సిరువురుయోధు లగపడిరి. వారాతనిఁ జూచియుండలేదు.
వసంతుఁడు చాలఁ జురుకైనవాఁడు. తత్క్షణమె వింట నమ్ములు సంధించి
చప్పుడుగాకుండ ముందున్న యోధుని గుఱిచూచి కొట్టెను. ఆఘాటు
తో నాతఁడు క్రిందఁబడిపోయెను. అంతలో నచ్చటివీరులు కలవర
పడి కొన్నియలుగుల తివ్వటివ్వున విసరిరి. వసంతుఁ డాయెదుట లేఁడు.
ప్రక్కకుఁబోయి నేలనుండియే గబగబ ప్రాఁకిపోయి శత్రువృత్తాంత

మును, యోధునకుఁ దెలియఁజేసెను. యోధుఁడుప్పొంగి "వత్సా! నీవతిసూక్ష్మముగఁ గార్యమును జక్కఁబెట్టికొని వచ్చితివి. నాకు మహా సంతోషముగ నున్నది. అని హెచ్చరించెను."

వెంటనే మహాయోధుఁడు శాత్రవాగమమునుగూర్చి సేనల కన్నిటికిని ప్రచురము చేయించెను. సైనికులందఱును లేచి సంసిద్ధులై రాజాజ్ఞననుసరించి నిశ్శబ్దముగ నుండిరి. చంద్రగుప్తుఁడు తోడిరాజులోకముతో, వినోదమందిరము నెద్దఁ గాచికొని యుండెను. ఆవంకనే మహాయోధుఁడును వసంతుఁడును వారిసేనతో నిలిచియుండిరి. మహాయోధుఁడు తనసైనికులను వినోదమందిరపార్శ్వమునఁ జంద్రగుప్తరక్షక భటులతోఁ జేర్చియుంచెను. తోఁటలో నున్న సైనికులలోఁ గొందఱు చాణక్యుఁడును, మాళవరాజును, నిలిచియున్న చావడివైపునకు వచ్చి పాటలీపుత్రసేనలోఁ గలిసియుండిరి. ఈయేర్పాటు లన్నియును, కిక్కురుమనకుండఁగనే జరిగిపోయినవి. ఇంకను శత్రుసైనికులు వీరి పైఁ బడలేదు. దీనికిఁ గారణము చమువరులకుఁ దెలిసియేయున్నది. మార్గదర్శి యగుశత్రుయోధునొకని వసంతుఁడు తనవాఁడియలుగునకుఁ దొలికబళ్ళము చేసినసంగతి నిప్పుడె చదివియున్నారు. మరల వారిలో వేఱొకదండనాయకుని మార్గదర్శిగా నియమించుకొనుటకై యింత యాలస్యమైనది ఈలోపలనే చంద్రగుప్తసేన లన్నియును సంసిద్ధ మగుట కవకాశముకలిగినది వసంతుఁడు వారినిమొట్టమొదట చూడకయే యుండినచో నీసరికే సేనలోనిద్రించుచున్న వీరభటులలోఁ జాలమంది మఱి మేల్కనలేకయే పోయియుందురు.

శత్రుసైనికులు నిశ్శబ్దముగ బయలుదేఱిరి. శరవేగమున నందఱు నొకనిమిషములో, చావడికిని, వినోదమందిరమునకును, నడుమనున్న బయలఁ బ్రవేశించిరి. ఆబయలు లించుమించుగా నూఱుగజముల వెడలు పుండెను. చంద్రగుప్తసైనికులు నిద్రించుచుండి రని వారు తలంచి

యుండిరి. వారందఱును జంద్రగుప్తసైనికులవలెనే యుండిరి. కాని, చీకటిలో వారిదుస్తు లెవ్వరికిని దెలియ లేదు. చంద్రగుప్తుఁడు తనసేన దుస్తులు మార్పించుట వారికిఁ దెలియ లేదు.

అప్పుడే మూఁడుజాము లైనది దూరమునఁ బట్టణములో గొట్టఁబడినఘంటాధ్వను లెవ్వరును వినలేదు. నందునిసైనికు లొక్కసారిగ సీవలావలనున్న శత్రు సేనలపై శరవర్షమును గురియించిరి. తోడనే యిరువంకలనుండియు భానానల ముద్రేకించి నందసైనికుల దహించుచుండెను. ఆవంకనుండి వసంతుఁడును, మహాయోధుఁడును, శీలకోటరాజపుత్త్రులును, శత్రుసేనలలోఁ జొరఁబడి నిశితకరవాలముల వీరభటులఁ దుండెతుండెములుగ తెగనఱకుచుండిరి. ఈవంకనుండి చాణక్యప్రేరణమున మాళవకాంభోజరాజులు వీరవిహారము సేయుచుండిరి. ఆయంధకారమున నెవరికిఁగాక రగపడుట లేదు. నందసైనికులును సామాన్యులు గారు. చండప్రచండు లనుయోధపుంగవులు తమసేనలతో ముందునకుఁజొరఁబడి చంద్రగుప్తునిరక్షకసైన్యమును జెల్లాచెదరు చేయుచుండిరి. వారినిరువురిని వరుసగాఁ బుష్కరాక్షుండును, జంద్రగుప్తుఁడును, దాఁకి తమవాఁడికోలలచే నొప్పించుచుండిరి. ఆచీఁకటిలో హస్తలాఘవమేగాని లక్ష్యము నిలుచుట లేదు. కన్నులు మూసికొనిపోరాడుచున్నట్లుండెను. ఇరువాగులను మహాకోలాహలధ్వనులు బయలుదేఱెను. ఒకరికొకరు తీసిపోవక పోరాడుచుండిరి.

ఆసమయమునఁజాణక్యునియానతిచేశత్రుసమీపమునున్న చావడి తగులఁ బెట్టఁబడియెను. గుప్పుగుప్పునఁ బొగలును మంటలును బయలు దేఱెను. వెదుళ్లు పెళపెళ ప్రేలుచుండెను. తుట్టలు తుట్టలుగ మిణుగురు లెగిరి యొకయింటిపైనుండి మఱియొకయింటిపైఁ బడుచుండెను. ఆపేటలోనిప్రజ లదివఱకే తమతమగృహంబులను విడిచి పాఱిపోయియుండిరి. ఒక్కొక్కయిల్లు నఖండముగ మండిపోవుచుండెను. ఆయఖండ

జ్వాలలవలన విశేషమగు వెలుతురు కలిగెను. ఆవెలుతురువలన, నంద సైనికులు తాము రెండుపెద్దసేనలనడుమఁజిక్కికొని యుంటిమని తెలిసి కొనిరి. చంద్రగుప్తునిసేనలు శత్రుసేనావిన్యాసమును బాగుగ గుర్తించెను. ఇరువంకలవారును బైఁబడిరి. నందయోధులును వెనుదీయక తలపడి శత్రుసేనల కాశ్చర్యమును, భయమును, గలుగునట్లు పోరాడుచుండిరి. ఆయగ్నికీలలు క్రమక్రమముగా హెచ్చి పేటయంతయును చుట్టుముట్టుటచే వారి కప్పగు పట్టఁగలుగ నుండెను. వెనుకఁ జంద్రగుప్తుని ప్రక్కనున్న వీరులపై వెలుగానుటలేదు. నడుమనున్న నంద భటులు వెలుతురులోనుండిరి. వారిపై లక్ష్యముసేయుట సులువుగా నుండెను. వారును వీరావేశమున సాహసించి పోరుచుండిరి. ఆమహానలకీలలను మించి బాణానలము సేనాకాననమును దహించుచుండెను. ఇరువాగులందును భటులు గూలుచుండిరి. పరస్పరసంఘట్టనలచే యోధులొక్కసారిగ విరమరణము నొందుచుండిరి.

పుష్కరాక్షునిదాడికి నిలువలేక చండుఁడు సేనలతోవెనుదిరిగెను. గాంధారపతి వాని నడ్డగించి రణముచేయుచుండెను. చంద్రగుప్తుఁడు ప్రచండునితోఁ బ్రచండయుద్ధము సేయుచుండఁగా వసంతుఁడు రాజముగినకు వచ్చి ప్రచండునితల తనకరవాలమున కెరఁజేసెను. ఆతనిసేనలు చెల్లాచెదరైపోయినవి. ఆవంక కుండలదండధారులను మాళవకాంభోజులు తాఁకి శత్రుల నల్లకల్లోలములో ముంచుచుండిరి. నందసైనికులను లోనికి రానియకుండ మహాయోధగాంధారపతులు సేనాపార్శ్వమున నిలిచి పరాక్రమించుచుండిరి.

నందసైన్యము బలహీన మయ్యెను. వారి హృదయములయం దధైర్యము జనించెను. సేనలుక్రమముగా నిలుచుట లేదు. దండనాథుల యుత్సాహవాక్యములు పనిచేయుట లేదు. వీరభటులు చెదరిపోవు చుండిరి. వారికి జయముకలుగుననునాశ పోయినది. ప్రచండునిమరణము

వారికి భయమును గలిగించెను. అవకాశము చిక్కినంతవఱకు పాఱి పోవుచుండిరి. అంతమంది యోధులతో జాముసేపు నిలిచి పోరాడిన వారిపరాక్రమమును శ్లాఘింపవలసినదే కాని, పాపము! వారిపలాయన సమయమునకే తెల్లవాఱుట కెంతయు నవమానకరంబుగను, జింతా కరంబుగ, నుండెను.

పేటనుముట్టికొన్న దారుణాగ్ని జ్వాలలు చల్లారెను. కాని, యరుణ కిరణజ్వాలలతోఁ జంద్రగుప్తయోధులశరానలకీలలు శత్రుసులముట్టి కొనుచునే యుండెను. శత్రుసులవెన్నాడి తఱుముచునేయుండెను.

చాణక్యచంద్రగుప్తులయానతిచే సేనలన్నియును బట్టణప్రాకార మును, ముట్టడించినవి. ఆప్రాకారములు చుట్టును నక్కడక్కడ నివఱకే పడఁగొట్టఁబడి యున్నవి. లోపల నందసైనికు లర్ధచంద్రాకృతిగ నిలువఁ బడి యుండిరి. చాణక్యుఁడు మగధమాళవకాంభోజసేనానాయకులతోఁ బేట తిరిగి పోయి పట్టణమున కవ్వలిభాగమున నిలిచి యుండెను. పుర ప్రాకారమునకుఁ దూర్పుదిక్కున కాశ్మీరగాంధారపతులు తమసేన లతోఁ గాచియుండిరి. చంద్రగుప్తుఁ డితరదండనాయకులతోడను, సామంతులతోడను, బశ్చిమద్వారమున నుగ్రాకారుఁడయి నిలువఁబడి యుండెను. నందుఁడు రాక్షసునితో దక్షిణద్వారమున కెదురుగఁ బట్ట ణములోపల నర్ధచంద్రాకృతిగ నున్న సేనాగర్భమున నశ్వారూఢుఁడయి యుండెను. అట్టియాకారముతోడనేయింకనై దాఱుగురు యోధులందఱు రక్షకసైన్యముతోఁ దిరుగుచుండిరి. వారందఱును క్రొత్తవారికి నందుల వలెనే కానవచ్చుచుండిరి. ఈకారణముచే శత్రులెక్కడ నడ్డిన నక్కడనే నందుఁడు ప్రత్యక్షమగుచున్న ట్లుండెను. పాంచాలదేశయోధ పుంగవులకు సత్యమును గ్రహించుట కవకాశము లేకుండఁ బోవు చుండెను. అందఱుయోధులును నెవరిమట్టునకు వారే నందునితోఁ బోరాడ వలయు నని సన్నాహము చేసికొనుచుండిరి. చంద్రగుప్తప్రతి

జ్ఞావాక్యముల విని న నందుఁ డీతంత్రమును బన్ని యుండును. లేక బుద్ధి మంతుఁ డగునాతని మంత్రిరాక్షసుఁ డీయేర్పాటులను జేసి యుండును.

వసంతమహామోఘులు వేగవంతము లగుగుఱ్ఱముల నధిష్ఠించి సేనలతో దక్షిణద్వారమున నిరీక్షించుచుండిరి. వారికిని వారిగుఱ్ఱముల కును నభేద్యము లగుకవచము లుండెను. వైరోచనుఁడు తనయోఁచు పోఁజుతో నాద్వారమునకు రక్షకుఁడయి యుండెను. అప్పుడు శీలకోట రాజకుమారు లాతనిం జూచి మహామోఘునితో "అయ్యా! ఆతఁడు మీదుస్తులనుబోలిన వానిని ధరియించి యున్నాఁడు. చూచితిరా?" అని విన్నవించిరి.

మహామోఘుఁ డాతని క్రోధవేగముతోఁ జూచి "ఈకపట శీలుఁడు తనకుఁ దగినప్రతీకారమును బడయఁగలఁడు. ఒకనిమిష మోపిక పట్టి చూచుచుండుఁడు" అని హెచ్చరించెను.

"అయ్యా! ఈదుశ్శీలుని దండించుపని నాపైఁ బెట్టుఁడు." అని వసంతుఁడు కోరికొనియెను.

"వలదు. వలదు. నేనే యాతనికిఁ దగినశాస్తి చేయవలయును." అని మహామోఘుఁడు తనగుఱ్ఱమును ముందున కుడాయించెను.

దుర్గద్వారమున భటులందఱును బల్లెముల భారుచేసి యుండిరి. ముందున్న భటులు బల్లెములఁ దొడల నానుకొని మోకరించి యుండిరి. వెనుకవారు కచ్చడముల శానించుకొని వంగి యుండిరి. ఇంకను వెనుక నున్నవారు బల్లెముల బుజముల నానుకొని వెన్నులు వంచి నిలువఁ బడి యుండిరి. ఆబల్లెము లన్నియు విప్పఁబడినయేదుబందిముండ్లవలె భారుచేయఁబడి యుండెను. ఆసేన యాద్వారమున కినుపగోడవలె నున్నది.

మహాయోధుఁడు వారిని లక్ష్యముసేయలేదు. కత్తి త్రిప్పుకొనుచు గుఱ్ఱమును వెనుకకు నెట్టికొనిపోయి వేగముగ ముందున కాసేనామధ్యమున కొక్క దాఁటు దాఁటెను. వారందఱును భటులు. వారికిఁ గవచములు లేవు. వారిబల్లెములు యోధునికవచముపైఁ బనిచేయుట లేదు. ఆతనికత్తికి రెండుపైపులను వాఁడియున్నది. ఆతఁడొక్కఁడో నిలుచుట లేదు. ఈవిహారములో వైరోచనునిమస్తకము బంతివలెఁ బైకెగిరిపోయినది మొండెము క్రిందఁ బడిపోయెను. మహాయోధుఁడు మహాసముద్రమున విహరించు తిమింగిలమువలె నల్లాడుచుండెను. ఆతనికరవాలాఘాతముచే శత్రుభటులశిరంబులు తాళఫలంబులవలె నేలపైఁ బడిపోవుచుండెను. ఆసేనయంతయును చెల్లాచెదరైనది. వెనుకఁ దిరిగి చూచునప్పటి కశ్వారూఢుఁడయి పరాక్రమించుచున్న వసంతుఁడు తనప్రక్కనేయుండెను. అత్యాశ్చర్యము కలిగెను. వసంతునిచంద్రహాసమునుండి రక్తము స్రవించుచుండెను.

మహాయోధుఁడొన్నఁడునుదనంతటియోధుని జూచియుండలేదు. వసంతునిలాఘవమునకు సంతసించెను. "కుమారా! నీవిక్రమము లోకాతీతమైనది. దైవానుగ్రహమున నీకే విజయము లభింపఁగలదు." అని హెచ్చరించెను. సేనలు మఱలఁ గూడికొని వారిపైఁ బడుచుండెను. భీమపార్థులవలె వారిరువురును విజృంభించుచుండిరి. వారికొల్లల నిలువలేక సేనలు చెదరిపోవుచుండెను వారింకను ముందునకుఁ ద్రోసికొని పోవుచుండిరి. ఇంతలో శీలకోటరాజకుమారులును, మఱికొందఱు దండనాయకులును, యోధసైన్యముతో వచ్చి వారిని గలిసికొనిరి. వారి కెదురుగనే నందునిమొనయున్నది. ఒకవంకఁ జంద్రగుప్తుఁడును, నొకవంక కాశ్మీరగాంధారరాజులును, జేరి కలఁచుచుండుటచే శత్రుసేనాభ్యూహము, కల్లోలమునఁ బడిపోయెను.

నందుఁడు మూర్ఛఁ బొందించిన క్రౌర్యమువలె భయంకరాకారుఁడయి యెక్కడఁజూచినఁ దానేయగపడుచుఁ బ్రతాపముఁ జూపుచుండెను. శత్రురాజలోక మంతయు నందునితోడనే పోరాడుచుండెను. నందుఁడందఱి కన్నిరూపములుగ యుద్ధముచేయుటఁజూచి పాంచాలదేశ సేన చాల నాశ్చర్యపడిపోవుచుండెను. పాపము! నందునిమాయ నా రెఱుఁగరు.

గోవను లగు యోధవీరులును, దండనాయకులును. సామంత రాజకుమారులును, నిరంతరవసుమతీమనోహరాకారసందర్శనభాగ్యముం గోరి యిప్పుడు నందునితోఁ బోరఁదలంచుచుండిరి. పోరుచుండిరి. ఆతని ముందున్న మహావీరుల ప్రతాపశిఖల సహింప నోపక చంద్రగుప్తుని మఱుఁగునకుఁ దొలఁగిపోవుచుండిరి. కాని యాతఁడె పద్మనందుఁడని నిశ్చయింప నేరకుండిరి. తనతోఁ బోరుచున్న వాఁడు నాతఁడే. దూరమున నింకొకరితో యుద్ధముసేయుచున్న వాఁడు నాతఁడే. చంద్రగుప్తుఁడు దూరమునందున్న మలయకేతువుతో యుద్ధ మొనర్చుచుండెను. ఆకారణమున నాతఁ డానందుని దాఁకఁ బోలేదు. ఇతను లెవ్వరు నిజమైన నందుని దెలిసికొనలేకుండిరి.

వసంతుఁ డాతని భాగుగ నెఱుంగును. మహాయోధుఁడుకూడ భాగుగ నెఱిఁగినవానివలెనే యాతని వెంబడించుచుండెను. కాని, యాతనిమాత్రము తాఁకుటలేదు. వసంతుఁ డాతని నెదిరించి తాఁకుటకు సంసిద్ధుఁడయి యుండెను. ఆతనికి సహాయముగ మహాయోధుఁడును, శీలకోటరాజపుత్త్రులగువిక్రమసుందరసేనులును, వచ్చుచుండిరి. నందుఁడును, మంత్రిరాక్షసుఁడును, మఱికొందఱుయోధులు, నొకగుంపుగాఁ జేరి దారుణముగఁ బోరుచుండిరి. వారివెనుకనే వసంతుఁడును దక్కినవారును బోవుచుండిరి. వారు నిలిచినచో వీఁటిని నిలుచుచుండిరి.

ఆసమయమున వసంతుఁడు తనగుఱ్ఱమును ముందునకు దాఁటించి నందునిం దాఁకెను. నందుఁడు తనచేతిలో నొకబలమైన గదను ధరించి యుండెను. తనపుత్త్రుల నాశనమునకుఁ గారకుఁడయిననసంతుని జూచిన తోడనే యాతనికిఁ బట్టరానికోపము వచ్చెను. గదయెత్తి వసంతునిపై నొక్కవిసరువిసరెను. ఆదెబ్బ తగిలినచో నసంతునిదేహ మింతింతతుని యలు కావలసినదే. కాని, వసంతుఁ డతిలాఘవమునఁ దప్పించుకొని యాతనిభుజముపైఁ దనచంద్రహాసముతో నొక్కనఱకు నఱకెను. ఆదెబ్బవలనఁ గవచమునూడఁ దెగి గాయమయ్యెను. దానిపైఁదోక త్రోక్కినభుజంగమువలె మండిపడుచు మరల గదయెత్తి విసరెను. వసంతుఁడు తప్పించుకొని మరలఁ గత్తితో నఱకెను. వసంతునియొక్కొక్కవేటునకును నందున కొకొక్కగాయ మగుచుండెను. నందుని గదాఘాతములకు వసంతుఁడు దొరకుటలేదు. మంత్రిరాక్షసునితో మహాయోధుఁడు పోరాడుచుండెను. తక్కినయోధులతో విక్రమసుందరసేనులు పోరాడుచుండిరి

నందుఁడును మంత్రిరాక్షసుఁడును తమగుంపులోఁ దప్పించుకొని పోవలయునని చూచుచుండిరి. పుత్త్రఘాతకుఁ డగుచాణక్యు నెట్లయినఁ బరిమార్పవలయు ననినందుఁడు కోపవేగమున ఘూర్ణిల్లుచుండెను. రాక్షసుఁడు తంత్రమాలోచించుచుండెను. వసంతుఁడును, మహాయోధుఁడును, వారిని విడిచిపెట్టుట యెట్లు? వారు పోవుచోటికెల్లఁ బోయి వసంతుఁడు నందుని తాఁకుచుండెను. నలుదెసలనుండియును జంద్రగుప్తుని సైనికులుచుట్టు ముట్టియుండిరి. వారు నాశనముచేసిన శత్రుభటుల పీనుఁగులను ద్రొక్కుకొనుచు ముందునకు నచ్చుచుండిరి.

నందునకు నిరాశ కలిగెను. పాతిపోవలయునని తలంచెను. కాని, యంతటను శత్రుసేనాసముద్రమే ఘోషించుచుండెను. అతని కేమియును దోఁచలేదు. ఎదుట వసంతుఁడు మృత్యుదేవతనలె నగపడుచుండెను.

చావునకుఁ దెగించి పోరాడఁ దలంచెను. మంత్రి రాక్షసునిం జూచి "అమాత్యా! నాకిఁక జీవితాశ లేదు తప్పించుకొని పోవుట కవకాశము లేదు. నేనీవసంతునితోఁ బోరాడెదను చచ్చుటయో, చచ్చుటయో, తుద కేమగునో తెలియదు. అవకాశమున్న నివెటకేని పోయి శత్రు సంహారమును గావించుటఁ గాలోచింపుము" అనియెను.

రాక్షసుఁడు "మహారాజా! మిమ్ము విడిచి నేనెందుఁ బోఁగలను?" అనియెను.

"పోవలయును. కాలము తప్పినది పోనలయును. శత్రుసంహారము కావలయును." అని పద్మనందుఁడేమో స్మృతికిఁదెచ్చుకొనువాని వలె మహాయోధునివంకఁ జూచుచుండెను.

రాక్షసుఁ డేమియును మాటాడలేదు. ఆతని ముఖకాంతి యెడలినది.

అప్పుడు వసంతుఁడు "ఓనందుఁడా! నిన్ను రక్షించువారెవ్వరైన నున్నచోఁ బిలిచికొనుము. నిపై నిరపరాధులశిక్షించుట యనాథయువతుల నవమానించుట, యనునేరముల మోపి నిన్ను శిక్షించుమన్నాఁడను. నికు మరణదండనము విధింపఁబడినది. కాని, నివలె బలవంతముగ నరికట్టి రహస్యముగఁ జంపఁ దలంపు లేదు. స్వేచ్ఛగా రణరంగమున నిందఱియెదుట నీతోఁ బోరాడి పగ తీర్చుకొనియెదను. నిన్ను శిక్షించెదను. పిలువుము. నీదిక్కుగలవారిని బిలిచికొనుము" అనిధిక్కరించెను.

గాయములు పడియున్న నందునిహృదయమున కాపలుకులు హాలాహలసదృశములయి యుండెను. కోపోద్రేకమున నొడలెఱుంగక వసంతునిపై గదనెత్తి బలవంతముగ విసరెను. ఆచెబ్బ తప్పించుకొనఁ జూచుచున్న వసంతునివెన్ననఁ దగిలెను. అది జారిపోయెను. అయినను, గవచము పగిలిపోయెను. వసంతుఁడివఱకు దెబ్బతినలేదు. ఆతని

కన్నుల నిప్పులు గురియుచుండెను. అతివేగమున గుఱ్ఱమును దాటించుచుఁ దననిశితఖడ్గముతో నందునిశరీరమున గాయములపై గాయములు సేయుచుండెను. ఆతనియొడలినిండ రక్తము ప్రవహించుచుండెను. వసంతునిలాఘవమువలన నందునికరమునందున్నగద కేవల మలంకార మాత్రముగ నుండెను. ఆతని కాయాస మధిక మయ్యెను. వసంతుని ఖడ్గప్రహారణములచే నందునికవచము తుత్తునియ లగుచుండెను. బలమైనకోపము తెచ్చుకొని వసంతునిపై గదతో విసరెను. ఆదెబ్బవసంతుని గుఱ్ఱముతలపైఁ దగిలెను. దానితో గుఱ్ఱము పడిపోలేదు. నందునిపై కొక్కదాటు దాఁటెను. వసంతుఁడు కత్తినెత్తి నందునితల నెగుర వేయుటకు సిద్ధముగ నుండెను.

ఆసమయమున "రహస్యభేది యగునాకపటశీలుని చంపుఁడు. పాడుపుఁడు" అనునొకధ్వని వినఁబడెను. ఆకంఠధ్వని మంత్రిరాక్షసుని దని వసంతుఁడు తెలిసికొనియెను.

తోడనే "హా! వసంతా! రక్షింపుము! రక్షింపుము!" అనునొక యార్తనాదము వినఁబడియెను. వసంతుఁడు వెనుదిరిగి చూచినప్పటికి హరిదాసుని నొకయోధుఁడు పట్టుకొని నఱుకఁబోవుచుండెను.

వసంతుఁడు "రాజా! కొంచెముసేపు తాళుము. ఆదీనుని రక్షించి మరల వచ్చెదను." అనియెను.

నందుఁడు "నే నీకోస మాఁగియుండువాఁడను గాను. రమ్ము. రమ్ము" అని నందుఁడు పిలిచెను.

"నీవాఁగనక్కఅ లేదు. నాకత్తి నియనుజ్ఞఁ గోరుచున్నది" అని మహాయోధుఁడనెను.

వసంతుఁడీమాటలువినిపించుకొనకయే యార్తనాదము దిక్కుగా గుఱ్ఱము నుడాయించెను. దయాళుఁడగునాతని కాయార్తనాద మాకర్షణమంత్ర మయ్యెను. ఒక్కనిమిషములో నందుఁడు తన

చేతిలోఁ బడిపోవును. ఆకారణమునఁ దనజీవితేశ్వరి తనకు లభింపఁ గలదు. స్వార్థము నప్పు డాతఁడు తలంచుకొనలేదు. శరవేగమునగమ్య స్థానము చేరెను

అట సిద్ధార్థుఁడుకత్తినెత్తి హరిదాసుని జంపుటకు సిద్ధముగ నుండెను. ఆయెత్తినకత్తితో నక్లె యాతనిచేయి క్రిందఁ బడఁగొట్టెను. అదిక్రిందఁబఱుసరికి దానిపై నాతనిశిరస్సును బడిపోయెను. మరల వెనుకకుఁ జూచెను ఇప్పుడు నందునియెదుట మహోద్యోధుఁడు నిలిచి యుండెను.

"అయ్యా! నీకిఁక భయము లేదు. నాకు రణమునకు సెలవొసం గెదవా?" అని వసంతుఁడు హరిదాసునితోఁ బల్కెను.

"ఇది శత్రుసేనామధ్యము. శత్రుప్రభు నేనెంటరిగఁ బోయినచో నీకు నాప్రాణములునిలువనిచ్చెదరా? నన్ను సురక్షితముగు తావు నకుఁ గొనిపోయి మటివిడిచిరమ్ము. ఈమాత్రముపుణ్యముగట్టికొనుము" అని హరిదాసుఁడు ప్రార్థించెను.

వసంతుఁ డట్లే యాతని వెంటఁబెట్టుకొని పోయెను,

కొలఁదిసేపటిలో మహారణము చల్లారినది. రాక్షసాదివీరులు కొందఱు పాఱిపోయిరి. హతశేషు లగువీరులు కొందఱు చంద్రగుప్తు నకు లోఁబడి పోయిరి. చంద్రగుప్తసార్వభౌమునివిజయధ్వజము కోట బురుజుపై నెత్తఁబడియుండెను. చంద్రగుప్తుఁడు సపరివారముగ నిరా ఘాటముగఁ గోటలోఁ బ్రవేశించెను.

ఇరువదిరెండవప్రకరణము.

చంద్రగుప్తుఁడును, వసంతుఁడును, సహాధ్యాయులు. సమవయస్కులు. బలపరాక్రమములయందు సమానులు. జ్ఞాతులు. అయినను వీరియదృష్టమునకును, మనోదార్ఢ్యమునకును, భేదమున్నది చంద్రగుప్తునియదృష్టము నిరాఘాటమైనది. ఆతనిమనస్సు నిశ్చలమైనది. వసంతునియదృష్టమునకు విఘాతము లున్నవి. ఆతనిగ్రహములు చాల వక్రభావమును వహించినవి. ఆతనిహృదయము సుకుమార మైనది. ఆతఁడు ఋజువర్తనుఁడే కాని, దయాళుఁ డగుటచే స్వార్థత్యాగియై దురదృష్టము నాశ్రయించుచుండును. ఆతని కొకగడియలో వసుమతీసందర్శనమహానందము నిరర్థక మైపోయినది. ఒక్కక్షణములో నిరంతర వసుమతీసంయోగసౌభాగ్యము వస్తుయినది. ఐహికజీవితము దుర్భరమై పోయినది. వసుమతీపాణిగ్రహణమహోత్సవము ననుభవించునదృష్ట మాతని కిఁక నెక్కడిది? ప్రతికూలదైవ మాతనిహృదయమునకు దాక్షిణ్యభావ మనుదురదృష్టచ్ఛాయను గల్పించెను. దాక్షిణ్య ముత్తమోత్తమ మైనదే యైనను, నాతనికి వ్యతిరేకఫల మిచ్చుచున్నది. అయిన నేమి? జీవితసంశయమునం బడియున్న ప్రాణేశ్వరివృత్తాంతముం దెలిపి రక్షించినపుణ్యాత్ముఁడు, ప్రభువగుచంద్రగుప్తునివిజయముం గోరి శత్రురహస్యముల నెఱింగించినపరోపకారపరాయణుఁడు, నగుహరిదాసుని మృత్యుముఖమునుండి వెడలించుటకంటె నట్టిమహాపురుషునకుఁ గావలసిన దేమున్నది? అంతకంటె నుత్తమధర్మ మేమున్నది? ఆపురుషోత్తముని భూతదయాపరత్వమే యాతనిరక్షించుఁ గాక! కృతజ్ఞతాబుద్ధియే యాతనికి మేలు సేయుఁగాక! ఆతనిధర్మమే యాతనిఁ గాపాడుఁగాక!

పద్మనందునివధించిన మహాపీరశిఖామణి యెవ్వరో తెలిసి కొనుటకు నేఁడు సభగావింపఁబడినది. నందుని మేమువధించితి మని కొందఱు పాంచాల యోధులు లేచి మనవిచేసిరి. వీరందఱును గలిసి నందునిఁ జంపిరా? లేదు. వేఱువేఱుగనే సంహరించినట్లు వారొక్కొక్కరు చెప్పిరి. ఒక్కనందుని నింపతెట్లుచంపిరి? దీనిపరమార్థము వేఱుగనున్నది. వీరు పాంచాలు రగుటచే నందుని నెఱుఁగరు. నందభూమికం దాల్చి రణముచేయుచున్న యోధులను వీరు వధించిరి. ఎవరిమట్టునకు వారే నందుని చంపితిమని సంతసించుచున్నారు. వారు చూపిన యుత్తమాంగములలో నొక్కటియును నందశిరముగా నుండలేదు.

ఇఁక నందునిశిరఃకర్తనము చేసిన వారెవ్వరో తెలియలేదు. ఆతఁడు పాతిపోయియుండు నని యనుమానము కలిగెను ఈవిషయమును దెలిసికొనుటకు దివ్యజ్ఞానమహితుండగు రాజయోగానందస్వామికూడ లేఁడు. నాఁడు తక్షశిలానగరమున విచారణము జరిగినది మొదలు నేటివఱకు కామహామహుని దర్శనము లేదు. ఆలోచన చెప్పుటకట చాణక్యుఁడుకూడ లేఁడు. తనప్రతిజ్ఞ యేమికావలసి వచ్చునో యని చంద్రగుప్తుఁడు డాలోచించుచుండెను.

ఇంతలో చాణక్యుఁడును మహాయోధుఁడును సభాస్థలంబునకు విచ్చేసిరి. ఒకబల్లెమునకు గ్రుచ్చఁబడినశిరస్సుఁ బట్టుకొని యొకభటుఁడు కూడ వారివెనుకనే వచ్చెను.

చంద్రగుప్తుఁడు చాణక్యునకు నమస్కరించి "మహాత్మా! అది యేమి?" అని ప్రశ్నించెను.

"అదియే పాపపుఁదలంపులకుఁ బుట్టినిల్లైనపద్మనందుని దుర్మేధానిధానము" అనిచాణక్యుఁడు బదులుచెప్పెను.

"ఇది యెట్లు వచ్చినది?"

" ఈమహాయోధుఁడు దీనిని గంగానదిలోఁ ద్రోయఁబోవు చుండఁగా వారించికొని తెచ్చితిని."

చంద్రగుప్తుడు మహాయోధునివంకఁజూచి "నందశిరఃఖండన మహాకార్యము మీవలననే దీరినదా?" అనియడిగెను.

"కేవలశిరఃఖండనమాత్రము"

"అది యేమి?"

"మహావీరశిఖామణి యగువసంతుని దారుణకఠినవాల మదివఱకే యాతనిప్రాణములఁ గన్నులలోనికిఁ దెచ్చినది. తరువాతపనిని ముగించు టకు నాచంద్రహాసము నిమిత్తమాత్ర మైనది."

"రాజకార్యము లన్నియు నెఱిఁగియున్న మీ రాతల నేలగంగ లోఁ ద్రోయఁ బూనితిరి?"

"అవసానసమయమునఁ బద్మనందుఁడు నన్నుఁ గోరుటచేత—"

"ఆతనియభీష్టముఁ దీర్చుటకు మీరంగీకరించితిరా?"

"అంగీకరించునంతవఱ కవకాశ మెక్కడిది? ఆతఁడింకను మాట లాడుచుండఁగనే తల తెగనఱికితిని"

"ఆతఁ డల్లేలకోరెనో మీరు గ్రహించితిరా?"

"మీప్రతిజ్ఞాభంగమును, వసంతుని కాశాభంగమును, గావించు టకే కానచ్చును. నాకాతఁడు గర్భశత్రుఁడైనను నవసానసమయమునఁ గోరినకోరిక తీర్చుట ధర్మ మని యోచించితిని"

"పాంచాలదేశవాసులగుమీ కాతఁడు గర్భశత్రుఁ డెట్లయ్యెను?"

"ఆగొడవ యంతయు చాలఁగనున్నది."

"అది యేమో చెప్పఁగూడదా?"

"ఈసంతోషసమయమున విచారపూరిత మగనావిచిత్రచరిత్ర మునుగూర్చి తడవవలదు" అనిమహాయోధుఁడు నిట్టూర్పు విడిచెను.

అప్పుడు చాణక్యుఁడు "అయ్యా! ప్రభాకరునిఁ బరివేష్టించి యున్నగ్రహంబులకుఁ బ్రకాశమువలెఁ జంద్రగుప్తు నాశ్రయించిన యోధులకుఁగూడనదృష్టము పట్టవలసినదే. ఈశుభసమయమున నెల్లవారి విచారములును దీరిపోవలసినదే" అనియెను.

"బొగ్గునకు నలుపువలె నాజీవితమునకు విచారము స్వభావమై పోయినది. అయిననేమి? నాకోరికలు తీరినవి. అంభీరపద్మనందులమారణ కర్మము నాకంఠమున జీవము లుండఁగా జరిగినది. అంతియేచాలును" అనిమహాయోధుఁడు బదులు చెప్పెను.

"పాంచాలు రగు మీ కంభీరునివలన నపకారమైనఁ గావచ్చుంగాని మగధరాజగునందునిపై మీకంతదీర్ఘక్రోధమునకుఁ గారణమేమి?"

"నేను పాంచాలుఁడను గాను. మగధరాజునకు లోఁబడిన యొక రాజ్యమునకు సేనానాయకుఁడను. నందుఁడు మాళవమును జయించిన వెనుక మారాజ్యమును బలవంతముగ లోఁబఱచుకొనియెను"

"మీరు పాంచాలమున కెందులకుఁ బోతిరి?"

"నందునిచేనవమానింపఁబడిన నేను రహస్యముగమాళవరాజుతోఁ గలసి మరల యుద్ధప్రయత్నములు చేయ మొదలుపెట్టితిని. సైన్యమును గూర్చికొన నారంభించితిని. ఆకార్యము లింకను ముగియకుండఁగనే మర్మజ్ఞుఁ డగునందుఁడు నన్నిదేశమునుండి వెడలింప నిశ్చయించుకొనియెను."

"ఏమిచేసెను?"

"కపటహృదయుఁ డగునందుఁడు నన్ను తక్షశిలానగరనాయకుని కడకు రాయబారిగఁ బంపవలయు నని మారాజున కుత్తరువు చేసెను."

"అయ్యా! నీవు రాధాకృష్ణవర్మవా? ఈపదియేండ్లలో నెంతగా మాఱిపోతివి!" అని చాణక్యుఁడు ప్రశ్నించెను.

మహాయోధుఁడు మాటాడలేదు. అప్పుడు చంద్రగుప్తుఁడు "గురువర్యా! రాధాకృష్ణవర్మపేరు నాచిన్నతనమున వినియున్నాను. ఆతఁడొక మహాకవి. ఆతఁడు రచియించినగ్రంథములును, గృతులును, జాలవఱకు నేను వినియున్నాను. ఆతఁడె యీతఁడా?" అనియెను.

"వత్సా! ఔను. ఈతఁడు సంగీతసాహిత్యములయం దఖండ ప్రజ్ఞావంతుఁడు. సింహవిక్రముఁ డగునీతఁడు రణరంగమున విజృంభించు చున్నప్పుడు భీమసేనుఁడు తలంపునకు వచ్చుచుండును. ఈవీరశిఖామణి లేకుండుటవలననే రత్నగిరిరాజ్యమున కిట్టిగతి పట్టినది. ఈతఁడు వసుమతి తండ్రి యగు మానపాలునకు సమీపబంధువు. ఈతని వియోగమును సహింపకయే మానపాలుఁడు మరణించెను." అని చాణక్యుఁడు చెప్పెను.

చంద్రగుప్తుఁడు మహాయోధునిఁ గూర్చి "అయ్యా! తదువాత మీరు తక్షశిలకుఁ బోయి యేమి చేసితిరి?" అని యడిగెను.

"నిజముగా నందుఁడు నన్నచటికి రాయబారిగాఁ బంపలేదు. బలిపశువుగాఁ బంపెను."

"అదియేమి?"

"నావలన ముందుముందు తనరాజ్యమునకు భంగము గలుగఁ బోవుననుభయముచే రాయబారమనుమిషపెట్టి నన్నచటికి బంపుచు నంతకుముందే బలవంతముగ నన్ను వధింపు మని యంభీరునకు లేఖా మూలముగఁ దెలియపఱచెను."

"అంభీరుఁ డట్టిదుష్కార్యమున కంగీకరించెనా?"

సమానులకుఁ గాక మైత్రి యెట్లు పొసంగును? పద్మనందుఁ డెంతపాపాత్ముఁడో యంభీరుఁ డంతదుర్మార్గుఁడు. ఇరువురు నావిషయమున నొకరికొకరు తీసిపోరు.

" ఆయపాయమును మీరెట్లు తప్పించుకొంటిరి?"

"నేను మాటలాడుచున్నప్పుడే యాతనిదుశ్చేష్ట లన్నియును గనిపెట్టి తీవ్రక్రోధమున లేచి నిలువఁబడితిని. చుట్టును గొందఱుభటు లాయుధహస్తులయి నిలిచియుండి రాజాజ్ఞను వేచియుండిరి. నేను లేచిన వాఁడనే నన్నుఁ బట్టికొనుటకై వచ్చిరి. నేను మరణమునకుఁ దెగించి వారిపైఁ బడితిని. అప్పుడు నాచంద్రహాసమునకుఁ గొందఱుభటులు బలియైరి. అంభీరుఁ డంతఃపురమునకుఁ బాఱిపోయెను. అప్పటి నాతీక్ష్ణా కారమును జూచి యెవ్వరును నన్నడ్డుకొనువారు లేకపోయిరి. ఆసమయ మున నేనా యపాయమునుండి తప్పించుకొని తపోవనమునకుఁ బోయి యందుండి యంభీరుని జంపువఱకుఁ బొంచాలము విడువననియును, పద్మనందునిమరణానంతరమునఁగాని నఖలోమచ్ఛేదముఁ గావించుకొన ననియును, నాలో నేనే ప్రతిన చేసి కొంటిని. అప్పటిగ్రీకుకలహాముల వలనఁ గొందఱు యోధులు నాతోవచ్చి కలిసికొనిరి."

"ఇంతమంది యోధులు మీతోఁ గలియుటకు రాజయోగానంద స్వామి మీకుఁ జాలనఱకు సాయపడి యుండును. ప్రాపంచకవిషయ ముల నుజ్జగించినపరమహంస యగునానుహత్తున కీగొడవ లన్నియు నెందులకో? నాకు వింతగానున్నది ఉపాధ్యాయచాణక్యుని వాత్సల్య మునకుఁ బోడాదయామయునిసాహాయ్యముకూడ నలవడుటచేతనే మా కిట్టిభాగ్యము లభించినది."

"అట్లు కాదు. నియదృష్టమున కాతఁడు నిమిత్తమాత్రుఁడు. అంతేకాని యాతఁడు చేసిన దేమున్నది? నీయదృష్టమే నిన్నింతటివానిగఁ జేసినది"

" అట్లనరాదు. ఇదంతయు నాపుణ్యపురుషుని యాశీర్వచన ప్రభావమే. ఆమహనీయుఁ డెల్లప్పుడును దర్శన మిచ్చుచు నివిజయో త్సాహమున నేల సాహాత్కరింపకుండెనో తెలియరాకున్నది"

"ఇక నికాతనిదర్శనము కాదు. ప్రత్యక్షముగ నాతని నీవు చూడఁజాలవు"

"ఏమి?"

"ఆపరమహంస నాతో నైక్యమై పోయెను"

సభ్యు లెల్లరును మహాశ్చర్యమున మునిఁగిపోయిరి. చంద్రగుప్తుఁడు దిగ్గున లేచి మహాయోధుని గౌఁగిలించుకొని "మహాత్మా! నా యనుమానము స్థిరపడినది. రాజయోగానందస్వామికిని మీకును తావళములు, దండము, కావిచేలములు, కమండలుస్సు, వీనివలననే భేద మగపడుచుండెడిది గాని యాకారమున నేకీభావమే పొడకట్టుచుండెడిది. తేజోమూర్తియగు రాజయోగానందస్వామి యందలి భయభక్తులచే నా సంశయమునుగూర్చి యడుగ లేకపోవుచుండెడివాఁడను. అయ్యా! ఆ మహాత్ముఁడు మీయపరాకృతియే గాదా?" అని ప్రశ్నించెను.

మహాయోధుఁ డేమియును బదులుచెప్పక యూరకుండెను. సభాస్తారు లగుయోధులును, చాణక్యుఁడును, మహానందమున నా మహాయోధుని వేవిధముల సన్మానించిరి. రాజయోగానందస్వామియే మహాయోధుఁ డనియు, మహాయోధుఁడే రాధాకృష్ణనగ్న యనియు నందఱికిని దెలిసిపోయినది.

"అయ్యా! యోగమహిమయు, దివ్యదృష్టియు మీకెల్లు లభించినవి" అని మహాయోధునిగూర్చి చంద్రగుప్తుఁడు మరలఁ బ్రశ్నించెను

"గ్రీకులకల్లోలమునం బడినప్రజ లసేకులు నన్నాశ్రయించిరి. నేను యోధుఁడ నైనప్పుడు వారు భటులై గ్రీకుకోశములఁగొల్లగొట్టుట యందును, గ్రీకుపక్షసైనికుల రహస్యముగ వధించుటయందును, వారు తోడుపడుచుండిరి. ఆద్రవ్యముతో మేమొక శైలదుర్గమును నిర్మించుకొని యందుండిమి. నేను యోగినైనప్పుడా భటులే శిష్యు లగు

చుండిరి. వారిమూలమునసే నాకెల్లవృత్తాంతములును దెలియవచ్చు చుండెడివి. నిరంతరమునాకన్నులు మగధపాంచాలములవంకనే చూచు చుండెను. మగధరాజ్యమునందలిసమాచారము లన్నియు నాకెప్పటి కప్పుడు వారివలననే తెలియుచుండెడివి. మీరు తప్పించుకొని వచ్చు టయు, గుప్తసుర్గమును నిర్మించుకొనందలంచుటయు, నాకు వారివలననే తెలిసినది. ఆచారచక్షుస్సులమూలమున నేనన్నియును దెలిసికొని పని చేయుచుంటిని. వసంతుఁడును నీవు నందుఁ జేసినపనులను విని సంతసించి మీవలన నాకార్యములు సఫలములు కాఁగల వని నాసైన్యమును నీ సేనలతోఁ గలిపితిని. నేను నిన్నుఁ జేరితిని తక్షశిలానగరమునందలివసు మతివృత్తాంతమును హరిదాసునివలనఁ దెలిసికొనివచ్చినవారు నాశిష్యులే. మొట్టమొదట ననుమానముగ గ్రహించినవారును నాశిష్యులే"

"అయ్యా! ఆహరిదాసుఁడు కూడ మీశిష్యుఁడేనా"

" కాదు ఆతఁడు కొంతకాలముక్రిందట మాయాశ్రమమునకు వచ్చినాఁడు. ఆతఁడు నాచే రచియింపఁబడినగీతములు పాడుచుండుటచే నాకుఁ బూర్వస్మృతి కలిగి నాహృదయము చలించుచుండుటవలన నా కార్యముల కభ్యంతరము కలుగుననుభయముచే నాతని మూఁడవ నాఁడే యటనుండి పంపివేసితిని. ఆతఁ డీదేశపువాఁడే కావచ్చును. లేని యెడల నేను రచియించినగీతముల నెట్లు గానముచేయఁగలఁడు? తరు వాత నాతనిచర్యలనుబట్టి యుపాధ్యాయచాణక్యుని గూఢచారుఁడయి యుండు నని యూహించితిని."

ఆమాటలు విని చంద్రగుప్తుఁడు చాణక్యునివంకఁ జూచెను. చాణక్యుఁడు "నాగూఢచారులలో హరిదాసు లెవ్వరును లేరు. ఆతఁ డెవ్వఁడై యుండునో యింకను తెలియలేదు" అనియెను.

"మొన్నగంగానదితీరమున నందయోధులు రహస్యముగ వచ్చి నప్పుడుగూడ నొకపాట వినఁబడినది. ఆపాటయందారహస్య ముద్బోధ మైనది. అంతట నందయోధులు పట్టుకొనఁబోనుసరికి 'వారు పాటిపోయిరి. దీనినిబట్టి చూడఁగా నాతఁడు మనయభ్యుదయమును గాంక్షించుచు మనతోడనే వచ్చుచున్నట్లు తోఁచుచున్నది. నిన్నటిదినమున శత్రు రహస్యమును వసంతునకుఁ దెలిపినవాఁడు నాతఁడేయఁట! ఆమహాను భావుఁ డెవ్వఁడో మనకు బోధపడినది కాదు" అని చంద్రగుప్తుఁడు పలికెను.

"ఆహరిదాసుఁడుకూడ నిరాధాకృష్ణవర్మవంటివాఁడే కావచ్చు ను" అని చాణక్యుఁడు బదులుచెప్పెను

"మహాత్మా! ఐహికసుఖంబుల నుజ్జగించి విజితేంద్రియుండవై చరించుచును నకారణవాత్సల్యంబున మాకింతటిమహోపకారముం జేసినమీకుఁ బ్రత్యుపకార మేమి చేయఁగలము?" అని చంద్రగుప్తుఁడు మహాయోధుని సంభావించెను. మహాయోధుని మన మింతటినుండి రాధాకృష్ణవర్మ యనియే పిలిచికొందుము.

"నీసహాయమున నాకోరికలు తీరినవి. నేను కోరఁదగిన దేమి యును లేదు. నీపట్టాభిషేకమహోత్సవమును, వసుమతీవసంతుల కళ్యా ణమును గన్నారఁ గాంచి మరల మునివ్రత మవలంబించి నాశేషకాల మును గడపి వైచెదను" అనిరాధాకృష్ణవర్మ బదులుచెప్పెను.

"నందశిరశ్ఛేదకుఁడు వసుమతీపాణి గ్రహమున కర్హుఁడయి యుండఁగా వసుమతీవసంతులకళ్యాణమును మీరెట్లు చూడఁగలరు?"

"వసంతుఁడు నందుని జయింపలేదా?"

"వధించుట మీవలన నైనదికాదా?"

"నావలన నైన దేమియును లేదు. ప్రాయోపవిష్టుఁడయి పడి యున్న ద్రోణునితలను ధృష్టద్యుమ్నుఁడువలెవసంతకృపాణాఘాతములచే నుసురు చెదరియున్ననందునితల నేరు నటికితిని. ఈజయము తప్పకవసం తునిదే కాని నాది కాదు."

"అయ్యా! అట్లు కాదు మీకింకను వయసు చెల్ల లేదు. ప్రతాప విజిత యగువసుమతిలో రత్నగిరిరాజ్యమును గాని, పాంచాలరాజ్య ప్రాతినిధ్యమును గాని చేకొని మమ్మానందింపఁ జేయుఁడు!"

"అయ్యో! అట్లనకుఁడు! నాకీలోకమున ననుభవింపఁదగినది లేదు. నాకు లభించినభాగ్యమునే యనుభవించు నదృష్టము పట్టినది కాదు నాయద్ధశరీరము భస్మమైపోయినది. నేనర సచ్చియున్నాఁడను. నాజీవితమువలనఁ బ్రయోజనము లేక పోయినను, నాహృదయమునందలి క్రోధ మింతవఱకు నన్నుఁ బనిచేయించినది ఇప్పు డదియును నన్ను విడిచిపోయినది. నాకిఁక శాంతరసాశ్రయం బగుమునివ్రతమే శరణ్యము. నాకుమరలఁ బూర్వస్మృతిఁగలిగించి నాహృదయమునుగలఁగింపవలదు."

"మహాత్మా! మీకిదివఱకుఁ బరిణయ మైనదా?"

"నేను మానపాలునకు సమీపజ్ఞాతి కుటుంబములోనివాఁడను. ఆతనిమేనగోడలగు సుందరిని నాకిచ్చి పరిణయము చేసి నన్నేయాతఁడు కుమారునిగఁ జూచికొనుచుండెడివాఁడు. ఆతఁడురాజ్యభార మంతయును నామీఁదనే విడిచిపెట్టెను. నందహతకునిమూలమున నాకుఁబ్రియా వియోగము తటస్థింప నున్నప్పటికి నాప్రాణేశ్వరి పసునాఱేండ్లది. అప్ప టికి వసుమతి యైదేండ్లబాలిక. ఆతల్లిలేనిబిడ్డను మేమే పెంచుచుంటిమి. వియోగసమయమున నాబిడ్డను నాజీవితేశ్వరియగు సుందరి కొప్ప గించి కొంతధైర్యము చెప్పి నేను వెడలిపోతిని. తరువాతినాయవస్థను మీరిదివఱకు వినియుంటిరి గదా! ఆప్పటిదీర్ఘక్రోధమువలన నేను

మరల వెనుదిరిగి చూడలేదు. చిన్న బిడ్డ యగువసుమతిని త్తికొనిబాష్ప పూరితనయనములతో దలవంచికొని నిట్టూర్పు విడుచుచు నాకేళి మందిరమున నానాఁటిరాత్రి మఱుమాట చెప్పలేక నిలువఁబడిపోయిన నాప్రాణేశ్వరి మనోహరాకార మొకనాఁటిరాత్రిమాత్రము శైలారణ్య మున నాస్మృతిపటంబునఁ దోఁచినది. అంతకంటె నెప్పుడును కరిన హృదయుఁడ నగునాకు నాప్రేయసి తలంపునకైన రాలేదు ఇఁక నిలోక మున నాప్రాణమును జూచుభాగ్యము నాకు లేదుగదా! నాజీవితము నిరర్థకమై పోయినది. నేనిలోకమున నెందులకును బనికిరానివాఁడనై పోతిని." అనియూధీగోదాత్తుఁ డంతర్బాష్పనయనుఁడై తలవంచి కొనియెను.

సభ్యులహృదయము లన్నియును గరుణారసపూరితము లయ్యెను. వాఁడేమియును మాటలాడలేక యూరక చూచుచుండిరి.

అప్పుడుచాణక్యుఁడు "రాధాకృష్ణనర్మా! వసంతునకు నందశిర శ్ఛేదన మవశ్యకర్తవ్యమైనను జేఁజిక్కినసంధిని విడిచి యాతఁడా సమయమున నెటకుఁ బోయెనో? నీకుఁ దెలిసినదా?" అని ప్రశ్నించెను.

"ఆతఁడు మరణాపాయమునఁ బడిపోవనున్న హరిదాసుని రక్షింపఁ బోయెను" అని రాధాకృష్ణవర్మ చెప్పెను.

"ఆహా! వసంతుఁ డెంతకరుణాళుఁడు! ఎంతస్వార్థత్యాగి! ఎంత ధీరుఁడు! ఎంతధర్మాత్ముఁడు! ఎంతకోమలహృదయుఁడు! ఎంతపరాక్రమ నిధి!" అనుధ్వనులతో సభ యంతయును క్రోఁగిపోయెను. అప్పుడు చాణక్యుని బోధనమునఁ జంద్రగుప్తుఁడు వసంతుని సభకు రావింప నాజ్ఞాపించెను.

ఇరువదిమూఁడవ ప్రకరణము.

వసంతుఁడిప్పు డెందున్నాఁడు? పొలికలన దుఃఖభీషణాకారుఁడై కూర్చుండియున్నాఁడు. పేరినెత్తురువలన నెట్టనైయున్న చంద్రహాస మాతనితొడపై నుండెను. ఆతనిమొగము జేవుర్పించి యుండెను. కన్ను లెఱ్ఱనడిపోయినవి. ఎంతయోఁపిన నాఁగక కన్నీరు కాలువలు గట్టుచుం డెను ఆతఁడు సిద్ధార్థునికపాలమునుండి స్రవించుచున్న నెత్తురును దన బాకుమొనతో నద్ది వడఁకుచున్న చేతులతో నెట్లో యొకలేఖ లిఖిం చెను. ఆతనియుద్దేశమునుబట్టి చేయి నడచుట లేదు. హృదయావేగ మునను ద్దేశములు నిలుచుట లేదు. కన్నిటికాలువలచే, వ్రాసినదా తని కగపడుట లేదు. ఉత్తర మింకను ముగింపలేదు. ఏమి వ్రాసితినో చూచికొనవలయు నని యాతఁడు తలఁచెను. శిరోవేష్టమును విచ్చి కన్నులఁ దుడిచికొని యాలేఖను జదువుకొనుచుండెను

"జీవితేశ్వరీ—" అని చదువునప్పటికి దుఃఖాతిరేకమున గుండెలు బ్రద్దలయ్యెను. నోట మాటవచ్చుట లేదు. మరల సంతాపాశ్రు పూరమువలనఁ గన్నుల కేమియు నగపడుట లేదు. సముద్రతరంగముల వలె దుఃఖతరంగము లెగచి విరుగుచుండెను. మరల నెగయుసంతవఱ కానడుమఁ గొంతవిశ్రాంతి యుండెను. వసంతుఁడు మరలఁ గన్నులు దుడిచికొని ధైర్యమునుదెచ్చుకొని, యావాక్యమును దుడిచివైచి, యట "వసుమతీ!" యని వ్రాసిచదువ నారంభించెను.

"దారుణరణసంరంభమున నీలోకమును నిడిచిపోవఁదలంచితిని. కాని, యాశాపాశమును, యోధసామాన్యమగు దురభిమానావేశమును, నన్నడ్డగించుటచే శత్రువీరునియాయుధమునకుఁ దలయొగ్గలేకపోతిని. ఆశాపాశము తెగిపోయినవెనుక మరలరణరంగమున బడి చావఁజూచితి. ఏమి లాభము? అంతలో యుద్ధమే పరిసమాప్తియయినది. మన యనురాగలతకు, మనయాశాకుసుమమునకు, మనదురదృష్టము గ్రీష్మోపమై పోయినది. ఈలోకమున—ఈజన్మమున—ఇఁక—మనముఁ గలిసికొనుట కవకాశము లేదు. కేవలదుఃఖదాయక మగునాజీవితమును విడిచివేయవలసినదే కాని బలవన్మరణము వీరపురుషోచితము కాదని సంశయించుచున్నాఁడను— మనయదృష్టమునకు భంగముదెచ్చుట యందుఁ బాపగ్రహమువలెనడ్డమువచ్చినదురాత్ముఁడగుసిద్ధార్థునిపెత్తురుతో నిలేఖ వ్రాసి యిందుమూలమున నానిశ్చితాభిప్రాయమును వెల్లడించు చున్నాఁడను. ఈదుఃఖజీవిత మింతలోఁ గడతేరునదికాదు. ఐహికసుఖం బులఁ బరిత్యజించి నిరంతరమును నాహృదయనిధానమును స్మరించుచుఁ దదేకధ్యానమునకు నెమ్మది మరలించి మహారణ్యముల మునివృత్తినవ లంబించి చరించుచు నాయాయుశ్శేషమును గడపెదను. నాకు సెల వొసఁగెదవా?" అని చదువునప్పటికాతనిహృదయ మతివేగమునఁ గొట్టు కొనసారంభించెను. అపరితాపమున నెడలంతటను జెమరించెను. కంఠ స్వరము గాద్గద్యమును వహించెను. ఒక్కింత మనసుకుదురుపఱచు కొని మరలఁజదువుచుండెను.

"నీవిశాలతరశ్యనయనముల నుండి యాణిముత్తియపుఁగోవలవలె వెడలుచుండువేఁడి కన్నీటిధారలఁబయ్యెదచెఱంగునఁదుడిచి— చెమ్మటలఁ

జెక్కులఁజిక్కువడియున్న వినీలకుటిలకుంతలంబుల సవరించి—అభినవ కోమలప్రవాళము బోనినిమధురారుణాధరమును గమలించుచున్న వేఁడి నిట్టూర్పులను చేలాంచలచాలనంబులం బాడముచల్లనిగాలిచే నెక్కింత సేపాఁపి—నీహృదయమును గందింపక—నీమనసుఁజెదరింపక—నీమొడలు వడకింపక—నీముద్దుమోముగమువాఁడింపక—నికన్నులు మూయింపక—నీప్రాణముల నల్లార్పక—సయుక్తికముగ—సార్థకముగ—సాభిలాషముగ—సానుకంపముగ—నాహృదయాభిప్రాయమును వెల్లడించి—నియొద్ద—సెలవు—గయికొని—"ఇఁకఁ జదువలేకపోయెను. ఆపై నిఁకఁ బ్రాసినదియును లేదు. శోకవేగమున "హా!" యని మూర్ఛిల్లెను.

ఆతఁడు మూర్ఛదేరునప్పటి కిరువురుభటు లెదుట నిలువఁబడి "అయ్యా! చక్రవర్తియగుచంద్రగుప్తునియాజ్ఞ యయినది. మీరు సభాస్థలంబునకు విచ్చేయవలయును" అని విన్నవించిరి.

వసంతునకుఁ జంద్రగుప్తునియం దెంతమిత్రభావము! ఎంతగారవము! ఎంతభయము! ఎంతభక్తి! అట్టిదుఃఖసమయమునఁగూడ నాతఁడు మాఱుమాటాడక బయలుదేరెను. చంద్రగుప్తునియాజ్ఞానిర్వహణమే వసంతునకుఁ బరమధర్మము. వారిరువురును రామలక్ష్మణుల యపరావతారము లని చెప్పవచ్చును.

వసంతుఁడు సభారంగమునఁ బ్రవేశించెను. కాని, దురదృష్టోపహతుం డగునాతఁ డెన్వరిని గన్నెత్తి చూడలేకపోయెను. నోరెత్తి మాటలాడలేకపోయెను. స్థాణువువలె నిలువఁబడిపోయెను.

అప్పుడు చంద్రగుప్తునిహృదయము కఱఁగి నీరయ్యెను. కొంచెము సే పూరకుండి "వసంతా! నందశిరఃఖండనము నికావశ్యకకార్యమై

యుండఁగా రణరంగమునఁ జేజిక్కి-ననందుని విడిచి నీవెటకుఁ బోతివి?" అని యడిగెను.

"సుందరిని రక్షించుటకు—" అని వసంతుఁడు ప్రత్యుత్తర మిచ్చెను.

సభ యంతయును నివ్వెఱపడిపోయెను. వాఁడిపోయియున్న రాధాకృష్ణవర్మ యాశాలత వసంతవచనసుధారససేచనముస మరల మొలక లెత్తుచుండెను.

"సుందరి గంగానదిలో మునిఁగిపోయినది గదా?" అని చంద్ర గుప్తుఁడు ప్రశ్నించెను.

"లేదు. ఊరక యట్లు నటించి కలశపురమునుండి తప్పించుకొని హరిదాసవేషమున సంచరించుచున్నది. అంభీరుని రహస్యములును, పద్మ నందుని రహస్యములును, మనకుఁ దెలియపఱచిన దామెయే."

"ఆమె యుద్ధములోని కేల వచ్చినది?"

"ఊరక హరిదాసవేషముతోడనే వచ్చినది. తమరహస్యము లీహరిదాసునిమూలమునఁ, వెల్లడియయ్యెననుకోపమున సిద్ధార్థుఁ డామెను నఱికిబోవుచుండ నేనాతని వధియించి యామెను గాపాడితిని."

రాధాకృష్ణవర్మ మొగము వికసించెను. ఆతఁడు వెనుక హరి దాసుని జూచినప్పటిచర్యయంతయును స్మృతికిఁదెచ్చికొనియెను. కార్య భారమును వహించియుండుటచేతను, చిరకాలముక్రిందటనే విడుచుట చేతను, నాతని కప్పు డనుమానముకలుగలేదు. ఇప్పు డవియన్నియును తార్కాణమయ్యెను. రాధాకృష్ణవర్మ సంతోషము నాఁపజాలక వసం తుని గౌఁగిలించుకొని యానందబాష్పములతో నాతనిశిరంబును దడిపి నైచెను.

అప్పుడు చాణక్యుఁడు లేచి నిలువఁబడి యిట్లుపన్యసించెను.

" చంద్రగుప్తునకు విజయము లభించినది. రాధాకృష్ణవర్మ ప్రతిజ్ఞలు తీరినవి. నాయభీష్టము సిద్ధించినది. దేశోపద్రవములు చల్లారినవి. ఇప్పుడు వసంతుఁడుమాత్రము సందిగ్ధావస్థయం దున్న వాఁడు. ఇందు సందిగ్ధమే లేదు. వసంతుఁడుదారస్వభావుఁడు. మహాపరాక్రమసంపన్నుఁడు. దయార్ద్రహృదయుఁడు. నేనును రాధాకృష్ణవర్మయు నెంతపని చేసినను మొట్ట మొదటఁ జంద్రగుప్తుని యభ్యుదయమునకు స్వార్థత్యాగియయి శ్రోడుపడినవాఁడు వసంతుఁడు. స్వదేశరాజుల యంతఃకలహములు చంద్రగుప్తసేనానాయకుఁ డగువసంతునివలననే తీరినవి. అంభీరునివధియించి తక్షశిలాచుర్గమును జంద్రగుప్తున కొప్పగించినవాఁడును వసంతుఁడే. ఆ కారణమునఁనే పాంచాలమునకు నెమ్మది కలిగినది. ఎన్ని విధములఁ జూచినను చంద్రగుప్తునకుఁగాని, ప్రజలకుఁగాని, వసంతునివంటిమిత్రుఁడు, వసంతునివంటి యోధుఁడు, వసంతునివంటి రాజభక్తుఁడు, వసంతునివంటి దేశసేవాపరాయణుఁడు, వసంతునివంటి విశ్వాసి మఱియొకఁడు లేఁడు. ఇంతేగాక చంద్రగుప్తుని ప్రతిజ్ఞ ననుసరించి నందునితోఁ బోరాడి ప్రాణావశిష్టునిగఁ జేసియుఁ బరోపకార పరాయణుఁడయి యాతని విడువవలసిన వాఁడయ్యెను. ఆతని నీరాధాకృష్ణవర్మ సంహరించెను. వీరిరువురును దక్క నిందు నందునితోఁ బోరాడినవా రెవ్వరును లేరు గదా—"

" లేరు. మహాత్మా! లేరు" అని సభ్యులందఱు నేకగ్రీవముగాఁ బల్కిరి.

"ఇప్పుడు వసుమతి వీరిరువురిలో నొకరిసొత్తు కావలసియున్నది-"

"ఔను! ఔను!" అని సభయంతయును ప్రతిధ్వనించెను.

"రాధాకృష్ణవర్మ వసుమతికి జ్ఞాతికుటుంబములోనివాఁడు. ఇంతేగాక యామెను బెంచినవాఁడు. ఆమెతండ్రి యగుమానపాలునిమేనగోడలికి భర్త. ఈకారణములవలన రాధాకృష్ణవర్మకు వసుమతిని బరి

గ్రహింప వలనుపడదు. ఒక్క నందశిరశ్ఛేదమువాత్రమే యాతఁడు కావించెనుగాని విజయమువసంతునికేకలిగినది. ఒక వేళ రాధాకృష్ణవర్మకే జయము కలిగినదన్నయెడల నాతఁడు వసుమతిని పుత్రికగా స్వీకరింపఁ దగినవాఁడే కాని యుద్ధాంగిగాఁ గైకొనుట ధర్మశాస్త్రమునకుఁ గాని, యాచారమునకుఁ గాని, విరుద్ధమైన పని. అంతేకాక రాధాకృష్ణవర్మ యంతరాత్మకూడ నందుల కంగీకరించుట లేదని సభ్యులకెల్లరకుఁ దెలిసిన విషయమే. వసుమతీ వసంతుల యన్యోన్యానురాగము కూడ నంద తెఱఁగినదియే. కాఁబట్టి తనప్రాణేశ్వరి యగుసుందరిని మృత్యుముఖంబు నుండి తప్పించి యొసంగినవసంతునకు రాధాకృష్ణవర్మ తాను పెంచుట వలననేగాక రాజశాసనమును బట్టి తనకుఁ బుత్రికాప్రాయ యగు వసుమతి నొసంగి తనఋణమును దీర్చుకొనుఁగాక! మగధపాంచాలచక్ర వర్తి యగుచంద్రగుప్తసార్వభౌముని పట్టాభిషేక శుభసమయమున వీరి కళ్యాణమహోత్సవ మతివైభవమున జరిగింతురుగాక! వసుమతీ వసంతులకళ్యాణముతోఁ జంద్రగుప్తపట్టాభిషేకమహోత్సవము వసు మతికి వసంతాయమాన మగుఁగాక!"

అప్పుడు "తథాస్తు! తథాస్తు!" అను శబ్దములతోడను, సభ్యుల కరతాళధ్వనులతోడను, సభ ముగింపఁ బడియెను.

ఇది ద్వితీయభాగము.

పరిసమాప్తి

చరిత్రవిషయంబు లగునవల లను నవీనాలంకారములచే నాంధ్ర భాషావధూటిని వలపించుచున్న మాయాంధ్రప్రచారిణీగ్రంథమాలికకు ద్వితీయకుసుమముగ నీవసుమతీవసంతమును వ్రాయుచు న్యవధి చాల నంచున నింతటితో ముగించి ముద్రాయంత్రమున కొసంగితిమి. మే మిం కను వ్రాయవలసినదే కాని రెండువేలయేండ్లకుఁ బూర్వమున జరిగిన యీనాఁటిచంద్రగుప్త పట్టాభిషేకవైభవమునుగూర్చి గాని, వసుమతీ వసంతులకల్యాణమహోత్సవముంగూర్చి గాని, వర్ణించి వ్రాసినచో నుత్ప్రేక్షాతిశయోక్త్యాద్యలంకారతత్త్వమును సంపూర్ణముగ నాకళించి యున్నచదువరులకు మావాక్యములయం దసత్యశంక యుదయించు నేమో యనుభీతిచే మా లేఖిని నింతటితో నాఁపివేయనలసినవార మైతిమి. మగధపాంచాలరాజసార్వభౌముఁడును, ప్రజారంజకుఁడును, నగుచంద్ర గుప్తునపట్టాభిషేకకార్యములకుఁ గొదవ యేముండును? ఆతని పట్టా భిషేకశుభసమయమున జరిగినవసుమతీవసంతుల కల్యాణోత్సవమునకు మాత్రము లోపము కలుగునా? ఆమహోత్సవము లెట్లు జరగవలసి యుండెనో యట్లే జరిగినవి.

సార్వభౌమునియనుగ్రహమునకో, కృతజ్ఞతవలననో, వసంతు నకు రత్నగిరిరాజ్యమును, రాధాకృష్ణవర్మకు పాంచాలరాజప్రాతినిధ్య మును, లభించినవి. సామంతరాజు లెల్లరును సన్మానింపఁబడి తమ తమదేశములకుఁ బంపఁబడిరి. సైనికు లెల్లరును పారితోషికముల నందికొనిరి. చంద్రగుప్తుని చల్లని పరిపాలనమునఁ బ్రజలు సుఖం

చిరి. ఇందు చంద్రగుప్తనిరాణి యెవ్వరో చరిత్రములవలనఁ దెలియక పోవుటచే నూహించివాసినయెడలఁ బాఠకులహృదయములకు సందేహము కల్పించినవార మగుదుమేమో యని యీభాగమును మేము కూడ వదిలితిమి. కాని, పట్టాభిషేకమునకు ముందో, తరువాతనో, చంద్రగుప్తునకుఁ దప్పక కల్యాణమైయుండు నని మనమూహింపవచ్చును. మురాతనూఁజఁ డగుచంద్రగుప్తుఁడు మౌర్యుఁడనికూడఁ బిలువఁబడు చుండెడివాఁడు. ఆతనిసంతతివా రందఱును మౌర్యులైరి. వసుమతీసుందరులు కొంతకాలమునకుఁ బిమ్మట వియ్యమునుఁగూడ నందిరఁట! వీరెల్లరును మన కపూర్వపరిచితులయ్యును నీగ్రంథపరమునఁ జిరపరిచితులవలెనే మనహృదయములం దోఁచుచుండుటచే వీరియభ్యుదయపరంపరలంగూర్చి యెంతసేపు యోచించినను మనకుఁదనివి తీరుటలేదు. మాలేఖని యింకను నదృష్టప్రభావము నూహించుచునే యున్నది. కాని, చిరకాలముక్రిందటి వృత్తాంతము లూహల కందరానివగుటచే దరువాతి సంగతులను యథార్థముగఁ దెలిసికొనుటసాధ్యము కావున నింతటి తోడనే సంతుష్టివహించి విరమింతము.